M. R. Ry. Ongole Venkatarangayya Pantulu Garu, B.A., B.L., High Court Vakil, Nellore writes :-

“[illegible]

[illegible]”

SREE VEMANA ANDHRA BHASHA NIL...

The Honourable Rao Bahadur B. N. Sarma Garu, B. A., B. L., President of the First Andhra Conference, writes :

“......Bodies such as the Vignana Chendrika Mandali have been rendering to the cause of Telugu Literature by the publication of such highly useful works as the Andhrulacharitram by Mr. Chilukuri Virabhadra Rao *evincing original research and great ability* make one feel that there is a general upheavel of society and that sign of the renaissance of the Andhra Literature are clearly visible on the horizon.”

---

M. R. Ry. K. V. Lakshmana Rao Pantulu garu M. A., the Editor, ‘Vignana Chendrika’ and the Telugu Encyclopædia, writes :

“He is perhaps the First Telugu Scholar who has attempted a translation of eminent English Authors. His History of the Andhras is a unique

production disclosing extensive research in the field of Ancient History and is highly appreciated by Antiquarians. * * * He writes an idiomatic, elegant, chaste and charming style and is known as one of the best Telugu Writers of the present day. I know him personally. He is honest and trustworthy. I think Telugu Academy is the proper place for such an antiquarian and a well-known Telugu author."

---

M. R. Ry. B. Seshagiri Rao Pantulu Garu, M.A Professor, Vizianagaram Maharajah's College, writes:—

"I was so glad to read through your Andhra's History Vol. II your style, arrangement and discussion of matter have considerably improved."

---

Mr. N. K. Venkatesan M. A., L. T., Professor, Presidency College, Madras, writes in the Hindu:—

"For the origin and meaning of the word 'Andhra' and its use for the Telugu people, I refer the correspondent and his company to the History of the Andhra's in the Vignana Chendrika series, the language, the manner and the matter of which may give very good lessons to these reformers of Telugu style."

---

ఇతిహాసతరంగిణీగ్రంథమాల. ౧

సంపాదకుఁడు,
వెలగల వెంకటరెడ్డి.

196/11

# ఆంధ్రులచరిత్రము.

## తృతీయభాగము.

మధ్యయుగము.

SREE VEMANA ANDHRA BHASHA NILAYAM
శ్రీ వేమన
ఆంధ్ర భాషా నిలయము
దక్షిణ హైదరాబాద్
1923.
HYDERABAD-DN.

ఇయ్యది
చిలుకూరి వీరభద్రరావుగారిచే
రచియింపఁబడినది.

మొదటికూర్పు ప్రతులు, ౨౦౦౦.

రాజమహేంద్రపురము.
శ్రీ మనోరమాముద్రాక్షరశాలయందు ముద్రింపఁబడియె.
1916

సర్వస్వామ్యసంకలితము.

వెల రూ. ౧-౮-౦.

# రాజపోషకులు

మ॥ రా॥ శ్రీ కొప్పూరు చంద్రారెడ్డిగారు, జమీందారు నిడుదప్రోలు.

## ప్రధానపోషకులు

,, ,, ,, కర్రి చినవేంకటరెడ్డిగారు, మాముడేరు.

,, ,, ,, తాడి రామిరెడ్డిగారు, నత్తారామేశ్వరం.

,, ,, ,, కోనాల చినవెంకటరెడ్డిగారు, ఆరవిల్లి.

## పోషకులు

,, ,, ,, గుడిమెట్ల బుల్లివెంకటరెడ్డిగారు, మల్లెపూడి.

## అభిమానులు

,, ,, ,, వెలగల కొండారెడ్డిగారు, ఆరవిల్లి.

,, ,, ,, కర్రి పల్లారెడ్డిగారు, రంగూన్.

,, ,, ,, సత్తి వెంకటరెడ్డిగారు, ఆరవిల్లి.

,, ,, ,, సత్తి పెరుమాళ్ళరెడ్డిగారు, అయినపర్రు

,, ,, ,, వెలగల చంద్రారెడ్డిగారు, జుత్తిగపాకలు.

,, ,, ,, మండ వెంకన్నగారు, ఆరవిల్లి.

,, ,, ,, కర్రి వెంకటరెడ్డిగారు, ఊబలంక.

# విజ్ఞప్తి

ఆంధ్రమహాజనులారా ;

విజ్ఞానచంద్రికామండలి, ఆంధ్రభాషాభివర్ధనీసంఘము, ఆంధ్రప్రచారిణీమండలి లోనగు సంఘములు బయలు వెడలి తమయనర్ఘ్య గ్రంథకుసుమములభాషాయోషం బూజించి దేశమున కభ్యుదయ పరంపరాభివృద్ధి నొదవించుటఁ గాంచి, మేమును యథాశక్తి దేశభాషాసేవం జేయఁ దలఁచి యీయితిహాసతరంగిణీగ్రంథమాలం గూర్ప సమకట్టితిమి.

ఇందు దేశచరిత్రములు, చరిత్రాత్మకము లైన నవలలు, భాషాతత్వముం దెల్పు గ్రంథవిమర్శనములు మొదలగు గ్రంథము లేడాదికి మూఁడుచొప్పున ముద్రింపఁబడుచుండును. చారిత్రకజ్ఞానము లేనివానిజీవితము అయస్కాంతములేని నౌకాయాత్రవంటి దని చెప్పిన ట్లీవఱ కాంధ్రప్రపంచము తొల్లి తనపూర్వు లేమార్గములం ద్రొక్కి యింతింతనరాని యభివృద్ధింగాంచి యలరిరో, యె ట్లవక్రపరాక్రమముం జూపి యభిమన్యునింబోలె గీతిఃశేషులై తమ సామ్రాజ్యములం గోలుపోయిరో తెలిసికొనఁజాలక తట్టుముట్టాడుచుండెను. ఈకొఱఁతఁదీర్ప విజ్ఞానచంద్రికామండలి సమకట్టి ఆంధ్రులచరిత్ర రెండుభాగములును, ఆంధ్రదేశచరిత్రాత్మకము లైన నవలాగ్రంథములు నాలుగిఁటిని నాంధ్రలోకమున కొసఁగెను

కాని ప్రకృతిజ్ఞానశూన్యమగు నాంధ్రప్రపంచపు దుస్థితింబాప సమకట్టి శాస్త్రీయగ్రంథములం బ్రకటించు పరిశ్రమయం దున్న విజ్ఞానచంద్రికామండలి యెన్నికొఱంతలను దీర్పంగలదు? చరిత్రగ్రంథముల కాంధ్రప్రపంచము త్వరపడు చున్నసూచనలు గనం బడుచున్నవి.

దేశభాషాసేవ జేయుట దేశస్థుల స్వధర్మనిది గదా! మాయితిహాసతరంగిణికూడ తన నెచ్చెలులవలె భాషాసేవం జేయ బయలువెడలినది.

పూలచెట్లనేకములుగలవు. వసంతసమయము. కుసుమ సంపాదన మతిసుకరమని తలంచి మేము మాలారచనోత్సుకుల మైయుంటంగాంచి యాంధ్రనందనకల్పభూజ మొకటి మాకు బ్రథమకుసుమము నొసంగె. ఆభూజమెద్దియో——తమజీవి తమంతయుం జరిత్రరచనకై ధారవోయుచు, మాతృభాషా సేవకధీరులగుశ్రీయుతచిలుకూరి వీరభద్రరావుపంతులుగారు. ఆంధ్రులచరిత్రము మూఁడవభాగమును, మాకుబ్రథమగ్రం థముగానొసంగి మాగ్రంథమాల కింతింతనరాని సొంపుంగూర్చి నందులకనేకవందనములనర్పించి వారికి మాకృతజ్ఞతం దెల్పు చున్నారము. మఱియు రెండుమూఁడాంధ్రదేశ చరిత్రాత్మక ములైనసవలలు వ్రాయఁబడుచున్నవి. వెంటనే ముద్రింపఁబ డఁగలవు.

ఆంధ్రప్రపంచ మీవఱకే యుత్సాహపూరిత మై

ముందంజవేయుచున్నది. కానమాకుఁబ్రోత్సాహ మొనరింపుఁ డని మే మంతగా వాకొననక్కరలేదు.

మాయుద్యమమును వినినతోడనే దయాచిత్తులరై మా గ్రంథమాలాస్థాపనమున కపారమగు ధనదానముంగావించి తమస్వార్థత్యాగముం జూపుటయేగాక వారిమిత్రులఁగొందరను బ్రోత్సహించి వారివలనఁగూడఁ గొంత ధనసహాయ్యమును జేయించిన శ్రీయుత కర్రి చినవెంకటరెడ్డిగారి కనేకవందన ములు.

మాగ్రంథమాలకు శాశ్వతపుచందానియమము లేదు. శుభ్రమగు కాగితములమీఁద చక్కని అచ్చుతో ప్రతిగ్రంథ మును ముద్రింపఁబడుచుండును.

ఇట్లు,

వెలగల వెంకటరెడ్డి,

ఇతిహాసతరంగిణీగ్రంథమాలా కార్యస్థానము,

ఆరవిల్లి, కృష్ణాజిల్లా.

# సంపాదకీయభూమిక.

ఇయ్యది మాయితిహాసతరంగిణీగ్రంథమాలా ప్రథమ కుసుమము. ఆంధ్రులచరిత్రము 1-2 భాగములను విజ్ఞానచంద్రికామండలివారు ప్రకటించియున్నారు. మూఁడవభాగమిది.

ఇందు క్రీ॥శ 1250 మొదలు క్రీ॥శ 1500 లవరకుగల ఆంధ్రదేశచరిత్రము వర్ణింపఁబడినది.

చరిత్రరచనమునకై తమ జీవితమునంతయు ధారవోయుచున్న శ్రీయుత చిలుకూరి వీరభద్రరావుగారే గ్రంథకర్తలు. పాఠకమహాశయులకు వీరు క్రొత్తవారుకారు. వీరి శైలియు విషయశోధనయు నీవఱకే యాంధ్రులు చవిచూచియున్నారు. పాఠకులకు వీరిం బరిచయముచేయుట ప్రభాకరుం గరదీపికంగొని జూపుటంబోలు.

వీరభద్రరావుగారీగ్రంథమును మాయితిహాసతరంగిణీగ్రంథమాలకు ప్రథమకుసుమముగనొసఁగి యత్యంతరామణీయకము నాపాదించిరని విన్నవించుచున్నాఁడ.

సంపాదకుఁడు.

# అవతారిక

ఆంధ్రులచరిత్రము యొక్క మొదటి రెండుభాగములు విజ్ఞానచంద్రికామండలివారివలనఁ బ్రకటింపఁబడినవి. రెండవ భాగము ప్రకటింపఁబడినప్పుడు మూఁడవభాగము నాఱు నెలలలోఁ బ్రచురింతు మని చేసిన వాగ్దత్తము నెఱవేర్చుకొనుటకు నాకు నాలుగు సంవత్సరములకాలము పట్టినది. ఈయాలస్యమునకుఁ దగిన కారణములు గలవు. కాని యాచరణము వాగ్దత్తమంత సులభసాధ్యమైనది కాదని యెల్లవారు నెఱుంగు నదియె. తుదకు విజ్ఞానచంద్రికామండలి కాశాభంగమునుగలిగింపవలసివచ్చినది. విజ్ఞానచంద్రికామండలివారీమూఁడవ భాగమును గూడఁ బ్రచురించెద మని ప్రకటించి యున్నను నే నీగ్రంథమును వారి కీయక వేఱుగాఁ బ్రకటింపఁ జేసినందులకు నేదియో గొప్పకారణ ముండునని పలువు రూహింప నవకాశము గలదు. కాని నాకును విజ్ఞానచంద్రికామండలికిని గల వ్యవహారము నంతయు లోకమునకుఁ దెలుపుకొన్నందువలనఁ బ్రయోజనము లేశమాత్రమును లేదు. విజ్ఞానచంద్రికామండలికి నేనెంతయుఁ గృతజ్ఞుఁడనై యున్నను, ఆత్మీయ గౌరవమును గాపాడుకొనుటకును, మనస్సంక్షోభమునుండి తప్పించుకొనుటకును, స్వలాభముకొఱ

కున్నై నే నీమూఁడవభాగమును విజ్ఞానచంద్రికామండలి కిచ్చియుండ లేదని మాత్రము విశదపఱచుకొనుచున్నాఁడను. ఇందులకు విజ్ఞానచంద్రికామండలియు, మహాజనులు నన్ను క్షమింతురుగాక ! గ్రంథము వెల్వడుటయె ప్రధానము గాని ప్రకాశకు లెవ్వరైన నేమి ?

మన దేశములోఁ బట్టపరీక్షులం దేఱిన విద్యాధికు లెందఱో యున్నను, కొందఱు మాత్రమె స్వభాషాభిమానులై భాషాసేవఁ జేయుటకుఁ గృషిచేయుచున్నను దేశచరిత్రము విషయమై యుపేక్షాపరులై యుండుటయు, దేశచరిత్ర మెఱుంగక జనసామాన్య మజ్ఞానదశయం దుండుటయుఁ దలపోసి నాశక్తి కొలఁది నే నీలోపమును నివారింపఁబూని యీచరిత్ర రచనకు దొరకొని సాహసించి క్రమముగాఁ జరిత్రమును బ్రచురింప నారంభించినతోడనే దేశమునఁ గొంతకదలిక జనింప నారంభించినవి. నా కీమహత్కార్యమునఁ దోడ్పడఁ దగిన విద్యాధికులలో నొక్కరగు శ్రీయుతజయంతి రామయ్య బి. ఏ.; బి. ఎల్ గారు ప్రతిపక్షకోటిలోఁ జేరినవారైరి. సమగ్రము సప్రమాణమునగుఁ జరిత్రము కావలయు ననియు నందు కొక పరిషత్తేర్పడవలయు ననియు నుద్ఘోషించిరి. అటు వెనుక వారు చేసిన ప్రయత్నములు ఫలించి కొందఱు మహా రాజుల ద్రవ్యసహాయమునను విద్యాధికుల ప్రోత్సాహము

వలనను ఆంధ్రభాషాసాహిత్యపరిషత్తు (Telugu Academy) ఏర్పడినది. "ఆంధ్రదేశచరిత్రాంశ పరిశీలనకుఁ బ్రోత్సాహ మొసంగుటయు, లభ్యములైన వానిలో మిక్కిలి విశ్వసనీయములైన యాధారముల సాహాయ్యమున సవిస్తరముగాఁ దెలుఁగుదేశము యొక్కయుఁ బ్రజలయొక్కయు, చరిత్ర మొకటి రచించి ప్రచురించుట పరిషత్తుయొక్క ప్రథానోద్దేశములలో నొకటిగాఁ దెలుపఁబడియెను. ఇది యొక శుభ సూచక మని తలంచితిని గాని నాప్రతిపక్షుల ప్రయత్నముల మూలమున నే నాపరిషత్తును సమీపించుటకే సాధ్యపడినది కాదు. తరువాత 'తెలుఁగు ఎకాడెమీ' కి మేనేజరు కావలయు నని పత్రికలలోఁ బ్రకటింపఁబడియెను. కొందఱు విద్యాధికులైన మిత్రుల ప్రోత్సాహమువలన నే నాయుద్యోగమునకు దరఖాస్తు పెట్టినప్పుడు జరిగినచర్య వైపరీత్యముగాఁ గన్పట్టకమానదు. అది యొక పెద్దచరిత్ర మగును. పరిషత్కార్యదర్శులకును తత్సభాధ్యక్షులకును చర్చ ప్రారంభమై కొంతకాలము నడచినది. అటు పిమ్మట కార్యదర్శులైన బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రులవారును, మ. రా. రా. శ్రీహైకోర్టువకీలు పురాణము నాగభూషణము ఎమ్. ఏ. బి. ఎల్ గారును, డాక్టరు ఆచంట లక్ష్మీపతి బి. ఏ. ఎమ్. బి. సి. యమ్ గారు 'మేనేజరు' గా నన్ను నియమించి యంగీ

కారమునకై అధ్యక్షులగు రామయ్యగారికిఁ బంపఁగా వారు 'మేనేజరు' లేకుండ సంవత్సరకాలము గడపుటకైన నొప్పు కొనిరి కాని నాకుఁ బ్రవేశము గలిగింప నిష్టపడరైరి. అంతట నదియు నామేలునకే యని భావించి పరిషత్తున కొక్క నమ స్కార మిడి చెన్నపురి విడిచి వచ్చితిని. ఆంధ్రసోదరులారా! నిజముగా దేశముకొఱకు నే నీచరిత్రరచనకుఁ గడంగితినిగాని దీని వలనఁ బుణ్యమును బుకఃపార్థమును మూటగట్టుకొన వలయు నని గాదు. విద్యాధికులచేతను ధనాధికులచేతను స్థాపింపఁబడిన పరిషత్తే యింతవఱకుఁ జరిత్రము విషయమై యేమియుం జేయఁజాలక సంవత్సరములకు సంవత్సరములు గడుపుచుండఁగా, సామాన్య ప్రజ్ఞకలిగి నిస్సహాయుండనై పెనఁగులాడుచున్న నేను నాకుఁ దోఁచిన విధముగా నింత కాలమునకైన నీమూఁడు భాగముల నాంధ్రప్రపంచమునకు నీరీతిగా నైన సమర్పింప శక్తుఁడ నైతిని గదా యన్నసంతో షమును బొందుట తక్క నాకు మఱియొండు లాభము గన్ప ట్టకున్నది. మిత్రులారా! నాగ్రంథములో లోపము లుండ వని గాని నాగ్రంథము సమగ్రమైన దని గాని నేనెన్నఁడును దలంచి గర్వము పడువాఁడను గాను. ఉపకరణము లసంపూ ర్ణములుగాను వివాదాస్పదములుగాను నున్నంతవఱకుఁ జరిత్ర రచనము నాకె కాదు కొమ్ములు తిరిగిన వానికైన భ్రమ

ప్రమాదములతోఁ గూడిన దోషములు లేక సమగ్రమై సప్రమాణమై యుండునట్లు చేయుట సాధ్యముగాదు. ఆంధ్ర దేశ చరిత్రాంశములను గాలక్రమయుక్తముగా సమన్వయముఁ జేసియొకరీతిచరిత్రమూలను గూర్చిభావిపరిశోధకులకుఁ దోడ్పడునట్లుగా సంపుటీకరణము చేయుటయె ప్రస్తుతము నేను చేయు పని. నాగ్రంథ మెంతదోషభూయిష్ఠ మనుకొన్నను దేశమునఁజరిత్రపరిశోధనమునకై పెక్కుండ్రను బురికొలుపకమానదు. నాయభిప్రాయము లెన్నఁడు నితరులను బంధించునవికావు. అసూయాపిశాచగ్రస్తులుగాక సత్యాన్వేషణపరులై యెవ్వరైనను సహేతుకముగా నాయభిప్రాయములను ఖండింపవచ్చును. దాన నాకొకింతయు నపయశంబు కలుగఁ బోదు. విమర్శ మూలముననే సత్యము తేటపడి పరిశుద్ధమైన చరిత్రము వెల్వడు ననుటకు లేశమాత్రమును సందియము లేదు.

ఈమూఁడవభాగములో క్రీ. శ. ౧౩౨౩ మొదలుకొని క్రీ. శ. ౧౫౦౦ వఱకుగల చరిత్రము సంగ్రహముగాఁ జెప్పఁబడినది. కాకతీయసామ్రాజ్యము భగ్నమైనవెనుక భిన్నరాజ్యములేర్పడి వేఱ్వేఱురాజవంశములచేఁ బరిపాలింపఁబడుట చేత పద్మనాయకులచరిత్రము వేఱుగను, రెడ్డిచరిత్రము వేఱుగను జెప్పవలసివచ్చినది. పద్మనాయకులచరిత్రముగాని

రెడ్లచరిత్రముగాని నేను వ్రాసినదానికంటె నెక్కువ నాకు లభించియుండలేదు. పద్మనాయకులచరిత్రమువలన నోరుగల్లు చరిత్రమునుగూర్చి ఫెరిస్తామొదలగు మహమ్మదీయచరిత్రకారులును, వారినిబట్టి స్యూయలు మొదలగువారును వ్రాసిన చరిత్రములు సరియైనవికావని తేటపడఁగలదు. ఈమూఁడవ భాగమును జదువునప్పుడు రాచవారును, పద్మనాయకులును, రెడ్లును పరస్పర ద్వేషములమూలమున సామ్రాజ్యములను బోఁగొట్టుకొని పారతంత్ర్యమునకు వశులైరనియును, కర్ణాటాంధ్రుల యైకమత్యమువలన కర్ణాటసామ్రాజ్యమని వ్యవహరింపఁబడిన విజయనగరసామ్రాజ్యము వర్ధిల్లినదనియుఁ జదువరులకు బోధపడఁగలదు. పోరునష్టము పొందులాభమను విషయమునే యీమూఁడవభాగము వేనోళ్ళఁజాటుచున్నది.

“జీర్ణ కర్ణాటరాజ్యచరిత్ర” మను పేరిట విజయనగరసామ్రాజ్యచరిత్రమును పండ్రెండుసంవత్సరములక్రిందట నేను రచించి ప్రచురించియున్నవాఁడను. ఆగ్రంథము మూఁడవభాగము తరువాతి గ్రంథముకాఁగలదు. ఆగ్రంథము విశేషభాగము మహమ్మదీయచరిత్రకారులు వ్రాసిన చరిత్రముల నాధారముచేసికొని స్యూయలుగారి గ్రంథమును గొంతవఱకనుసరించి వ్రాయఁబడినదిగావున నందు సంస్కరింపందగిన పొరబాటులు పెక్కులుగలవు. అందుఁ జేర్పవలసిన నూత్నవిష

యము లనేకములుగలవు. దానినే సంస్కరించి నూత్నవిషయములఁజేర్చి సవిస్తరముగా వ్రాసి నాలుగవభాగముగాఁ బ్రకటింపఁబోవుచున్నాఁడనుగావున విజయనగర సామ్రాజ్యచరిత్రములోని ప్రథమకర్ణాటరాజవంశమునుగూర్చిన చరిత్రమును గ్రంథవిస్తరభీతిచే నిందుసంగ్రహముగాఁ దెలిపియున్నాఁడను.

ఈ మూఁడవభాగమును వ్రాయుటకు నాకు తోడ్పడిన గ్రంథములయొక్కయు గ్రంథకర్తలయొక్కయు నామములీగ్రంథమున నాయాసందర్భములఁ బేర్కొనియుంటినిగావున గ్రంథవిస్తరభీతిచే మరల నిచటఁ బేర్కొనక వారెల్లరకు నాకృతజ్ఞతావందనములను దెలుపుచున్నాఁడను. ఈచరిత్రముయొక్క యచ్చుకాగితములనుదిద్ది నాకు సహాయ్యముఁ జేసిన ఆకొండి వ్యాసనారాయణగారికిని, కామరాజు వెంకటరమణయ్యగారికిని వందనములర్పించుచున్నాను. భ్రమప్రమాదజనితములైన దోషములను మన్నించి చదువరులు గుణములనే గ్రహింపవలయునని ప్రార్థించుచున్నాఁడను. ఈగ్రంథప్రాచుర్యమునకుఁ దోడ్పడిన శ్రీయుత వెలగల వేంకటరెడ్డిగారికిఁ గృతజ్ఞుఁడను.

గ్రంథకర్త.

# విషయసూచిక

## మొదటి ప్రకరణము.


| | పేజి. |
|---|---|
| ఆంధ్రదేశస్థితి. ... ... | ౧. |
| రాజమహేంద్రపురము తురుష్కులవశ మగుట. ... | ౩. |
| తెలుఁగు నాయకులు తురుష్కులను జయించుట ... | ౫. |
| మహమ్మదీయుల విజృంభణము. ... ... | ౬. |
| ఆనెగొంది పై తురుష్కుల దండయాత్ర. ... | ౮. |
| ప్రతాపరుద్రునిపుత్రుఁడు తురుష్కులను దఱుముట. | ౧౨. |
| రేచెర్ల సింగమనాయని విజృంభణము. ... | ౧౬. |
| సింగమనాయఁడు సంహరింపఁబడుట. ... | ౧౪. |
| సింగమనాయని సోదరుల ప్రతాపము. ... | ౧౮. |


## రెండవ ప్రకరణము.


| | |
|---|---|
| అనపోతభూపాలుని దిగ్విజయములు. ... | ౨౦. |
| ఇనుకుర్తికోట ముట్టడి. ... ... | ౨౨. |
| బహమనీరాజ్యస్థాపనము. ... ... | ౨౪. |
| మహమ్మద్ షాహ ప్రథమదండయాత్ర. ... | ౨౬. |
| మహమ్మద్ షాహ పరాజితుఁ డగుట. ... | ౨౮. |
| అనపోతనాయఁడు గోల్కొండను గోల్పోవుట.... | ౩౦. |
| అనపోత మాధవభూపాలుర రాజ్యపాలనము. ... | ౩౪. |
| అనపోతారెడ్డితోడి యుద్ధము. ... ... | ౩౮. |
| రాచకొండ దుర్గము. ... ... | ౪౧. |
| అనపోతనాయని మతము—భైరవ ప్రతిష్ఠలు. ... | ౪౪. |

అనపోతనాయని పరిపాలనావిశేషములు. ... ౪౫.
మాధవభూపాలుని పరిపాలనా విశేషములు. ... ౪౬.
రెండవ సింగమనాయని పరిపాలనము. ... ౫౧.
సర్వజ్ఞసింగభూపతి విషయము. ... ౫౪.
గౌరనమహాకవి. ... ... ౬౨.
అనపోత మాధవ భూపాలుర పరిపాలనము. ... ౬౪.
ఫిరోజిషాహ పద్మనాయకులతోఁబోరి పాటిపోవుట. ౭౨.
రావు మాధవరావు. ... ... ౭౫.


## మూఁడవ ప్రకరణము.


కుమారాన్న పోతానాయఁడు. ... ... ౭౭.
సర్వజ్ఞసింగభూపాలుఁడు. ... ... ౭౮.
బమ్మెర పోతరాజు-భోగినీదండకము. ... ౮౩.
లింగమనాయని ధాటి. ... ... ౯౯.
భైరవకవి. ... ... ౧౦౭.
పద్మనాయకసామ్రాజ్యావసానదశ. ... ౧౧౧.


## నాలుగవ ప్రకరణము.


రెడ్లచరిత్రము. ... ... ౧౧౨.
కోరుకొండ రెడ్లచరిత్రము. ... ... ౧౧౭.
ముమ్మడినాయకునిపరిపాలనము... ... ౧౨౧.
వైష్ణవ మతావలంబనము. ... ... ౧౨౩.
దేవాలయ ప్రతిష్ఠాపనలు. ... ... ౧౨౭.
కులగౌరవము. ... ... ౧౨౮.


## ఐదవ ప్రకరణము.


కొండవీటి రెడ్డిరాజుల చరిత్రము. ... ౧౩౦.
దేసటి వంశము. ... ... ౧౩౩.

పరుసవేది కథ ... ... ౧౩౫.
దేసటివేమభూపాలుని పరిపాలనము. ... ౧౩౭.
వేమారెడ్డి బిరుదు నామములు.... ... ౧౪౦.
వేమారెడ్డి మంత్రి రామాప్రెగ్గడ. ... ౧౪౧.
వేమారెడ్డి ప్రసిద్ధసేనానులు. ... ... ౧౪౨.
వేమునిరాజ్యవిస్తీర్ణము. ... ... ౧౪౬.
అవచి దేవయసెట్టి. ... ... ౧౪౮.
పోలయ వేమారెడ్డి రాజ్యపరిపాలనకాలము ... ౧౪౯.
రాజ్యపరిపాలన స్థితి. ... ... ౧౫౦.
వేముని విద్యావ్యాసంగము. ... ... ౧౫౩.
ఎఱ్ఱాప్రెగ్గడ చరిత్రము. ... ... ౧౫౪.


## ఆఱవ ప్రకరణము.


అనపోతభూపాలుఁడు. ... ... ౧౬౩.
అమరేశ్వరపునఃప్రతిష్ఠాపనము.... ... ౧౬౬.
సముద్రవ్యాపారము విస్తరింపఁజేయుట. ... ౧౬౮.
అనవేమభూపాలుఁడు. ... ... ౧౭౧.
అనవేమభూపాలుని కవులగోష్ఠి... ... ౧౭౮.
అనవేమభూపాలుని మరణము.... ... ౧౮౦.
కుమారగిరి భూపాలుఁడు. ... ... ౧౮౧.
అవచి తిప్పయసెట్టి ... ... ౧౮౨.
సముద్రయానము-విదేశవ్యాపారములు. ... ౧౮౫.
కాటయవేముఁడు-రాజ్యవిభాగము. ... ౧౮౮.
ఉండ్రాజుశాసనము. ... ... ౧౮౯.
కుమారగిరిరెడ్డి గ్రంథరచనము. ... ... ౧౯౩.

హరిహరరాయలు తనకూఁతును కాటయ వేముని కొడుకున కిచ్చి పెండ్లి చేయుట. ... ౧౯౪

## ఏఁడవ ప్రకరణము.

పెదకోమటి వేమభూపాలుఁడు.... ... ౧౯౬
మామిడిసింగనామాత్యాచార్యుఁడు... ... ౧౯౭.
సింగనామాత్యుని పూర్వులు. ... ... ౧౯౯.
సింగనామాత్యుని కొల్వుకూటము. ... ౨౦౨.
సర్వజ్ఞచక్రవర్తి బిరుదము. ... ... ౨౦౩.
సంతానసాగరనిర్మాణము. ... ... ౨౦౬.
శ్రీనాథకవిసార్వభౌముఁడు. ... ... ౨౦౯.
శ్రీనాథుని జన్మభూమి. ... ... ౨౧౧.
శ్రీనాథుఁ డాంధ్రదేశస్థుఁడైనయాంధ్రుఁడు.... ౨౨౧.
శ్రీనాథుని కొండవీటి పురవర్ణనము. ... ౨౨౫.
శ్రీనాథుని స్వర్ణాభిషేకము... ... ౨౨౭.
పెంటి స్తంభము వేఁట. ... ౨౩౨.
శ్రీనాథుఁడు రావు సింగభూపాలు సభకుఁ బోవుట. ౨౩౪.
పెదకోమటివేముని యంత్యదశ. ... ౨౪౧
రాచవేమారెడ్డి పరిపాలనము. ... ౨౪౩.
మల్లారెడ్డివంశము-కందుకూరు రెడ్లు. ... ౨౪౪.

## ఎనిమిదవ ప్రకరణము.

కాటయవేమభూపాలుని చరిత్రము ... ౨౪౯.
కాటయవేముని విద్యాపరిశ్రమము. ... ౨౫౧.
కాటయవేముని దానధర్మములు. ... ౨౫౩.
కాటయవేముని సంతతి. ... ... ౨౫౫.

## తొమ్మిదవ ప్రకరణము.


| | | | |
|---|---|---|---|
| అల్లాడ భూపతి | ... | ... | ౨౫౮. |
| అల్లాడభూపతిసంతతి. | ... | ... | ౨౬౨. |
| బెండపూడి లింగనామాత్యుఁడు | | | ౨౬౪. |
| అల్లాడవేమభూపతి—అల్లాడవీరభూపతి. | | ... | ౨౬౭. |
| రాజమహేంద్రపురరాజధానీవర్ణనము | | ... | ౨౮౧. |
| వేమవీరవిభులమతము. | ... | ... | ౨౮౨. |
| అల్లాడదొడ్డభూపతివిజయధాటి. | ... | ... | ౨౮౪. |
| అగ్రహారబ్రాహ్మణవర్ణనము. | ... | ... | ౨౮౫. |
| బెండపూడి అన్నామాత్యుఁడు. | ... | ... | ౨౮౬. |
| శ్రీనాథకవిసార్వభౌముని రాక. | ... | ... | ౨౯౦. |
| నిశ్శంక కొమ్మనామాత్యకవి. | ... | ... | ౨౯౧. |
| రాజమహేంద్రపురరాజ్యవిస్తీర్ణము. | | ... | ౨౯౩. |
| రెడ్లధర్మకార్యములు | ... | ... | ౨౯౪. |
| మధ్యాంధ్రదేశవిప్లవము | ... | ... | ౨౯౭. |
| అన్నదేవచోడునివీరకృత్యములు | ... | ... | ౩౦౧. |
| అత్తిలి కాకరపర్తులయుద్ధములు | ... | ... | ౩౦౪. |
| శ్రీనాథునికృతులు. | ... | ... | ౩౦౫. |
| శ్రీనాథుని చరమదశ. | ... | ... | ౩౦౭. |


## పదియవ ప్రకరణము.


| | | | |
|---|---|---|---|
| నూత్నకర్ణాటరాజ్యచరిత్రము. | ... | ... | ౩౧౧. |
| సంగమవంశము రాజ్యస్థాపనము | ... | ... | ౩౧౪. |
| విద్యానగరనిర్మాణము. | ... | ... | ౩౧౬. |
| మాధవవిద్యారణ్యస్వామి. | ... | ... | ౩౨౬. |


SREE VEMANA ANDHRA BHASHA NILAYAM
శ్రీ వేమన ఆంధ్ర భాషా నిలయము
HYDERABAD
1923

ప్రథమహరిహరరాయలు. ... ... ౩౩౦.
నాచనసోముఁడు ... ... ౩౩౭.

## పదునొకండవప్రకరణము.

వీరబుక్కరాయలు. ... ... ౩౪౨.
కంపరాయని దక్షిణదిగ్విజయయాత్ర. ... ౩౪౩.
మాధవమంత్రి. ... ... ౩౫౧.
తురుష్కులతోడియుద్ధములు. ... ... ౩౫౨.
మహమ్మద్ షాహతోయుద్ధము ... ... ౩౫౪.
ముజాహిద్ షాహతోయుద్ధము ... ... ౩౬౪.
బుక్కరాయని పరిపాలనము ... ... ,,

## పండ్రెండవప్రకరణము.

రెండవహరిహరరాయలు
వినుకొండతిప్పనామాత్యుఁడు. ...
వల్లభామాత్యకవి. ... ...
ఫిరోజిషాహతోయుద్ధము. ...

# ఆంధ్రుల చరిత్రము

## మూఁడవ భాగము.

### మొదటి ప్రకరణము.

#### ఆంధ్రదేశస్థితి.

(క్రీ. శ. ౧౩౨౩ మొదలుకొని క్రీ. శ. ౧౩౪౪ వఱకు.)

ఆంధ్రనగరమున జరిగిన ఘోరసంగ్రామములో నోరుగంటి ప్రతాపరుద్రుఁడు డిల్లీచక్రవర్తిచే నోడింపఁబడి చెఱఁగొని పోఁబడుటయు, ఆంధ్రవీరనాయకు లనేకులు డిల్లీచక్రవర్తితోడి యుద్ధమున వీరస్వర్గమును జూఱఁ గొనఁ బోవుటయుఁ గాకతీయసామ్రాజ్యము భగ్న మగుటకుఁ గారణము లయ్యెను. ఆంధ్రసామ్రాజ్యలక్ష్మి డిల్లీతురుష్కవీరుల క్రౌర్యమునకుఁ దాళఁ జాలక పరాభూత యై యాంధ్రనగరంబున నొక్కక్షణ మైన నిలువ నోల్లక ప్రతాపరుద్రధనాగారరక్షకు లగు హరి హర బుక్కరాజులతోడి చెలిమిం జేసి దిగువకర్ణా

SREE VEMANA ANDHRA BHASHA NILAYAM
HYDERABAD-CN.

టమునకుఁ బాఱి వచ్చి భయార్త యగుచు రక్షణార్థము నూత్నవరాన్వేషణచిత్త యై త్రిలింగకర్ణాటకభూములలోనటుఁ నిటుఁ బఱువు లిడుచు చిందులు ద్రొక్క నారంభించెను. అహా! సామ్రాజ్యలక్ష్మి చంచలయు, వీరవశ్యయు ననుమాట జగద్విదిత మయ్యెను గదా! ఇట్లాంధ్రసామ్రాజ్యము భగ్నము కాఁ గా మున్ను యాదవకులములో ముసలము జనించినప్పుడు యదువృష్ణి, భోజాంధక వీరవర్గమెట్లుకలంగెనో, కర్ణాటాంధ్ర భూములలో విగ్రహారాధనద్వేషమతాభిరతు లగు నూత్న జాతిముసల్మానువీరులు ప్రవేశించినప్పు డట్లే త్రిలింగకర్ణాటక వీరప్రపంచంబు కలంగి సంక్షుభిత మయ్యెను.

బలాఢ్యులైన శాత్రవులు దండెత్తి వచ్చి తమదుర్గము లాక్రమించుకొని ప్రతాపాగ్ని ప్రజ్వలింపఁజేయుచున్నప్పుడు రాచవారు, కమ్మవారు, రెడ్డినాయకులు, బలిజనాయకులు, పద్మనాయకులు, ఏకమై వైరి వీరులను తఱిమి ప్రతాపరుద్రునికిఁ బట్టము గట్టి యాంధ్రసామ్రాజ్యము నుద్ధరించుటకు మాఱుగా స్వార్థపరులై ఒక్కదేశీయుల మనుమాట మఱచి యదువృష్ణిభోజాంధకులవలెనె యొండొరులగొంతుకలు గోసి కొనుచు నాంధ్రభూతలము రక్తపూరితము గావించుచుండిరి. ప్రతాపరుద్రుని పుత్త్రుఁడు దిక్కులేనిపక్షి యయి తిరిఁగి యలసి వచ్చెను. ఆంధ్రనగరము తత్ప్రాంతదేశము తురుష్కులవశ

మయ్యెను. ఆంధ్రభూతలమును తురుష్కప్రతాపాగ్ని దహించుచుండెను. ఢిల్లీచక్రవర్తి యయిన గ్యాస్ఉద్దీన్ తుఘ్లఖ్ యొక్క పెద్దకొడుకును తురుష్కసైన్యాధ్యక్షుఁడును నైన 'మల్లిక్ ఫకీరుద్దీన్ జూనా' అను నామాంతరము గల అలూఫ్ ఖాను ఏకశిలానగరమునకు 'ఇమ్మద్ ఉల్ ముల్కు'ను బాలకుని (గవర్నరు) గా నియమించి కొంత సైన్యము చట నిలిపి కొదువ సైన్యముతో దండయాత్ర బయలుదేఱి ప్రాగాంధ్రదేశము మీఁదుగాఁ గళింగదేశమునకును అటనుండి ఢిల్లీనగరమునకును బోవ నిశ్చయించుకొని రాజమహేంద్రపురమునకుఁ బ్రయాణము సాగించెను.

## రాజమహేంద్రపురము తురుష్కులవశమగుట.

ఇట్లు తురుష్కులు తమ్మెదుర్కొనువారు లేక ముష్కరులై ఏకశిలానగరమునకును రాజమహేంద్రపురమునకు నడుమం గలయున్న దేశమును కొల్లపెట్టుచు, అనేకఘోరకృత్యములను గావించుచు వచ్చి రాజమహేంద్రపురదుర్గమును ముట్టడించిరి. ఇట్లు విజృంభించి నిరాతంకముగా దేశమధ్యమునుండి [illegible]మాత్ర వెడలి వచ్చిన శత్రుసైన్యమును పరాక్రమవిఖ్యాతులగు తెలుఁగునాయకులు గొందఱు స్వల్పసైన్యముతో నెదుర్కొని కొన్నిదినములు పోరాడఁ గలిగిరి. కాని

దైవసహాయము తక్కువగుటంజేసియు, శత్రుసైన్య మధికముగా నుండుటంజేసియుఁ దుదకు దుర్గమును విడిచి పెట్టవలసినవారైరి. అలూఫ్‌ఖాను 'హుమాయూన్ గజ్జర్' అను వానిని రాజమహేంద్రిప్రాంతదేశమునకుఁ బాలకుని (గవర్నరు)గా నియమించి తాను ఢిల్లీనగరమునకు వెడలిపోయెను. ఇది క్రీ. శ. ౧౩౨౩వ సంవత్సరాంతమున జరిగినది. రాజమహేంద్రిపురము తురుష్కులవశమైనతరువాత జరిగిన ఘోరకృత్యముల వర్ణింపఁ బనిలేదు. ఓరుగల్లునకుఁ బిమ్మట నొక్క రాజమహేంద్రిపురముననే దేశీయులు మొరాయించి తమ్మెదుర్కొన్నవారగుటచేత ప్రజలకు భీతి గొలుపనెంచి పట్టణము కొల్లగొనుటతోఁ దృప్తి నొందక పురాతనదేవాలయము నొకదాని బ్రద్దలుగొట్టి రాజమహేంద్రపురమున నొక గొప్ప మసీదును గట్టిరి. గవర్నరైనహుమాయూన్ గజ్జర్ ప్రేరేపణముచేత షరీఫ్ సాలర్ ఉల్వీయను సేనాపతి పై మసీదును క్రీ. శ. ౧౩౨౪వ సంవత్సరమున కట్టించినట్లు తెలియుచున్నది*. అలూఫ్‌ఖాను యుత్కలదేశములోని జాజిపురమును ముట్టడించి స్వాధీనము చేసికొని పిమ్మట ఢిల్లీనగ

---

* *Vide* District Manual, Page 28.

(ఇందునుగూర్చి ఫారసీభాషలో నొకశాసనము మసీదుద్వారముపై వ్రాయఁబడినది. ఆశాసన మిట్లున్నది—మహమ్మదుతుఘ్లక్ చక్రవర్తిపరిపాలనములో హుమాయూన్ గజ్జర్ కాలమున షరీఫ్ సాలర్ ఉల్వీ యనువానిచేత హిజ్రి ౭౨౪గవ సంవత్సరమున రజ్జాను ౨౦ వ దినమునఁ గట్టఁబడినది.) క్రీ. శ. ౧౩౨౪.

రమునకుఁ బోయి క్రీ. శ. ౧౩౨౫వ సంవత్సరమున 'మహమ్మద్‌బీన్‌తుఘ్లఖ్' అను బిరుదునామమును వహించి సింహాసన మధిష్ఠించెను.

## తెలుఁగునాయకులు తురుష్కులను జయించుట.

అయినను రాజమహేంద్రపురరాజ్యము స్వల్పకాలము మాత్రమె తురుష్కులస్వాధీనమం దుండెను. మంచికొండ కూనపనాయకుఁ డనుమహావీరుఁ డొకఁడు ప్రోలయనాయకుఁ డనువాని సాహాయ్యముతో రాజమహేంద్రపురమునందలి తురుష్కులను జయించి డిల్లీచక్రవర్తిపాలనమును కడముట్టించి రాజమహేంద్రపురమునకు నీశాన్యమూలను బదునొకండు మైళ్లదూరమున కోరుకొండయనుప్రదేశమున నొకదుర్గమును నిర్మించి ప్రజాపరిపాలనము చేయ నారంభించెను. ఏకశిలానగరమునకును విజయవాటిక (బెజవాడ) కును రాజమహేంద్రపురమునకును నడుమనుండుదేశమును కాకతీయరాజబంధువు లగురాచవారు పరిపాలనము చేయుచుండిరి.

ప్రతాపరుద్రుని సేనానులలో నొక్కఁ డగుదొడ్డారెడ్డికి దౌహిత్రుఁడైనప్రోలయవేమారెడ్డి యనునాతఁడు కృష్ణానదికి దక్షిణపార్శ్వమునందున్న కొండవీడు వినుకొండ రాజ్యముల నాక్రమించుకొని అద్దంకి రాజధానిగా శత్రుజనభయంకరుఁడై ప్రజాపరిపాలనము చేయుచుండెను.

ఏకశిలానగరమునకు దక్షిణభాగమున నుండునాంధ్రదేశముపై తురుష్కమహావాయువు వీచుటకుఁ బ్రారంభించినపుడు నడగొండవలె నడ్డుపడి నిలువరించినమహాశూరుఁ డగు రేచెర్ల సింగమనాయఁడు బలాఢ్యము లైనరాచకొండ, దేవరకొండ దుర్గములలో నివసించుచు నోరుగల్లునకు (ఏకశిలానగరము) శ్రీశైలమునకు నడుమ నుండు దేశమును బరిపాలనము సేయుచుండెను.

శ్రీశైలమునకు దక్షిణమున నుండుగండికోటరాజ్యమును, పెనుగొండరాజ్యమును సంగమ రాజపుత్త్రుఁడుబుక్కరాజును, వానికిఁ బ్రాగ్దిక్కున నుండునుదయగిరిరాజ్యమును వాని రెండవ యన్న యగుకంపభూపతియును, విద్యానగరము రాజధానిగ నానెగొంది, బరకూరురాజ్యములను మొదటియన్న యగుహరిహరభూపతియును బరిపాలనము సేయుచు నూత్నకర్ణాటరాజ్యసంస్థాపకు లై నలుప్రక్కలఁ గర్ణాటరాజ్యమును విస్తరింపఁ జేయఁ బ్రయత్నించుచుండిరి*.

## మహమ్మదీయుల విజృంభణము.

ఇదివఱకే యుత్తరహిందూస్థానమంతయు మహమ్మదీయ పరిపాలనముక్రిందికి వచ్చి యుండెను. ఇప్పుడు దక్షిణహిందూ

---

* వీరిచరిత్రములు వేఱ్వేఱుప్రకరణములలో సవిస్తరముగాఁ దెలుపఁబడును గావున నిచట వివరింపలేదు.

దేశము నంతయు జయింపవలయునని మహమ్మద్ తుఘ్లఖ్ సంకల్పించెను. ఇతఁడు క్రీ. శ. ౧౩౨౫ వ సంవత్సరమున డిల్లీసింహాసన మధిష్ఠించినతరువాత దక్షిణహిందూదేశము లోనిహిందూరాజ్యములకు విపత్తులు సంఘటిల్లెను. ఇతని హృదయపీఠమందు దురాశ, క్రౌర్యము దట్టముగా నలము కొని మూర్తీభవించి కూర్చుండినవి. భరతఖండమునందలి హిందూరాజ్యముల నన్నిఁటి నొక్క గుక్కలో మ్రింగివేయ వలయు నన్నంతదురాశ యాతనిబట్టి పీడించుచుండుటచేత స్వస్థచిత్తము లేక యుండెను. ఇతఁడు క్రీ. శ. ౧౩౨౭ వ సంవత్సరమున లక్షగుఱ్ఱపుదళముతో హొయిసల (మైసూరు) దేశముపై దండెత్తి వచ్చి రాజధాని యయినద్వారసముద్రమును స్వాధీనపఱచుకొని హొయిసలరాజయిన వీరభల్లాణదేవుని (మూఁడవబల్లాలరాజు) నచటినుండి పాఱద్రోలి యానగరమును ధ్వంసముగావించి మరలి ఢిల్లీనగరమునకుఁ బోయెను. ౧౩౧౦ దవ సంవత్సరమున మలిక్ కాఫుర్ జయించినది మొదలుకొని దక్షిణమధురాపురము మహమ్మదీయులవశమై వారిచేతనే పరిపాలింపఁబడుచుండెను. అపుడు కుత్బు-ఉద్దీన్-ఖాన్ మధురాపురమునకుఁ బాలకుఁడు (గవర్నరు)గ నుండెను. వీరభల్లాణదేవుఁడు ద్వారసముద్రమును విడిచిపెట్టి తూనూరని యెడు తిరువణ్ణామలను (దక్షిణార్కాడుమండలములోనిది) రా

జధానిగఁ జేసికొని యందే నివసించి యుండెను. ఈమహమ్మదీయులదండయాత్రలవలన దక్షిణహిందూదేశమంతయు నొక్కమాఱల్లకల్లోల మయ్యెను. దక్కనునకు రాజప్రతినిధిగా నియమింపఁబడినతనసోదరపుత్త్రుఁడు తనపరిపాలనమును ధిక్కరించి స్వతంత్రపరిపాలనము సేయుచున్నందున వానిని శిక్షించుటకై మహమ్మదు తుఘ్లఖ్ చక్రవర్తి గుజరాతునకు(ఘూర్జరమునకు) గవర్నరుగా నున్న 'ఖాజాజెహా' నను వానిని పంపించెను. దేవగిరిసమీపమున వార లుభయులకును ఘోరయుద్ధము జరుగ 'బహాఉద్దీన్' చక్రవర్తిసైన్యములను గెలువఁజాలక పాఱిపోయి యానెగొందిభూపాలుని శరణువేఁడెను. అప్పుడు శరణాగతరక్షకుండని బిరుదు వహించినజంబుకేశ్వరరాయలు తనకు రాఁబోవువిపత్తునైనఁ దలపోయక యాతురుష్కునకభయహస్త మిచ్చి రక్షణ యొసంగెను*.

* ఆనెగొందియొక్క పూర్వచరిత్రము రాయవంశావళియను గ్రంథమునందక్క మఱియెచ్చటను గానరాదు. ఈగ్రంథమానెగొందిసంస్థానములో నున్నదఁట: రాయవంశావళియనుగ్రంథమును బట్టి చూడఁగా నందుఁడనురాజు కిష్కింధ(ఆనెగొంది)లో ౧౧౧౪ మొదలు ౧౧౩౬ వఱకు, అతనికుమారుఁడు చాళుక్యుఁడు ౧౧౩౬ మొదలు ౧౧౧౩ వఱకు పరిపాలనము చేసిరి. వీనికి ముగ్గురుపుత్త్రులు గలరఁట. అందగ్రజుఁడైన బిజ్జలుఁ డనువాఁడు కళ్యాణపురమునకు రాజయ్యెనఁట విజయధ్వజుఁ డనురెండవకొడుకు ౧౧౧౩ మొదలుకొని ౧౧౫౬ వఱకును ప్రభుత్వము

## ఆనెగొందిపై తురుష్కుల దండయాత్ర.

సంగమరాజపుత్త్రులు నూత్నకర్ణాటరాజ్యమును స్థాపించుటకుఁ బూర్వమనఁగా క్రీ. శ. ౧౩౩౩ వ సంవత్సరప్రాంతమున చంద్రవంశసంజాతుఁ డగు జంబుకేశ్వరుఁడు తుంగభద్రానదికి

---

చేసెనఁట! విష్ణువర్ధనుఁ డనుమూఁడవవానిం గూర్చి యేమియుం దెలియరాదు. విజయధ్వజుఁడే తుంగభద్రాతీరమునఁ దనపేరిట విజయనగర మనుపట్టణమును నిర్మింపగా దానిని మాధవవిద్యారణ్యులవారిప్రోత్సాహముచే సంగమరాజపుత్త్రుఁ డగుహరిహరరాయలు విశాలమైనపట్టణముగాఁ జేసి ప్రఖ్యాతికిఁ దెచ్చెనని కొందఱు వ్రాసి యున్నారు. విజయధ్వజుని యనంతరమున వేదరాజు ౧౧౭౬-వఱకును, మనుమఁడగు రామదేవరాజు ౧౨౭౦ వఱకును, రామదేవరాయనికుమారుఁ డగుప్రతాపరాయఁడు ౧౨౯౭ వఱకును ప్రభుత్వము చేసిరఁట ఈప్రతాపరాయనికొడుకే జంబుకేశ్వరరాయలఁట! ఈరాయవంశావళి క్రమమైనదియగునో కాదో పరిశోధింపవలసిన గ్రంథముగా నున్నది.

ఈవంశావళిలోనివిజయధ్వజుండే యిప్పటి విజయనగరసంస్థానీకులైనపూసపాటివారిపూర్వీకుఁ డని విజయనగరకళాశాలాధ్యక్షు లగు శ్రీమాన్ కిడాంబిరామానుజాచార్యులు. ఎమ్. ఏ. బి. యల్. ఎఫ్. ఎమ్. యు. గారాంధ్రపత్రిక యొక్క మూఁడవసంవత్సరాదిసంచికలో విజయనగరపురాజు లను శీర్షికతో వ్రాసినవ్యాసములో నుదాహరించి ముడిపెట్టినది మాత్రము వింతగాఁ గన్పట్టక మానదు. రాయవంశావళిగ్రంథములోని పై వంశక్రమమును శ్రీయుత బెంగుళూరు సూర్యనారాయణరావు బి. ఏ. గారి ‘Never-To-Be-Forgotten-Empire’ అనుగ్రంథమునుండి గ్రహింపఁబడినది.

నుత్తరపుటొడ్డున నున్న యానెగొందిదుర్గమునుండి తత్సమీప దేశమును బరిపాలనము సేయుచుండెను. ఇతఁడు బహాఉద్దీనునకు రక్షణ యొసంగె ననుసమాచారములను చారులవలన విని చక్రవర్తి కోపోద్దీపితుఁడై ౧౩౩౪గవ సంవత్సరమున దండయాత్ర వెడలి వచ్చెను. అసంఖ్యాకములగు సైన్యములతోఁ దనపై దండెత్తివచ్చియున్న చక్రవర్తిని కంపిలికోటసమీపమున జంబుకేశ్వరుఁ డెదిరించెను. ఆంధ్రకర్ణాటులకును ఢిల్లీ తురుష్కులకును మఱియొకమాఱు ఘోరయుద్ధము జరిగెను. ఈయుద్ధము తనకుఁ బ్రతికూలముగ బర్యవసితమగునని యూహించి తురుష్కులవలన స్వకుటుంబమునకు మానభంగమగునేమో యన్నభయముతో తనస్త్రీల నెల్లర నగ్నిప్రవేశముసునట్లు చేసి రాజు శత్రువుల మార్కొని పౌరుషముతోఁ బ్రాణము లున్నంతదనుక పెనఁగి తుదకు వీరస్వర్గమునే నొందఁగలిగెను. ఆనెగొందిదుర్గము తురుష్కులవశ మయ్యెను. ఢిల్లీ చక్రవర్తి చేతికి బహాఉద్దీనుమాత్రమె గాక మఱిముగ్గురు మంత్రివర్గమువారు చిక్కిరఁట వీరిలో జంబుకేశ్వరునిమంత్రి యగుహరిహరరాజును కోశాధ్యక్షుఁ డగు బుక్కరాజుకూడ నుండిరఁట! తక్కిననలువురును జంబుకేశ్వరుని సర్దారులఁట! వీరి కోరిక ననుసరించి రాయలశవ మానెగొందికిఁ గొనిపోఁబడి యాతనియౌర్ధ్వదేహిక క్రియలు చక్కగా నిర్వర్తింపఁ

బడినవఁట! అచ్చటి జనులు జంబుకేశ్వరుని దైవమును గాఁ దలంచి పూజించుచుండిరి. డిల్లీచక్రవర్తి రాజ్యమును వశ పఱచుకొని యాప్రదేశమునకు 'మలిక్‌నాయబ్' అనువాని నధికారినిగా నేర్పఱచి చెఱపట్టి యుంచిన యాఱ్గురిని వెంట నిడికొని డిల్లీనగరమునకు వెడలి పోయెనఁట! చక్రవర్తిక్రూరుఁడై బహాఉద్దీనుని హింసపెట్టించి చంపించెనఁట! ఎప్పుడు డిల్లీచక్రవర్తి సైన్యములతోఁ దమదేశమును విడిచిపెట్టి వెడలి పోయెనో యానాఁటనుండియు 'మలిక్‌నాయబు' నకు ప్రజలు వశులు గాక ధిక్కరించి పోరాడుచున్నందున వారి శౌర్యోత్సాహములను స్వాతంత్ర్యప్రీతిని మెచ్చుకొని యచట రాజ్యము చేయుట తనకు సాధ్యము కాదని తలంచి చక్రవర్తికి దేశస్థితి నంతయును దెలియఁజేయఁగా నాతఁడు నట్లే యూహించి తనకడ బందెలోనున్న హరిహరునకు రాజ్యము నొసంగ బుక్కరాజును వానికి మంత్రిగా నియమించి తనకు సామంతులుగ నుందున ట్లొప్పించుకొని వారలను కారాగారమునుండి విముక్తులను గావించి వారిదేశమునకుఁ బంపించి తరువాత మలిక్‌నాయబుని తనకడకు రప్పించుకొనియెనఁట! ఇట్లని మహమ్మదీయచరిత్రకారులు వ్రాసి యుండిరి.* వీర భల్లాణదేవుఁడు

* ఇబున్‌బతూతా యను మహమ్మదీయచరిత్రకారుఁడు. క్రీ. శ. ౧౩౩౩వ సంవత్సరమున హిందూదేశమును చూడవచ్చి తొమ్మిదిసంవత్సర

క్రీ. శ. ౧౩౮౫ వఱకు బ్రదికి యుండి పేరునకు మాత్రము చక్రవర్తిగానుండి పరిపాలనము చేయుచున్న వాఁడైనను వాస్తవముగా హరిహరాదులే స్వతంత్రపరిపాలనము సేయుచుఁ దమరాజ్యమును బలపఱచుకొని క్రమముగా విస్తరింపఁ జేయుచుండిరి.

### ప్రతాపరుద్రునిపుత్త్రుఁడు తురుష్కులను దఱిమి వేయుట.

తనతండ్రిసామ్రాజ్యములోఁ జేరినయాంధ్రదేశమంతయుఁ బైని జెప్పినప్రకారము పలుభాగములుగా విడిపోయి పల్వురచేఁ బరిపాలింపఁబడుచుండుటయు, నాంధ్రనగరము తురుష్కులవశమై యాంధ్రదేశమునఁ దురుష్కులపాలనము బలపడుచుండుటయు, అసహాయుఁడై తాను దుస్థితియందుండుటయుఁ

ములు సంచారము చేసెను. ఇతఁడు వ్రాసిన దానికిని అచ్యుతదేవరాయల కాలమునాఁ డున్నపోర్చు గీసువాఁడైన ఫెర్నావోన్యూజ్, ఫెరిస్తా మొదలగు చరిత్రకారులువ్రాసినగాథలకును కాలవ్యత్యాసములు మొదలగునవి కొన్ని కానంబడుచున్నవి. ఇబూబతూతా పైనిజెప్పిన కాలమున నున్నవాఁడుగనుక నతఁడు వ్రాసినదానియందే యెక్కువసత్య ముండవచ్చునుగాని యీచరిత్రకారులు జంబుకేశ్వరునకుఁ బిమ్మట డిల్లీచక్రవర్తి జంబుకేశ్వరుని మంత్రి యగు దేవరాయలను (హరిహరుని) సింహాసన మెక్కించె నని చెప్పుచున్నారు గాని యది యంతగా విశ్వసింపఁ దగినది కాదు.

బలుమాఱుఁ దలపోసి తలపోసి చింతించుచు నిరుత్సాహుఁడు గాక రెండవప్రతాపరుద్రునిపుత్త్రుఁడు తనకు మిత్రులైన యాంధ్రనాయకులతోడ దురుష్కులనుఁ దఱిమివేయుటను గూర్చియాలోచించుచుండెను*. ఆంధ్రదేశమున మహామ్మదీయులైన తురుష్కులు తమరాజ్యమును స్థాపించిరనియు వారలు క్రమముగా దక్షిణహిందూదేశమునంతయు వశపఱచుకొందురనియు, ఏతన్మూలమున విగ్రహారాధనద్వేషమతాభిరతులగు తురుష్కులపాలనమున హిందూమతాచారధర్మములు చెడిపోయి హిందూమతము క్షీణించుననియు, కావున నాంధ్రులుఁ, గర్ణాటకులు, ద్రావిడు లేకీభవించి విగ్రహారాధనద్వేషమతాభిరతులు, నూత్నశత్రువులు నగు మహమ్మదీయుల దక్షిణాపథమునుండి తఱిమివేయుట ప్రథమ కర్తవ్యమనియు

* ప్రతాపరుద్రునిపుత్త్రుని నిజమైన పేరెద్దియో తెలియరాకున్నది. పల్వురు పలుపేరులను బెట్టి వ్యవహరింపఁదొడంగిరి. స్థానికచరిత్రమునందు వీరభద్రరా జని పేర్కొనఁబడి యుండెను గాని కొందఱు వినాయకదేవుఁడని వ్యవహరించిరి. ఫెరిస్తా కృష్ణనాయకుఁ డని పేర్కొనియెను గాని చక్రవర్తిపుత్త్రునికి నాయకశబ్దము చేర్చుట సమంజసముగాఁ గన్పట్టలేదు. మఱియొకచోట నాగదేవుఁడని వ్యవహరింపఁబడియెను. భావిపరిశోధనమునంగాని యథార్థనామ మిదియని నిర్ధారింపఁ జాలము. అందువలన నే పేరు నుగైకొనక నేను ప్రతాపరుద్రునిపుత్త్రుఁడని మాత్రము వ్రాయుటయె యుక్తమని తోఁచినది.

నీమహాత్కార్యమును బూనుటకు సంసిద్ధుఁడనై యున్నానని యు, నందుల కెవరిశక్తికొలఁది వారు సైన్యములను బంపి సాహాయ్యముఁ జేయవలసి యుండునని విద్యానగరంబునం దుండెడిహరిహరరాయలతోడను, కర్ణాటదేశాధీశ్వరుం డైన బల్లాలదేవునితోడను కేరళదేశాధీశ్వరునితోడను ప్రసంగించి సఫలీకృతమనోరథుఁడై క్రీ. శ. ౧౩౪౪వ సంవత్సరములోఁ దురుష్కుల నెదుర్కొనుటకు సైన్యముల సమకూర్చుచుండెను. కేరళదేశాధీశ్వరుండు కొంతసైన్యమును బంపెను. కర్ణాటసైన్యమున కాధిపత్యమును వహించినకంపభూపతియు, రెడ్డినాయకులకు ప్రతినిధిగా వేమారెడ్డిసోదరుఁ డగు మాచారెడ్డియు, పద్మనాయకవెలమలకుఁ బ్రతినిధిగా సింగమనాయఁడు మొదలగువారును తమలోఁదమకుంగలవైషమ్యములనుగొంత వఱకు మఱచిపోయి యీమహాత్కార్యమునందు ప్రతాపరుద్రునిపుత్త్రునికిఁ దమతమసైన్యములతోవచ్చి తోడ్పడియుండు రు. ఈసైన్యములకన్నింటికి వీరశిఖామణియు బుద్ధిశాలియు నగుప్రతాపరుద్రునిపుత్త్రుఁ డధ్యక్షుఁడై సైన్యములనడిపించుకొని పోయి యోరుగల్లు ముట్టడించెను. కాకతిసామ్రాజ్యము భగ్నమైనవెనుక నిరువదిసంవత్సరములకు ప్రతాపరుద్రునిపుత్త్రునిప్రయత్నములుఫలించినవి. అప్పుడుదక్కనునందున్న తురుష్కులకును, హిందువులకును వెక్కుదినములుముక్కుర ఘోర

యుద్ధము జరిగి యోరుగంటిరణక్షేత్రమున రక్తకాల్వలు ప్రవహించిన వన్న నతిశయోక్తి కాదు. సుస్థిరచిత్తుఁడై ప్రతాపరుద్రునిపుత్త్రుఁడు యుద్ధరంగమున నిలువంబడి యసంఖ్యాకములగుహిందూసైన్యములఁ బురికొల్పుచుఁ బెక్కుదినములు విడువక పోరాడుటంజేసి తురుష్కసైన్యంబులు నిరుత్సాహముం జెందుటయు, నందువలన విశేషముగా హతమగుటయు సంభవించెను. తుదకు ఇమ్మదు-ఉల్-ముల్కు హతశేషమగు సైన్యముతో నోరుగల్లు విడిచి పాఱిపోయెను. ప్రతాపరుద్రుని పుత్త్రుఁడు వాని వెన్నంటి దఱిమెను. అతఁడు దౌలతాబా దను నూత్ననామమును వహించిన దేవగిరిపట్టణమునకుఁ బాఱిపోయెను. అంతటఁ గాకతీయుఁడు హిందూ సైన్యములను మరలించుకొని యేకశిలానగరమును బ్రవేశించి పట్టాభిషిక్తుఁ డయ్యెను. ఈసమాచాము తెలియవచ్చినతోడనే ఢిల్లీచక్రవర్తియగు మహమ్మదుతుఘ్లఖ్ చిత్తచాంచల్యము గలవాఁడై పూర్వముకంటెను క్రూరుఁడై ప్రజల నానావిధముల బాధించుచు ఢిల్లీనగరవాసులను దౌలతాబాదునకుఁబోయికాపురముండునటులు నిర్బంధపఱుపసాఁగెను. ఢిల్లీనగరమునుండి దౌలతాబాదునకును దౌలతాబాదునుండి ఢిల్లీనగరమునకును బ్రజల నినుమాఱు ద్రిప్పియుఁ దుదకు విఫలప్రయత్నుఁ డయ్యెను.। ఈదెబ్బతో దక్కనుదేశమునందు

ఢిల్లీచక్రవర్తి ప్రభుత్వము నశించి పోయెనుగాని ప్రతాపరుద్రునిపుత్త్రునికి మాత్ర మీయోరుగల్లురాజ్యము స్థిరపడక స్వల్పకాలములోనే యన్యాక్రాంత మయ్యెను.

### రేచెర్లసింగమనాయని విజృంభణము.*

రేచెర్లసింగమనాయఁడు రాచకొండదుర్గములో నుండి యేకశిలానగరమునకును శ్రీశైలమునకు నడిమిదేశమును బరిపాలనము చేయుచుండె నని యితకుఁ బూర్వము దెలిపి యున్నాఁడను. ఇతఁడు బలాఢ్యములగు రాచకొండ, దేవరకొండ దుర్గములలో నివసించుచుఁ గాకతీయాన్వయుల యధికారమును ధిక్కరించి స్వతంత్రుఁడై రెడ్డినాయకులకు రాచవారికిఁ బ్రబలశత్రువై వారిగిరిదుర్గములనాక్రమించుకొనుచు భయంకరుఁడై యుండెను.

---

*ఇతఁడు ప్రతాపరుద్రుని ప్రసిద్ధసేనానులలో నొక్కఁడైన యెఱ్ఱదాచానాయని పుత్త్రులలో జ్యేష్ఠుఁడు. ప్రతాపరుద్రుని పరిపాలన కాలమున సుగతల యనుగ్రామమునొద్ద మచ్చకొమ్మనాయఁడను వానిని జిలుగుపల్లియొద్ద రుద్రమనాయనియుద్ధములో సంహరించి రణము గడిపి 'మచ్చనాయకగండఁడు' యను బిరుదమును, 'సోమవంతరాగోల' యను బిరుదమును, 'కోదమనాయకతలగుండుగండ' యను బిరుదమును ప్రతాపరుద్రుని వలనఁ బొందుటయే గాక యెనుబది బిరుదముల నాతని వలనఁ బడయఁగాంచి 'అశీతిబిరుదాలసింగమనాయఁడు' అని ప్రసిద్ధిగాంచెనఁట — వెలుగోటి వారి వంశచరిత్ర [illegible] పేజీ చూడుఁడు.

వారలకు వీనిని జయించుట కష్టసాధ్యముగా నుండెను. ఇట్లుండ నొకనాఁడు రాచవారిసింగమనాయని బావమఱఁది యగు చింతలపల్లి సింగమనాయనిఁ బట్టుకొనిపోయి జల్లిపల్లి కోటలో చెఱలోఁ బెట్టఁగా నీతఁడు విని బహుసైన్యములఁ గూర్చుకొనిపోయి జల్లిపల్లికోటను ముట్టడించెను.

## సింగమనాయఁడు సంహరింపఁబడుట.

అప్పుడు దుర్గములో నున్న రాచవారితనితోఁ దలంపడి పోరాడుటకు సాహసింపఁజాలక మాయోపాయంబున నీతని గడతేర్పవలయు నని తమలోఁ దాము నిశ్చయముచేసికొని మహామాయావి యగుతమ్మళబ్రహ్మాజీయను వానిని రప్పించి మోసపువిధముగా సింగమనాయనిఁ జంపు మని బోధించి రఁట! అతండును వల్లెయని యొకనాఁడు సింగభూపతిని స్నేహ భావమును సూచింపుచు సమీపించి యాకస్మికముగాఁ గప టోపాయమున నాతనిఁ బాకుతోఁ బొడిచి పాఱిపోయెనఁట! అంతట సింగమనాయఁడు తనపుత్త్రిలను రప్పించి “ పుత్త్రకు లారా! నాశత్రువులు నన్ను యుద్ధమున గెలువలేక కపటో పాయమునఁ బొడిపించిరి. నే నిఁక బ్రతుకను. దీనికి మీరు చింతించినఁ బ్రయోజనము లేదు. నన్నుఁ బొడిపించిన శత్రు రాజులరక్తముతోఁ దిల తర్పణమును గావించి నాఋణము

దీర్చుకొన్నాఁడు. ఇదియె నాకోరిక" అని చెప్పి ప్రాణముల విడిచెనఁట! ఇట్లని వెలుగోటివారివంశచరిత్రమునందు వ్రాయఁబడినది. కాని సింగమనాయనిమరణము మఱియొక విధముగాఁ దెలియుచున్నది. పూసపాటిరాజన్యుల పూర్వికుఁడగుమాధవవర్మకును రేచర్లగోత్రోద్భవుఁడగుసింగమనాయనికిని బెజవాడసమీపమున నున్న పెదవీడను స్థలమున ఘోరమైనయుద్ధము జరిగి యాయుద్ధములో మాధవవర్మ సింగమనాయని సంహరించుటయె గాక యంతటితోఁ దృప్తి నొందక సింగమనాయనిభార్యగర్భములో నుండు శిశువుం గూడ సంహరింపఁ బ్రయత్నించెనఁట! అందువలన నాతనికి "రేచెర్లగోత్రసముద్భవశుష్కకాననదావదహనుం" డను బిరుదము కలిగెనని కవిజీవితములలోఁ జేర్కొనఁబడియెను*. సింగమనాయనిమరణమునకుఁ బైని జెప్పిన వానిలో నేది కారణమైనను సింగమనాయనిపుత్త్రులకు రాచవారియెడ ద్వేషమును బురికొల్పుటకుఁ జాలియుండెను.

---

* శ్రీరామమూర్తి కృతమగు కవిజీవితగ్రంథము పే. ౩౬.

రేచెర్లగోత్రజులలో సింగమనామధేయులును, పూసపాటివారి వంశములో మాధవవర్మ నామధేయులును పెక్కండ్రు గలరుగావున నేనాటి కాలమున నిట్టిపని జరిగియుండునని చదువరులకు సంశయము గలుగవచ్చును. ఈకారణముచేతనే పూసపాటివారికి పైబిరుదము వచ్చియున్నయెడల తప్పక యీసింగమనాయనికాలమే యై యుండవలయును. అయిన నింకను విచారణీయము.

## మొదటి ప్రకరణము.

ఈసింగభూపాలుఁడు కృష్ణానదీతీరమున సిద్ధక్షేత్రముగా నున్న యేలేశ్వరములో ననేకబ్రహ్మప్రతిష్ఠలు గావించెననియు, మఱియు ననేకదానముల గావించెననియు, సింగభూపాలీయమున వర్ణింపఁబడి యుండెను*.

### సింగమనాయనిసోదరుల ప్రతాపము.

సింగమనాయనిసోదరులైన వెన్నమనాయఁడును, యాచమనాయఁడును మత్స్యగన్నరాజు మొదలగు రాజులను జయించి కొలమచెలమగ్రామములో నున్నమన్నెవారిపై దక్కనులోని తురకలు దండెత్తి రాఁగా మన్నెవారు సాహాయ్యముకోరి ప్రార్థించినందున వీరు తురకలపై యుద్ధమునకు వెడలిరి. యాచమనాయఁడు తురకల నోడించి మన్నెవారిని గాపాడి 'వీరగురు' అను బిరుదమును గాంచెనఁట! ఈయుద్ధమును జేర్కొనకపోయినను 'వీరగురు' బిరుద మున్నట్లు సింగభూపాలీయమున నుదాహరింపఁబడి యున్నది. ఈయాచమనాయనికి నాగానాయఁ డనుపుత్త్రుఁడు గలఁడనియు, అతఁడు దణ్ణాలకోట (ధరణికోట) యొద్దను అనవేమారెడ్డితోఁ గదారి

---

* శ్లో. కృష్ణైలేశ్వరసన్నిధౌ కృతమహాసంభార మేలేశ్వరే
వీతాపాయ మనేకశో విదధతా బ్రహ్మప్రతిష్ఠాపనమ్
ఆనృణ్యం సమపాది యేన విభునా తత్తద్గుణై రాత్మనో
నిర్మాణాతిశయ ప్రయాస గరిమవ్యాసఙ్గిని బ్రహ్మణి.

యుద్ధముచేసి జయించినందునఁ గతారినాయఁ డను బిరుదమును వహించె నని సింగభూపాలీయములోని యొకశ్లోకము వెలుగోటివంశచరిత్రమునందు నుదాహరింపఁబడినది. కాని నాగానాయనికిఁ గతారినాయఁడనియు, రావుత్తురాయఁడనియు బిరుదము లున్నట్లుగాఁ జెప్పెనేకాని యతఁ డనవేమారెడ్డితోఁ యుద్ధము చేసి జయించినట్లు చెప్పియుండలేదు. కావున నాగానాయఁ డనవేమారెడ్డిని జయించినది విశ్వసనీయము కాదు*.

## రెండవ ప్రకరణము.

### అనపోతభూపాలుని దిగ్విజయములు.

(క్రీ. శ. ౧౩౪౪ మొదలు క్రీ. శ. ౧౩౭౦)

రేచెర్లసింగమనాయనిమరణానంతర మాతనిజ్యేష్ఠపుత్త్రుఁడైనఅనపోతనాయఁడు తనతండ్రిని రాచవారక్రమముగాఁ జంపించి రని నక్రోధుఁడై పగఁబూని విజృంభించి తనతండ్రియాజ్ఞానుసారముగా దిగ్విజయము ప్రారంభించి క్షత్రియసంహారమునకుఁ గడంగి శాత్రవులరక్తముతోఁ దండ్రికిఁ దిలతర్పణము గావింపవలయు నని గాఢప్రతిజ్ఞను జేసి చతురంగసేనాపరివృతుఁడై వీరశిఖామణి యగుతమ్ముఁడు మాదానాయఁడు వెంట నంటి రా, యసంఖ్యాకము లగుసైన్యములతోఁ బోయి

* శ్లో. శ్రీమాన్ వేచమహీపతి స్సుచరితో యస్యానుజన్మా స్ఫుటం
ప్రాప్తో వీరగురుప్రథాం పృథుతరాం వీరస్య ముద్రాకరః
లబ్ధ్వాలబ్ధ్వకతారిరాయబిరుదం రావుత్తురాయాన్వితం
పుత్త్రం నాగయనాయకం వసుమతీవీరైకచూడామణిమ్.

శత్రువులదై నజల్లిపల్లి కోటను ముట్టడించెను. చాళుక్యవంశదీప
కు లైనక్షత్రియు లనేకు లాదుర్గములోనుండి విషజ్వాలలను
గ్రక్కుచు నాల్కలను దెఱచికొని వచ్చెడిక్రూరకృష్ణసర్పము
లభాతి చనుదెంచెడి యావీరకుమారద్వయము నెదుర్కొని
క్షాత్రతేజముపెంపుఁ జూపుచుఁ బోరాడఁ దొడంగిరి. ఈక్ష
త్రియవీరవర్గమునకుఁ దోడ్పడుటకై కమ్మనాయకులును, రెడ్డి
నాయకులును బాహుదర్పమ్మున మెఱయుచు యుద్ధసన్నద్ధు
లై రాగా మొగులూరిదుర్గముసమీపమున చెంజెర్లభూమి
ప్రాంతమున నుభయపక్షములవారికిని మహాభయంకరమైన
యుద్ధము జరిగెను. అప్పు డనపోతానాయనికే జయము కలిగి
నందున వారలిరువురును శత్రువులను సంహరించి వారిరక్త
ముతోఁ బితృతర్పణము గావించి పగఁ దీర్చుకొని కృతార్థ
జన్ములైరట*!

---

* ఇంతటిపౌరుషకృత్యము గావించినందుల కీవీరశిఖామణిని వందిమా
గధులు "రేచర్లవిక్రమాదిత్య, రేచర్లవార్ధిచంద్రోదయ, సోనమల్లా రెడ్డిరణ
భూతబలిహరణా, మంగళప్రూడి యిమ్మడిరెడ్డి రణరంగమర్దనా, రావుసర
పుమల్లారెడ్డిభుజాఘట్టన, పోలూరుపోలా రెడ్డిరణనిర్ధూమధామ, బండికో
టూరెడ్డిరణభుక్తిఖడ్గభేతాళ, వినుకొండమారారెడ్డిప్రాణవాయుహరణ కర
వాలక్రూరసర్ప, కుంట్లూరు మారారెడ్డికంఠవిదళనఖడ్గభైరవకరవాలదం
ష్ట్రి, అరసపల్లి గౌరిరెడ్డిబలాటవీదావాగ్నికీలా, కొత్తపల్లికొండారెడ్డి
ప్రాణాపహరా," అని పొగడినందున నసపోతానాయఁడు భట్లకగ్రహార
ములిచ్చి జయభేరీతమ్మటధ్వనులను, బిరుదకాహళరవమ్ములను మ్రోయించు
చు నిజరాజధానియగు రాజగిరికి విచ్చేసెనఁట !- వె.సం.చ. పే.౩౭. చూడుఁడు

## ఇనుకుర్తికోట ముట్టడి.

పిమ్మట మఱికొంతకాలమునకు సోదరు లిరువురు విజిగీషులై మహత్తరసేనలతోఁ బోయి యినుకుర్తికోటను ముట్టడించిరి. చంద్రవంశాన్వయులైనచాళుక్యరాజులు పెక్కండ్రు కమ్మదొరలను తోడు చేసికొని దుర్గమును సంరక్షింపుచు బహుదినములు ప్రాణముల కాసపడక పోరాడి రణభూమియం దొఱఁగ వారిసేనలు వెఱచి కాందిశీకము లయ్యెనఁట! క్షత్రియులతోనైన యీమహాయుద్ధమునందు నూటయిరువది యొకండ్రు రాజులను సంహరించుటం జేసి సోమకులపరశురాముం డను బిరుద మనపోతనాయనికిఁ గలిగెనఁట! ఈబిరుద మాతనికిఁ గలదని దెలిపెడుశాసనము లనేకము లీయనపోతనాయనిచే లిఖింపఁబడియున్నవి*.

* అయ్యనవోలు శాసనములో నిట్లున్నది.

"మునిరజని పరశురామః
స్థానే వినియుజ్య వైష్ణవం తేజః
సోమకులపరశురామే
ధరా మత్యవన్నపోతభూపాలే"

వె. ఎం. చరిత్ర. అనుబంధము పేజీలు ౨౦—౨౧.

"సోమకుల పరశురామే భుజబలభీమేధిభూమిగోపాలే
యత్ర చ జాగ్రతి శాస్తరి జగతాం జాగర్తి నిత్యకల్యాణమ్."

సింగభూపాలీయము.

తరువాత నితఁడు భువనగిరి, యోరుగల్లు మొదలగు దుర్గముల నన్నిఁటిని స్వాధీనముఁ జేసికొని నిజముగా క్షత్రియుల పాలిటికిఁ బరశురాముఁడై యోరుగల్లు ప్రాంతదేశమున నుండు క్షత్రియుల నెల్లర నురుమాడుచుండెను. ఈసంహారమున కనేక క్షత్రియ కుటుంబములవారు వెఱచి వాని రాజ్యమును విడిచిపెట్టి విదేశములకుఁ బోయిరి. ప్రతాపరుద్రుని పుత్త్రుఁడుగాని వానిసంతతివారుగాని యేమయిరో వారి యుదంత మావంతయుఁ జరిత్రమునం దెలియరాకున్నది. క్రీ. శ. ౧౩౬౫ వ సంవత్సరమునాఁటికి నోరుగల్లు, పానుగల్లు, భువనగిరి, మెతుకు, గోలకొండ మొదలగు దుర్గము

ఇచుసర్తి కోటసమీపమునఁ బోరాడి వీరమరణము నొందిన క్షత్రియ నాయకుల పేర్లీక్రిందివి వెలుగోటివారివంశచరిత్రమునం దుదాహరింపఁ బడినవి.

కొండ రాఘవరాజు, కొండ్రాజు, జగ్గరాజు, గోవిందరాజు, గోపరాజు, జూటూరు సూరపరాజు, స్వర్ణసేనపరాజు, పీనరాజు, చినరాజు, పెద్దిరాజు, అప్పలగోలరాజు, రామరాజు, సాళ్వ రాఘవరాజు, సర్వరాజు, తిరుమలపోల్రాజు, వీరమరాజు, కుప్పరాజు, నరసరాజు, శ్రీనాథ గాత్రమీఘూనాథరాజు, సంపెట బాల్రాజు, మాదాల పెద్దరాజు, మల్లదేవరాజు, నట్లూరి పోల్రాజు, నల్లరాజు, శ్రీపతిరాజు, చిన్నవల్లభరాజు, చినశంకిరాజు, కనకరాజు, సక్కల్రాజు, చినలక్కరాజు, చిన్నజీతమరాజు, సాళెం చెన్నరాజు, కట్టా వెంకట్రాజు, ఉదయగిరి ఓబళ్రాజు, బాల్దేశ్రాజు, ఆకమ్మరాజు.

లన్నియు నితని వశముకాఁగా నాంధ్రదేశాధీశ్వరుం డనుబిరుదమును వహించి మహారాజ్యపట్టమున కభిషిక్తుఁడై తురకలకు దూరముగా నుండురాజగిరిదుర్గమును (రాచకొండ) రాజధానిగఁ జేసికొని యపక్రపరాక్రమంబున నోరుగల్లు రాజ్యము నేలుచున్న ట్లీ యనపోతనాయని శాసనములే యుద్ఘోషించు చున్నవి.

## బహామనీరాజ్యస్థాపనము. (౧౩౪౭)

ఢిల్లీచక్రవర్తి యైనమహమ్మద్ తుఘ్లఖ్ యొక్క సైన్యాధిపతులలో నొక్కఁ డగుహసన్ గంగూ అనువాఁడు తిరుగఁబడి స్వతంత్రుఁడై క్రీ. శ. ౧౩౪౭ లో దక్కను దేశమున మఱొక తురకరాజ్యమును స్థాపించెను. ఆరాజ్యమే తరువాత బహామనీరాజ్యమని చరిత్రమునం బ్రఖ్యాతిఁగాంచినది. ఢిల్లీచక్రవర్తికొల్వుకూటములో జ్యోతిష్కుఁడుగా నున్నగంగూ యనుబ్రాహ్మణునియొద్ద హసన్ బానిసవాఁడుగా నుండెను. ఒకనాఁడు హసన్ పొలము దున్నుచుండఁగా భూమిలో ధనము గాన్పించినదఁట! అతఁ డాధనమును దెచ్చి తన యజమానునకు సమర్పింపఁగా వానిసత్యసంధతకు మెచ్చి యాబ్రాహ్మణుఁడు వానియెడ దయాళుఁడై చక్రవర్తితో వానింగూర్చి యనుకూలముగాఁ బ్రసంగించి వానిని పదివేల

గుప్తముల కధికారిగా నియమించునట్లు చేసెను. ఆబ్రాహ్మ ణుఁ డప్పుడు వానింజూచి ‘ ఓయీ! యింకముందు నీకు రాజ్యము సంప్రాప్తింపఁగలదు ; అప్పుడు నన్ను మఱువకుమీ ’ యని చెప్పి పంపివేసెనఁట! ఇతఁ డనేకయుద్ధములలోఁ జక్రవర్తిపక్షమునఁ బోరాడి శత్రువులను జయించి చక్రవర్తికి జయము సమకూర్చుటంజేసి యాతఁడు మెచ్చుకొని ‘ జాఫర్ ఖాన్ ’ అనుబిరుద మాతని కొసంగెనఁట! ఇతఁడు ౧౩౪౭ లో దక్షిణహిందూదేశములోని రాజులసాహాయ్యమును బడసి చక్రవర్తియధికారమును ధిక్కరించి స్వతంత్రుఁడై కలుబరగిపట్టణమునకు హసనాబా దని పేరుపెట్టి రాజధానిగఁ జేసికొనియెను. తాను రాజ్యాధిపత్యమును వహించినపిమ్మటఁ దనపూర్వపుయజమానుని మఱచిపోక యాబ్రాహ్మణుని తన కోశాధ్యక్షునిగా నియమించుకొనియెను. అతని జ్ఞాపకార్థమై ‘ హసన్‌గంగూ ’ అని తనకును, ‘ బహామనవంశ ’ మని తనవంశమునకును పేర్లుపెట్టుకొని వ్యవహరింప మొదలుపెట్టెను. మఱియు నితఁడు ‘ అల్లా ఉద్దీన్ షాహ ’ అను బిరుదనామమును గూడ వహించెను. ఇతఁడు హిందూమతద్వేష్టకాకపోయినను, తనపని తీఱినవెనుక హిందూరాజులతోడ స్నేహమును చాలించెను. వీనిరాజ్యము విశేషముగా మహారాష్ట్రదేశమున వ్యాపించి యుండెను. కలుబరగిపట్టణము

మహారాష్ట్రాంధ్ర దేశములకు నడుమ సరిహద్దులో నోరుగల్లు నకు నూటయేఁబదిమైళ్ళదూరమున నుండెను. హాసన్‌గంగూ అల్లాఉద్దీన్ షాహ ౧౩౫౮ వఱకుఁ బరిపాలనము చేసిన పిమ్మట వాని రెండవకుమారుఁడు మహమ్మదుషాహ సింహాసన మధిష్ఠించెను.

## మహమ్మద్‌షాహ ప్రథమ దండయాత్ర.

మహమ్మదుషాహ బహమనీరాజ్యపట్టమున కభిషిక్తుఁడై పరిపాలనము ప్రారంభించినతోడనే యోరుగల్లుపురవరాధీశ్వరుం డయిన అనపోతభూపాలుఁడును, విద్యానగరాధీశ్వరుం డగుబుక్కరాయలును తమకడనుండి మహమ్మదుషాహ తండ్రి గైకొనినభూభాగముల విడిచిపెట్టవలసినదనియు లేని యెడల డిల్లీచక్రవర్తిసైన్యములతోడ్పాటుతో వాని దేశము పై దాడివెడలి యాభూభాగములఁ దామే యాక్రమింతుమనియు నతనికడకు రాయబారులను బంపెనఁట తనసర్దారులు తనయెడ నంతగాఁ బ్రేమానురాగములు చూపకున్న వారగుటచేతను, తనతల్లి మల్లికాజెహాను మక్కామదీనాయాత్రలు చేసివచ్చుటకై విశేషధనము నొసంగి పంపినందున బొక్కసములో ధనము తఱిగియుండుటచేతను యుద్ధము చేయుటకుఁ గడంగుట యుక్తమైనకార్యము కాదని యు

హించి మహమ్మదుషాహ హిందూరాజులను సంతోషపెట్టి కాలహరణము చేయుటకై విశ్వాసపాత్రులైన తనరాయబారులను గొందఱను వారలకడకుఁ బంపించి యాహిందూరాయబారులను పదునెనిమిదిమాసములవఱకుఁ దనకొల్వుకూటములోనే యుంచుకొని యుండెను. ఈలోపుగా విశ్వాసఘాతకులని యనుమానింపఁబడినవారి నెల్లరను వారియుద్యోగములనుండి తొలఁగించి విశ్వాసపాత్రులైనవారిని నాయుద్యోగపదవులయం దుంచెను. వానితల్లియుఁ బుణ్యక్షేత్రయాత్రలు ముగించి స్వస్థానమునకు మరలి వచ్చెను. తరువాత మహమ్మదుషాహ యుద్ధముచేయ నిశ్చయించి ధనకనకవస్తువాహనాదులతోఁ దమకడనున్న యేనుఁగులపైఁ బెట్టి కానుకగాఁ బంపకున్న దండెత్తి వచ్చెద నని తనశత్రురాజులకు సమాచార మంపెను. అందుమీఁద అనపోతానాయఁడు తనకుమారునికిఁ గొంతసైన్యము నిచ్చి వానిపైకిఁ బంపించెను. విద్యానగరాధీశ్వరుఁ డైనబుక్కరాజును కొంతసైన్యమును తోడుగాఁ బంపించెను. ఈసైన్యముల నెదుర్కొనుటకై మహమ్మదుషాహసైన్యాధిపతి యగుబహదూర్ ఖాను నియమింపఁబడియెను. అసంఖ్యాకము లగుసైన్యములతో బహదూర్ ఖాను హిందూసైన్యముల నెదుర్కొని యోడించి యోరుగల్లువఱకు దేశమును దోచుకొనుచు వచ్చుచున్నం

దనఁ గాలము ప్రతికూలముగ నున్నదని అనపోతభూపా లుఁడు వారుకోరిన ధనము నిచ్చి సంధిచేసికొని తురుష్కులను బంపివేసెను.

## మహమ్మదుషాహ పరాజితుఁ డగుట.

క్రీ. శ. ౧౩౭౩ వ సంవత్సరాంతమున మహమ్మదుషాహ కడకు గుఱ్ఱములవ్యాపారము చేయుకొందఱువర్తకులు వచ్చి వానికొఱకుఁ దెచ్చినయుత్తమాశ్వముల నన్నిఁటిని మిక్కిలి తక్కువవెలలకు తెలంగానారాజు బలాత్కారముగాఁ గైకొనియె నని మొఱవెట్ట నతఁ డుగ్రుఁడై మఱియొకమారు వానిపై దండెత్తి పగఁదీర్చుకొనవలయు నని ప్రతిజ్ఞఁజేసి రాజ్య భారమును మల్లిక్ సైయఫద్ దీన్ ఘోరీ యనువానిపైఁ బెట్టి సుల్తానుపురమునకేగి తనసైన్యములను పదిదినములవఱకు బరీక్షించెను. తనకు విజయము కలుగుటకై యచట పవిత్రుఁ డైనమహమ్మదుసీరాజుద్దీన్ జనుదీ యనువానిచేఁ బ్రార్థనలు చేయించి పదునొకండవదినమున నచటనుండి బహుసైన్యము లతో దండయాత్ర వెడలి కళ్యాణపట్టణముఁ బ్రవేశించెను. అంతనెమ్మదిగఁ బ్రయాణము చేసినయెడలఁ బండ్రెండుమాస ములకైన నోరుగల్లుచేరుట సంభవింప దని విశ్వాసపాత్రు లగుమిత్రులు చెప్పఁగా మహమ్మదుషాహ యాసైన్యముల

నచట నిలిపి నాలుగువేలగుఱ్ఱపురౌతులతోఁ దాను బయలు దేఱి వారముదినములకు నోరుగల్లుదుర్గమును సమీపించెను. అతఁ డచ్చట కాబూలివాండ్రను గొందఱను రప్పించి గుఱ్ఱములవ్యాపారము చేయువర్తకు లనుకొనునట్లుగా నటించుచు మార్గములో దొంగలు కొట్టి దోఁచుకొన్నట్లుగా వేషములు వేసికొని మీరు తిన్నగాఁ బోయి దుర్గద్వారము కడనున్న కావలివాండ్రను నేమరించి సంభాషించుచుండవలసినదని వారల కాజ్ఞాపించెను. వానియాజ్ఞను శిరసావహించి వారట్లు పోయి దుర్గద్వారముగుండ లోనికిం బోవఁ బ్రయత్నింప రక్షకభటులు వారలను బోనీయక నిలువరించిరి. తమ్ము దారిలో దొంగలు కొట్టి దోచుకొన్నందున మహారాజునకుఁ జెప్పి సంరక్షణముఁ బడయవలయునని వచ్చితిమేకాని వేఱొండుకాదని వారలు ప్రత్యుత్తర మిచ్చుచుండ మహమ్మదుషాహ నాలుగు వేలగుఱ్ఱపుదళముతో వచ్చి పైఁబడియెను. రక్షకభటులు ద్వారముతలుపులు మూయఁ బ్రయత్నించిరిగాని ప్రచ్ఛన్నవేషములతో నున్నయాఫ్ఘన్ భటులు తలుపులు మూయకుండ నడ్డుపడిరి. తురుష్కాశ్వికసైనికులు కావలివాండ్రనెల్లరను సంహరించి భయంకరధ్వనులతో లోనం బ్రవేశించి నగరములో నున్ననిరపరాధులైనప్రజల నురుమాడుచుఁ గ్రూరసంహారమున కొడిగట్టి విజృంభించి వచ్చుచుండఁగా దుర్గాధ్యక్షుఁ డైన

నాగయరుద్రదేవుఁడు వారల నెదుర్కొని కొంతసేపువఱకుఁ బోరాడి దురదృష్టవశమున శత్రువులచేఁ జిక్కెను. మహమ్మదుషాహ పట్టణదుర్గమునకు ముందు నగ్ని దాఁగొలిపించి కోటగోడనుండి యతని సందుఁ బడద్రోయింపఁగా నతఁడు నీచమరణంబు నొందెను గాని యీదారుణకృత్యమును గనియు వినియు సహింపఁజాలక యాంధ్రవీరు లొక్కుమ్మడి నాతతాతులపైఁ బడి కఠోరకుఠారంబులఁ జేతికందినవారినెల్ల నఱకుచుండుటఁ జూచి యాతురుష్కసైనికులు భీతిల్లి పలాయనులు కాఁగాఁ దెలుఁగురౌతులు వారిని విడిచిపెట్టక వెంబడించి తఱుమఁగా మహమ్మదుషాహ కూడ దెబ్బతిని గాయము నొందినవాఁడై పరాజితుఁడై తుదకుఁ బదునేనువందలసైనికులతోఁ బాఱిపోయి కలుబరగ చేరి తిరిగిచూచెను.

## అనపోతానాయఁడు గోల్కొండను గోల్కొనుట.

బహమనీరాజ్యము ప్రక్కలోబల్లెమువలె నుండుటచేత ననపోతనాయఁడు ఢిల్లీచక్రవర్తిగ నున్నఫిరోజిషాహకడకు రాయబారులను బంపి తాను వానికి సామంతుఁడుగ నుండి కప్పము గట్టుచుందుననియు, బహమనీరాజ్యమును వానిరాష్ట్రములోఁ జేర్చుకొమ్మనియును, తమకు సహాయముగాఁ గొంతసైన్యమును బంపినయెడల నాకార్యమును తాను సాధింపఁ గలను

నియుఁ జెప్పించెనుగాని చక్రవర్తి గృహాసంబంధములైన ఖిజ్మ
లఁగోఁ దగుల్కొని యుండి వారిపలుకులను వెడచెవిని బెట్టి
వినకుండెను. ఈసమాచారమును విని మహమ్మదుషాహా తెలం
గానాదేశముపై దండెత్తి వశపఱచుకొనుట యుత్తమకార్య
మని నిశ్చయించుకొనియెను. పిమ్మట మహమ్మదుషాహా యథా
ప్రకారము రాజ్యభారమును మల్లెకుసయుఫిద్దీను ఘోరిపైనఁ
బెట్టి యనేకవాహినీవ్యూహములతో బయలుదేరి కైలాసదు
ర్గముకడకు వచ్చి తనసైన్యమంతయు రెండుభాగములుగఁ
జేసి విదర్భసైన్యములకు అజీమ్‌హుమాయూనుని నధిపతిగ
నియమించి యాతని గోలుకొండదుర్గముపైకిని సఫ్‌దర్‌ఖానుని
నోరుగల్లుదుర్గముపైకిని బంపించి తాను సఫ్‌దర్‌ఖానుని వెంబ
డించెను. అనపోతనాయఁడు తనరాజ్యమునకుఁ బ్రాగ్దిశాభాగ
మున ధరణికోటసమీపమునఁ గొండవీటిరెడ్లతోఁ బోరాడు
చున్నవాఁడగుటచేత నోరుగల్లుదుర్గమునకు రక్షకుఁడుగానున్న
నాయకుఁ డసహాయుఁడై యున్నందున దుర్గమును విడిచి యడ
వులకుఁ బాఱిపోయెను. ఈసమాచారమును విని యనపోత
భూపాలుఁడు రెడ్లతోయుద్ధమును జాలించి నిజరాజధాని కేతెం
చియుఁ దురుష్కుల నెదుర్కొనుటకుఁ దగినసైన్యములను సమ
కూర్చుకొనుటకు కాలము చాలనందున నిరుత్సాహుఁడై
మహమ్మదుషాహాతో సంధిచేసికొనఁ దలంచెను. అందువలన

మహమ్మదుషాహావిధించుసంధినిబంధనలకు లోఁబడవలసివచ్చె ను. మహమ్మదుషాహ రెండుసంవత్సరములు తెలుఁగుదేశము లోనుండి యున్నవాఁడగుటచేత వెంటనే తనసైన్యములతో స్వరాజధానికి మరలిపోవుటకును, బహదూర్ ఖాను కైలాస దుర్గమున విడిసి యుండి యనపోతభూపాలుఁ దర్పించుకానుక లందుకొనుటకు నొప్పుకొనియెను. మహమ్మదుషాహ గోల కొండదుర్గమును అజీమ్‌హుమాయూనుని వశము గావించి కలుబరగిపట్టణమునకు మరలి పోయెను. మార్గమధ్యమున విద ర్భాపురమున (Beder) మూఁడుమాసములుండి శ్రమ దీర్చుకొ నుటకై తనసైన్యాధిపతులను వారిసైనికులతో వారిస్వస్థాన ములకుఁ బంపించెను. అటుపిమ్మట తెలుఁగురాయబారి కైలా సదుర్గమున నివసించియున్నబహదూర్ ఖానుకడకుఁ బోయి తమరాజుపక్షమునఁ గానుక లర్పించెను. అతఁడు వానిని మహమ్మదుషాహకడకుఁ గొనిపోయి యావృత్తాంతమును సుల్తానునకు నివేదించెను. అతండును నాతని సబహుమానము గా సత్కరించి సంతోషపెట్టెను. కొన్ని దినములు గడచినతరు వాత రాయబారి తమకును సుల్తానునకును ఇఁకముం దెన్నఁడు కలఁతలుజనింపకుండునట్లుగ సరిహద్దులనిర్ణయింపఁ జేసినబహా దూర్ ఖానునకుం దగిన నజరానా రాయలపక్షమున నిప్పించెద నని యతనితోఁ జెప్పెను. ఈసమాచారమును బహదూర్

ఖాను సుల్తానునకుం జెప్పెను. ఈవిషయమును గూర్చి సుల్తాను మొట్టమొదట పెడచెవిఁ బెట్టి విని యుండెను గాని తరువాత వారు తనపట్ల మనఃపూర్వకమైన విధేయత కలిగి యున్నవారని తెలిసికొని మహమ్మదుషాహ తనరాజ్యమునకును వారి రాజ్యమునకును నడుమ నున్న గోలకొండదుర్గము సరిహద్దుగా నుండవలెననియు, ఎంతకాలము తెలుఁగువారు తమ్మును తమ యధికారమును ధిక్కరింపకుండ నుందురో యంతకాలముఁ దానుగాని తనతరువాతిరాజ్యమునకు వచ్చువారుగాని వారిని నవమానింపరాదనియు, తాను పెట్టినహద్దు నతిక్రమింపరాదనియు నిబంధన చేసియుంచి తానే కాగితమును వ్రాసి ముద్ర వేసి మంత్రుల చేయవ్రాలు లాకాగితమును తెలుఁగురాయబారి కొసంగెను. అతఁడు తాను చేసినవాగ్దత్తముప్రకారము ఢిల్లీచక్రవర్తికి సమర్పింపనున్న రత్నసింహాసనమును మహమ్మదుషాహాకు సమర్పించి యతనియొద్ద సెలవుంగైకొని రాజశైలమునకు మరలి వచ్చెను*.

* ఈవృత్తాంతము ఫెరిస్తా యనేకవిధములుగా వ్రాసి యుండెను. ఫెరిస్తా వ్రాసినచరిత్రమును భాషాంతరీకరించినబ్రిగ్గు, స్కాట్టు అనువారల భాషాంతరీకరణములు పరస్పరవిరుద్ధములై యున్నవి. నేను స్కాట్టు వ్రాసినదానినే కొంచెము మార్పుతో నంగీకరించి యున్నాను. ఈకాలమునఁ గాకతీయులు ప్రసిద్ధులుగా నుండనట్లు ఫెరిస్తా వ్రాయుచున్నాఁడు గాని యీయభిప్రాయము సత్యమైనది కాదు.

## అనపోత మాధవభూపాలుర రాజ్యపాలనము.

రేచర్ల వంశమువారిలో స్వశక్తిచే మహారాజపదవి నొంది స్వతంత్రులై రాజ్యపరిపాలనము చేసినవారిలో నీ యనపోత భూపాలుఁడే ప్రప్రథముఁడుగాఁగన్పట్టుచున్నాఁడు. ఇతనిపూర్వు లెవ్వరు నీరీతిగా స్వతంత్రులై రాజ్యపరిపాలనము చేసినట్లు తెలుపు దృష్టాంత మింతవఱకుఁ జరిత్రమునఁ గానరాదు. వీరి పూర్వు లెల్లరును కాకతీయచక్రవర్తులకు భృత్యులుగ నుండి సేనాపతులై కాకతీయసామ్రాజ్యసంరక్షకులై యొప్పియుండిరి గాని యాతనివిధముగా మహారాజులై స్వతంత్రముగా భూపరిపాలనము చేసినట్లు గన్పట్టదు. ఈయనపోతానాయుఁడును మాధవనాయుఁడును క్రౌర్యమును బూని రెడ్లు మొదలగువారితో ద్వేషమును బెంచుకొని పోరాడక వారలతోఁ జెలిమి చేసికొని తురుష్కుల నెదిరించి యుండినయెడల నిజముగా బహామనీరాజ్యము దక్షిణహిందూస్థానమునందు వర్ధిల్లక నశించి యుండును. ఇప్పటి నిజామురాజ్యములోని తెలుఁగుజిల్లా లన్నియు నాకాలమున వారిరాజ్యమునం దిమిడియున్నవని చెప్పవచ్చును. వీ రసహాయశూరులై యొకవంక మహమ్మదీయులతోడను మఱియొకప్రక్క రాచవారితోడను, వేఱొకప్రక్క రెడ్లతోడను నిరంతరముఁ బోరాడు చుండినవారగుటచేత వీరిరాజ్యము తఱుచు యుద్ధరంగమగుచు వీరులకుమాత్రమె జన్మ

భూమిగ నుండుచు వచ్చెను. "శ్రీశైలవిన్ధ్య మధ్యోర్వీమణ్డలమ్ పరిపాలయన్" అనిఉమామాహేశ్వరశాసనములోని యొకశ్లోకములోను "విన్ధ్యశ్రీశైలమధ్యక్ష్మామండలం పాలయన్నుతైః" అనుసింగభూపాలీయములోని యొకశ్లోకములోను వీరు విన్ధ్యశ్రీశైలమధ్యోర్వీమండలము పరిపాలనము చేసినట్లు చెప్పఁబడినను గోదావరీనదికిఁ బైనుండుదేశ మీయనపోతనాయనిరాజ్యములోఁ జేరియుండె ననుటకు వేఱొకప్రమాణము గానరానందున నది కవికల్పిత మైనయతిశయోక్తి యని భావింపవచ్చును. శత్రురాజులతో జరుపుయుద్ధములందును రాజ్యపరిపాలనాభారమును నిర్వహించుటయందును తమ్ముఁడు మాధవభూపాలుఁడన్నయగు అనపోతభూపాలునకుఁ దోడునీడయయి యుండెను. ఆంధ్రదేశాధీశ్వరుం డనుబిరుదము అనపోతనాయని కున్నట్లుగా నాతనిచే స్థాపింపఁబడినశాసనములలోఁ జేర్చఁబడియుండుటచేతను అట్టిబిరుదము మాధవనాయనిశాసనమునం గనుపట్టకుండుటచేతను, అనపోతభూపాలుం డాయాంధ్రదేశభాగమును బరిపాలించుచుండ వానియనుమతిని తమ్ముఁడు యువరాజుగ నుండి పరిపాలనము చేయుచున్నట్లు మనమూహింపవలసియుండును గాని శ్రీశైలోత్తరద్వారమైనయుమామహేశ్వరములో దేవస్థానసమీపమున నున్నమాదానాయనిశాసనములో "శ్రీమాధవేంద్రుండు దేవనగదక్షిణప్రాంతమందుల స్వనామాం

కీర్తమైనమాధవపురమందు ప్రాజ్యరాజ్యోపవిష్టుండై" అని వ్రాయఁబడియున్నంతమాత్రముచేత నితఁడు స్వతంత్రుఁడై అనపోతభూపాలునితో సంబంధము లేకుండఁ బ్రత్యేకాంధ్ర భూభాగమును బరిపాలించుచున్నవాఁ డని మనమూహింప రాదు. ఇతఁడు తనయన్నతోఁగూడ జల్లిపల్లిరణములో శత్రు రాజులను సంహరించి పితృవాక్యపరిపాలనము చేసినవాఁ డగుటచేత నీతనికిఁ గూడ సోమకులపరశురాముఁ డను బిరుద ము లభించిన ట్లీతనిచే స్థాపితమైనశాసనములో నుదాహరింపఁ బడినబిరుదముచేతనే విస్పష్ట మగుచున్నది*. అనపోతభూపా

---

*"శ్రీగణపతయేనమః స్వస్తిశ్రీమన్మహామండలేశ్వరరాయ గాయ గోవాళ గజవళ విఘాళి భుజబలభీమ ఖడ్గనారాయణ సోమకులపరశురామ సత్యహరిశ్చంద్ర శౌచగాంగేయ అప్రతిహతప్రతాప సతతహేమాద్రిదాననిరత దాచయసింగభూపతిసుతుండైన మేదినీరూపనారాయణ అనగమాంబాగర్భప్రజ్యోదయ రేచెర్లవంశదుగ్ధాబ్ధిసుధాకరుండైన శ్రీమాధవేంద్రుఁడు దేవరగ దక్షిణప్రాంతమందుల స్వనామాంకితమైన మాధవపురమందు ప్రాజ్యరాజ్యోపవిష్టుండై శ్రీపర్వతోత్తర ద్వారమైన మహేశ్వరదేవరమంటపము మహాచ్ఛిలాసమూహాన రమ్యముగా రచియించి పరవాక్యప్రమాణజ్ఞులైన మాయిభట్టోపాధ్యాయులను తన్నిమిత్తంబై శాసనంబు చెప్పుమని పనిచినం దమకృత్తశాసనంబు." ఇంతవఱకును తెలుఁగు తరువాత సంస్కృత శ్లోకములుగలవు. నైజామురాజ్యములో మహబూబునగరముజిల్లా అమరవాదితాలూకాలోఁ జేరి శ్రీశైలోత్తర ద్వారమైన ఉమామహేశ్వరములో దేవస్థానసమీపమున నున్నది. (వెలు

లుఁడు కాకతీయ రాజ్యస్థాపనాచార్య బిరుదమును వహించినవాఁడుగా నాతనిచే స్థాపితములైన శాసనములలోఁ జేర్కొనఁబడియున్నను నిజముగా నితఁడు కాకతీయరాజ్యవిధ్వంసకుఁ డని చెప్పవలయునే కాని కాకతీయరాజ్యస్థాపనాచార్యుఁ డని చెప్పరాదు. ఇతనిపూర్వులు వహించినయీ బిరుదము గౌరవార్థ మీతనిబిరుదావళిలోఁ జేర్పఁబడినది కాని మఱియొండు గాదు. కాకతీయులరాజ్య మీతఁ డాక్రమించుటచేతనే రాచవారు మొదలగువారు ప్రబలవైరులైరి. పంచపాండ్యదళవిభాళుఁ డను బిరుదము కూడ పూర్వులవలననే సంక్రమించినది కాని పంచపాండ్యులదళమును జయించుటచేత నితనికి లభించినబిరుదము కాదు. మఱియు నితనికిం గల బిరుదములలోఁ బెక్కులు పూర్వులు వహించినవియు మఱియుఁ గొన్ని కాకతీయులును రెడ్డిరాజులును వహించినవియు నై యున్నవి*.

---

గోటివారి వంశచరిత్రము. అనుబంధము ౩౧౨ పేజి. ౧౨౫ సంఖ్యగల శిలాశాసనము చూడుఁడు.)

*"స్వస్తి శ్రీమన్మహామండలేశ్వర రేచెర్లగోత్రచింతామణి గజదళవిభాళ భుజబల భీమ ఖడ్గనారాయణ చేకోలుగండ గాయగోవాళ పాండ్యరాజగజదళవిభాళ చలమర్తిగండ ధరణీవరాహ మస్తరాజగజాంకుశ ప్రతికూలరాయ భయంకర ప్రతిగండభైరవ రాయమీసజాళ రాయదేవేంద్రసల్లక్షిజాణరాయ సెలగుసు సమరమహేశ్వర ఇనుమర్తిగండ గోవాళ కేళాదిరాయ జగనొబ్బ

## అనపోతారెడ్డితోడ యుద్ధము.

సింగమనాయని పుత్త్రులగు అనపోతనాయఁడు, మాధవనాయఁడును, కొండవీటిప్రభువగు ప్రోలయవేమారెడ్డి పుత్త్రులగు అనపోతారెడ్డి, అనవేమరెడ్డియును సమకాలికులు గావునను వైరులుగావునను ఒండొరుల రాజ్యాపహరణము కొఱకు ధరణికోటసమీపముననేకయుద్ధములుజరుపుచు వచ్చిరిగాని వీరిరాజ్యమును వారుగాని వారిరాజ్యమును వీరుగాని యాక్రమించి పరిపాలించినట్లుగానరాదు. ధరణికోట యెన్నఁడును పద్మనాయకుల వశమై పరిపాలింపఁబడినట్లు గన్పట్టదు. ఆప్రాంతమునఁ గృష్ణానదినిదాటి వచ్చి పద్మనాయకులు రాజ్య మెన్నఁడు నాక్రమించి యుండలేదు. ధరణికోటసమీపమున మాదానీఁ డను మాధవభూపాలునికిని ప్రోలయవేమారెడ్డిపుత్త్రుఁడగు అనపోతభూపాలునికిని యుద్ధముజరిగి యాయుద్ధమున అనపోతారెడ్డి మానమును సిగ్గునుబోనాడి పాఱిపోయెననియును, ఇప్పటికిని నాతఁడు పఱువిడిపోయిన మార

---

[illegible] రాయగండభేరుండ రాయబందివిమోచక రాయబిరుదవిభాళ శరణాగత[illegible]వజ్రపంజర బల్లరగండ వివేకనారాయణ సమస్తసమరవిజయలక్ష్మీస[illegible] సముచితపల్లవతోరణావళీప్రకాశితనిత్యకళ్యాణ సత్యప్రతిజ్ఞ [illegible]శౌర్యాదిజగత్ప్రసిద్ధ బిరుదనామధేయప్రశస్తిసహితులైన శ్రీ[illegible]నాయని అనపోతానాయనింగారు—వె. వం. చ. అనుబంధము పేజి ౨౨. ౨౪. చూడుఁడు.

మునఁ గనవైనను మొలకెత్తక యొకగుఱుతుగా నుండెనని వెలుగోటివారి వంశావళిలో నతిశయోక్తి వర్ణనముగావింపఁ బడినది.* యుద్ధమునందు జయాపజయములు దైవాధీనములు గాని పై వంశావళిలోవర్ణింపఁబడినదే వాస్తవమైనయెడల మాధవనాయఁడు ధరణికోట నాక్రమించుకొని యుండవలె నుగదా. అట్టి దెన్నఁడును సంభవించినట్లు గన్పట్టదు. అన పోతారెడ్డి బహుపరాక్రమవంతుఁడుగాని సామాన్యుఁడు కాఁడు. కొండవీటిరాజ్య మాక్రమించుకొనవలయునని మాధవనాయఁడు ధరణికోటదుర్గముపై దండెత్తి పోవ రెడ్లకును వీరికిని ఘోరయుద్ధము జరిగి యాయుద్ధమున శూరవరాగ్రణి యగు అనపోతరెడ్డిని జయింపఁ జాలక తిరువిట్లు పడుచుండఁగాఁ దురుష్కులు తమరాజధానిపైఁ దండెత్తివచ్చినారని విని యుద్ధము చాలించుకొని రాజధానీనగర సంరక్షణార్థము మరలి పోయినది మాత్రము వాస్తవ మనుటకు సందియ ముండదు. మఱియొకచోట వేంకటగిరి వంశావళిలో మాధవ భూపాలునిచే ననపోతారెడ్డి యుద్ధములోఁ జంపఁబడియెనని

*సీ. ఘనశౌర్యుండగు మాధవాధిపుని ఢాకన్ భీతి విభ్రాన్త సా
ధనుఁడై దన్నలకోటయొద్ద ననపోతారెడ్డి మానంబు సి
గ్గును బోనాడి రయంబునం బఱవఁగా క్షోణీస్థలిన్ జూడ నేఁ
డును నవ్వొచ్చెనడి యాలమై కసవుపాటున్ లేమ తోవ్రాటచేన్.

కూడ వక్కాణింపఁబడియుండెను*. ఇతరప్రమాణ మేమియును లేక వంశావళిలో వర్ణింపఁబడినంత మాత్రమున విశ్వసింపరాదు. ఇది తమ కసమ్మతముగ నుండుటచేత నేకాఁబోలు వెలుగోటివారివంశచరిత్రగ్రంథకర్తలు “దన్నాలకోటయొద్ద ననపోతారెడ్డిబంధువైన యనపోతారెడ్డితో యుద్ధము చేసి యతని సఖిమి జయమును బొందెను.” అని తమ గ్రంథమున వ్రాసి యున్నారు. ప్రోలయవేమారెడ్డి సత్పుత్త్రుఁడైనయన

---

* సీ. ధాత్రి నీముత్తాత తాతెల్ల దాచాఖ్యుఁ
డెలమితోఁ బాండ్యులదళము గెల్చెఁ
గెలఁగి తాతసుఁ దాత సింగక్షితీశుండు
కొప్పభూపతి గెల్చె గదనమునను
వర్ణించి మీతాతతండ్రి మాధవనృపుం
డన్నపోతారెడ్డి నాజి గనిమె
విజయి యై మీతాత వేదగిరీంద్రుండు
దిక్కుల దనయాజ్ఞ దీటు కొలిపె
మెఱసి లోక మెఱుఁగ మీతండ్రి మాధవ
క్ష్మావరుండు గెల్చె గన్నడీలఁ
గొనకు చెలమచెర్ల దుర్గంబు గొంటివి
నరసలోన లింగ నరవరేణ్య!

ఈపద్యము పైమాధవనాయని మనుమఁడగు కుమారమాదానాయని పుత్త్రుఁడును ప్రౌఢదేవరాయని సేనానియు నగు లింగమనాయనిం గూర్చి చెప్పినపద్యము

పోతారెడ్డియె వీరలతో యుద్ధము చేసి యుండెనుగాని యితని బంధువగు మఱియొక యనపోతారెడ్డి కాఁడు*.

## రాచకొండ దుర్గము.

ఇదిమిక్కిలిపురాతనమైన దుర్గమనియు, ఆంధ్రభృత్యవంశపురాజులకాలమున మహాప్రఖ్యాతిఁగాంచినదనియు నిదివఱకు విశదపఱిచి యున్నాఁడను. ఈరాజశైలము రేచెర్లసింగమనాయనికాలము నుండియుఁ దద్వంశీయులకుఁగొంతకాలమువఱకు రాజధానిగనుండుచువచ్చెను. "ఈరాజధాని హైదరాబాదు రాజ్యమునకుఁజేరిన నల్లగొండమండలములోఁ బ్రస్తుతము నారాయణపురసంస్థానమునకుఁ బశ్చిమభాగంబున ౬ మైళ్ల దూరమ్ములోను హైదరాబాదునకుం దూర్పుగా ౩౨ మైళ్ల దూరములోను దేవరకొండరాజధానికి వాయవ్యభాగమున ౩౦ మైళ్లదూరములోను నున్నది. దీనికిఁ జుట్టు చక్రవాళపర్వతములవలెఁ బర్వతదుర్గము గలదు. అది రమారమి వెలిపాలెముల

*"ప్రతాపరుద్రుని సేనాపతులలో నొకండగు సింగమనేనికొడుకులు అనపోతనీడు, మాదానీడు, అనువారు శా|| సం|| 1283న ప్రాంతమందు ధరణికోటలో ననపోతారెడ్డితోఁ బోరి యాతని నోడించిరని వెలుగోటివారి వంశావళిలో ఉదాహరింపఁబడినది." అని శ్రీయుతజయంతి రామయ్యగారాంధ్రభారతి పత్రికలోఁగూడ వ్రాసి యున్నారు. (ఆంధ్రభారతి సంపుటము ౨, సంచిక ౩ చూడుఁడు.)

తో సయితము ౩౦ మైళ్లువలయముండవచ్చును. ఇప్పుడాపాలెము లు ప్రత్యేక గ్రామములుగా నచ్చటచ్చటఁగొన్ని నిలిచియున్నవి. పర్వతదుర్గ మధ్యభాగమున విద్యోతమానం బైనపత్తనంబు ౧౫ మైళ్లువలయము గలదిగా నున్నది. ఆ రాజధానికి దక్షిణోత్తరముల నిడివి యెక్కువగను బూర్వపశ్చిమముల నిడివి తక్కువగను నున్నది. దీనిమొదటిదుర్గం బైనపర్వతంబు ప్రవేశించుటకు దుస్సాధ్యంబైనందున నచ్చ టచ్చటఁ బ్రవేశోచితదేశంబుల ద్వారంబులు గట్టఁబడి యున్నవి. తూర్పుద్వారంబునకు మట్టివాడ దర్వాజ యనియు, దక్షిణద్వారంబునకు భైరవునిగండి యనియుఁ, బడమటిద్వారంబులలో నొకదానికి నేనుఁగులదర్వాజాయనియు, నొకద్వారమ్మునకుఁ గోటీదర్వాజ యనియు, నుత్తరద్వారంబునకు భువనగిరిగండి యనియు, నామంబులు గలిగి యున్నవి. ఈద్వారంబులసమీపంబున మహోన్నతశిలాభాగంబులఁ గాలభైరవ, కపాలభైరవ, ప్రతిగండభైరవ, వీరభద్రాంజనేయాద్యుగ్ర దేవతాప్రతిమలు స్థాపించి వానికడను దనువంశబిరుదావళివ్రాయించి యున్నారు.

ఇట్టిపర్వతదుర్గంబునకు మధ్యమ్మునఁ బత్తనము, దానిలో దక్షిణభాగమ్మునుండి యీశాన్యభాగంబునకుఁ బ్రవహించు నొకనదియు ననేకంబు లైన దేవాయతనంబులు, బావులు, చెఱువులు శిథిలప్రాయంబులై యగపడుచున్నవి. రాజవీథులు

నంగడివీథులు గొంచెము గొంచెము గుర్తుతోఁ గథాశేష ముల్లై యున్నవి.

ఇట్టిరాజధాని మంచిస్థితిలో నున్నప్పు డెట్టు లుండెనో చూచిన నూహకు వచ్చును. పూర్వము పట్టణమున్నపట్టున భూమి సేద్యము చేయుచున్నారు. లంబాడీలగూడెములు క్రోశద్వయపరిమితప్రదేశ మెడముగా నేర్పడియున్నవి. ఏత త్పత్తనమధ్యభాగంబున నత్యున్నతంబులై రెండుకొండలు గలవు. అవి దక్షిణభాగమ్మున రాచకొండ యనియు, నుత్తర భాగంబున నాగానాయనికొండ యనియు నాఖ్యల నొప్పి యున్నవి. ఈపర్వతద్వయంబును జుట్టి మహోన్నతంబై యొక శిలాప్రాకారంబు గలదు. దానిలోపల రాచకొండకు నాలుగు కోటలు శిలామయములై ౨౦గజములయెత్తు గలవై యున్న వి. నాగానాయనికొండకును బ్రత్యేకముగా రాతికోట లున్నవి.

రాచకొండపై కెక్కునపుడు పెక్కుమహాద్వారంబులు నుపద్వారంబులును విలసిల్లుచున్నవి. ఈరాచకొండలోఁ గొంతవఱకు నగళ్లు మొదలగునవి పోయినవి పోను బొడ్డుచా కియుఁ గొన్నిప్రధానమందిరంబులును శిథిలములై కనఁబడుచు న్నవి. కొలువుకూటముసమీపమున నొక పెద్దబావి యున్నది. మఱియొకటి కొండలనడుమ నత్యల్పవివరముగాను నగాధము

గాను నశోష్యజలముగాను నున్నది. దానిని సంకెళ్లబావియని పిలుచుచున్నారు. ఈకొండయందు ముఖ్యముగా రాజులు వసించుటచే నిది రాచకొండయనియు దీని కుత్తరపుకొండ మీఁద నాగానాయఁడు ముఖ్యముగా నివసించి యుండుట చేత నిది నాగానాయనికొండయనియు వ్యవహారము గలి యున్నది*.

ఇట్టిబలాఢ్యమైనదుర్గమును ముఖ్యనివాసముగఁ జేసికొని యనపోతనాయఁడు శత్రువుల కవిజేయుఁడై యవక్రపరాక్ర మంబున రాజ్యపరిపాలనము గావించెను.

### అనపోతనాయనిమతము: భైరవప్రతిష్టలు.

ఇతఁడు భైరవభక్తుఁ డనియును శైవమతావలంబకుఁ డని యును నితనిచే స్థాపింపఁబడినశాసనములే వేనోళ్లఁ జాటు చున్నవి. తనరాజ్యమునందంతట ననేకభైరవప్రతిష్ఠలు గావిం చెను. నిరంతరశివదేవతాపరాయణుం డని కొన్నిశాసనము లుద్ఘోషించుచున్నవి గాన నీతనికాలమున నీయాంధ్రదేశ భాగమున వైష్ణవమతమునకు రాజసన్మానము గలిగియుండలేదని వీరిచరిత్రమువలన బోధపడుచున్నది. ఇంతవఱకును రేచెర్ల రాజవంశము వైష్ణవమతమును స్వీకరింపలేదు. ఈరాజులెల్ల

* వెలుగోటివారివంశచరిత్రము నుండి గ్రహింపఁబడినది.

రును వీరశైవులుగ నుండిరి. ఇతఁడు రాచకొండదుర్గములో పల నున్నకోటలనన్నిఁటిని బాగుపఱచుటయె గాక తత్సమీపమున నున్నకోటలను గూడ బాగుపఱిచెను. పెక్కుతటాకములను త్రవ్వించెను. అందు అనపోతసముద్రము రాయసముద్రము మొదలగునవి ముఖ్యములైనవి.

## అనపోతనాయని పరిపాలనా విశేషములు.

ఎప్పుడో యుద్ధములు తటస్థమైనప్పుడును, పగ దీర్చుకొను సందర్భమునను దక్క తదితరకాలములయందితఁడు క్రౌర్యస్వభావమునువిడిచి సాత్వికగుణసంపన్నుఁడై తనపరిపాలనలోని క్రిందిదేశముయొక్క శుభపరంపరలకై పాటుపడియె ననుటకు సందియము లేదు. ఇతఁడు రాజ్యాంగవ్యవహారములను మంత్రివర్యుఁడును సౌమ్యుఁడు నగు చిలుమరాజు తిప్పరాజను నియోగిపుంగవుని సహాయముతో నైపుణ్యముమీఱ నిర్వర్తింపుచు వచ్చెను. ఇతఁ డనేక భూదానములను సువర్ణదానములు మొదలగు హేమాద్రిదానములను భూసురులకుఁ జేయుటయేగాక శ్రీశైలమునకు సర్వజనులు నడిచిపోవుటకై సోపానములను గట్టించి మార్గము సులభము గావించెను. ఇతఁడు శ॥ సం॥ ౧౨౦౨ అనఁగా క్రీ. శ. ౧౨౮౧ వఱకు రాజ్యపరిపాలనమును చేసినట్లు గన్పట్టుచున్నది. అనపోతనాయని

పరాక్రమమును వర్ణించుచు నొకపూర్వకవి యీక్రింది పద్యమును జెప్పెను.

సీ. అశ్వరేవంతుఁడు హయమును నెక్కిన
దండిరాజులగుండె తల్లడిల్లు
వరిని దక్ష్మీకరకరవాలహతికిని
గర్ణాటసేనలు గళవళించు
సంగ్రామపార్థుని చాపటాంకృతులకుఁ
దెలుఁగురాజ్యం బెల్ల దిగులు గొనును
బ్రథననిశ్శంకుని బల్లెంబుడాకకు
నుల్కుల్కిపడుచుండు నోఢ్రరాజు
లతఁడు దఱిమినచో నుండఁదరముగాక
పారిది సురథానిరాజులు ప్రాంపుదప్పి
యోటమందిరి సిందూరికోటబయల
సన్నుతఖ్యాతి యనపోతమన్నరాజు.

మాధవభూపాలుని పరిపాలనావిశేషములు.

దేవరకొండదిగువభాగమున దక్షిణప్రాంతమున నొకపట్టణమును నిర్మించి మాధవపురంబని స్వనామాంకితము గావించి యందుఁ బ్రాజ్యరాజ్యోపవిష్టుఁడై పరిపాలనము చేయుచుండెనని యింతకుఁ బూర్వము వక్కాణించి యున్నాఁడను. ఇతఁడు దిగ్విజయమునందును శత్రురాజుల నడంచుటయందును దన

యన్న యైనయనపోతనాయనికిఁ దోడుగనుండి యమానుష విక్రమంబు నెఱపుటయె గాక రాజ్యాంగైకధురంధరుండును, సర్వశాస్త్రవిశారదుండును, అమాత్యశిఖామణియు, పెద్దన మంత్రివర్యునితనయుండును నగుపోతరాజుయొక్క సహాయముతో బహుజనశ్లాఘాపాత్రముగాఁ బరిపాలనము గావించెను*. హరిశ్చంద్రచరిత్రము ద్విపదకావ్యముగ రచించిన గౌరనామాత్యునికిఁ బెదతండ్రియని గౌరనామాత్యునిహరిశ్చంద్రోపాఖ్యానములో

" సింగనమాధవక్షితిపాలమణికి
మంగళమూర్తికి మంత్రియై జగతిఁ
బొగడొందు పెద్దన పోతరాజునకుఁ
దగినతమ్ముఁడు యశోధనుఁ డెల్లమంత్రి

---

* "శ్రీమతో మాధవేంద్రస్య రాజ్యాంగైకధురంధరః
మంత్రీ పోతననామాసీ త్సర్వశాస్త్రవిశారదః.
యస్యామాత్యశిఖామణేః కవి రస్తౌ త్రికపాత్రీకృతాం
మత్వా వాక్పతి రద్ధనీసుభగాం వాగ్వైఖరీం లజ్జతే
సోయం పెద్దనమంత్రివర్యతనయః శ్రీపోతరాజోన్వహం
దేశస్యాస్య మహోపకారరచనాం సమ్యఙ్ముదాధికరోత్.

ఈశ్లోకములు మాధవభూపాలునిచే నమామాహేశ్వరమున స్థాపితమైనశిలాశాసనములోనివి. ఈశాసనము నె. నం. [illegible] పత్రముయొక్క అనుబంధములోఁ బ్రకటింపఁబడినది.

చెట్టపట్టంగ నోచినభాగ్యవతికిఁ
జుట్టాలసురభికి సుందరీమణికి
ఘనుఁడు వల్లభమంత్రి గంగాంబ గోరి
గనిన పోచాంబకు గారాబుసుతుఁడ
ధరణి నమాత్యరత్నం బనఁ బరఁగు
ధరణి మంత్రికిఁ గూర్మితమ్ముఁ డఘుఁడ
భూత నాయకపాదపూజాభిరతుఁడ
గౌతమగోత్రుండ గౌరనాహ్వయుఁడ "

అనుచరణముల వలన సువిదితమగుచున్నది. కాఁబట్టి మన పోతరాజు గౌతమగోత్రుఁ డనియు, ఋగ్వేది యనియు, శ్రీశైవమత మవలంబించినసిద్ధయోగి యనియు తేటపడుచున్నయది. ఇట్టి మంత్రిపుంగవుని సహాయముతో మాధవభూపాలుఁడు తనపాలు రాజ్యమును జనరంజకముగాఁ బరిపాలనము గావించెను. మాధవభూపాలుఁడును శైవమతాభినివేశముగలవాఁడు గాని వైష్ణవమతావలంబకుఁడుగాఁడు. ఇతఁడు తన యన్నవలెనె శ్రీశైలమునకు సోపానములను, గోపానములకు గోపుర మండపప్రాకారములను గట్టించెను. మఱియు శ్రీశైలోత్తరద్వారమైన యుమామహేశ్వర క్షేత్రములో నాచంద్రార్కముగా దృఢమైనట్టి శిలామండపము నొకదాని నిర్మింపించెను. మఱియు నుమామహేశ్వరాలయమును దృఢము

గను రమ్యముగను పాషాణములచేఁ గట్టించి శాసనము వ్రాయించెను*. ఇతనికి దేవగిరీంద్రుఁడు మొదలగు పుత్త్రులు జనించి రని సింగభూపాలీయమునఁ జెప్పఁబడి యుండెను. ఇతఁడు రామాయణమునకు క్రీ. శ. ౧౩౬౪లో వ్యాఖ్య రచించె నని భైరవకవిప్రణీత మైన శ్రీరంగమహత్త్వము యొక్క పీఠికలో శ్రీయుతులు మానవల్లి రామకృష్ణకవిగారు వ్రాయుచు చాటుశ్లోక మని యొకశ్లోకము నుదాహరించి యున్నారు‡. ఈశ్లోకము అనపోతనాయనిమనుమఁ డగు రావు మాధవభూపాలుని గూర్చిన దని యాతనిభార్య యగు నాగాంబిక రాచకొండకుత్తరమున నాగసముద్ర మను తటా

*"శ్లో. దన్త్యబ్ధ్యర్కమితే శకాబ్దగణితే శర్వే నలే ఫాల్గునే
మాసే దాచయ సింగభూపతిసుత శ్రీమాధవో భూధవః
శ్రీశైలోత్తరతోరణే భువి మహేశస్యాలయం నూతనం
పాషాణై స్సుదృఢం సురాసురనుతం రమ్య మ్మదాచీకరత్."

శాలివాహనశకము ౧౨౮౪ అగు నలసంవత్సరము ఫాల్గునమాసమున దాచయ సింగభూపతిసుతుం డగు మాధవనాయుఁడు శ్రీశైలోత్తరద్వారమున ఉమామహేశ్వరాలయమును రమ్యముగను దృఢముగను పాషాణములచేఁ గట్టించె నని తాత్పర్యము.

‡శా. శాకాబ్దే నిధివార్ధిరామశశిగే స్వబ్దే ప్లవంగే శుభే
మాసే ప్యాశ్వయుజే రఘూద్వహపదే రామో రాఘవీయాహ్వయామ్
టీకా మర్థపటుప్రబోధసుఘనా మాణిక్యపుష్పాంజలిం
కృత్వా రాజతి రావుమాధవనృపో రామాయణస్య శ్రియే.

కమును దర్శించి వ్రాయించినశిలాశాసనములోని శ్లోకముగా నున్నది. కాఁబట్టి రామాయణమునకు వ్యాఖ్యానము రచించినవాఁడు రామకృష్ణకవిగారు పొరబడి వ్రాసినట్లుఁ, అనపోతనాయనిసోదరుఁ డగు నీమాధవభూపాలుఁడుగాక అనపోతనాయని మనుమఁ డగు రావుమాధవరావని పైనాగాంబిక శాసనము వలన స్పష్టముగా బోధపడుచున్నది.

ఈ మాధవభూపాలుని పూర్వకవియొకం డీక్రిందిపద్యములలో నభివర్ణించి యుండెను.

సీ. జగమెల్ల నెఱుఁగ శ్రీనగరమున కేరాజు
గోపురసోపానకోటిఁ గూర్చె
నుత్తరద్వారమం దొప్పుగ నే రాజు
మామహేశ్వరులధామం బొనర్చె
నాంధ్రభూమీశ్వర యవనుల నేరాజు
కడఁదోలి చెలియలికట్ట యయ్యె
నేరాజు తండ్రికై యిందువంశజుల ర
క్తములు నించి తిలోదకములు పోసె
గీ. నతని నుతియింపఁ దరమె సభాంతరముల
సర్వ బిరుదుల కొమరవేశ్యాభుజంగ
చరణనూపురమూరురాయరవిఫాళ
మహితలక్షణు సింగయమాధవేంద్రు."

" సీ. పరశురాముఁడు తండ్రి పగసాధ్యముగఁ జేసి
తరతరము నృపులతలలు నఱికె
సగరుండు తండ్రి కై పగఁగొని రోషించి
తాలజంఘాదులతలలు రాల్చె
తఱిమి యశ్వత్థామ తండ్రికై యెంతయు
నలపాండుసైన్యంబుతలలు ద్రుంచె
మహిమీఁద సింగయ మాధవుం డుర్వీశుండు
తండ్రి కై రాజుల తలలు గోసె
గీ. గాక యబ్బంగి సంగరాంగణములందు
వైరివీరుల గెలువ నెవ్వాఁడు చాలుఁ
దనర భార్గవ సగరులు ద్రౌణి రావు
మాధవుఁడు దక్క శూరులు మఱియుఁ గలరె.

## రెండవసింగమనాయనిపరిపాలనము.

(క్రీ. శ. ౧౩౮౦ మొదలుకొని క్రీ. శ. ౧౪౦౦ వఱకు)

అనపోతభూపాలుని తరువాత రాజ్యభారమును వహించినవాఁడు వాని జ్యేష్ఠకుమారుఁ డైనసింగమనాయఁడు. బహమనీరాజ్యాధిపతి యైనమహమూద్‌షాహాయు, కర్ణాటసామ్రాజ్యాధీశ్వరుం డగు రెండవహరిహరమహారాయఁడును సింగమనాయనికి సమకాలికులు. మహమూద్‌షాహ విద్వాంసుఁడు నేకపత్నీవ్రతుఁడుఁ బరోపకారియు నగుటచేతఁ దనప్రభుత్వకాలము

లో యుద్ధములను మాని ప్రజాసౌఖ్యమునే కోరి ప్రవర్తించిన
వాఁడగుటచేత మహమ్మదీయులతో సింగమనాయనికి యుద్ధ
ములు లేక పోయినవి. అయినను గర్ణాటసామ్రాజ్యపట్టభద్రుఁ
డగు రెండవహరిహరరాయలుమాత్ర మీరాచకొండరాజ్య
మును, కొండవీటిరాజ్యమును వశంవదములుగాఁ జేసికొనుటకై
ప్రయత్నములు సలిపి యుండక పోలేదు. ఆహేతువుచేత నాత
నిసేనాధిపతులకును సింగమనాయనికిని యుద్ధములు జరుగుచు
వచ్చెను. శ్రీవీరవిజయహరిహరమహారాయలవారిసైన్యాధ్య
క్షుఁడైనవిజయగుండదండనాథుఁడు సింగమనాయనివశంవదు
నిగాఁ జేసికొనుటకై దండెత్తి వచ్చినప్పుడు కృష్ణాతీరమున
నుభయులకు ఘోరయుద్ధము జరిగెను గాని యాయుద్ధ
మునసింగమనాయనికే విజయమా కలిగెను. విజయగుండ
దండనాయకు డెంతసమర్థుఁడైనను, ఆంధ్రులను జయించి
వారిని పర్వతగుహాలలోనికిఁ దఱిమినట్లుగా నతిశయోక్తివా
క్యముల నెన్నిఁటిని వ్రాయించుకొన్నను హరిహరమహారాయ
లకాలమున రాచకొండరాజ్యము గాని కొండవీటిరాజ్యముకా
ని కర్ణాటసామ్రాజ్యమునకు వశంవదములు గాలేదు. మఱియు
ను కర్ణాటసామ్రాజ్యమునకు వశంవదులైనక్షత్రియు లనేకు
లీతనిరాజ్యమునకు భంగకరముగఁ బ్రవర్తింపుచు ననేకవిధ
ములుగా బాధలు కలిగించుచువచ్చిరి కాని యీతఁడు వారిసం

దళిని నోడించి దేశమునశాంతి నెక్కొలుపుచు వచ్చెను. ఈతనిపినతండ్రికుమారుఁ డగుదేవగిరీంద్రుఁ డనుపెద్దవేదగిరి నాయఁడు వేములకొండసమీపమున సత్యాకిదేవుని పరాజితుని గావించెను. శ్రీశైలప్రాంతదేశమునఁ గంకాళదేవుఁ డనువాని తో సమరము సలిపి వానిని సంహరించి వానిసేనలను చీకాకు పఱచి పాఱఁద్రోలెను. చాళుక్యదేవుఁ డనురాజు మామిడాలగ్రా మసమీపమునఁ ద న్నెదిరింపఁగా నాతనిఁ జక్కడంచి విజయ మును గాంచెను. అరవపల్లిసమీపమునఁ గన్నడదేవుఁడనురాజు ముమ్మరుఁడై మార్కొనఁగాఁ బోరుసలిపి వానిని జయించెను. ఉత్తరదేశమున నుండుశత్రువీరులు పెక్కండ్రు ఏకశిలానగర మును ముట్టడింపఁగాఁ బరవసమున నావీరుల మార్కొని వార లనెల్లరఁ బాఱఁద్రోలి,,ఏకశిలానగరసమీపశాత్రవారణ్యదహ నదావానల'' యను బిరుదమును ,వేములకొండ రణరంగస్థల వైరిరాజ జీమూతపవన ' యను బిరుదమును వహించుటయె గాక గుంద్రదండనాయఁ డనుమహాశత్రువును పౌరుషముతో నెదుర్కొని యుక్కడంచెను.

ఇట్లుపితృవ్యునిపుత్రుఁడగు పెదవేదగిరినాయనిసహాయముతో సింగభూపాలుఁ డవక్రమలీల శత్రురాజుల నిరవశేషము గావించి దేశమునకు నెమ్మదిని గలిగించి ప్రజలకు సౌఖ్యప్రద మగు నట్లు పరిపాలనము గావించెను.

## సర్వజ్ఞసింగభూపతి విషయము.

ఈసింగమనాయఁడే విద్వాంసుఁడై రసార్ణవసుధాకరాది సంస్కృత గ్రంథనిర్మాత యై సర్వజ్ఞబిరుదము గాంచినవాఁడని వెలుగోటివారివంశచరిత్రమునందుఁ జెప్పఁబడి సర్వజ్ఞ సింగభూపతి యెవ రను విషయము విశేషముగాఁ జర్చింపఁబడినది. ఈసింగభూపతి రసార్ణవసుధాకర మనునామాంతరముగల సింగభూపాలీయ మను నలంకారశాస్త్రమును సంగీతరత్నాకరవ్యాఖ్యను మఱికొన్ని సంస్కృతగ్రంథములను రచియించెనఁట. రసార్ణవసుధాకర మనుగ్రంథము క్రీస్తుశకము పదునాలుగవశతాబ్ద్యుత్తరభాగమున సింగభూపతి రచియించినట్లున్నది. ఈరసార్ణవసుధాకర మనుగ్రంథము రసనాటకాది విషయకమై మూఁడుల్లాసములుగా నేర్పరుపఁబడిన యత్యుత్తమప్రబంధముగా నున్నది. కావ్యపంచకమునకు వ్యాఖ్యయొనరించి మహామహోపాధ్యాయుఁ డను మహాఖ్యాతి వహించిన కోలచల మల్లినాథసూరిచేఁ దనవ్యాఖ్యలయం దచ్చటచ్చటఁ బ్రమాణముగా నుదాహరింపఁబడినది. ఇంతియగాక అలంకారశిరోమణియందుఁ బ్రతాపరుద్రయశోభూషణవ్యాఖ్యానమునందును, శాకుంతల, బాలరామాయణాది నాటకవ్యాఖ్యా ద్యనేకగ్రంథములయందును బ్రమాణముగాఁ దీసికొనఁబడినది.*

---

*ముద్రిత రసార్ణవసుధాకరగ్రంథముయొక్క యుపోద్ఘాతములో నిట్లున్నది.

"మల్లినాథేన చ బహవో௨ స్మాద్గ్రంథా త్సముద్ధృతా
రఘువంశాదివ్యాఖ్యానేషు లిఖితా దృశ్యన్తే."

వెలుగోటివారివంశచరిత్రగ్రంథకర్తలు సర్వజ్ఞసింగభూపతి యెవ రను విషయమును గూర్చి విశేషముగాఁ జర్చించి వీరని వారని యెవ్వరిని నిర్ధారణ సేయఁజాలక తుదకు సింగమనామ ధేయుల నిరువురను సర్వజ్ఞులను గావించి విడిచి పెట్టిరి. అనపోత భూపాలునితరువాత రాజ్యభారమును వహించిన యతనిపుత్త్రుఁ డగు నీసింగమనాయఁడు సర్వజ్ఞసింగభూపతి యగునేమో మనము నిర్ధారింపవలసి యున్నది. రసార్ణవసుధాకరకర్త యన బరఁగు సర్వజ్ఞసింగభూపాలుఁడు వైష్ణవమతాభినివిష్టుఁడై తన యాస్థానమునుండి కొన్ని మతరహస్యములను దెలిసికొని వచ్చుటకు వైష్ణవులను గొందఱదేశికులయొద్దకు నంపె ననియు దేశికాచార్యులవారును రహస్యసందేశ, తత్త్వసందేశ, సుభాషితనీవ్యాదిగ్రంథముల రచియించి సింగభూపాలునికొఱ కని పెనియు నొకయైతిహ్యము కలదు. వేదాంతదేశికులవారు క్రీ. శ. ౧౨౭౦ మొదలుకొని ౧౩౭౦ వఱకుఁ గలరని గురు పరంపరాప్రభావములోని

"శ్లో. శ్రధియో గ్యే శకే శుక్ల ఉదభూ ద్వేంకటేశ్వరః
లబ్ధవాన్ యే శకే ప్రాయా త్సౌమ్యేన పరమం పదమ్."

అనుశ్లోకమువలనఁ దెలిసికొనుచున్నారము. దేశికులవారి యపర వయస్సులో మనయీసింగమనాయఁ డుండిన నుండ వచ్చును గాని మఱియొక యభ్యంతరము గలుగుచున్నది. దేశికులు తత్త్వసందేశోపసంహారమున—

శ్లో. త్రివిధచిదచిదేకలక్ష్యతంత్రీ
యతిపతియామునభాషితే నియోక్తుః
ఇద మితి నిగమాంతదేశికేన
ప్రతిసమదిశ్యత మాధవాత్మజస్య."

అనియున్నది. విశిష్టాద్వైతమతమును గుఱించి గ్రంథము వ్రాసి పంపుమని నియోగించిన మాధవాత్మజునికి వేదాంతదేశికునిచే నిది బదులు పంపఁబడెనని తాత్పర్యము.

ఈమాధవాత్మజునే తరువాతివైష్ణవగ్రంథములు సర్వజ్ఞసింగభూపాలునిగా వాకొనుచున్నవి*. కాని మనసింగమనాయని తండ్రి అనపోతభూపాలుఁడు కాని మాధవభూపాలుఁడు కాఁడని రసార్ణవసుధాకరగ్రంథమువలననే స్పష్ట మగుచున్నది. "దేశికులవారు 'మాధవాత్మజస్య' అని వ్రాసిన విశేషణము అనపోతాత్మజుఁడైన యేడవతరము సింగభూపతికి సంబంధింపదు. కావున మాధవాత్మజస్య యని చెప్పినది పొరపాటుగా నుండవచ్చును. లేదా, మాధవాత్మజుఁడైన మఱియొకసింగభూపతి యాకాలమున నుండవచ్చును." అని వెలుగోటివారి వంశచరిత్రమునందు వక్కాణింపఁబడియున్నది.

---

* శ్లో. వ్యాఖ్యాకృచ్ఛకటోపముఖ్యవచసాం సర్వజ్ఞసింహాయ స
ద్రాజే తత్త్వహితాత్మకాని రచయన్ సూక్తాని యః ప్రాహిణోత్.
ఆచార్యద్వాత్రింశత్.

అనపోతనాయనితమ్ముఁ డగుమాధవనాయఁడు గొప్పప్రభావముగలవాఁడనియు నతనికి దేవగిరీంద్రుఁడు మొదలుగాఁ గలవారు వంశకరు లగుపుత్త్రులు గలిగి రనియు రసార్ణవసుధాకరగ్రంథమునఁ జెప్పఁబడియుండుటచేత మైసూరునందుండు శ్రీప్రస్తుతపరకాలస్వాములవారు మాధవాత్మజులలో నొకసింగమనాయఁ డుండిన నుండవచ్చు నని వ్రాసినారఁట! కాని అనపోతాత్మజుఁ డైనయీసింగమనాయని సర్వజ్ఞసింగభూపతి యని చెప్ప సాహసింపరైరి. దేశికులవారు మాధవాత్మజుఁడని వ్రాసెనే కాని సింగమహీపతి యనికూడఁ జెప్పి యుండలేదు.

---

శ్లో. తత శ్చ సర్వజ్ఞనృసింహభూపః
ప్రాగేవ రామానుజదర్శనస్థః
శ్రీవాగ్గ్రి ముముక్షో రధిగత్య తస్మి
న్నరో భరన్యాస ముపేక్షతే స్మ.
శ్రీవైష్ణవాగ్ర్యా అపి తత్ప్రసక్తాః
ప్రణమ్య భూయః సహపుత్రవర్గమ్
ముముక్షు మేనం గురుసార్వభౌమే
సమర్పయామాసు రనన్యరక్షమ్.
సోఽయం మహాకారుణికాగ్రగణ్యో
నిజాంతరంగై ర్వినివేదితార్థః
అంగీచకార స్వయ మేవ రక్షా
భరం ముముక్షుప్రవరస్య తస్య.

నిగమాంతదేశికసచ్చరిత్రరత్నావళి.

ఇతరవైష్ణవగ్రంథములు మాత్రము మాధవాత్మజుని సర్వజ్ఞ సింగమనాయఁ డనుచున్నవి. పరకాలస్వాములవారు వ్రాసిన ట్లు అనపోతభూపాలునిసోదరుఁ డగుమాధవునిపుత్త్రులు దేవగి రీంద్రాదులలో నొకసింగమనాయఁ డుండి యతఁడే సర్వజ్ఞబి రుదము వహించినవాఁడైనయెడల నిరువురు సింగమనాయక యు లేకకాలమున నొకరు రాచకొండలోను మఱియొకరు దేవరకొండలోన బరిపాలనము చేయుచుండి రని మన మూహిం పవలసినది గదా. అట్లయినయెడల మాధవాత్మజునిజ్యేష్ఠకుమా రుఁడైన దేవగిరీంద్రుఁ డను దేవగిరినాయని నగస్త్యభ్రాత యని విడిచిపెట్టవలసినదా? సర్వజ్ఞబిరుదమువహించినసింగమనాయఁ డనుకొడుకే మాధవున కున్నయెడల తనమూవురుపుత్త్రులను గూడ నతిశయోక్తులతో నభివర్ణించుకొన్న రసార్ణవసుధాకర గ్రంథకర్త మహావిద్వాంసుఁ డనిప్రఖ్యాతిఁ గాంచిన పితృవ్య పుత్త్రుని నుదాహరింపక విడిచిపెట్టుట యసూయచేత నని యూహింతమా?

ఎట్లయిన నీయూహ పొసఁగ నేరదు. దేశికులవారిచే రచి యింపఁబడినసుభాషితనీవి యనుగ్రంథము రత్నపేటిక యను వ్యాఖ్యతో ముద్రింపఁ బడినది. రత్నపేటికలో సింగమనాయని పేరునకు సర్వజ్ఞబిరుదము చేర్పఁబడి యుండలేదనియు, సింగమ నాయఁడు రాజమహేంద్రనగరమున నివసించి యుండి విశిష్టా

ద్వైతమతసిద్ధాంతముల బోధించుటకు గురువులను శ్రీరంగము నుండి రప్పించుచుండెననియు రత్నపేటిక వ్యాఖ్యానములో వ్రాయఁబడి యున్నదనియు నేతద్గ్రంథసంపాదకులు తమయుపోద్ఘాతమున నుడివి యున్నారు. సింగమనాయని వెలుగోటివారి వంశమునకు సంబంధించినసర్వజ్ఞసింగమనాయనిగా ధ్రువపఱచుట సంశయింపఁదగిన దనియు వేదాంతదేశికులచే గ్రంథములం బడసినది కోరుకొండదుర్గమును పాలించినముమ్మడినాయకుని తమ్ముఁడగుసింగమనాయకుఁడనితలంపవచ్చునని దొరతనము వారిశాసనపరిశోధకులు వ్రాయుచున్నారు‡. అయినను వీరు చెప్పినట్లు ముమ్మడీంద్రుని సోదరుఁడైనసింగమనాయఁడే దేశి

‡ One of Dasika's Poems the సుభాషితనీవి with its commentory Ratnapetika has been edited by Mr. Narasimha Aiyangar in the Vani Vilas Press, Srirangam. He has pointed out in the introduction to the name of Singappa Nayaka is not found in the Ratna Petika. The latter commentary says that Singa was living at Rajahmahendranagara and was receiving teachers from Srirangam for explaining to him the tenets of Vishnavaswamin which he was much interested. The identification of Singa with Sarvajna Singa of the Venkatagiri family or with his grand-father Singa Prabhu has to remain very doubtful since

కులవారిశిష్యుఁ డని యొప్పుకొంద మన్నను, మాధవాత్మజస్య అను దేశికులవారిపలుకు వీరినిగూడ బాధించుచున్నది. కోరుకొండసింగపనాయనితండ్రి కూనభూపాలుఁ డని కోరుకొండశాసనమువలనఁ దెలియుచున్నది. కాని దేశికులవా రుదాహరించిన శిష్యుఁడు మాధవాత్మజుఁ డెవ్వఁడో తెలియరాదు. అనపోతభూపాలునికొడుకు సింగమనాయఁడు సర్వజ్ఞభూపతి కాఁడని మఱికొన్నిదృష్టాంతములచే ఋజువు చేయవచ్చును. బమ్మెరపోతరాజకృత మని చెప్పఁబడెడిభోగినీదండకము సర్వజ్ఞసింగమనాయని కంకితము గావింపఁబడినది. అందు „ కుమారాన్నపోతావనీనాథసూనుః, పోతమాంబాలసద్గర్భముక్తామణిః ,, అని వ్రాయఁబడియుండుటచేత సర్వజ్ఞసింగమనాయనితండ్రి కుమారాన్నపోతానాయఁ డనియు, తల్లి పోచాంబ యనియుఁ దెలియుచున్నది. ఈసింగమనాయనితల్లి అన్నపూర్ణాదేవి, తండ్రి అనపోతనాయఁడు నని రసార్ణవసుధాకరగ్రంథమువలననే వేద్యమగుచున్నది. శ్రీనాథుఁడు సర్వజ్ఞసింగమనాయనిసభకుఁ బోవు

---

the Zamindars of Venkatagiri family could hardly have extended their power so far north as Rajahmundry.

It is not unlikely that Singa the people for whom Vedanta Desika wrote his works is to be identified with Singaya Nayaka of Korukonda. (*Annual Report on Epigraphy*, 1913 *para* 71).

SREE VENK

చు శారదనుద్దేశించి చెప్పినపద్య మాంధ్రసారస్వతమ్ము నెల్లనలంక
రించియున్న దిగదా. ప్రౌఢదేవరాయలయాస్థానకవి యగు డిండి
మకవిసార్వభౌముని నుద్భటవివాదప్రౌఢిచే గెలిచి వానికం
చుఢక్క పగులఁ గొట్టించి కర్ణాటాధీశునిముత్యాలశాలలో
స్వర్ణాభిషేకమును బొందినతరువాతగదా చెప్పినపద్యమంతకు
బూర్వమం దుండినహరిహరరాయలకు సమకాలికుఁ డగునీ
సింగమనాయనియాస్థానమునకు వచ్చి చెప్పుట యెట్లుపొసఁగినది?
కాఁబట్టి యీతనియాస్థానమునకు శ్రీనాథకవిసార్వభౌముఁడు
వచ్చి 'సీనారటంకారా' మను పద్యము చదివి యుండలే దనుట
స్పష్టము గదా? ఈ హేతువులచేత అనపోతభూపాలునిపుత్త్రుఁ
డైనసింగమనాయునికి సర్వజ్ఞబిరుదము లేదని ఘంటాపథముగఁ
జాటవచ్చును. ఇంతియ గాక రసార్ణవసుధాకరగ్రంథమున కీసిం
గమనాయఁడు కర్త యనుట గూడ సందేహింపవలసినవిషయ
ముగా నున్నది. "రసార్ణవ సుధాకరకర్తృత్వము సింగభూపాలు
నిపై నారోపింపఁబడినది కాని వాస్తవమున కాగ్రంథము
నాతఁడు రచించి యుండఁడు. ఆగ్రంథము నామూలాగ్ర
ముగాఁ బరిశీలించువారికిట్లు స్పష్టముగాఁ దోపక పోవదు" అని
వేటూరి ప్రభాకరశాస్త్రిగారు "కనకాభిషేక" మనుచిన్నపొత్త
మున వ్రాసి యున్నారు. ఈ సింగమనాయఁడు విద్వాంసుఁ డైన
నగుఁ గాక, యితఁడు రసార్ణవసుధాకరగ్రంథకర్త కాఁడనియు.

సర్వజ్ఞబిరుద మీతనికి లేదనియు నిస్సంశయముగా నుడువ వచ్చును*.

## గౌరనమహాకవి చరిత్రము.

అనపోతసింగమనాయనికాలముననను, ఇతనికుమారుఁడగు మాధవునికాలముననను గౌరనమహాకవి యుండి హరిశ్చంద్రోపాఖ్యానమును, నవనాథోపాఖ్యానమును, నిర్దుష్టము లైన ద్విపదకావ్యములనుగా రచించి యాంధ్రసారస్వతమునకు వన్నె దెచ్చినవాఁడు. మిక్కిలి రసవత్తరముగా నాంధ్రమున హరిశ్చంద్రకథ వ్రాసి ప్రసిద్ధి గన్నవారిలో నితఁడే మొట్టమొదటివాఁడు. ఇతని గ్రంథమును జూచియె శంకరకవి, శరభకవి, రామరాజభూషణుఁడు హరిశ్చంద్రచరిత్రములను వ్రాసి యున్నారు. గౌరనమహాకవి యాంధ్రకావ్యములను మాత్రమె గాక సంస్కృతమున లక్షణదీపిక యను ఛందశ్శాస్త్రమును గూడ రచియించెను. లక్షణదీపికలో "అస్తి ప్రశస్తావనిపాలమౌళిరత్నావళీరంజితపాదపీఠః । రేచర్లవంశార్ణవ

*శ్రీనాథకవిని గూర్చి వ్రాయునపు డీవిషయమును గూర్చి విశేషముగాఁ జర్చించి సిద్ధాంతము చేయఁబడి యున్నది గావున నీసింగమనాయఁడు సర్వజ్ఞసింగమనాయఁడు మాత్రము కాఁడని చెప్పి విరమించుచున్నాఁడను. రసార్ణవసుధాకరగ్రంథమును రావుమాధవరావు కాలమునకో తరువాతి కాలమునకో యున్న మల్లినాథసూరియె రచించి సింగమనాయని పేరుపెట్టి యుండెనని యొకప్రతీతి గలదు. ఎంతవఱకు నిజమో తెలియరాదు.

పూర్ణచంద్రో మహాబల స్సింగయమాధవేంద్రః" అని చెప్పఁబడి యుండుటచేతను, హరిశ్చంద్రోపాఖ్యానమున

"సింగనమాధవక్షితిపాలమణికి
మంగళమూర్తికి మంత్రియై జగతిఁ
బాగ డొందు పెద్దనపోతరాజు"

అని తన పెద్దతండ్రి పోతరాజు మంత్రిగా నుండినట్లు చెప్పి యుండుటచేత గౌరనమహాకవి అనపోతసింగనికాలమునను సింగనమాధవునికాలమునను జీవించి యుండు వని మనము నిశ్చయముగాఁ జెప్పవచ్చును. ఏతత్కవిరచిత మైన హరిశ్చంద్రోపాఖ్యానమునకు లఘుటీక వ్రాసిన తంజనగరము తేవప్పెరుమాళ్లయ్యగారు "ఇతనిశైలి మిక్కిలి రసవంత మై వర్ణనాచమత్కృతియుఁ బాక వైలక్ష్యమును గలిగి ముద్దులు గులుకుచుఁ దద్దయు మృదు వై యుండును. తిక్కనవలెఁ దఱుచుగా నచ్చతెనుంగుపదములను గాని, దగు కొలందిని విడిపలుకులనే బెడఁగుగా నల్లి భావ మంతయుఁ జిత్రించి, రసంబుఁ జిప్పిలం జేయుచాతురి యీకవియందును జాలఁ గలదు. ఆయారసముల కనురూపముగాఁ బదము లలవరించి మిక్కిలియు స్వభావానుగుణముగా వర్ణనములు సేయుటయం దీకవి యసమానుఁడు. సాబ గైనస్వభావోక్తులును, జాతీయములును, లోకోక్తులును నందంద నెరసి బెరసి యీతని కవిత

కెంతయు మురువు గూర్చుచుండును. విద్వద్గోష్ఠి మొదలుగా వెంగలి ముచ్చటవఱకును, సార్వభౌముఁ డాదిగా సేవకుని పర్యంతమును, స్వర్గము మున్నుగా శ్మశానవాటిదనుకను నిట్లెయ్యేపదవుల యుచ్చనీచకాష్ఠలును దదవాంతరదశలును గలుగుపాత్రములకుఁ గథాసందర్భమున కనుగుణముగా వేషములను బొందుపఱిచి, తత్తదుచితపరిభాషాదిపరికరము గొఱవడనట్లు రచించురచనలు మిక్కిలి పొంకములును ప్రౌఢములును రమణీయములు నై కవిరసజ్ఞతాపటిమను, లౌకికపరిజ్ఞానగౌరవమును, వర్ణనాప్రాగల్భ్యమును బ్రకటించుచున్నవి. ఏది చెప్పినను, ఏపాత్రమును జిత్రించినను, బడాడంబరమును సమాసారభటియు లేక సరసములైన తేటపదముల సొగసుగాఁ గూర్చి కోరినరసము లొలికించుచున్నాఁడు. మఱియు శబ్దవిస్తరమునకును వర్ణనాబాహుళ్యమునకునుఁ జొరక యొకకొన్ని బంతులలోఁ దలఁచినవర్ణనమును సర్వగౌరవమునం జేసి మెచ్చులుగులుక, రసము చిప్పిలునంత రంజకముగాను మోమున వ్రేలునంత విశదముగాను వర్ణనము సేయుటయం దితఁడు పెట్ట.'' అని కవిశక్తులను విశేషముగా శ్లాఘించి యున్నారు. ఏరివాక్యములలో నతిశయోక్తి లేవియును లేవని తన్మహాకవిరచితగ్రంథములం జదివినవారికి విదితముగాక మానదు.*

* కొలఁదె హరిశ్చంద్రుగుణములు వొగడఁ
దను వెల్ల సత్యంబు తలఁ పెల్లఁ గరుణ

## అనపోత మాధవభూపాలుర పరిపాలనము.

(క్రీ. శ. ౧౪౦౦ మొదలుకొని క్రీ. శ. ౧౪౩౦ వఱకు).

అనపోతసింగమనాయనికి, అనపోతనాయఁడు, దాచానాయఁడు, వల్లభనాయఁడు, వేదగిరినాయఁడు, దామానాయఁడు,

---

పను లెల్ల ధర్మంబు పలు కెల్లఁ బ్రియము
బొంకు నాలుకకుఁ జేర్పుట కాని వావి
యింక నన్నియుఁ జెప్ప నేమి కారణము.

*          *          *          *          *

సుందరి గా దిది సొబగు రాయంచ
యంచ గా దిది నడపారు క్రొమ్మించు
మించు గా దిది రాచ మెచ్చులపత్రిమ
ప్రతిమ గా దిది పచ్చిపగడంపులతిక
లతిక గా దిది నవలావణ్యసరసి.

*          *          *          *          *

వెన్నముద్దను రూపు వెట్టినమాడ్కి-
నున్న మెత్తనిమేన నొప్పెడివాఁడు
ఎన్నఁడు నెండ కన్నెఱుఁగనినునువు
కన్నుల ముత్యాలు గాఱ నేడ్చెడిని
నే చెల్ల నో యమ్మ యీచక్క నన్న
రాచతేజము గలరత్నాలపెట్టె
నడువ నెట్లోర్చునో నాముద్దుఁజిలుక
కడుపు చుఱుక్కను గన్నవారికిని.

*          *          *          *          *



SREE VEMANA ANDHRA BHASHA NILAYAM
శ్రీ వేమన ఆంధ్ర భాషా నిలయము
1923.
HYDERABAD-DN

మాదానాయఁడు ననునార్వులు పుత్రు లున్నట్లుగా రసార్ణవసుధాకరగ్రంథమున వ్రాయఁబడి యుండెను*, వీరిలో జ్యేష్ఠుఁ డగుఅనపోతానాయఁడు తొలుతను మాదానాయఁడనుమాధవనాయఁడు తరువాతను రాజ్యభారమును వహించి పరిపాలనము గావించిరి. రసార్ణవసుధాకరగ్రంథములో సింగమనాయఁడు తనపెద్దకుమారుఁడు గుణములచేఁ బ్రసిద్ధుఁ డై సౌందర్యమున నకులుని, ధనుర్విద్యయం దర్జునుని, నిరూఢమైనభుజపరాక్రమమునందు భీముని, సత్యోక్తియందు ధర్మరాజును, దానమందుఁ గర్ణుని జయించె నని యభివర్ణించి

---

"లెక్కింప నపకీర్తి లేనిజీవనము
నిక్కంబుగా నొక్కనిమిషంబె చాలు"
"పసపడ మొగిలులోపలి నీళ్లునమ్మి
దొననీళ్లు చల్లువేసులు నెంచు గలఁడె"
"ఊతుగా నాఁబోతు టంకె వేసినను
గంతులు దక్కునే కంఠీరవంబు"
"కులము ప్రధానమే గుణము లేకున్న
గలశాబ్ధిఁ బుట్టదే కాలకూటంబు"
"పంద నందఱు బాధ పఱతురు గాని
యెంచు సాహసుని ది క్కెవ్వరుఁ బోరు"

* "శ్లో॥ అనపోతదాచవల్లభవేదగిరిస్వామిదామమాదాభిఖ్యైః

యున్నాఁడు*. కొడుకుల నీవిధముగా వర్ణించిన గ్రంథకర్తలలో సింగమనాయఁడు దక్క మఱియెవ్వరును గానరారు. ఇతఁడు సమ్మెటసోమరాజును జయించి సరిపెల్లరాజులను సంహరించి 'పట్టుతలాటాంక' అనుబిరుదమును, 'రాయవేశ్యాభుజంగ' అను బిరుదమును బొందినాఁడఁట! ఒకపూర్వకవి యీతని నీక్రింది పద్యములో నభివర్ణించియున్నాఁడు.

సీ. పటుసోమకులరాజపరశురామాంకుఁ డై
సమ్మెటసోముని జక్కఁ జేసె
ఖడ్గనారాయణగాయగోవాలుఁ డై
సరిపల్లెరాజుల సంహరించె
పట్టుతలాటాంకబల్లరగండఁ డై
యనవేమరెడ్డిని నాజిఁ దునిమె

---

* "శ్లో॥ తత్రాత్రి ద్యః ప్రథితః కుమారతిలకః శ్రీయన్నపోతో గుణై
రేకస్యాగ్రజ మాత్మరూపవిభవే రూపే ద్వయో రగ్రజమ్
ఆరూఢేత్రితయాగ్రజం విజయతే దుర్వారదోర్విక్రమే
సత్యోక్తౌ చతురగ్రజం వితరణే కించాపి పఞ్చాగ్రజమ్.

"శ్లో॥ పుత్రైరస్త్యైశ్చ సనయై స్సోయం సిఙ్గమహీపతిః
షడ్భిః ప్రతిష్ఠా మయతే స్వామీ వాఙ్గై స్సుసఙ్గతైః."

షడంగములతోఁ గూడుకొన్న రాజువలె నీతిమంతు లగునార్గురి పుత్త్రులతో రావుసింగభూపతి ప్రతిష్ఠను బొందుచున్నాఁ డనితాత్పర్యము.

జగమందు రాయవేశ్యాభుజంగాంకుఁ డై
సురథానిబలముల సొరిది గెల్చె
గీ. ధరణి నాతఁడు భీమప్రతాపవిజయ
బాహుబలశాలి నిత్యసౌభాగ్యశీలి
లలితసుగుణుండు రేచెర్లకులపవిత్రుఁ
డనఁగ నెలసెను సింగయయన్నవిభుఁడు."

ఈపైపద్యములో అనవేమరెడ్డిని అనపోతనాయఁడు సంహరించె నని చెప్పినమాట సత్య మని విశ్వసింపరాదు. అనవేమారెడ్డి కొండవీటిరాజ్యమును క్రీ. శ. ౧౩౯౯ వఱకును బరిపాలనము చేసెను. అనపోతనాయనికాలమందున్నవాఁడు కోమటివేమారెడ్డికాని అనవేమారెడ్డి కాఁడు. అనపోతనాయఁడు గండికోటదుర్గముపై దండెత్తి పోయి ముట్టడి వేయఁగ తద్దుర్గాధ్యక్షుఁ డగుపోలేపల్లిబుక్కరాజు రాత్రి వచ్చి మోసముతో నీయనపోతానాయనిఁ జంపెనఁట. ఈపోలేపల్లిబుక్కరాజు మిక్కిలి ప్రసిద్ధపురుషుఁ డనియు, సామాన్యుఁడు గాఁడనియు వీనిపైఁ జెప్పిన యీక్రిందిచాటుపద్యములవలన వేద్యము కాఁగలదు.

సీ. కొలువులో మీసాలు కొనలు దిద్దఁగ వచ్చుఁ
జికిలి పేనాకత్తి చిమ్మవచ్చు
మేలైనయంగీలు మెఱసి తొడ్గగ వచ్చు

సతులు చూడఁగ నెమ్మె నలుప వచ్చు
గరడిసాదనఁ జూచి ఘాత సేయఁగ వచ్చు
బిరుదులు చదువంగ బిగియవచ్చు

* * * *

గీ. కాక యరి నని వ్రేయ సత్కవుల కీయ
నీవె నేర్తువు ధరణిలోన నేర్పు మెఱయఁ
బరమకల్యాణ! నూతనపంచబాణ;
భానుతాటోప! తిమ్మయబుక్కభూప.

సీ. కలగుండ్లు పడఁబారు కన్పించుదుర్గాలు
కడఁగి భగ్గున విచ్చుగండవిండ్లు
పెంధూళిపైఁ గప్పి భీతిల్లుఁ గోటలు
కమలి భస్మంబులౌ గాననములు
చీకాకుపడుదొడ్డసింహాసనంబులు
హల్లకల్లోలమౌ నష్టదిశలు
గగ్గులకాఁడౌను గడి మన్నెభూములు
పంచబంగాళమౌ పట్టణములు

గీ. గర్వదుర్వారభూపసంఘములలోన
నుట్టిపడ్డట్టు నీధాటి పుట్టినపుడె
మన్నెశార్దూల! రిపుమన్నెమర్త్యజాల
భానుతాటోప! తిమ్మయ బుక్కభూప!

సీ. మత్తారిరాజన్యమకుటంబులనె కాని
పాదంబు చాపఁడు బలిమి మెఱసి
బిరుదాడురాజులపేరురమ్ముననె కాని
మన్నెబెబ్బులిబాకు మహి నిడండు
పచరించు రిపురాజపట్టణంబునె గాని
వాజి నెక్కండండ్రు రాజసమున
కపటరాజ కఠోరకంఠరక్తమె గాని
యడిదంబు కడుగఁ డాహవమునందు
గీ. మన్నెమాత్రుండె గద్దరిమన్నెమావు
మలయుఁబిత్తరి మన్నీలమగలమగఁడు
దండిమన్నీలవలపుల మిండగీడు
భోగసురరాజు తిమ్మయబుక్కరాజు.
సీ. అనిలోన విఱిగి వచ్చి యందల మెక్కునే
ముక్కు సెవు ల్లేని మొండిగాక
పోరిలో గుఱ్ఱంబు పాలియించి వచ్చునే
గుఱిచెడ్డగుఱ్ఱాలగోవు గాక
బవరంబునకుఁ బోయి పతికి వంచన చేసి
తోలఁగునే బణ్ణంగి దూబ గాక
ఏలినపతిసొమ్ము నెల్లకాలము దిని
పాఱిపో నెంచునె పంద గాక

గీ. సమరతలమునఁ దనప్రాణసతి దలంచి
సుఖము గోరునె జోగులసుతుఁడు గాక
యనుచు గెల్వంగ నేర్తు వీవాహవమున
భానుతాటోప ! తిమ్మనాయబుక్కభూప !

అనపోతానాయనితమ్ముఁడు చినసింగమనాయఁడు తన యన్నను బుక్కరాజు మోసమున సంహరించినసంగతి విని కోపోద్దీపితుఁడై తనబావమఱంది యగు జూపల్లికొండమనాయనిఁ బిలిచి ,, మా యన్నను గపటముచేఁ జంపినబుక్కరాజుతల దీసికొని రావలసిన''దని చెప్పి పంపె ననియు, తదాజ్ఞానుసార మాకొండమనాయఁ డనేక సేనాసమేతుఁడై పోతేపల్లి బుక్కరాజుమీఁదికి యుద్ధమునకుఁ బోయిన నాబుక్కరాజు కొండమనాయనితో యుద్ధముఁ జేయ వెఱచి పాడిచేటికోటలో డాగఁగాఁ గొండమనాయఁ డాకోట యెక్కి లోపలికి దిగి బుక్కరాజును బట్టుకొనియె ననియు, అంత నాతఁడు శరణము వేఁడఁగా నతని కభయమిచ్చి యతనిం దీసికొని సింగమనాయనిసభకుఁ దెచ్చి నే నితని కభయమిచ్చితిని గాన నితని ప్రాణము రక్షింపుఁ డని ప్రార్థింపఁగా సింగమనాయఁడు గరుణించి బుక్కరాజును గాపాడె ననియు వెలుగోటివారివంశచరిత్రమున వక్కాణింపఁబడి యున్నది*.

*అనపోతసింగమనాయని పుత్త్రిలని రసార్ణవసుధాకరగ్రంథమునం

## ఫిరోజ్‌షాహ పద్మనాయకులతోఁ బోరి పాఱిపోవుట.

రెండవ యనపోతభూపాలునికిఁ బిమ్మట నాతనిసోదరులలో నైదవవాఁ డగురావుమాధవరావు రాచకొండలో రాజ్యభారమును వహించినట్లు గన్పట్టుచున్నది. ఇతనిపరిపాలనకాలముననే అనఁగా క్రీ. శ. ౧౪౧౭ వ సంవత్సరమున బహమనీరాజ్యాధిపతి యైనఫిరోజ్‌షాహ నిర్హైతుకముగా లక్షసైన్యముతో

---

బేర్కొనంబడిన యార్వురు పుత్త్రులలోను చినసింగమనాయని పేరు గనంబడదు. అనపోతనాయఁడు, దాచానాయఁడు, వల్లభనాయఁడు, వేదగిరి నాయఁడు, దామానాయఁడు, మాదానాయఁడు నని యార్వుర పేరులు మాత్రి మాగ్రంథమునఁ గానంబడుచున్నవి. వీరిలో వేదగిరిస్వామియే చినసింగమనాయఁ డని వెలుగోటివారివంశచరిత్రగ్రంథకర్తలు పేర్కొనుచు వేదగిరిలో వేంచేసియున్నస్వామి నరసింహుఁ డగుటచేత వేదగిరిస్వామి యన నరసింహుఁ డని యర్థము గ్రహింపవలసి యుండు నని కారణము నొకదానిఁ గూడ వ్యక్తపఱచి యున్నాఁడు. ఇట్లర్థము వ్యక్తీకరింపకున్నయెడల పదవతరము సింగమనాయనిసర్వజ్ఞభూపుని చేయుటకు ప్రతిబంధకముగా నుండును. ఏమన సర్వజ్ఞభూపునిపితామహుఁడు రావుసింగక్షమానాథుఁ డని భోగినీదండకమున వక్కాణింపఁబడియుండుటచేతను, రసార్ణవసుధాకరగ్రంథమున సింగమనాయనిపుత్త్రులలోఁ బెద్దవాఁ డగు ననపోతనాయనికి సింగమనాయఁ డను పేరుగలతమ్ముఁడు లేకుండుటచేతను, వీరు సర్వజ్ఞసింగమనాయని పితామహుఁ డగురావుసింగక్షమాపాలుఁ డెతఁడో నిరూపింపవలసియున్నది గావున వేదగిరిస్వామి యనఁగా నరసింహుఁ డని యర్థము చెప్పి యతఁడే సర్వజ్ఞసింగభూపతితాత యగురావుసింగక్షమానాథుఁ డని పేర్కొనియుండిరి.

తెలుఁగుదేశముపై దండెత్తి వచ్చి పానుగల్లుదుర్గమును ముట్ట డించెను. ఈదుర్గము రేచెర్లవంశజు లైనపద్మనాయకవీరుల వశమునం దుండుటవలన రెండుసంవత్సరములకాలము ముట్ట డించి చుట్టుముట్టుకొనియున్నను పద్మనాయకులబలిమి యెట్టి దో కాని యాతనికి వశపఱచియుండలేదు. ఈపానుగల్లుదుర్గ మాదవానిదుర్గమునకు నుత్తరమున డెబ్బదిమైళ్ళదూరమున నున్నది. రెండుసంవత్సరములకాలము ముట్టడించి యున్నతరు వాత ఫిరోజ్‌షాహాసైనికులలో కలరా మున్నగు వ్యాధులు సంభవించి కొంతసైన్యము నశించెను. తురకసర్దారు లనేకులు పద్మనాయకవీరులధాటికి నిలువఁ జాలకయు, క్రూరవ్యాధుల పీడభరింపలేకయుఁ బలాయను లై వచ్చినదారిని బట్టి వారివారి జాగీరులకుఁ బోయిరి. తుదకు ఫిరోజ్‌షాహా భగ్నమనోరథుఁడై సిగ్గునుబోనాడి పాఱిపోవలసివచ్చెను. తెలుఁగుసర్దారులలో ముఖ్యుఁడును మొదటిమాధవభూపాలుని మనుమఁడును, పెద వేదగిరినాయనికుమారుఁడు నగురామచంద్రనాయఁడు ఫిరోజ్ షాహను వానిసైన్యములను వెంటాడించి వానివజీరుఁ డగు “మీర్-ఫైజ్-ఉల్లా” అను వానిని సంహరించి బండికనుమ సమీపమున వాని కనేకవిధము లైనబాధలను గల్పించి పరి భవించి యదివఱకుఁ దురుష్కులు పెట్టినబాధలకు వడ్డితోఁ గూడ నప్పుతీర్చి కసితీర్చుకొనియెను. ఈయుద్ధమునందు రామ

చంద్రినాయనికి తమ్ముఁడు కుమారమాధవనాయఁడు తో డ్పడి విజయమునకుఁ గారణభూతుఁ డయ్యె. ఒకకవి రామ చంద్రనాయనిగూర్చి యీక్రిందిపద్యమును జెప్పి శ్లాఘించెను.

"సీ. కుంట్లూరియిమ్మని గూల్చినయెఱదాచ
భూతలాధిపుఁడు మీతాతతాత
యనిలోన మచ్చగన్నయను ద్రుంచిన సింగ
ధారుణీశ్వరుఁడు మీతాతతండ్రి
తోడరిభాండారమున్మడిని నాజి నడంచి
తనరుమాధవుఁడు నీతండ్రి తండ్రి
గుండ్రదండ్రాయని ఖండించి సన్నుతి
గాంచుటఁ బరఁగె నిన్నన్నతండ్రి
గీ. కడిమి మై నీవు తగ బండికనుమయొద్ద
బరగ పేరోజి సురథానుఁ బరిభవించి
కదనమున నౌర గెలిచితి కన్నడీల
రమ్యదేవేంద్ర వేదయరామచంద్ర!"

రామచంద్రనాయనితమ్ముఁడు కుమారమాదానాయఁడు దేవరకొండరాజధానిపై దండెత్తి వచ్చినయెఱకృష్ణరాయనితో యుద్ధముఁ జేసి వానిని సంహరించి విజయము గాంచెను. వలి కొండదుర్గాధీశ్వరుఁ డైనపండరాధీశునిమీఁదికి దాడి వెడలి పోయి వానిని జయించి యావలికొండదుర్గమును దా నాక్ర

మించుకొని 'హాన్నెగట్టుకుదిరెగట్టుమండలేశ్వరగండ' అను బిరుదమును, మఱియు నెరకవరప్రాంతమున మన్నెజంగలియను లింగబలిజను నుక్కడంచి ''పనఘానరాయబసవశంకర' అను బిరుదమును వహించెనఁట!

## రావుమాధవరావు.

ఈరావుమాధవనృపాలుఁడు క్రీ. శ. ౧౪౨౭ వ సంవత్సరమున నయితము రాచకొండలో నివసింపుచు రాజ్యపరిపాలనము చేయుచున్న ట్లితనిభార్య యగునాగాంబికశాసనము వలన స్పష్టముఁగా దెలియుచున్నది. ఆశాసనమునం దితని వంశావళి వివరింపఁబడినది. విష్ణుపాదమున జనించినవర్ణమునందు రేచర్లవంశాంబుధిపూర్ణచంద్రుఁ డైనయెఱదాచభూపాలుఁడు జనించె ననియు, నతనికి యాచకకామధేను వగు సింగక్షితీశుఁడు, నతనికి ననపోతభూపతియు, నతనికి వంశదీపకుఁ డైనసింగభూపాలుఁడు, నతనికి రావుమాధవనృపాలుఁడు జనించెనని యుదాహరింపఁబడి యుండెను. రసార్ణవసుధాకరమునఁ జెప్పినట్లుగాఁ దనభర్త కైదుగు రన్న లున్నట్లు చెప్పి యుండలేదు. మఱియు నాశాసనమున రావుమాధవరావు శాలివాహనశకము ౧౩౪౯ ప్లవంగసంవత్సరాశ్వయుజమాసమున శ్రీమద్రామాయణమునకు సమీచీనముగ నర్థబోధకమ మగురాఘవీయ మనువ్యాఖ్య నొనరించి శ్రీరాములవారి

పాదాంబుజములయందు సమర్పించినాఁడని చెప్పియుండియు నతనితండ్రి సింగభూపాలుఁడు రసార్ణవసుధాకర మను నుద్గ్రంథమును రచించి సర్వజ్ఞబిరుదమును వహించియుండిన యెడల నేల యుదాహరింపకుండెనో కారణము గోచరముగాక యున్నది. ఈశాసనములో రావుమాధవరావు రాయరావుబిరుదమును స్వీకరించినాఁడని వాకొనఁబడియున్నది*. మఱియును శాలివాహనశకము ౧౩౬౧ సౌమ్యసంవత్సర చైత్రమాసమున రావుమాధవరావుభార్య నాగాంబిః నాగసముద్ర మనుతటాకమును శాశ్వతధర్మవృద్ధి కై ప్రతిష్ఠించెనని యాశాసనము ఘోషించుచున్నది.

ఇదియునుంగాక యీరావుమాధవభూపాలుఁడు రాచకొండ కీశాన్యమునఁ గ్రోసెడుదూరమున "చేతిరాతిసరికె" యను ప్రదేశమున నొకశిలమీఁద శ్వేతాచలపతిస్వామికిఁ జూతవనము సమర్పించినట్లు శాసనము చెక్కింపఁబడినది♦.

---

* శ్లో॥ సూను స్సిఙ్గనృపస్య తస్య శుభధీ స్సూర్యోపమ స్తేజసా
కాన్త్యా చన్ద్రసమః కలాభి రనిశం సన్మార్గసంపత్తిభిః
రమ్యో రాజతి రావుమాధవనృపో రాజన్యచూడామణి
ర్యేనశ్రీనిధిరాయరావుబిరుదం లోకే నిరూఢీకృతమ్.

♦శ్లో. కులశేఖరరావుమాధవః కులకోట్యై సురనాథతాం ప్రదాతుమ్
విశదాచలనాథకేళయే భువి భోగాయ గిశే రదత్త చూతాన్."

# మూఁడవ ప్రకరణము.

## ఇతర పద్మనాయకవీరులు.

(క్రీ. శ. ౧౪౦౦ మొదలుకొని క్రీ. శ. ౧౪౫౦ వఱకు)

### కుమారాన్నపోతనాయఁడు

రసార్ణవసుధాకరగ్రంథకర్త యని పేర్కొనంబడియెడి సింగమనాయని పుత్త్రులలో వేదగిరిస్వామి యని నామాంతరము గల రావుసింగక్షమానాథుని కనపోతనాయఁడను నొకకొడుకు గలఁడు. ఇతఁడు మెతుకుసీమకుఁ బరిపాలకుఁడుగ నుండెను. ఇతఁడు రాజమహేంద్రవరము రెడ్లను జయించె ననియు, బోయరాజ్యమును గట్టుకొనియె ననియుఁ జెప్పుదురు. ఇతఁడు విష్ణుభక్తుఁడై రామానుజీయ మత మవలంబించెనఁట! ఇతని పరాక్రమము నభివర్ణించెడి పూర్వకవి చాటుధారయొకటి శ్రీరావువంశీయులచరిత్రమున నుదాహరింపఁబడినది.

,, సీ. పౌరుషంబున నీవు పానుగల్లాదిగాఁ
గోటరాజ్యం బెల్ల గొల్లలాడి
యేపు మై రాజమహేంద్రంబు మేరఁగా
రెడ్డిరాజ్యం బెల్ల రేగఁగొట్టి
బాహుబల్మిని చెన్నపట్నంబు మేరఁగా
తిగుటరాజ్యం బెల్ల దెబ్బఁదీసి

మొక్కళంబునఁ జొచ్చి ముద్దోజిగీటుక
బోయరాజ్యం బెల్లఁ బొడిచివైచి
గీ. నేర్పు నెఱపించి రాయలనిర్వహించి
తెట్లు సంబెటగెలిచితి వావహమున
విమలచారిత్ర సింగభూవిభుసుపుత్త్రి
వర్ణితాటోప రాయరావన్నపోత."

సర్వజ్ఞసింగభూపాలుఁడు. (?)

రావుసింగభూపాలునిపుత్త్రుఁడై మెతుకుసీమను బరిపాలించిన యనపోతనాయనికి సింగమనీడు, అన్నమనాయఁడు, వసంతనాయఁడు నని మూవురుపుత్త్రులు గలరఁట! "వీరిలో శ్రేష్ఠుఁడగు సర్వజ్ఞసింగభూపతి కావ్యనాటకాలంకారశాస్త్రములయందు మిగులఁ బ్రవీణతగలిగి యాంధ్రపండితమండలికిఁ బట్టుకొమ్మయై యుండెను." అని వెలుగోటివారివంశచరిత్రమునందు వ్రాయఁబడియెను. "ఈప్రభుఁడు విద్యావినోదములఁ గాలము గడుపుచుండువాఁడు. సంస్కృతమునఁ బండితుఁడును గవియు నై యుండి స్వయముగ ననేకగ్రంథముల రచియించి పండితకవుల విశేషముగ నాదరించి బహుప్రఖ్యాతిఁ గాంచె" నని రావువంశీయులచరిత్రమున వక్కాణింపఁబడి యున్నది. "వీ రనేకవిద్యల నభ్యసించి యెల్లప్పుడు పండితులచేతం గవులచేతం బరివేష్టింపఁబడి యుండువారు. "సింగభూపాలీయ"

మను గ్రంథమును రచించినారు. వీరికి సర్వజ్ఞనామము పౌరుష నామధేయ మై యున్న"దని శ్రీబొబ్బిలిసంస్థానాధిపతుల చారిత్రమునందు లిఖియింపఁ బడియున్నది. "సింగభూపాలుఁడు మహావిద్వాంసుఁడు; అందుచేత నతండు సర్వజ్ఞసింగమనీఁడు (నాయఁడు) అని వ్యవహరింపఁబడుచు వచ్చెను. ఇతఁడు వేంకటగిరి సంస్థానమునకు మూలపురుషుఁ డయినబేతాళనాయఁడనునామాంతరముగల చేవిరెడ్డికిఁ బదుఁతరమువాఁడు. ఈ ప్రభువు సంస్కృతమున చమత్కారచంద్రిక యనునలంకారశాస్త్రమును జేసెను. దీనికి సింగభూపాలీయమని నామాంతరము గలదు." అని యాంధ్రకవులచరిత్రమున నుద్ఘోషింపఁబడియెను. ఈతనింగూర్చి వేంకటగిరివంశావళిలో:—

సీ. క్షితిలోన సర్వజ్ఞసింగభూపాలుండు
బలవైరిసన్నుతపౌరుషుండు
లలితకావ్యనాటకాలంకారచతురుండు
సకలశాస్త్రార్థవిశారదుండు
వలనొప్ప సింగభూపాలీయనామక
గ్రంథంబు రచియించెఁ గౌతుకమున
మును భాగవతమును దెనుఁగుచేసినయట్టి
బమ్మెరపోతన బాగుమీఱ
గీ. తనకుఁ జెప్పినభోగినీదండకమును

వెలయ శ్రీనాథనామకవిప్రవరుఁడు
కోరి చెప్పినపద్యముల్ గొని ముదాప్తిఁ
బెంపుతో వారి మన్నించి పేరు వడసె"

అను నొకపద్యము గన్పట్టుచున్నది. ఈగ్రంథకర్తల యభిప్రాయములను బట్టి చూడఁగా రసార్ణవసుధాకరగ్రంథకర్తనే యెల్లవారును సర్వజ్ఞుఁడని వ్యవహరించుచున్నట్లు విశదము కాఁగలదు. అయినను రసార్ణవసుధాకరగ్రంథమును బట్టి యేడవతరము సింగమనాయఁడు గ్రంథకర్తగాని యీపదవతరము సింగమనాయఁడు గ్రంథకర్త కాఁడని స్పష్టముగాఁ దెలిసికొనఁగలుగుచున్నారము. దేశికులవారు తత్త్వసందేశోపసంహారమునఁ బేర్కొనినమాధవాత్మజునే తరువాతి వైష్ణవగ్రంథములు సర్వజ్ఞసింగమనాయనిగా నభివర్ణించుచున్నవనుసంగతియు మనమెఱుంగుదుము. రసార్ణవసుధాకరగ్రంథకర్త మాధవాత్మజుఁడు కాఁడని స్పష్టపడియె. ఈపెదసింగమనాయఁడే (ఏఁడవతరమువాఁడు) రసార్ణవసుధాకరాది సంస్కృతగ్రంథనిర్మాత యై సర్వజ్ఞబిరుదము గాంచినవాఁడని వ్రాసియుండియు వెలుగోటివారివంశచరిత్రకారులు పదవతరము సింగమనాయనిగూడ సర్వజ్ఞుఁడని వ్యవహరించుచున్నారు. దీనికిఁ గారణ మీపదవతరము సింగభూపతి కావ్యనాటకాలంకారశాస్త్రాదులయందు మిగులఁ బ్రవీణత కలిగి,

యాంధ్రపండితమండలికిఁ బట్టుకొమ్మ లై యుండుటచేతనఁట! వీరిరువురును గూడ మాధవాత్మజులు గా రని స్పష్టము. ఈ పదవతరము సింగమనాయఁడు దేశికుల వారి కాలములో లేఁడు. దేశికులవారు మాధవాత్మజునికిఁ బంపిన "సుభాషితనీవి" యను గ్రంథము వ్యాఖ్యోపోద్ఘాతమున "రాజమహేంద్రనగరస్థిత సర్వజ్ఞసింగక్షమావల్లభేన" అని వ్రాయఁ బడి యుండుటచే వెలుగోటివారివంశచరిత్రకారులు ,,కాఁబట్టి నిజముగఁ దొమ్మిదవతరమువా రాదేశము (రాజమహేంద్రవరము) నాక్రమించి యేలి తమపుత్త్రాదుల నచట నిలిపి యుండవలె" నని తమయుపోద్ఘాతమున వ్రాసియున్నారు. దీనిబట్టి తొమ్మిదవతరమువాఁడై నయనపోతనాయఁడు రాజమహేంద్రవరము రెడ్లనుజయించి తనపుత్త్రుఁడైనసర్వజ్ఞ బిరుదాంకితుం డనుసింగమనాయని రాజమహేంద్రరాజ్యమునకుఁ బట్టముగట్టె ననియు, సర్వజ్ఞ సింగమనాయఁడు రాజమహేంద్రరాజ్యమును బరిపాలించె ననియు నిర్ధారింపవలసి యున్నది. ఇది చరిత్రాంశమునకు విరుద్ధము. సర్వజ్ఞసింగమనాయఁ డెన్నఁడును రాజమహేంద్రనగరమును బరిపాలించి యుండలేదు. అల్లాడరెడ్డిపుత్త్రు లగువేమారెడ్డియు వీరభద్రారెడ్డియు రాజమహేంద్రవరరాజ్యమును బరిపాలించుకాలమున ననఁగా క్రీ.శ. ౧౪౪౦-౫౦ సం॥ముల నడుమ లింగమనాయఁడు మొదలగు పద్మనాయకవీరులు గొండఱు

కర్ణాటసామ్రాజ్యలక్ష్మీధురంధరుఁడైన ప్రౌఢదేవరాయని పక్షమున రాజమహేంద్రపుర రాజ్యము పైఁ బలుమాఱు దండెత్తి వచ్చి యుద్ధములు చేసినది వాస్తవ మైనను క్రీ. శ. ౧౪౫౦ండవ సంవత్సరము వఱకును అల్లాడరెడ్డిపుత్త్రు లగు వేమారెడ్డియు, వీరభద్రారెడ్డియు నిరంకుశముగాఁ బరిపాలనము చేయుచున్న వా రగుటచేత సర్వజ్ఞబిరుదాంకితుండని పేర్కొనంబడియెడి యీపదవతరముసింగమనాయఁడు, రాజమహేంద్రవరరాజ్యమును బరిపాలించినట్లు గన్పట్టదు. రెడ్డిరాజులకుఁ బిమ్మట రాజమహేంద్రవరరాజ్యము గజపతుల పరిపాలనమునం దుండెను గాని కర్ణాటాధీశులపరిపాలనమునం దుండి యున్నట్లు గన్పట్టదు. ఆకాలమునఁ గర్ణాటులు మహామ్మదీయులు, గజపతులు రాజమహేంద్ర రెడ్లరాజ్యము నాక్రమించుకొనుట కై క్రీ. శ. ౧౪౪౩-౧౪౫౦ సంవత్సరముల నడుమ దండయాత్రలు సలుపుచు దేశమునకు సంక్షోభము కలిగించుచు వచ్చినను తుదకు రాజమహేంద్రపురరాజ్యము గజపతులవశ మయ్యెను. ఈపదవతరము సింగమనాయఁడు వేంకటగిరిసంస్థానమున కధీశ్వరుఁ డని యాంధ్రకవులచరిత్రమునందును, కవిజీవితములయందును వ్రాయఁబడియెను గాని యప్పటికి వేంకటగిరిసంస్థాన మేర్పడియుండలేదనుట స్పష్టము. ఇతఁ డోరుగంటిరాజ్యములోనే యుండి యాసీమను బరిపాల

నము చేసినవాఁడని స్పష్టముగాఁ జెప్పవచ్చును. ఈ పద్యవ తరము సింగమనాయఁడే సర్వజ్ఞుఁ డని చెప్పుటకుఁ దగ్గిన హేతువు లెవ్వియును గానరావు. ఒకటి రెండుగాథలు గలవు. అందు ముఖ్యముగా బమ్మెరపోతరాజకృత మనియెడు భోగినీ దండక మొకటి యచ్చుపడి ప్రచారమునం దున్నది. అది యెంతవఱకు విశ్వాసపాత్ర మైనదో మనము తెలిసికోవలసి యున్నది.

## బమ్మెరపోతరాజు-భోగినీదండకము.

"బమ్మెరపోతరాజు నెల్లూరిమండలములోని వేంకటగిరి సంస్థానమునకు ప్రభువగు సర్వజ్ఞసింగమనాయని యాస్థాన పండితుఁడై యుండినందునకుఁ బోతరాజప్రణీతమైన భోగినీ దండకము సాక్ష్యమిచ్చుచున్నది. ఈదండకము సర్వజ్ఞసింగమ నాయఁ డుంచుకొన్న వేశ్యవిషయమై చెప్పఁబడినది. దాని కవిత్వ మించు మించుగా భాగవతమును బోలియుండును. ఈసర్వజ్ఞసింగమనాయఁడు ౧౪౨౨వ సంవత్సరము మొదలు కొని ౧౪౪౭వ సంవత్సరము వఱకును విజయనగరాధీశ్వరుఁడు గానున్న ప్రౌఢదేవరాయనితో సమకాలికుఁడు." అని యాంధ్రకవులచరిత్రము పోతనకవీంద్రునిచరిత్రమును వ్రాయు సందర్భమున నుద్ఘోషించియున్నను శ్రీనాథునిచరిత్రము వ్రాయు సందర్భమున "శ్రీనాథుఁడును బమ్మెరపోతరాజును సర్వ

జ్ఞసింగమనాయని యాస్థానకవీశ్వరు లైనట్లు వేంకటగిరి సంస్థానవంశచరిత్రమునందు వ్రాయఁబడి యున్నదఁట! కాని యీకవు లిద్దఱును సింగభూపాలుని కాలమువారే యైనను వీరిలో నెవ్వరు నాయాస్థానకవీశ్వరులు కానట్టు సంశయింపవలసి యున్నది.'' అనియు నుద్ఘాటించుచున్నది. ముందు శ్రీనాథుని చరిత్రమును తరువాత పోతనచరిత్రమును వ్రాయఁబడి యుండుటచేత మొదటి వాక్యమె తరువాత వ్రాయఁబడినదిగా మన మూహింపవచ్చును. కవిచరిత్రకారుని యభిప్రాయమునం దట్టి మార్పునకుఁ బ్రబలహేతు వేమని విచారింప భోగినీదండక కృతియె కారణ మని చెప్పఁదగి యున్నది. శ్రీనాథుని చరిత్రమును వ్రాయునప్పుడు భోగినీదండకముఁ నుజూచి యుండక పోవచ్చును. పోతరాజుచరిత్రమును వ్రాయునప్పుడు చూచి యుండవచ్చును. కాని యనేక ముద్రణములంబొంది యున్న కవులచరిత్రమునం దింకను బరస్పర విరుద్ధములై స్వవచన వ్యాఘాతమును నిరూపించు నిట్టి యభిప్రాయముల నేల సవరించకయూరకోనవలసి వచ్చెనో బోధపడక యున్నది. సింగమనాయఁడు కవులచరిత్రమునందుఁ జెప్పినట్లు వేంకటగిరిసంస్థానాధీశ్వరుఁడు కాఁడని యిదివఱకె తెలిపి యున్నాఁడను. ఇంక బమ్మెరపోతన యాతని యాస్థాన కవి యగు నేమో మనము విచారింపవలసియున్నది. అతఁ డతని యాస్థానకవి యనుటకుఁ

ప్రత్యక్ష సాక్ష్య మిచ్చుచున్నది భోగినీదండకము. భోగినీదండకము బమ్మెరపోతరాజవిరచిత మని తెలుపుటకు దండకము తుద నీక్రింది పద్యము చేర్పఁబడి యున్నది.

"ఉ. పండిత కీర్తనీయుఁడగు బమ్మెరపోతన యాసుధాంశుమా
ర్తాండ కులాచలాంబునిధి తారక మై విలసిల్ల భోగినీ
దండకము న్రచించె బహుదానవిహార్తకు రావుసింగ భూ
మండల భర్తకు న్విమత మానవనాథ మదాపహర్తకున్."

ఈపై నుదాహరింపఁబడిన పద్యము బమ్మెరపోతన రచించినది గాక మఱియొకరు రచించినట్లు "పండిత కీర్తనీయుఁడగు బమ్మెరపోతన" యని ప్రథమ పురుషములో నుడివిన పలుకే సాక్ష్య మిచ్చుచున్నది. పండిత కీర్తనీయుఁ డనని బమ్మెరపోతన వంటి భక్తాగ్రేసరుఁ డగు కవి యాత్మశ్లాఘనీయమగు విశేషణమును వ్రాసికొనునా యని సంశయింపఁదగి యున్నది. అయిన నిట్టివానిని విశ్వసించుటకు ముందు కవియొక్క శీలమును బరిశీలింపవలసి యుండును. "ఈబమ్మెరపోతన యెక్కడివాఁడు, ఇతని చరిత్రశీలము లెట్టివి?" అను వానిని మున్ముందుగాఁ దెలిసికొనవలయును. "ఈతని నివాసస్థలము కడపమండలములోని యొంటిమెట్ట. ఇదియే భాగవతమునం దేకశిలానగర మని చెప్పఁబడినది." అని యాంధ్రకవిచరిత్రకారుఁడు నుడివి యుండెను గాని యది యథార్థము గాదు. ఏకశిలా

నగర మని భాగవతమున వక్కాణింపఁబడినపురము కాకతీయ సామ్రాజ్య ధురంధరులచే నివసింపఁబడి యాంధ్రనగర మని ప్రఖ్యాతిఁగాంచిన యోరుగల్లునగరముగాని కడప మండలము లోని యొంటిమెట్టకాదు. దేశచరిత్ర మెఱింగిన వా రెవ్వరును ఒంటిమెట్టను ఏకశిలానగర మని యొప్పుకోనరు. ఒంటిమెట్టకు నేకశిలానగర మని నామాంతర మున్నట్లు శాసనములుగాని గ్రంథములుగాని బోధింపవు. ఓరుగల్లునకు నేకశిలానగరమని నామాంతర మున్నట్లు శాసనములును గ్రంథములును వేయి నోళ్ళఁ జాటుచున్నవి. మఱియు మెట్ట యను పదమునకు శిల యను నర్థములేదు. కల్లను శబ్దమునకు శిల యను నర్థము గలదు. ఇంతియగాక సర్వజ్ఞుఁ డని యేసింగమనాయనికి బిరుదము గలదని చెప్పెదరో యాసింగమనాయఁడు గాని వాని సంతతివారు గాని కడపమండలమును బరిపాలించి యుండలేదు. కాఁబట్టి బమ్మెరపోతరాజునివాసస్థలము హైదరాబాదు రాజ్యములోని వరంగ లనియెడి యోరుగల్లుపట్టణము. ఈపురరాజమె యేకశిలానగర మనియు నంధ్రనగర మనియుఁ జరిత్రమునఁ గడుఁ బ్రఖ్యాతి వహించినదిగా నున్నది. దీనికి సమీపమునం దుండెడి బమ్మెర యను గ్రామనామమును బట్టియె యీతనికి బమ్మెర యనునది యింటి పేరుగా నేర్పడినది. ఈపోతనామాత్యుఁడు నియోగిబ్రాహ్మణుఁడు. కౌండిన్యగోత్రుఁడు. ఆఁ

స్తంబసూత్రుఁడు. తండ్రి పేరు కేసనమంత్రి. తల్లి పేరు లక్కాంబ. అన్న తిప్పరాజు. కవి తనవంశావళి యీక్రింది పద్యములోఁ జెప్పుకొనియెను.

"సీ. కౌండిన్యగోత్ర సంకలితుఁ డాపస్తంబ
సూత్రుండు పుణ్యుండు సుభగుఁడైన
భీమన మంత్రికిఁ బ్రియ పుత్త్రుఁ డన్నయ
కలకంఠి తద్భార్య గ రమాంబ
కమలాప్తు వరమునఁ గనియె సోమనమంత్రి
వల్లభ మల్లమవారి తనయుఁ
డెల్లన యతనికి నిల్లాలు మాచమ
వారి పుత్త్రుండు వంశ వర్ధనుండు
గీ. లలిత మూర్తి బహుకళావేది కేసన
దాన మాన నీతి ధనుఁడు ఘనుఁడు
తనకు లక్కమాంబ ధర్మగేహిని గాఁగ
మనియె శైవ శాస్త్రమతము గనియె."

ఇతఁడు శ్రీమద్భాగవతము నాంధ్రీకరించుటకుంగల కారణ మీక్రింది రీతిని దెలిపెను.

"మదీయ పూర్వజన్మ సంచిత తపఃఫలంబున శ్రీమన్నా రాయణ కథాప్రపంచ రచనా కుతూహలుండనై యొక్కరా కానిశా కాలంబున సోమోపరాగంబు రాక గని సజ్జనాను

మతంబున నభ్రంకష శుభ్రసముత్తుంగభంగ యగు గంగకుఁ జని గుహికులిడి వెడలి మహనీయ మంజులపులిన శోభితప్రదేశంబున మహేశ్వరధ్యానంబు సేయుచుఁ గించి దున్మీలితలోచనుండనై యున్నయెడ రామభద్రుండు తన నామాంకితముగా శ్రీమహాభాగవతంబు తెనుంగుసేయ నానతిచ్చి తిరోహితుండయ్యె." మఱియు,

"మ. ఒనరన్ నన్నయ తిక్కనాదికవులీయుర్విన్ బురాణావళుల్
తెనుఁగుల్ సేయుచు మత్పురాకృతశుభా ధిక్యంబుదానెట్టిదో
తెనుగుంజేయరు మున్ను భాగవతమున్ దీనిందెనిగించి నా
జననంబున్ సఫలంబు సేసెదఁ బునర్జన్మంబు లేకుండఁగన్."

అని గూడఁ జెప్పెను. ఇతఁ డాశ్వాసాంత గద్యములో "ఇది శ్రీపరమేశ్వర కరుణా కటాక్ష కవితా విచిత్ర కేసన మంత్రి పుత్ర సహజ పాండిత్య పోతనామాత్య ప్రణీతం" బని వ్రాసికొని యుండుటచేత నితఁడు గురుముఖమున విద్య నభ్యసింపలేదనియు స్వయంకృషి మూలముననే పాండిత్యమును సంపాదించె ననియు, ఈశ్వరకటాక్షముచేతనే కవితాసంపత్తి కలిగిన దనియు వేద్యము కాఁగలదు. ఇతఁడు నరకృతిచేయకుండుటయె గాక తన భాగవతమునందు సమకాలికులైన ప్రభువులపట్ల తూష్ణీంభావమును జూపుచు భక్తాగ్రేసరుఁడు

గావున మహాధైర్యముతో నరకృతి నిషేధించునట్టి యీక్రింది పద్యమును జెప్పి భాగవతమునఁ జొప్పించి యున్నాఁడు.

ఉ. ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి పురంబులు వాహనంబులున్
సొమ్ములుఁ గొన్ని పుచ్చుకొని సొక్కి శరీరము వాసి కాలుచే
సమ్మెట వ్రేటులం బడక సమ్మతి శ్రీహరి కిచ్చి చెప్పె నీ
బమ్మెర పోతరాజొకఁడు భాగవతంబు జగద్ధితంబుగన్."

మహనీయుఁడగు నిక్కవిశిఖామణి ధనికుఁడు గాక రాజుల నాశ్రయింపక కృషికర్మచేఁ గాలము గడపుచుండువాఁడఁట! ఇతనికి శ్రీనాథుఁడు బావమఱఁదియని చెప్పెదరుగాని యందులకుం దగిన సాక్ష్యమెద్దియు నాంధ్రసారస్వతమునఁ గానరాదు. ఒకనాఁడు బమ్మెరపోతన్నను జూడవచ్చి యాతఁడు పొలములో నరకగట్టి దున్నుచుండగాఁ జూచి "హాలికులు సుఖముగా నున్నారా" యని పరిహాసపూర్వకముగా కుశలప్రశ్నము చేయఁగా నతఁడు.

"ఉ. బాలరసాలసాల నవపల్లవ కోమల కావ్యకన్యకన్
కూళల కిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైన నేమి గహనాంతర సీమలఁ గందమూల గౌ

ద్దాలికులైననేమి నిజదారసుతోదర పోషణార్థమై *."

అని ప్రత్యుత్తరము చెప్పె నందురు. మఱియు శ్రీనాథుఁడు భాగవతమును కర్ణాటాధీశ్వరుని కంకితము చేసి ధనము సంపాదించి కుటుంబభరణము చేసికొనరాదా యీదారిద్ర్యముతో బాధపడనేలయని ప్రస్తావించి తన ప్రభువున కంకితము చేయునట్లొడఁబఱచుటకయి ప్రయత్నించుచున్నప్పుడు సరస్వతి యెదుట నిలిచి కన్నీరు పెట్టుకొనుచున్నట్లాతనికిఁ బొడఁగట్టఁగా పోతన

"ఉ. కాటుక కంటినీరు చనుకట్టుపయింబడ నేల యేడ్చెదో
కైటభదైత్యమర్దనుని గాదిలికోడల యోమదంబ యో
హాటకగర్భురాణి నిను నాకటికిం గొనిపోయి యల్లక
ర్ణాటకిరాట కీచకులకమ్మఁ ద్రిశుద్ధిగనమ్ము భారతీ!"

---

* ఈపద్యమే కొంచెము మార్పుతో మంచనకవి విరచితమైన కేయూరబాహు చరిత్రము నందిట్లున్నది.

ఉ. బాలరసాలసాల నవపల్లవకోమల కావ్యకన్యకన్
గూళలకిచ్చి యప్పడుపుకూడు భుజించుటకంటె సత్కవుల్
హాలికులైననేమి మఱియంతకు నాయతిలేనినాఁడు కా
ద్దాలికులైననేమి నిజదారసుతాద్యభిరక్షణార్థమై.

దీని కర్తృత్వమును బమ్మెరపోతరాజున కారోపించి పైకథకల్పించి యుందురు.

అని యామెనూఁతార్చెనని చెప్పుదురు. బమ్మెరపోతన భాగవతములోఁ జెప్పిన "ఇమ్మనుజేశ్వరాధములకిచ్చి" యను పద్యమును జూచి బమ్మెరపోతనామాత్యుని యాత్మగౌరవ బుద్ధిని మఱింత లోకమునకుఁ బ్రకటించుటకై యిటీవలవారిచే బైకథలు కల్పింపఁబడి యుండవచ్చును. పోతనకవీంద్రుని భక్తివిశేషములను దెలిపెడుకథలు గూడఁ బెక్కులు గల్పింపఁబడినవి. ఇంతియగాక యింతకన్నను వైపరీత్యముగలదు. పోతనకవి వ్యాసవిరచితభాగవతపురాణమును దెనిగించెనన్న వార్త మెతుకుసీమనుబరిపాలించు సర్వజ్ఞసింగమనాయఁడు విని యాతని తనయాస్థానమునకు రప్పించి గ్రంథమునుచదివి తనకాగ్రంథము నంకితము చేయవలసినదని యడిగెననియు, అతఁడు తనగ్రంథమును నరాంకితము చేయనని రాజుప్రార్థన మన్నింపక నిరాకరించెననియు, అందుపైనాతని కాగ్రహము వచ్చి యాతనిగ్రంథమును భూమిలోఁ బాతిపెట్టించెననియు, శ్రీరామమూర్తి సర్వజ్ఞసింగమనాయని భార్యయొక్క స్వప్నములో సాక్షాత్కరించి భర్తను వేడుకొని భాగవతపురాణము లోకములో వ్యాపింపఁజేయ నియ్యకొల్పుమని యామెతోఁ జెప్పి యదృశ్యుఁడై పోయెననియు, ఆమె తన స్వప్నవృత్తాంతమును భర్తకుఁజెప్పి పాతిపెట్టించిన పుస్తకమును పయికి తీయింపఁగా నందలి తాళపత్రములు పురుగులు

తిని బహుభాగములు శిథిలములైపోయి యుండెననియు, పిమ్మ
ట సింగనాదికవులు చెడిపోయిన భాగములనెల్ల బూరిం
రనియు నొకకథ చెప్పుచున్నారు. కూచిమంచి తిమ్మకః
తన లక్షణసారసంగ్రహమునందుఁ జెప్పిన యీక్రిందిపద్యము
పై కథ కుపబలముగా నున్నది.

,, సీ. ఘనుఁడు పోతనమంత్రి మునుభాగవతము ర
చించి చక్రికి సమర్పించు నెడల
సర్వజ్ఞసింగయక్ష్మావరుం డది తన
కిమ్మని వేడగా నీయకున్న
నలిగి యాపుస్తకం బవనిఁ బాతించినఁ
జివికి యందొకకొంత శిథిల మయ్యెఁ
గ్రమ్మఱ నది వెలిగందల నారప
రాజును మఱిబొప్పరాజు గంగ

గీ. రాజు మొదలగు కవిశరుల్ తేజ మెసఁగఁ
జెప్పి రాగ్రంథములయందె తప్పు లొదవెఁ
గాని పోతనకవీంద్రుని కవితయందు
లక్షణం బెందుఁ దప్పునా దక్షహరణ. ''

మఱియొక సందర్భమునఁ దిమ్మకవి పోతన నభివర్ణించుచు
నతఁడు మత్తక్షితీశాధమస్తోత్రవిముఖుండని యీక్రింది పద్య

ములోఁ జెప్పి తన లక్షణసారసంగ్రహంబున నుదాహరించి యున్నాఁడు.

„ సీ. అఖిలవేదాంత విద్యారహస్యవిదుండు
సహజపాండిత్య విశారదుండు
మత్తక్షితీశాధమస్తోత్ర విముఖుండు
శంభుపదాబ్జ పూజా రతుండు
పటుతర కవితావిభాసిత ప్రముఖుండు
సకలాంధ్రలక్షణ చక్రవర్తి
రఘుకులేశనిదేశరచిత మహాభాగ
వతపురాణుఁడు పుణ్యవర్ధనుండు
గీ. బుధజనహితుండు బమ్మెరపోతసుకవి
యెన్న రేఫఱకారంబు లెఱుఁగఁ డనుచు
నజ్ఞులొక కొందఱాడుదు రా మహాత్ము
కవితకెందును లోపంబు కలుగ దభవ. ”

ఇట్టి శీలముచే మహాప్రఖ్యాతిగాంచిన బమ్మెరపోతన సర్వజ్ఞసింగమనాయని యాస్థానకవి యని చెప్పుటకంటె సాహసకృత్యము మఱియొకటి యుండఁబోదు. ఇంతటి యాత్మగౌరవ సంపత్తిగల యీకవిచంద్రుఁడు సింగమనాయఁడుంచుకొన్న వేశ్యనుగూర్చి దండకము చెప్పెననిగాని చెప్పునని గాని యూహించుటకే సాధ్యపడదు. ఇతనికిని సింగమనా

యనికిని సరిపడదని యంకితమును గూర్చినకథయె వేనోళ్లఁ జాటుచున్నది. ఒకవేళ భాగవతము రచించుటకు ముందే భోగినీదండకమును రచించియుండునని యూహింతమన్నను భాగవతములోని రాజదూషణ మీయూహనుగూడ బాధింపక మానదు. అదివఱకు సింగమనాయని యాస్థానకవిగనుండి భోగినీదండకమును జెప్పినకవి యొక్కమాఱుగా రాజదూషణమునకుఁ గడంగుట తటస్థింపదు. ఇష్టములేనియెడల నరాంకితము చేయకుండునేగాని యాతనిరాజ్యమునందుండి యారీతిగా రాజదూషణముఁ జేసి బ్రదుకఁజాలునా ? దీనివిషయమై కవి జీవితములందిట్లున్నది.

„ అటువలెనే కూచిమంచి తిమ్మకవి చెప్పిన పద్యమును భాగవతములో పోతరాజు చెప్పిన „ ఇమ్మనుజేశ్వరాధముల కిచ్చి " అను పద్యమును పోతరాజు సింగమనీని కాలీనుఁడని తెల్పినను సింగమనీనిపైఁ గృతియిచ్చి భోగినీదండకమును జెప్పెననుమాటను పూర్వపక్షము సేయుచున్నది. దీనికిఁ దోడుగా భోగినీదండకము చివరనున్న యీక్రిందిపద్యము మఱియొక పెద్దయనుమానమును కల్గించుచున్నది. ఆపద్యమెట్లన్నను

„ఉ. పండితకీర్తనీయుఁడగు బమ్మెరపోతన యాసుధాంశుమా
ర్తాండకులాచలాంబు నిధి తారకమై విలసిల్ల భోగినీ
దండకమున్ రచించె బహుదానవిహార్తకు రావు సింగభూ

మండలభర్తకున్ విమత మానవ నాథమదాపహర్తకున్."

ఇట్లున్న పద్యమున పండితకీర్తనీయుఁడనని బమ్మెరపోతన పై దండకమువంటి చిన్నవ్రాఁతకుఁగా నింత బిరుదాంకితము వేసికొని యింతగా ఆత్మస్తుతి చేసికొనునా? యనియు నిదియొక గొప్పయంశమని దీనికిఁ గాను సర్వజ్ఞ సింగమనీనివంటి మహా పండితుఁడు కృతిపతిగానుండఁ గోరి పోతరాజువంటి వైరాగ్య సంపన్నుని అట్టి కవిత్వము జెప్పుట కుత్సహింపఁ జేయుట కల్గునా యనియుఁ దోఁచు చున్నది.

* * * * * * *

కూచిమంచితిమ్మకవిసార్వభౌముఁడుతనలక్షణగ్రంథములో భాగవతగ్రంథము రచించిన బమ్మెరపోతరాజునకును పై సింగమనీనికిని బలద్విరోధంబు కలదనియు నాకారణమున నాపోతరాజకృతభాగవతము రూపుమాపఁ దలంచి దానిని భూమిలో బాతించెననియుఁ గావున నందులోని యనేకభాగములు ఖిలములైనవనియు నిట్టులేమఱికొన్ని వృత్తాంతంబులు చేర్చి యొక పద్యముచెప్పె. దానింబట్టిచూడ నీపోతరాజునకును సింగమనీనికింగల విహితవిశ్వాసములు బోధయగును. ఆపద్యానుసారముగాఁ జూచిన నాయిర్వురకును విరోధమున్నట్లు కాన్పించును గాని విహితమున్నట్లు కాన్పించదు. * * * ఈపద్యమునంగల లక్షణము(దీనిపేరే లక్షణసారసంగ్రహము)తిమ్మ

కవివలన శా. స. ౧౬౬౨ అనఁగా క్రీ. శ. ౧౭౪౦ నకు స
యగు రౌద్రి సంవత్సరమునరచింపఁబడియె. దీనికి వ్యతిరే
ముగా ఆ. ౧౮౬౦ సంవత్సరప్రాంతమున ఆంధ్రభాగవతమును
ముద్రించిన పండితులు పోతరాజు జన్మకర్మములు దెల్పునను
వచనగ్రంథమునుండి తాము పరిశోధించి వ్రాసితిమని కొన్ని
క్రొత్తమాటలు వ్రాసిరి. దానివివరమీావలకే చేసియున్నాను.
పైరెండు కథలలోఁ దిమ్మకవి వ్రాసినదే మధ్యాంధ్రమండ
లమునాఁ బరఁగు వేంగీదేశములో వ్యాప్తమైయున్నది. తిమ్మ
కవినాటికే పైసర్వజ్ఞసింగమనీనికథ ప్రాచీనము. అట్లుండఁగా
నాంధ్రభాగవతము ముద్రించినవారు మఱి నూటయిరువ
సంవత్సరముల యనంతరకాలములోఁ దామెద్దిమో పోతరాజు
జన్మకర్మములఁ దెలుపనున్న వచనగ్రంథముం దెచ్చి తామ
పరిశీలించితిమని మూలగ్రంథమును బ్రకటింపకయే వ్రాసి
మాటలను నమ్మఁట యుక్తియుక్తముగాఁ గాన్పించదు. కావు
సింగమనీనికిని పోతరాజునకును విహితవిశ్వాసములు లేవని య
నిశ్చయింపవలసి యున్నది. ''

మొన్న మొన్నను నూతనముగా వెలువడిన వెలుగోటివా
వంశచరిత్రమునందక్క పూర్వగ్రంథములన్నిటియందును రస
ర్ణవసుధాకరాద్యనేక సంస్కృతగ్రంథకర్తయు, సర్వజ్ఞబిరు
దాంకితుఁడునగు సింగమనీఁ డొక్కఁడేయని ఘంటాపథంబు

ఘోషించుచుండ రసార్ణవసుధాకరము బయల్పడి పండితుఁడు రసికుఁడునని ప్రఖ్యాతిఁగాంచిన సింగమనాయఁడితఁడుగాక యేఁడవతరము సింగమనాయఁడని తేలినది. ఈకథలన్నియు నాసింగమనాయనికి ముడిపెట్టుదమన్నను నడుకవు. కాఁబట్టి యీపదవతరము వానిని సర్వజ్ఞునిగా నెన్నుకొనక తప్పదు. ఇతని తాత సింగమనాయఁడని భోగినీదండకమున నుండ నాతని నే సింగమనాయనితోను ముడిపెట్టుటకుఁ దోఁచక వెలుగోటివారి వంశచరిత్రకారులు రసార్ణవసుధాకర గ్రంథకర్త యగు సింగమనాయని పుత్త్రులలో నొకఁడగు వేదగిరిస్వామితో ముడిపెట్టిరి. మాధవనాయని పుత్త్రుఁడగు దేవగిరీంద్రుని వేదగిరీంద్రుని జేసిరి. వేదగిరిస్వామి యనునది సింగమనాయనికి నామాంతరమగునెడల మాధవనాయని పుత్త్రుఁడగు దేవగిరీంద్రుఁడను వేదగిరిస్వామినిమాత్రము సింగమనాయఁడని యేల యనరాదు? అప్పుడు 'మాధవాత్మజుఁ' డని దేశికులవారు చెప్పినదానికి ప్రాధాన్యము కలుగునుగదా!

కాఁబట్టి పదవతరము సింగమనాయనికి సర్వజ్ఞబిరుదముండిన నుండవచ్చునుగాని యందునకుఁ బ్రమాణముగా భోగినీదండకమును జూపుటమాత్రము సాహసకృత్యమని నా యభిప్రాయము. అంతకన్న మఱియేయాధారమును గన్పట్టదు. శ్రీనాథుఁడు రావు సింగమహీపాలునభకుఁ బోయి

యుండినది వాస్తవమగునేని యతఁడు తప్పక యీపదవతరము సింగమనాయఁడే కావలయును. శ్రీనాథుఁడుగాని బమ్మెర పోతనగాని సర్వజ్ఞసింగమనాయని యాస్థానకవులు గారు. ఇంతకును సర్వజ్ఞసింగభూపతి యెవ్వరో యేగ్రంథకర్తకును సరిగాఁ దెలిసియుండలేదు. ఈసర్వజ్ఞసింగభూపతికథ నే నిట్లు పరిష్కరించి పర్యవసానము నీక్రిందిరీతిని దెలుపుచున్నాఁడను.

మొట్టమొదట దేశికులవారికాలమున వైష్ణవమతాభినివేశపరవశుఁడైన యొక సింగమనాయఁడు గలఁడని మన మెఱుంగుదుము. అతనినే మాధవాత్మజుఁడని దేశికులవారు వక్కాణించిరి. తరువాతివా రాతనినే సర్వజ్ఞుఁడని వచించిరి. తరువాతివా రట్టి ప్రఖ్యాతి విని వానిపేరిట రసార్ణవసుధాకరాదిగ్రంథములను రచించిరి. శ్రీనాథుఁడు, బమ్మెర పోతన మొదలగువారు సమకాలికులుగావున నిటీవలివారు పెక్కుకథలను గల్పించి వాని నన్నిటి నొక్క సింగమనాయనికే యారోపించి రసాభాసము గావించిరి. అవి పరస్పరము పొందికలేకయున్నవి. భోగినీదండకముకవనము భాగవతకవనమును బోలియున్నను పోతనకవికృతము గాదని చెప్పవచ్చును. మంచికవియగువాఁ డారీతిగా చిన్నదండకములోఁ బోతనకవనమువలెఁ గవనము చెప్పుట యొకవింత కాదు. భాగవతములో శివదూషణముఁ జేసినందులకుఁ బాపపరిహారార్థముగా వీర

భద్రవిజయమును పోతరాజు రచించెనని యొక గ్రంథమున గల్పింపఁజాలినవా రుండఁగా నొక చిన్నదండకమును శబ్దా ద్యలంకారములతోఁ గూర్పఁజాలినవార లుండకుందురా? పోతనమహాకవినిగూర్చి విశేషాంశములు కవి జీవితాదిగ్రంథ ములయందును భాగవతపీఠికయందును వ్రాయఁబడియున్నవి గావున గ్రంథవిస్తరభీతిచేత నిట విరమించుచున్నాను.

## లింగమనాయనిఘాటి.

ఇతఁడు క్రీ. శ. ౧౪౭౦ ప్రాంతములనున్న సింగన మాధవేంద్రునకు మునిమనుమఁడు. పెదవేదగిరినాయనికి మనుమఁడు. ఫిరోజ్‌షాహాను నోడించిన రామచంద్రనాయని తమ్ముఁడగు కుమారమాదానాయనికి మూఁడవకుమారుఁడు. ఇతఁడు గర్వసంరంభుఁడైన వీరాగ్రేసరుఁడు. అల్లాడ వేమారెడ్డికి నాతని తమ్ముఁడైన వీరభద్రారెడ్డికి బలవద్విరోధిగా నుండెను. ఇతని యన్నయగు కుమార వేదగిరినాయఁ డన వేమారెడ్డి తమ్ముఁడైన మాచారెడ్డిని జంపి యతని యాకృతి తన తమ్మపడిగములోఁ జెక్కించెననియు, ఈసంగతి మాచారెడ్డి యన్న యనవేమారెడ్డి విని వేదగిరినాయనిమీఁద దండెత్తివచ్చి యుద్ధముఁ జేసి చంపి యతని యాకృతిని దన తమ్మపడిగలోఁ బొదిగించెననియు, ఈకుమార వేదగిరినాయని తమ్ముఁడగు నీలింగమనాయఁడు విని పరిభవమును భరింపఁ

జాలక చిన్నవయస్సున నుండినను బంధువుల నందఱను గూ ర్చుకొని వానిమీఁద దండెత్తిపోయి యుద్ధముఁజేసి యనవేమారెడ్డిని జంపి యతని ప్రతిమను దన తమ్మపడిగలోఁ బొదిగించి సింహతలాటబిరుదు వహించెననియుఁ వెలుగోటివారి వంశచరిత్రమునందు వ్రాయఁబడినదిగాని యిది యెంతమాత్రమును విశ్వాసపాత్రమైన సత్యముగాదు.

ఏమన; అనవేమారెడ్డి క్రీ.శ. ౧౩౭౭ వఱకును, తరువాత కుమారగిరిరెడ్డి క్రీ. శ. ౧౩౯౯ వఱకును అటుపిమ్మట కోమటి వేమారెడ్డి క్రీ. శ. ౧౪౨౦ వఱకును రాజ్యపరిపాలనము చేసినట్లు శాసనము లుద్ఘోషించుచున్నవి. ఇట్లుండఁగా సింగనమాధవేంద్రునకు సమకాలికుఁడగు ననవేమారెడ్డిని సింగనమాధవేంద్రుని మునిమనుమఁడగు లింగమనాయఁడు సంహరించెనుట యసంభవముగదా. ఇంతియెగాదు. అనవేమారెడ్డిని అనపోతసింగమనాయని పుత్త్రుఁడైన యనపోతనాయఁడు ‘‘పట్టుతలాటాంకబల్లరగండఁడై, యనవేమరెడ్డిని నాజిదునిమె’’ అని సంహరించినట్లు చెప్పియుండియు లింగమనాయఁడు సంహరించెనని స్వవచనవ్యాఘాతముగ వ్రాయుట వింతగా నున్నది. యథార్థము గ్రహింపవలెనన్న లింగమనాయఁ డనవేమారెడ్డికాలమున లేఁడని చెప్పకతప్పదు. కోమటివేమారెడ్డినే పైగ్రంథకర్త లనవేమారెడ్డియని పేర్కొని

యుండవచ్చునని యూహింతమన్నను కోమటివేమారెడ్డి మృతినొందినకాలమునకు లింగమనాయఁడు పుట్టియుండునో లేదో సంశయింపవలసియుండును. లింగమనాయనితండ్రియె యిరువదియైదేండ్లు దాటినవాఁడుగ నుండఁజాలఁడు. కాఁబట్టి వెలుగోటివారి వంశచరిత్రములో చెప్పినట్లు అనవేమారెడ్డిని గాని కోమటివేమారెడ్డినిగాని లింగమనాయఁడు సంహరించె ననుట కల్లగాని సత్యముగాదు. ఇతఁడు క్రీ. శ. ౧౪౪౦-౫౦ సంవత్సరములకు నడుమఁ బ్రఖ్యాతిగాంచినవాఁ డనుటకు సందియము లేదు. ఇతఁడు రెడ్డిరాజ్యమునకు గర్భశత్రువుగ నుండెననుటయు విశ్వాసపాత్రము. బహుపరాక్రమవంతుఁ డనుటకు సందియములేదు. కాని యితఁడు పాదముఁబెట్టిన చోటెల్ల భస్మీపటలమగుటయెగాని మఱియొండులేదు. ఇతఁడు "ఏకధాటీసమర్థుఁడు, కోటలగొంగ, మూరురాయరగండ, చతురుపాయదక్ష, రిపుప్రళయాంతకోపేంద్ర, అష్టదిగ్రాయ మనోభయంకర, అవఘళరాయమానమర్దన, మేదినిరాయ దుష్టగజాంకుశ, రాజవేశ్యాభుజంగ" ఇత్యాదిబిరుదములను వహించెనఁట! ఇతనికాలి పసిండియందెచప్పుడు వినఁబడి నప్పుడు అల్లయవేమారెడ్డికిని ఆతని తమ్ముఁడు వీరభద్రారెడ్డి కిని గుండెలు జల్లుమనుచుండునఁట! స్తుతిపాఠములం జేయుటయఁ దాఱితేఱిన యొకబట్టుకవిచేఁ జెప్పఁబడిన యీక్రింది

పద్యము చదువుటకు వినోదముగామాత్ర ముండకపో దని యుదాహరించుచున్నాఁడను.

"ఉ. బల్లరగండలింగవిభుపాదమునందుఁ బసిండియందె డా
గల్లురు గల్లుగల్లురని గల్లనిమ్రోయఁగ భీతి గుండియల్
జల్లురు జల్లుజల్లురని జల్లని నల్లలనాడుచుందు రా
యల్లయరెడ్డి వేమనృపుఁ డాతనితమ్ముఁడు వీరభద్రుఁడున్"

మఱియు మఱొకబట్టుకవి యాతని పరాక్రమాదుల నభివర్ణించుచు నీక్రింది సీసమాలికను జెప్పినట్లు రావువంశీయుల చరిత్రమున నుదాహరింపఁబడినది

"సీ. నాఁడెంబుగా నబ్బినాటిరాజ్యంబెల్ల
నద్భుతంబుగఁ జూరలాడినాఁడు
కృష్ణవేణీజలక్రీడావినోదుఁడై
యఖిలదారుణులసొం పడఁచినాఁడు
జగనొబ్బగండఁడై జగతిరేచెర్లను
తురకదళముల తలల్ దుంచినాఁడు
చటులోగ్రగతి రాయశరభమై యవలీలఁ
దిరుగ సింహాద్రి సాధించినాఁడు
పరదళంబులు పటాపంచలై పారంగ
నెన్నగొరవకొండ నెక్కినాఁడు
కేళాదిరాయఁడై కెరళి గోరంట్లను

చారభానుని వెన్ను చఱచినాఁడు
నల్లకొండలను సన్నాహంబుగా నెక్కి
కపటాహితుల నేలఁ గలిపినాఁడు
గంగసాక్షిగ మీరి కదిసి రాజమహేంద్ర
వరము చూరలు గొనివచ్చినాఁడు
సురథానుకొలువులోఁ బొరసెను బిరుదుకై
ముద్దుడక్కని వెన్ను మొత్తినాఁడు
తేజంబుగాఁ బ్రౌఢ దేవరాయలచేత
సరుదుగా బిరుదందె యందినాఁడు
యువతనూజుని భంగి యినుకుర్తికోటలో
లీల శత్రుల విభాళించినాఁడు
ధీరుఁడై యల్లాడ ధీసురథానుచే
యమ్మెగా భువనాద్రి యెక్కినాఁడు
గెంటించి బలిమి శిఖేంద్రఖానునిఁ దోలి
యెలమి రాజ్యంబుఁ దా నేలినాఁడు
యలవంక బలువంకలార్చి తాకినబట్టి
బలిదఖానుని భంగపఱచినాఁడు
రణకేళి యెఱుకవరప్రాంతమున గొట్టి
మన్నెజంగుల యేపు మాపినాఁడు
మణుగూరికోటలో మండువమన్నెఁడు

ప్రతిఘటించిన తూలబఱచినాఁడు
శరణుజొచ్చిననొచ్చి సరమఖానునిబట్టి
గౌతమీతటమునఁ గాఁచినాఁడు
పోరిలోననగన్న భూపాలుచెఱఁబెట్టి
ధృతి కొత్తకొండ సాధించినాఁడు
అదిరివిధమరాజు కదనోర్విగర్వింప
నడఁచి యింద్రునివీటి కనిపినాఁడు
సింహవిక్రమపురి సింగమపలెకాని
గోపాలకృష్ణుని గొట్టినాఁడు
మెండుగవీకమై కొండపల్మగ్నిలు
పూనివచ్చిన నూనపుచ్చినాఁడు
యెదిరించువేలూర యేలూరుతిప్పని
మొదలింటపటుగతి మోదినాఁడు
కుంట్లూరికోటపై గుంద్రౌతురాజుల
మొత్తమైయెదిరిన మొత్తినాఁడు
ఖాణాలకోటపై ప్రకటించి యుగ్రత
కాలాగ్నిరుద్రుఁడై కాల్చినాఁడు
సంగరస్థలమున సింగళదేవుని
శిరము ద్రుంచెటికీర్తిఁబరఁగినాఁడు
మలకపోలార్జును మదమెల్ల గక్కించి

యన్నయాదవకొండఁ గొన్నవాఁడు
గర్వించితలపడ్డ గండరిగండని
మెట్టగదియతలగొట్టినాఁడు
కుటిలశాత్రవకోటి కోవిలకొండ తా
మగతనంబునఁ బిల్కుమార్చినాఁడు
ఉచ్చిళ్ళకోటకై యుద్రేకమునఁబోయి
చెంగేటినీరుగాఁ జేసినాఁడు
ఉర్విలోఁబొగడొందు నుప్పారిచెంగట
చెనకినరిపుకోటి చెండినాఁడు
శాతశిఖావృత్తి జగమెల్ల నెఱుఁగ శ్రీ
శైలపట్టణముఁ దా నేలినాఁడు
బుక్కరాజునుబట్టి పొడిచేటికోటలో
గజపతిమెచ్చఁగఁ గాఁచినాఁడు
దొరయుసల్కయవారి తోలితొప్పరలాడి
బాగవాడొద్దను బాపినాఁడు
చాటిచెన్నయగారిఁ జదిపిచట్టలుచీరి
కొండమల్లయ గారిఁ గొట్టినాఁడు
గొరంట్లతిప్పని కొట్టికోటయునెక్కి
వేకరికులమెల్ల వెదకినాఁడు
చిటివల్లభయ్యను చెట్లనుబడఁద్రోలి

పాణముఁరాజును బఱపినాఁడు
గంగయభీమని రాజసంబునఁదోలి
సాల్వతిప్పని నేలచదిపినాఁడు
ముచ్చుకంపయకుర్కి మునువుగాఁ బడమోది
ఫూలసంగని పౌంజుఁ బొడిచినాఁడు
రాజులెప్పుడు మెచ్చ రామరాజ్యంబుగా
సింగిరాజాచలం బేలినాఁడు
దండిమై ముప్పదిరెండుదుర్గంబులు
నేఁ ధాటిగెలిచి నెక్కినాఁడు
వీరభద్రుని దొడ్డవిభు వేమనృపతులు
రట్టుకై కాలండ బెట్టినాఁడు
ఘనమూరురాయర గండబిరుదంబు
పనుపొంద కాకాల బెట్టినాఁడు

గీ. రాజమాత్రుండె కృష్ణరాయమహిప
చారుతరమూర్తి రాజులచక్రవర్తి
గాయగోవాళుఁ డన్నెపుగండఁడనఁగ
లీలనొప్పారె మాదయలింగవిభుఁడు."

ఈలింగమనాయఁడు ప్రౌఢదేవరాయనికిఁ గప్పము గట్టు సామంతుఁడుగను సేనాపతిగనుండి యనేక దుర్గములను

సాధించి యతనిచేత గండపెండేరమును బిరుదందెను పొందిన వాఁడు.

## భైరవకవి.

(౧౪౩౦ మొదలు ౧౪౬౦ వఱకు)

ఇతఁడు గారుడపురాణాంతర్గతమైన శ్రీరంగమహాత్మ్యమును దెనిఁగించిన సుప్రసిద్ధ మహాకవి. ఇతఁడు తన శ్రీరంగమహాత్మ్యమున—

"మ. కృతవిద్యాఖురళీపరిశ్రమ కలాకేళీ విలాసుం జన
స్తుతచారిత్రుని గౌతమాన్వయపవిత్రుం గౌరనామాత్య స
త్సుతుఁ గళ్యాణకవిత్వలక్షణసమర్థున్ సూక్తిముక్తాఫలా
తత కాంతిస్ఫుట చంద్రికోల్లసితవిద్వత్కైరవున్ భైరవున్."

అని తాను గౌతమగోత్రుఁడైన గౌరనామాత్యసత్సుతుఁడనని చెప్పుకొనియెను. తనకు శ్రీశైల మల్లికార్జునస్వామి దేవి యగు భ్రమరాంబికకృపచేత సారస్వతసిద్ధి కలిగినట్లు తుది గద్యమున "శ్రీమద్భ్రమరాంబా వరప్రసాద లబ్ధసారస్వత విలాస గౌరవ గౌరనామాత్యపుత్త్ర" అని వ్రాసికొనుటచేఁ దెలియుచున్నది. మఱియు రత్నశాస్త్ర మను చిన్నకృతిలోఁ గూడ—

"భ్రమరాంబికా మహావర
సముదిత నిరవద్యహృద్య సాహిత్యకళా

క్రమ విమల ప్రతిభా సం
క్రమణుఁడ మతిశాలినైన గౌరనసుతుఁడన్."

అని[...]

కవిరాజ గజాంకుశ మను గ్రంథమున:—

" శ్రీమత్పరమ శివానన
తామరస వికాసలీలఁ దనరిన భ్రమరాం
బా మధుమత్త భ్రమరిక
నామానససరసిరుహమునన్ వసియించున్."

అను పద్యమును జెప్పి యాలక్షణగ్రంథమును ప్రారం[-]భించెను. కాఁబట్టి ఈ భైరవ మహాకవి హరిశ్చంద్రకథయు నవనాథచరిత్రయు, నవగ్రహస్తుతియుఁ రచించిన గౌరనమహా కవి పుత్త్రుఁడని మనము నిశ్చయింపవచ్చును. గౌరనమహా కవి క్రీ. శ. ౧౪౨౭ సంవత్సరము వఱకు నుండెను గావు[న] భైరవకవి ౧౪౩౦-౧౫౫౦ సంవత్సరములనడుమ నుండె నను [...]స్పష్టము. శ్రీరంగమహత్త్వముయొక్క పీఠికలో శ్రీమానవ[...] రామకృష్ణకవిగారు గౌరన క్రీ. శ. ౧౫౦౦ లో నుండెను [...]వున నితఁడు ౧౫౩౦ ప్రాంతములోనుండ వచ్చునని చెప్పు[...] సిద్ధాంతము కేవలము పొరబాటు.

సింగనమాధవేంద్రుని కాలమున గౌరన యున్నట్లు లక్ష[-]దీపికవలనఁ దెలియుచున్నది గావున నొక సింగనమాధ[...]

ద్రుఁడు క్రీ. శ. ౧౩౮౦ వఱకును, మఱియొక సింగనమాధ వేంద్రుఁడు ౧౪౨౫ వఱకును బరిపాలనము చేసినవారు గావున వీరిలో నెవరి కాలమున గౌరనమహాకవి జీవించి యున్నను, గౌరనామాత్యుని పుత్త్రుఁడగు భైరవమహాకవి ౧౪౩౦-౧౪౫౦ సంవత్సరముల నడుమ నుండె ననుట సత్యమునకు దూరము కాదు. రామకృష్ణకవిగారికి భ్రమను గలుగఁజేసిన చాటు శ్లోకము రావుమాధవరావు భార్య యగు నాగాంబిక శాసనము లోని దని తెలిసికొనుటతోనే వారి పొరబాటు వెల్లడి యగు చున్నదని యిది వఱకె తెలిపి యున్నాఁడను. మల్లారెడ్డి శివ ధర్మోత్తర ఖండమున:—

„సీ. మానిత వరధరామరకులతిలకంబు
గౌతమ గోత్రాబ్ధి కల్పశాఖి
మల్లికార్జున పండితోల్లసద్వంశుండు
గౌరనారాధ్య శేఖరసుతుండు
శ్రీమల్లమాగర్భసింధుశీతకరుండు
గంగమాంబా మనః కంజభాను
సకలాగమజ్ఞానసార ధౌరేయుండు
పరవాది దుర్మత భంజనుండు
గీ. చలఁగి గురుదక్షిణామూర్తి సద్గురులను
గౌరనాహ్వాయు దేశికుఁ గన్న తండ్రి

ప్రవిమలాన్నతకులోద్భవారాధ్యుఁ బుణ్యు
రణ్యకరసాధ్యు లింగనారాధ్యుఁ దలఁతు.”

అను పద్యములోఁ జెప్పిన మల్లికార్జున పండితారాధ్య వంశములోనివాఁ డగు గౌరనారాధ్యుఁడు మఱియొకఁ డని నాయభిప్రాయము. గౌరనమహాకవిగాని భైరవమహాకవిగాఁ దాము మల్లికార్జున పండితారాధ్యుల వంశము లోని వా రయిన యెడల నట్లు చెప్పుకొని యుండరా? ఏగ్రంథమునం దును వా రట్లు చెప్పుకొని యున్నట్లు గన్పట్టదు. గౌరనామాత్య విరచితమైన లక్షణదీపికలో నుదాహరింపఁబడిన కవి గజాంకుశము భైరవకవి ప్రణీతము కాదని నాయభిప్రాయము. శ్రీరంగమహాత్మ్య గ్రంథసంపాదకు లిమ్మహాకవి కవిత్వమును గూర్చి యీక్రిందివిధమున వ్రాసి యున్నారు—

“ఇతని శ్రీరంగమహాత్మ్యము లాక్షణికులందఱుం జదివియున్నట్లు దాహృతపద్యములే ఘోషించుచున్నవి. ఈకృతి మనోహరమై శైలీపాటవముగలదై “దుష్కవిఘోరపిశాచముల” నదల్చునట్లున్నది. భైరవుని పదబంధము ప్రౌఢమై యొక్కొక యెడ శ్రీనాథపెద్దనలఁ దలఁపించుచున్నది. రెండవ యాశ్వాసములోని ఋతువర్ణనమును నాల్గవ దైదవయాశ్వాసములం బురవర్ణనమును గవిప్రతిభారచితములు కాని మూలమునం గానరావు. ఉభయభాషాపాండిత్యము చూపుచున్న యాపట్లు

స్వరచితార్థసంపత్తినై మెఱయుచున్నవి. దీనిలోని పద్యములు క్రీ. శ. ౧౬౦౦ లో నుండిన జగన్నాథకవిచే రత్నాకరము నను, ప్రబంధమణిభూషణమునను దత్తత్కథాభాగములకు ననుకూలముగా నున్నవి గ్రహింపఁబడినవి. అనేక దివ్యక్షేత్ర ములలో శ్రీరంగము చాల ముఖ్యమైనదైనందున నాఙ్గురు కవులు దీనిం వెనిఁగించిరి. శ్రీనాథుని కాశీఖండ, భీమఖండము లకుఁ బిదప క్షేత్రమహాత్త్వముల నింత ప్రౌఢముగాఁ దెలిఁ గించిన కవి యన్యుఁడెవ్వఁడుఁ గానరాఁడు. * * * * * * * భైరవుఁడు వేదాంతశాస్త్రమునఁ జక్కఁగాఁ బరిశ్రమించినట్లు తద్గ్రంథపఠనమువలనఁ దెలియుచున్నది గాని కృతిపతియగు రాఘవమంత్రి వైష్ణవుఁడో లేక మాధ్వుఁడో కావున నతఁడు విష్ణుభక్తాగ్రేసరులు క్షేత్రరాజమగు శ్రీరంగ మును హృదయసన్నిధానమున సదా కొలుచుచుండుటకై భైరవునిచే దీనిఁ దెనిగింపఁజేసెను. భైరవుఁడు శైవుఁడు. అ యినను దీనిలో శివపక్షపాతమగు నంశము లేవియు లేవు. భైరవుని యనర్గళకవితాధారయు, రసభావగతివిశేషములు శ్లాఘ్యతరములు.''

## పద్మనాయక సామ్రాజ్యావసానదశ.

కాకతీయసామ్రాజ్య మస్తమించిన వెనుక నోరుగల్లు ప్రాంతదేశమును పద్మనాయకులు నూఱేండ్లకాలము స్వతం

త్రముగఁ బరిపాలనముచేసిరి. పిమ్మట గజపతులీరాజ్యమును జయించి స్వల్పకాలము పరిపాలించినవెనుక తురుష్కులీ గజపతులను జయించి రాజ్యమును స్వాధీనముఁజేసికొని పరిపాలించుచున్నారు. ఇప్పటికి నీయాంధ్రదేశభాగము మహమ్మదీయుల పరిపాలనముక్రిందనే యున్నది. పద్మనాయకుల రాజ్యపరిపాలనా పద్ధతులు మొదలగునవెట్లుండెనో తెలిసికొనుటకు సాధనసంపత్తి గానరాదు. అట్టి సాధనసంపత్తి బయల్పడువఱకు నింతమాత్రముతోనే తృప్తినొంది మిన్నకుండవలసినవారమగుచున్నారము. భావిపరిశోధకులు పద్మనాయకుల రాజ్యపరిపాలనా చరిత్రమును సవిస్తరముగాఁ దెలుపఁగలరను విశ్వాసముతోఁ బ్రస్తుతము విరమించుచున్నాను.

---

## రెడ్లచరిత్రము.

### నాలుగవ ప్రకరణము.

---

వర్ణాశ్రమ ధర్మపద్ధతుల ననుసరించి వర్తమానకాలంబున నాంధ్రదేశమునందున్న బలిజ, కమ్మ, వెలమ, రెడ్డి తెలఁగా తెగలవారిలో నుత్తమస్థితియందున్నవారలను క్షత్రియులుగను వైశ్యులుగను పరిగణింపవలసి యున్నను నాలు

గవర్ణమువారినిగా వ్యవహరించుచున్నారనుట సుప్రసిద్ధము. శాస్త్రములప్రకారము వీరిని శూద్రులనరాదు. ఈ తెగలలోఁ బెక్కు శాఖాభేదములు గలవనియు మన మెఱుంగుదుము. ఆంధ్రదేశములోఁ గొన్ని ప్రదేశములలో రెడ్లను, మఱికొన్నిప్రదేశములలో తెలగాలను గాపులనియుఁ గూడ వ్యవహరించుచున్నారు. కొందఱకుమాత్రమె యీనామము వర్తింపవలసియున్నను అనేకు లీనామములచేతనే వ్యవహరింపఁబడుచుండుటచేత వీరి సాంఘికతత్త్వమునుగూర్చి మిక్కిలి లోతుగఁ బోయి చర్చించుట కిది యదనుగాదు. కమ్మవారును, వెలమవారును వేర్వేఱుకాలములయందు వేఱుపడి ప్రత్యేకశాఖలవారుగఁ బరిగణింపఁబడుచు వచ్చుటచేతను, తెలుఁగుదేశములో నొక భాగముననున్న యుత్తమబలిజశాఖలవారికే తెలఁగాలను నామము వ్యవహరింపఁబడుచుండుటచేతను, నాల్గవవర్ణమువారుగా వ్యవహరింపఁబడుచు శాఖాంతరభేదములచే నొప్పుచున్నవారిని బలిజలనియు, రెడ్లనియు రెండు ప్రధానశాఖలుమాత్రమె గలవని మనము పరిగణింపవలసియుండును. ఈ తెగలకును యవనశకపహ్లావాది జాతులకును సమ్మేళనము సంభవించినపిమ్మట ననేక క్షత్రియవంశము లుద్భవించి భరతఖండమున వివిధభాగము లాక్రమించి పలు రాజ్యములను స్థాపించి పరిపాలించినమాట సత్యమున కెంత

మాత్రము దూరము కాదు. రెడ్డిశబ్దము రాట్‌శబ్దమునుండి యేర్పడినది గావున రెడ్డియనఁగా రాజని యర్థమగుచున్నది. కాఁపుశబ్దమునకుఁ గావలికాఁచువాఁడు (రక్షకుఁడు) అని యర్థము. ఇయ్యవి పండితులు సయితము చెప్పెడి యర్థములు. ఇప్పుడు సామాన్యముగా కాఁపుశబ్దము రైతు (వ్యవసాయముచేయువాఁడు) శబ్దమునకుఁ బర్యాయపదముగా వ్యవహరింపఁ బడుచున్నది. ప్రాచీనకాలమున రాట్టులను నొకజాతి ప్రజలు భరతఖండమున నివసింపుచుండిరని వేదములవలనను, శాసనములవలనను మనకు స్పష్టముగాఁ దెలియుచున్నది. వీరిలో రట్టులు లేక రాటులు. ఆరట్టులు, లాటులు, విరాటులు, మరాటులు, వరాటులు, కిరాటులు, భల్లాటులు, అంగీరాటులు, ఖగారాటులు మొదలగు శాఖాభేదములు గలవు. వీరిలోఁ గొందఱకు భోజులనియు నామాంతరము గలదు. ఈభోజులలో ననేకు లిప్పుడు కమ్మశాఖవారిలో నున్నారు. ఈరాట్టశాఖలవారు తొలుత సింధునదీతీర ప్రాంతభూములందును, పిమ్మట గంగానదీతీర ప్రాంతభూములందును, అటు పిమ్మట నర్మదా, గౌతమీ కృష్ణానదీతీర ప్రాంతభూములందును నివసింపుచు క్రమముగా దక్షిణహిందూదేశమునకును వ్యాపించిరి. వీరెల్లరు వేర్వేఱుదేశములకుఁబోయి దేశభేదము చేతను, భాషాభేదముచేతను వేర్వేఱునామములతో నేటికాల

మున వ్యవహరింపఁబడుచున్నారు. వీరుతోలుత కంపిలానగర ప్రాంత దేశమున నివసించి యందుండివచ్చినవారగుటచేత మొదట వీరికి కాంపు లని వ్యవహారనామము కలిగినది. కంపిలానగరమే కాంపిల్యనగర మని భారతాది సంస్కృతగ్రంథముల వ్యవహరింపఁబడుచు పాంచాలదేశమునకు రాజధానిగ నుండెను. మన దేశమునం గలి పూర్వపుఁ దెలుఁగు శాసనములలో కాంపు లని సబిందుకముగా వ్రాయఁబడి యుండెను. పూర్వకాలమున బౌద్ధమతమునఁ జేరిన బలిజశాఖల వారిలో ననేకులకు శ్రేష్ఠి యను పదము పట్టపు పేరుగ నుండెను. రాట్టశాఖలవారికి రెడ్డి యను పదము పట్టపు పేరుగ నుండెను. పూర్వకాలమున నీయిరుతెగలలోని యుత్తమ నాయకులకు నన్యోన్య సంబంధ బాంధవ్యములు, భోజన ప్రతిభోజనములు గలవు. పశ్చిమ హిందూస్థానమునందు రాట్టులు నివసించు దేశమునకు రాట్టవాడి యని వ్యవహార నామము గలదు. రాట్టవాడిరాజవంశమునకే రాఠోడ్ లేక రాఠోర్ రాజవంశ మని ప్రఖ్యాతిగలిగినది. ఈరాట్టవాడిరాజకుటుంబమే యొకటి రాష్ట్రకూటరాజవంశముగాఁ బరిగణింపఁబడినది. ఈరాట్టవాడి లేక రాఠోడ్ సీమనుండి యాంధ్రదేశమున కేతెంచి నివసించియున్న రెడ్లనే పూర్వపుఁ దెలుఁగు శాసనములలో రద్దోడి కాంపులని యప్పటిశాసన విలేఖకులు వ్రాసియుండిరి. ఏది యెట్లున్నను రెడ్లని

వ్యవహరింపఁబడెడి తెగలవారు రాష్ట్రజాతులను సంబంధించిన వా రనుట కెంతమాత్రమును సందియము లేదు. వీరెల్ల రాంధ్ర జాతులతోడి సంబంధ బాంధవ్యములచేతను, ఆంధ్రభాషను మాతృభాషగఁ గైకొన్న వారగుటచేతను ఆంధ్రజాతీయులై రనుటకు సందియము లేదు. పల్లెలో నన్నివిధములైన భేదములు గలవు. రెడ్లలో నన్నివిధములైన భేదములు గలవు గావున వానింగూర్చి చెప్పుట సాధ్యము గాదని చెప్పుదురు. కాఁబట్టి యట్టి భేదములనుగూర్చిన చరిత్రము ప్రత్యేకముగ వ్రాయ వలయునేగాని యిందు వ్రాయుట సాధ్యముగాదు. పంటవారు నాలుగు కులా' లని సామాన్యముగా పదునాలుగు ప్రధాన శాఖలు గలవని చెప్పుదురు. అయిన నయ్యవి పదునాలుగు ప్రధానశాఖలో వివరించుట కష్టసాధ్యము. అయోధ్య రెడ్లు, మోటాటిరెడ్లు, పంటరెడ్లు, దేసూరిరెడ్లు, పాక నాటిరెడ్లు, పెదకంటిరెడ్లు, భూమంచిరెడ్లు, ఓరుగంటిరెడ్లు, బలిజరెడ్లు, గండికోటరెడ్లు, గోనటిరెడ్లు, కుంచేటిరెడ్లు, మొర సరెడ్లు, పల్లెరెడ్లు, గాజులరెడ్లు, నేరేటిరెడ్లు, పాకనాటిరెడ్లు, పొంగనాటిరెడ్లు, కమ్మపురిరెడ్లు, వెలనాటిరెడ్లు మొదలగు వ్యవహారనామము లనేకములు గన్పట్టుచున్నవి. వీ రెల్లరకు మాతృభాష యాంధ్రమైనను దేశకాల పాత్ర భేదముల చేతఁ గొన్ని యాచార భేదములు గన్పట్టుచున్నవి. అయ్యవి క్రమముగా నశించు సూచనలు గాననగుచున్నవి.

## కోరుకొండ రెడ్డి చరిత్రము.

(క్రీ. శ. ౧౩౨౮ మొదలుకొని ౧౩౫౦ వరకు)

క్రీ. శ. ౧౩౨౮వ సంవత్సరాంతమునఁ దురుష్కులు రాజమహేంద్రపురదుర్గము నాక్రమించుకొని తత్ప్రాంత దేశమును జయించి పరిపాలనముసేయ మొదలుపెట్టిరని ప్రథమ ప్రకరణమునఁ దెలిపియున్నాఁడను. ఇట్లు దేశ మాక్రమించుకొని తురుష్కులు రాజమహేంద్రపురము రాజధానిగాఁ బరిపాలనము సేయుచుండఁ బ్రతాపరుద్రుని సేనానులలో నొక్కఁడును, కృష్ణా గోదావరీ మధ్య దేశమున నధికారమును బడసియున్న ప్రోలయనాయకేంద్రుఁడు (ప్రోలిరెడ్డి) కుమారుఁడగు కాపయనాయకేంద్రునియొక్కయు, మంచికొండ కేశవనాయకుని మనుమఁడును, గణపతినాయకుని కుమారుఁడునగు కూనపనాయకునియొక్కయు సహాయముతో రాజమహేంద్రపుర తురుష్కులపై దండయాత్ర వెడలి యుద్ధముచేసి తురుష్కులను జయించి దేశము నుద్ధరించెను. ఇతఁడు తురుష్కులను జయించినవిషయము అద్దనపటశాసనమునఁ జేర్కొనంబడినది *.

---

౩౯. *శ్లో. సంహార వ్యాకీర్ణవారిదుర్గాం
ధరాం మహేశాం యవనోపరుద్ధాం
సముద్ధరన్ ప్రోలయనాయకేంద్ర
స్తుతః ప్రతాపమతి స్మ వర్ధ్వాత్.

కాపయనాయకుఁడు బహు పరాక్రమవంతుఁడనియు, పంచోత్తర సప్తతినాయక సంసేవ్యమాన పదపద్ముండనియు, 'ఆంధ్రసురత్రాణ' యను బిరుదమును వహించి ప్రఖ్యాతిఁ గాంచినవాఁడనియు, ఆర్యవటశాసనములవలన విదితమగుచున్నయది. రేచెర్ల మెఱదాచానాయని సింగమనాయఁడు "చెలఁగి తాతకుఁ దాత సింగక్షితీశుండు కాపభూపతిఁ గెల్చెఁ గదనమునను" అని వెలుగోటివారి వంశావళిలోఁ జెప్పినట్లుగా జయించిన దీ కాపభూపతినే కాఁబోలు ? ఈకాపభూపతి తురుష్కులచే నాక్రమింపఁబడిన బ్రాహ్మణాగ్రహారములను పునర్దత్తములను గావించెనని పై శాసనమునన పేర్కొనఁబడియుండెను *.

30. శ్లో. స్వర్గాతిథౌ ప్రోలయనాయకే తే
విశ్వేశ్వరాజ్ఞా మధిగమ్య నిత్యా
అపాలయ త్కాపయనాయకేంద్ర
స్తదీయరాజ్యం [illegible] ప్రతాపః"

[ఈరాజాసన యార్యవటశాసనము శ్రీ [illegible] శాస్త్రి పరికాశరావుపంతులు బి. ఏ. గారిచేత ఆంధ్రపత్రికా ౩౦ సంవత్సరాది సంచికయందు ౨౪౫వ పేజీలోఁ బ్రకటింపఁబడినది.]

*"అథ పంచోత్తరసప్తతినాయకసంసేవ్యమానపదపద్మః
కాపాయనేన్ద్రః శ్రీ విశ్వేశ్వర కరుణయా [illegible].
తురుష్కైర్యే సమాక్రాన్తా స్తేనాన్యే కాపభూపతిః
అగ్రహారాః పునర్దత్తా భూమదేవో [illegible]."

ప్రోలయనాయకుఁడుగాని కాపయనాయకుఁడుగాని యె క్కడ పరిపాలనము చేసిరో వారికి నివాసస్థానముగానున్న పట్టణ మెయ్యదియో తెలియు శాసనముగాని గ్రంథముగాని గానరాదు. వీరలు కృష్ణాగోదావరీ మధ్యఖండమునఁ బ్రబలులై యుండి తురుష్కులతో యుద్ధముచేసి వారలను మధ్యాంధ్ర దేశమునుండి తఱిమి యుందురని యార్యవట శాసనములం బట్టి మన మూహింప వచ్చును. మఱియుఁ గృష్ణాగోదావరీ మధ్యఖండమునఁ గాపవర మను పేరుగల గ్రామములు పె క్కులు గాన వచ్చుచున్నందునఁ గాపభూపాలుఁడు కొల్లేటి కోటలోనో లేక పద్మపుర మను నామాంతరముగల గణప వరముననో (కృష్ణామండలములోని భీమవరము తాలూకా లోనిది) యుండి రాజ్యపరిపాలనముచేసి యుండునని యూహిం చుచున్నాఁడను.

మంచికొండ కూనారెడ్డి కోరుకొండదుర్గమును నిర్మించుట.

ఆంధ్ర సురత్రాణ యను బిరుదమును వహించినప్రఖ్యాత కాప భూపతికి బంధువుఁ డగు మంచికొండ కూనారెడ్డి కాప

---

విశ్వేశ్వరాయ వివిధాం ప్రవిధాయ సే
వాం యాతే విభౌ. దివి చ తత్పదసేవనాయ
తై ర్నాయకై స్స్వనగరా ణ్యధిగమ్య సర్వై
స్సంరక్షితా గతవిరోధకదైః స్వదేశాః.

(ఆంధ్రభారతి 3వ సంపుటము సంచిక ౧–౨లలో ౨౪౬వ పేజిచూడుఁడు)

భూపాలుని సాహాయ్యముతో రాజమహేంద్రపుర తురుష్కులను జయించి యచటికిఁ బదునొకండుమైళ్ళ దూరముననున్న కోరుకొండ యను ప్రదేశమున నొక పట్టణమును నిర్మించి తట్టుకోటనుగట్టి యవక్రపరాక్రమముతోఁ గోన పర్యంతము గల భూభాగమును బరిపాలించెను. ఇతని పేరిటనే గౌతమీతటమున కూనవర మను నొక గ్రామము గట్టఁబడినది. కాఁబట్టి యీకూనభూపాలుఁడు పరిపాలించిన దేశ మిప్పటి గోదావరిమండల మని నిర్ధారింపవచ్చును. ఇతఁడు క్రీస్తుశకము ౧౩౨౫ మొదలుకొని ౧౩౪౦ వఱకు రాజ్యపరిపాలనము చేసెనని చెప్పవచ్చును. ముమ్మడినాయకుని యార్యవటశాసనమున ఇతఁడును, ఇతని తండ్రి గణపతియు, ఇతనితాత కేశవనాయకుఁడును త్రిలింగ దేశాధిపతులైనట్లుగానభివర్ణింపఁబడిరి*.

---

*"దేశా స్సహస్రం భరతస్య ఖండే
దివ్యం త్యఖండాఖిల వస్తుశస్తాః
తేషాం శిరోభూషణ మేవదేశ
స్త్రిలింగనామా సుకృతైకసీమా."
త్రిలింగ దేశాధిపతి శ్శ్రీమాన్ కేశవ నాయకః
యేన భూపా దిలీపాద్యా స్స్మృయా ద్విస్మారితా ఇవ
చర్వీనీత మదగర్వ ఖండనే కల్పి(తా)రి నృప వీరముండనే
మఁచికొండ ఘనగోత్రమండనే భూరజృంభత నృపే స దండనే
తస్య కేశవనృపస్య నందనో నాయకో గణపతి ర్గుణాకరః

## ముమ్మడినాయకుని పరిపాలనము.

(౧౩౪౦ మొదలుకొని ౧౩౭౦ వఱకు)

కూన భూపాలుని యనంతర మాతని జ్యేష్ఠపుత్త్రుఁడును పరాక్రమవంతుఁడు నగు ముమ్మడినాయకుఁడు రాజ్యాభిషిక్తుఁడయ్యెను. ఇప్పటి గోదావరి మండలమంతయు నాకాలమున ముమ్మడినాయకునిచేఁ బరిపాలింపఁబడియెను. ఇతఁడాంధ్రసురత్రాణయను బిరుదమును బొంది ప్రఖ్యాతుఁడైన కాపభూపాలునితోఁబుట్టువు కొమార్తను వివాహము చేసికొని వైరివీరసంహారుఁడై విద్యావంతులైన పండితుల కనేకాగ్రహారముల నొసంగుచు శాస్త్రవిద్యలఁ బ్రోత్సహించుచు

---

స్వర్గతే పితరి పశ్చిమే వయస్యాససఁజ వసుధాం భుజే నిజే
లక్ష్మీ ర్వసుధా కీర్తి ర్గణపతి నృపతేః పరం ప్రియాస్తి స
తాభ్యా మధికా కీర్తి ర్యేనా సౌ(తే) తదర్థ మర్పితవాన్
పుత్త్రి శ్రీకూనభూపాల స్తస్మా దుదభవ ద్విభోః
ప్రద్యుమ్న ఇవ లక్ష్మీశాం చ్ఛంకరాదివ శక్తిమాన్
నృపో గణపతిః పుత్త్రిం పౌత్త్రిం దృష్ట్వా నృపశ్రియః
త్యక్త్వా సింహాసనం భౌమం దివ్యం సింహాసనం యయౌ
విస్ఫూర్జద్గుణ రత్నరోహణగిరి ర్విఖ్యాత దోర్విక్రమో
నిర్వ్యాజ ధావనిపాలతార్ద్రవిభవో నిర్వ్యాజ విశ్రాణనః
గంభీర స్థిరధీ రుదాత్తచరితః కారుణ్య పూరాశ్రయ
శ్శ్రీమత్కూనయనాయకో నిజకులక్షీరోదక్షేః శ్చంద్రమాః"

సర్వజనరంజకముగాఁ బరిపాలనము చేసెను *. ఈముమ్మడి నాయకుని రాజ్యములో కోనసీమ, అంగరసీమ, కొఠాము సీమ, కురవాటసీమ, చాంగలునాటిసీమ మొదలగు సీమలు చేరియుండెను. ఇవన్నియును గౌతమీనది కిరుప్రక్కలను వ్యాపించి యుండెను. ఇతని దేశము మిక్కిలి ఫలవంతమైనది. ఈ రాజ్యము అరటి, కొబ్బరి, పనస, పోక, మామిడి మొదలగు తోటలతో రమ్యమై యాంధ్రభూమిని ప్రసిద్ధినొందినదిగా నున్నదని యార్యవటశాసనమున వర్ణింపఁబడినది †. ఇప్పటికి నట్లేయుండి ప్రఖ్యాతివహించి యున్నదనుట యాంధ్రుల కెల్లరకుఁ దెలిసినవిషయమే.

ముమ్మడినాయకుఁడు తాను రాజధానియగు కోరుకొండ యందుండి పెద్దతమ్ముని సింగమనాయకుని తుని సమీపమును

---

* ప్రఖ్యాతాంధ్రసురత్రాణ స్స్వయం కాపయనాయకః
తస్మై స్వసు స్సుతాం ప్రాదా న్ముమ్మడీంద్రాయ భూభుజే"
(ఆంధ్రభారతిలో శ్రీయుతులు దుగ్గిరాల సూర్యప్రకాశరావుపంతులు గారును, పెండ్యాల సుబ్రహ్మణ్యశాస్త్రులుగారును ప్రకటించిన యార్యవాట శాసనముఁ జూడుఁడు ఆ. భా.సం. 3 సం ౪.)

† పాక (వ్యా) కోచమోచాలికుచపనస కామ్రాదిసంవీతపార్శ్వ
రంతస్సంతానకాంతక్రముక ఫణిలతాశృంగి బేరైకపూర్ణైః
ప్రాంతోద్యన్నారికేళై ర్వకుళ కురవకాశోక పున్నాగరమ్యై
రారామైః కస్య హర్షం న విదధతి పగం ముమ్మడీంద్రస్య దేశాః"

నందున్న కోట్యాము(కొత్తాము) నందును చిన్నతమ్ముని గన్న యను తాడిపాకదుర్గమునను నిలిపి రాజ్యమును సామర్థ్యముతోఁ జక్కఁగఁ బరిపాలనము చేసెను. తాడిపాకయనునది ప్రస్తుతము గోదావరిమండలములోని రాజవోలుతాలూకాలో నున్నది; పిమ్మట సింగమనాయకుఁడు పీంపానదీతీరమున ముమ్మడివీడను నగరమును గట్టించి రాజధానిగఁ జేసికొని ధర్మయుతుఁడై పరిపాలన మొనరించెనని యార్యవటశాసనమువలనఁ దెలియుచున్నది*. ముమ్మడివీడే ముమ్మడివరమని నేఁడు వ్యవహరింపఁబడు చున్నది.

## వైష్ణవమతావలంబనము.

ముమ్మడినాయకునిపూర్వులు శైవులయినను ముమ్మడియు నాతని తమ్ములు మాత్రము వైష్ణవమత మవలంబించినట్లు గన్పట్టుచున్నది. ఇతనికాలమున శ్రీరంగమునుండి పరా

---

* 33 నామ్నా ముంమడినాయకస్య ఘటితా (     ) రిణీ
లక్ష్మీవిభ్రమ భూర్విలాసనిలయో వాణ్యా క్షితిర్మండనం
పంపాసంపదుపాశ్రితా సవిధగశ్రీరామనాథేశ్వరా
ఖ్యాతా ముంమడివీడు నామనగరీ శింగక్షమాభృద్విభోః.

34 ప్రగాఢసన్యాప్తతసార్శ్వదేశే। పీంపానదీసాథసిసావనేచ్ఛే
స్యా రాజధానిప్రతిబింబితేఽపి విరాజతే సా నగరీ విశాలా.

35 గరీయసి పురే తస్మిన్ సర్వైశ్వర్య సమన్వితః
నివసన్ శింగ భూపాలః పాలయత్యఖిలాంభుగం

శరభట్టను వైష్ణవబ్రాహ్మణ గురువు కోరుకొండకు విచ్చేసి ముమ్మడినాయకుని శిష్యునిగాఁ జేసికొని వైష్ణవమతమును గోదావరిమండలమున వ్యాపింపఁజేసెను. ఈపరాశరభట్టు గురుపరంపరలో నేఁడవవాఁడు. ఇతఁడింతదూరమునకు వచ్చి ముమ్మడినాయకుని శిష్యునిగాఁ జేసికొనఁగలుగుట వింతగానే యున్నది. ఒకనాఁడీభట్టరి తన ప్రియశిష్యుఁడైన ముమ్మడినాయకునితో నిట్లనియె. „నాకు మానవజన్మములు తుదముట్ట వచ్చినవి. నేనీ దేహమును చాలించినతోడనే కోరుకొండపై లక్ష్మీనరసింహస్వామిరూపమున వెలసెదను.'' ఇట్లు చెప్పి వెంటనే యాతఁడు మృతినొందెనుగాని యాతఁడు లక్ష్మీనరసింహస్వామి యగునని చెప్పినవాక్యములను ముమ్మడీంద్రుఁడు మఱచి యుండెనఁట! అటుపిమ్మట లక్ష్మిదాసియను నొకవేశ్యస్వప్నములో సాక్షాత్కరించి పరాశరభట్టరి పరాశరశైలమున నుద్భవించితినని చెప్పెనఁట! ఇయ్యది ప్రభువునకు వినిపించినతోడనే యతఁడు తనతో భట్టరిచెప్పిన వాక్యములను జ్ఞప్తికిఁదెచ్చుకొని యామెకుఁ జెప్పి లక్ష్మీనరసింహస్వామికి నాలయము నిర్మింపుమని యాజ్ఞఁజేసెనఁట! అతని యాజ్ఞాప్రకారము లక్ష్మి దాసి ధనమును ప్రోగుచేసి కొండపై దేవాలయమును గట్టించి పరాశర నృసింహమూర్తిని ప్రతిష్ఠాపనము గావించి యంగ రంగ వైభోగములకు రెండుగ్రా

మములను దానము గావించెను. ఈదేవాలయనిర్మాణము నందు ముమ్మడినాయకుఁడే విశేషముగా సాహాయ్యముఁజేసి యుండును. లక్ష్మీనరసింహస్వామియాలయములోనికిఁ బోవు నప్పుడు మధ్యద్వారముకడఁ గన్పట్టు విగ్రహములు రెం డును ముమ్మడినాయకుని యొక్కయు లక్ష్మీదాసియొక్కయు విగ్రహము లని చెప్పుదురు. పరాశరభట్టుకేరిటనే యాకొం డకు పరాశరశైల మనియు, స్వామికి పరాశర నరసింహుఁ డనియు నామములు గలిగినవి. శ్రీరంగ దేవాలయములో నొక తామ్రశాసనము గలదు. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి యాలయములోని శిలాశాసనములోనున్న శ్లోకములు సరిగా శ్రీరంగ దేవాలయములోని తామ్రశాసనములోనివిగా నున్న వి. అందు నేఁడవ పరాశరభట్టునకుఁ దెలుఁగు దేశములో మంచికొండ గోత్రమున జనించిన రంగవర్ధనుఁడను ముమ్మడి నాయకుఁడు శిష్యుఁడుగ నుండెనని వ్రాయఁబడి యుండెను *. ముమ్మడినాయకుఁడును నతని తమ్ముఁడు సింగమనాయకుఁ డును వైష్ణవ మత గురు వగు వేదాంత దేశికులవారితో సమకాలికు లైనను వైష్ణవమత భక్త్యావేశపరవశు లైనను వేదాంతదేశికులవారు గ్రంథములు వ్రాసి యిచ్చినది వీరికిఁ

* Annual Report on Epigraphy, 1912, page 87, para 68.

గాదు. ఇందలి సింగమనాయఁడు సర్వజ్ఞసింగమనాయఁ డనుట భ్రమగాని వే ఱొండుగాదు. వేదాంత దేశికులవారు తత్త్వసందేశోపసంహారమునఁ జెప్పిన ట్లితఁడు మాధవాత్మజుఁడు కాఁడు. కావున దొరతనమువారి శాసనాధికారులు వ్రాసినది పొరబా టని నాయభిప్రాయము.* లక్ష్మీనరసింహస్వామి దేవాలయము శాలివాహనశకము ౧౨౭౫ అనగా క్రీ. శ. ౧౩౫౩వ సంవత్సరమున నిర్మింపఁబడిన ట్లాయాలయములోని శిలాశాసనమున లిఖియింపఁబడినది.

ముమ్మడినాయకుని సోదరుఁడగు సింగమనాయకుఁడు శాలివాహనశకము ౧౨౭౦ శ్రావణబహుళామావాస్యనాఁడు సూర్యగ్రహణసమయమున నాయుర్వేద విశారదుండును, అత్రేయగోత్ర సంభవుండును, యజుశ్శాఖాబ్రాహ్మణుండును నగు పరహితాచార్యునకు అక్కలంపూడియను గ్రామమును దానమొసంగెను. అక్కలంపూడియను గ్రామమె ముమ్మడిసింగవరమని కొంతకాలము వ్యవహరింపఁబడిన ట్లాశాసనము వలననే వేద్యమగుచున్నది. భిషఙ్మణియగు పరహితాచార్యుఁడు తానాగ్రామమును ౨౦భాగములు చేసి యందుఁ బదిభాగము లితరబ్రాహ్మణులును వేదాధ్యయనసంపన్నులు నగు పదు

* Annual Report on Epigraphy, 1913 No. 961, Public, 2nd August 1913, page 129, para 71.

గురకు నా వెంటనే ధారపోసెను. పురహితుని కుటుంబమువారు మూఁడుతరములనుండి యాయుర్వేదవిద్యావిశారదులుగాఁ బ్ర ఖ్యాతివహించి యుండిరి. ఈశాసనముపై సింగానాయనియొ క్కయు; ముమ్మడినాయనియొక్కయు చేవ్రాళ్లు గలవు. ఈ శాసనము క్రీ. శ. ౧౩౬౮ వ సంవత్సరమున లిఖింపఁబడినది గావున ముమ్మడినాయకుఁడును వీనితమ్ముఁడు సింగమనాయ కుఁడును ౩౦ సంవత్సరములు రాజ్యపరిపాలనము చేసినట్లు గ స్పట్టుచున్నది. ముమ్మడినాయకునకుఁ గూనారెడ్డి, అన్నారె డ్డి, కాటమరెడ్డి మొదలగువారు నైదుగురు కొమాళ్లు గలరు. ముమ్మడినాయకుని తరువాత నీమూవురును ౨౫ సంవత్సర ములు రాజ్యపాలనము చేసి యుందురు.

## దేవాలయ ప్రతిష్ఠాపనలు.

క్రీ. శ. ౧౩౭౦ వ సంవత్సరమునకుఁ బిమ్మట ముమ్మడి నాయకునికొమారుఁడు కూనారెడ్డిపరిపాలనకాలములో కోరు కొండలో మఱికొన్ని ప్రతిష్ఠాపనలు జరిగినవి. కూనారెడ్డి స్వా మికొండకు దక్షిణభాగమున దిగువ నొక దేవాలయమును గ ట్టించి యందు రంగనాయకుని ప్రతిష్ఠ గావించెను. ఆస్వామి కైంకర్యాదులకై భూదానములు మొదలగునవి చేసెను. ఆయాలయ ప్రాకారము లోపలనే వైభవరాయని ప్రతిష్ఠ గా వించి యాలయముగట్టించి యథావిధిగాఁ గైంకర్యాదులు జ

రుగునట్లు కట్టడిగావించెను. పిమ్మటఁ గొంతకాలమునకుఁ గేశవస్వామిని గూడ ప్రతిష్ఠగావించి యాలయమును గట్టించి యాస్వాములకందఱకు నిత్య నైవేద్యములకు నిరంతరోత్సవములకు ననేక భూదానములను గావించి యాదేవస్థానమును మహోత్కృష్టదశకుఁ గొనివచ్చెను. కూనారెడ్డియు నతని సోదరులును గలిసి స్వల్పకాల మనఁగాఁ బదునైదుసంవత్సరములు పరిపాలనము చేసినతరువాత కూనారెడ్డికొడుకు ముమ్మడిరెడ్డి రాజ్యపరిపాలనము వహించెను గాని యత్యంతస్వల్పకాలములోనే యీకోరుకొండరెడ్డి రాజ్యమంతయును కొండవీటిరాజ్యమును బరిపాలించుచున్న కుమారగిరిరెడ్డి మంత్రియును సేనానియునగు కాటయవేమారెడ్డిచే జయింపఁబడి యతనిచేఁ బరిపాలింపఁబడుచు వచ్చెను. కావున క్రీ. శ. ౧౩౯౫ దవసంవత్సరమునకుఁ బిమ్మట కూనారెడ్డిసంతతివా రీదేశమును పరిపాలించి యుండరనియు, ఒకవేళ కొంచెముకాలము పరిపాలించినను స్వతంత్రపాలనము చేసి యుండరనియు మనము నిశ్చయింపవచ్చును.

## కులగౌరవము.


ఈకోరుకొండరాజ్యమును బరిపాలనముచేసిన రెడ్లు విద్యాసక్తులును, ధర్మానురక్తులును, వైష్ణవమతాభినివేశపరవశు

వగు మల్లాంబ భార్య యని తెలిసికొనియుంటిమి. మఱియును అల్లాడవేమారెడ్డి కోరుమిల్లి శాసనమున కాటయవేమునకు కాటప్రభు వను కుమారుఁడు కలఁడనియును, అతఁడు హరిహరరాయల కొమార్తయగు హరిహరాంబను వివాహము జేసికొనియె ననియుఁ జదివియుంటిమి. కాటయవేమునకు మల్లాంబ మాత్రమెగాక దొడ్డాంబికయను మఱియొక భార్య కలదనియు, ఆమెకు అనితల్లియను కొమార్తెయు, కుమారగిరి యను పుత్త్రుఁడును గలరనియు, అనితల్లి శాసనమువలన విదిత మగుచున్నది* కాటయప్రభుని పేరును మల్లాంబపేరును దొడ్డాంబికపుత్త్రికయైన అనితల్లి శాసనమునఁ గానరావు. అల్లాడవేమారెడ్డిశాసనమున కాటయప్రభుని పేరు మాత్రమె గాక అనితల్లి పేరుకూడ గలదు. గాని కాటయప్రభువు యొక్కయు అనితల్లియొక్కయు, తల్లులపేరులు పేర్కొనంబడియుండలేదు. కాటప్రభువు మల్లాంబ కుమారుఁడని గాని లేక మల్లాంబికకు సంతతి కలదని కాని యెచ్చటను జెప్పఁబడియుండ

* ౪౨ వ శ్లోకము.


యస్యా వేమనృపాలో జనకో దొడ్డాంబికా తు జననీ
సాదీవ్యత్యనితల్లీనమూర్త్తి రివ దేవభూమిదేవశ్రీః ౹

౪౩ వేమక్షితీశ తిలకేధ కథావశేషే
భర్తా కుమారగిరి రస్యనుతో భువోభూత్.



లును నైన పరిపాలనము చేసినది స్వల్పకాలమైనను యశముతోఁ గూడుకొని ధర్మించిరి. అదియునుగాక వీరికి కులగౌరవమధికముగానుండెను. వీరివర్ణము (చతుర్థవర్ణము) విష్ణుపాదమునందు త్రిలోకపావనియైన గంగతోడఁ బుట్టినదిగావున బ్రహ్మక్షత్రియవైశ్యవర్ణములవారికంటెను పారిశుద్ధ్యమున మించినదనియు వీరి వర్ణములో శిష్టులుదేరనియు, కర్తాసక్తులును, శుద్ధస్వాంతులును, శాంతులును, రాగాదిదోషరహితులును గలరని మున్నుడివినాయకుని శాసనములో నభివర్ణింపఁబడియుండెను. ఇయ్యది వైష్ణవమతసంస్థాపనమును బొంది వైష్ణవగురుప్రబోధనలఁగలిగినవారై యుత్కృష్టమైన రాజ్యపదవికి వచ్చిన తరువాత నావిర్భవించిన కులాభిమానజనితవాక్యములనుగా మనమూహించి సంతసింపవలసినదే. * ఇంతకన్న వీరినిగూర్చి

* పూర్వోత్తరా వర్ణా తనూతాం లింపన్ని పాదభ్రాంశత
ఈశ్వరవనసహితో స్ఫుతధిపాం బ్రహ్మాదిజాతయః స్త్రీప్రసూ
తాసా మార్గార్యం చతుర్థ జాతిస్త్వ తత్పదా జ్జాతా
అస్యా జాతేస్తు బోద్ధా జాతీనాం శుద్ధి రతి నచ స్పష్టం
యదియం సహజాతా భాగీరథ్యా త్రిలోకపావన్యా
తజ్జాతీయాః కర్తారః స్సత్యాశాన్తాః
శుద్ధస్వాంతాః శాంతా రాగాది దోషాః
రాజన్యాన్వామాత్య సాహాయ్యముద్దిశ్య"
సర్వం భారం నిర్వహంత్యేవ సమ్యక్



లున్నై పరిపాలనము చేసినది స్వల్పకాలమైనను యశముతోఁ గూడుకొని [illegible]. అదియునుగాక వీరికి కులగౌరవమధికముగానుండెను. వీరివర్ణము (చతుర్థవర్ణము) విష్ణుపాదమునందు త్రిలోకపావనియైన గంగతోడఁ బుట్టినదగాను బ్రహ్మక్షత్రియవైశ్యవర్ణములవారికంటెను పారిశుద్ధ్యమున మించినదనియు వీరి వర్ణములో [illegible], కర్మాసక్తులును, శుద్ధస్వాంతులును, శాంతులును, రాగాదిదోషరహితులును గలరని మున్ను [illegible] శాసనములో నభివర్ణింపఁబడియుండెను. ఇట్టి వైష్ణవ [illegible] మును బొంది వైష్ణవగురు ప్రబోధనలఁగని [illegible] రాజ్యపదవికి వచ్చిన తరువాత నాయక [illegible] వాక్యములనుగా మన [illegible] దే. * ఇంతకన్న వీరినిగూర్చి

* [illegible] కింపున్న [illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
[illegible]
రాజ [illegible]
[illegible]

కాని వీరిపరిపాలనపద్ధతిని గూర్చికాని తెలిసికోఁదగిన ది విశేషముగానున్నను సాధనసామగ్రి కొఱవడియుండుటచేత నింత మాత్రముతోఁ దృప్తినొందవలసినవార మగుచున్నాము.

## ఐదవ ప్రకరణము.

## కొండ వీటిరెడ్డిరాజులచరిత్రము.

పదునాలుగవ శతాబ్దిప్రారంభమున, అనఁగా క్రీ. శ. ౧౩౨౩ వ సంవత్సరాంతమునఁ గాకతీయసామ్రాజ్య మస్తమించిన వెనుక పంటశాఖీయులగు రెడ్డినాయకులు గొందఱు స్వతంత్రులై ప్రాగ్దేశములోని సింహవిక్రమపురము (నెల్లూరు) మొదలుకొని సింహాచలము పర్యంతము భూమి నాక్రమించుకొని నూఱేండ్లు పరిపాలించి జగద్విఖ్యాతయశస్కులైరి. అట్టివారిలో ప్రముఖుఁడు దేసటివేమారెడ్డి. ఇతనిపూర్వులెల్లరును గాకతీయసామ్రాజ్యమున సైన్యాధిపతులుగనుండి ప్రసిద్ధికెక్కినవారలు. ఇతనితండ్రి ప్రోలయయు మాతామహుఁడు దొడ్డయయు, ఇతఁడునుగూడ కాకతీయచక్రవర్తుల కొల్వు సలుపుచున్న సైన్యాధిపతులేగాని యన్యులుగారు. ఈవేమారెడ్డియు, ఇతని తరువాతివారును ,,పల్లవాదిత్యయనియు, ,,పల్లవత్రినేత్ర'' యనియు బిరుదములను వహించియుం

డుటచేత డాక్టరుహల్ట్జు అనుచరిత్రకారుఁడు వీరినిపల్లవు లని భ్రమపడియెనుగాని వీరుపల్లవులుగారు. వీనికి వేఱుగ నర్థములు చెప్పవచ్చును. వీరిపూర్వులెవ్వరైనను పల్లవరాజులను జయించి వారిబిరుదములను వహింపఁగాఁ గ్రమముగానయ్యవి వీరికి సంక్రమింపవచ్చును. పల్లవాదిత్యుఁడన బాలసూర్యుఁడని పండితులర్థము చెప్పిరి. ఈయర్థము విశ్వాసపాత్రమైనను గాకపోయినను పంటరెడ్లు మాత్రము పల్లవులు గారని స్పష్టముగఁ జెప్పవచ్చును. వీరు తెలుఁగుచోడుల శాఖలోనివారని కొందఱు తలంచుచున్నారు. ఈయూహకొక కారణము గన్పట్టుచున్నది. అభినవభట్టబాణవిరచితమై వీరనారాయణచరిత్రమను నామాంతరమున వ్యవహరింపఁబడు వేమభూపాలచరిత్రమున నీపంటవంశములోనివారి పూర్వులలో కామభూపాలుఁడను వాఁడొకఁడు అద్దంకిరాజధానిగాఁ దెలుఁగుదేశమును బరిపాలించెనని నుదాహరింపఁ బడియుండెను. నెల్లూరిమండలములోని కావలిగ్రామమున నొక శాసనములో జగనొబ్బగండ కామయదేవచోడుఁడను నొక మహారాజునామము గన్పట్టుటచేతను, పాకనాడు పంటరెడ్లకుఁ బ్రధానస్థానముగా నుండుటచేతను, అద్దంకి ప్రథమమున రాజధానిగ నుండుట చేతను సాధారణముగా వేమభూపాలచరితమున నుదాహరింపఁబడిన కామభూపాలుఁ డీకావలిశాసనములోనిజగనొబ్బ

గండకామయదేవచ్ఛోడుఁడే యై యుండవచ్చునని యూహిం చుటకవకాశము కలుగుచున్నది గావున వీరు తెలుఁగుచోడు లతో సంబంధము కలిగియుందురను వాదమును బలపఱచుట కీయూహసహకార మగుచున్నదని డాక్టరుహల్ట్షుగారు వ్రాసియు న్నారు.* ఈరెడ్డిరాజులు చోడులతో సంబంధబాంధవ్యములు సలుపుటచేత డాక్టరుహల్ట్షుగారు తలంచినట్లు వీరు తెలుఁగుచో డులలో నొకశాఖవారినిగా మన మూహింపవచ్చునుగాని వీ రిని పల్లవులతో చేర్చుటకుమాత్రము సాహసింపరాదు. చో డులు క్షత్రియులుగదా వారితో వీరిని గలుపుట యెట్లని కొందఱకు సంశయము గలుగవచ్చును. కాని క్షత్రియులమని చెప్పుకొన్న చోడులు ప్రాచీనకాలమునుండి క్షాత్రవృత్తిని వహించినవారగుటచేత నుత్కృష్ట మైనరాజ్యపదవులను వ హించినప్పుడు ఆకాలమునాటి బ్రాహ్మణోత్తములు వారిని క్షత్రియులనుగానే పరిగణించియుందురు. కాని యిటీవలి రెడ్డి రాజులు పూర్వపు వర్ణాశ్రమసాంప్రదాయధర్మములు చెడి పోయినతరువాతికాలమున రాజ్యపదవులను వహించినవారు గావున నవీనబ్రాహ్మణోత్తములు వీరిని క్షత్రియులనుగా బ రిగణింపక చతుర్థవర్ణములో నుత్తములనుగా వర్ణించియుం

* Annual Report on Epigraphy, 1906. Para 57

డిరి. జగనొబ్బగండయను బిరుద మీరెడ్డిరాజులకును గలదు. ఈవంశమువారు చోడులకు సంబంధించినవారైనను గాకపోయినను వ్యవసాయము చేసికొనుచుండి యొక్కసారిగా రాజ్యపదవికి వచ్చినవారుమాత్రము కారని నాయభిప్రాయము. కాఁబట్టి వేమారెడ్డి క్షాత్రవంతమైన కుటుంబమున జనించినవాఁడగుటచేతనే మహాపరాక్రమవంతుఁడై కాకతీయసైన్యాధిపతులను జయించి బహుభూములాక్రమించుకొని పరిపాలించినవాఁడు.

## దేసటివంశము.

వేమారెడ్డి యింటిపేరు దొంతివారని స్థానికచరిత్రములందును, సూర్యాయలు మొదలగువారి గ్రంథములయందును పేర్కొనఁబడి యుండెనుగాని వేమారెడ్డి యింటిపేరు దొంతివారుకారు. ఇతఁడు దేసటివంశమున జనించిన పోలయరెడ్డి యొక్క ద్వితీయపుత్త్రుఁడు. వీరి యింటిపేరు దేసటివారని వీరు పరిపాలించిన యాంధ్రవాఙ్మయముననె స్పష్టపరుపఁబడియున్నది. కొండవీటిరాజ్యమును బరిపాలించిన వేమారెడ్డివంశమువారును, రాజమహేంద్రపుర రాజ్యమును పరిపాలించినట్టి అల్లాడరెడ్డివంశమువారును జ్ఞాతులనియు నొక్కవంశమువారేయనియు, శంభుదాసప్రణీతమైన హరివంశమువలనను, శ్రీనాథకవి ప్రణీతములైన భీమఖండ, కాశీఖండములవలనను

స్పష్టముగాఁ దెలియుచున్నది. ఎఱ్ఱాప్రెగ్గడవిరచితమైన హరివంశముయొక్క పూర్వభాగమునఁ దొమ్మిదవ యాశ్వాసము మొదటిపద్య మిట్లు వేమారెడ్డిని సంబోధించుచున్నది.

"కం. శ్రీసాధక సుచరిత్రా
నైసర్గికసుజనతాభినందితగోత్రా
శాసనసమగుణ జైత్రా
దేసటివేమా సమస్తధీరలలామా"

శ్రీనాథుని కాశీఖండమునఁ దృతీయాశ్వాసము మొదటిపద్య మిట్లు వీరభద్రారెడ్డిని సంబోధించుచున్నది.

" కం. శ్రీమద్దేసటివంశ
గ్రామణి మూర్ధాభిషిక్త కంఠీరవ సు
త్రామనిభవైభవోన్నత
భామాపాంచాల వీరభద్రనృపాలా"

దేసటి వేమాయనియు, దేసటివంశగ్రామణియనియు, శంభుదాస శ్రీనాథకవులు వేమారెడ్డిని వీరభద్రారెడ్డిని సంబోధించియున్నవారగుటచేతను, భీమఖండమున "చతుర్థమహాళిమండలంబై కీర్తివిహారఘంటాపథంబైన పంట దేసటిమహాన్వయంబున, పాకనాటిదేశంబున భద్రపీఠంబున నధివసించి" అని శ్రీనాథుఁడు వర్ణించియుండుటచేతను వేమారెడ్డియొక్కయు, వీరభద్రారెడ్డియొక్కయు నింటిపే రొక్కటియేయని

యు, దేసటివారనియు, వారు జ్ఞాతులనియు స్పష్టముగా బోధపడఁగలదు. శ్రీనాథుని భీమేశ్వరపురాణము నచ్చొత్తించిన వారు దేసటిశబ్దమేదో యనుకొని పై దానిలో దేసటిశబ్దము ను దీసివేసి పంట మహాన్వయంబున నని మాత్రముంచిరి. కవి జీవితములయందుమాత్రము నేను చెప్పినవిధముగానే ముద్రింపఁబడినది. ప్రబంధములు ముద్రించువారు ప్రాఁతప్రతులను జక్కఁగా పరిశోధించి ముద్రింపవలయును. భీమేశ్వరపురాణమట్లు ముద్రింపఁబడక పూర్వపుఁ బ్రతులకు విరుద్ధపాఠములతో ముద్రింపఁబడినది. ఈవిషయము చరిత్రాంశమున కెంతో ప్రధానమైనది. హరివంశము, కాశీఖండము దేసటి వంశమని పేర్కొనకయున్న పక్షమున, భీమేశ్వరపురాణము లోని మార్పు చరిత్రమున కెంతనష్టము గలిగించును? రాజమహేంద్రపురమును బాలించిన రెడ్లకును, కొండవీడును బరిపాలించిన రెడ్లకును నెట్టి సంబంధముగలదోయని చరిత్రకారులు దెలిసికొనఁజాలక చిక్కులు పడుచుండిరి. వీరుభయులు జ్ఞాతులని యాంధ్రప్రపంచ మిప్పుడు తెలిసికొనఁగలదు.

## పరుసవేదికథ.

పంటకాపు కులమున జన్మించినవారు కొందఱు నూఱేండ్ల కాల మీయాంధ్రదేశమున రాజ్యపాలకులై పరిపాలించుటయును, కొందఱు నామములకుఁ బూర్వము కోమటి శబ్దము

చేర్పఁబడి వ్యవహరింపఁబడు చుండుటయును దలపోసి యీ పంటకాపులకిట్టి యైశ్వర్యము లభించుట కొక కథ కల్పింపఁబడినది. పద్మనాయకుల యైశ్వర్యమునుగూర్చియు రేచనిగూర్చియుఁ బిల్లలమఱ్ఱి బేతాళనాయని కథ యెట్లు కల్పింపఁబడినదో అట్లె యీపంటరెడ్ల యైశ్వర్యమును గూర్చియునట్టి కథ యొకటి కల్పింపఁబడినది. దొంతి అల్లాడ రెడ్డి యనునాతఁ డొకఁ డుండె ననియు, అతని యింటికి వేమన యను నొక కోమటి వచ్చెననియు, అతఁడు స్పర్శవేది యను శిల నొకదాని మూటలోనుంచి, బైటికి వెళ్ళఁగా రెడ్డి దాని నపహరించి తన యింటికి నిప్పంటించి తగులఁబెట్టుకొనియె ననియు, తరువాత కోమటి వచ్చి తన మూటలోని ఱాయి యేమైన దని యడుగఁగా నది యింటితోఁ గాలిపోయి యుండునని చెప్పఁగా నాతఁ డెంతో దుఃఖించి యంతటి మణి పోయిన తరువాత బ్రదుకెందుకని రోసి తానుగూడ మంటలోఁబడి చచ్చెననియు, తరువాత నతఁ డొకనాఁడు రెడ్డి స్వప్నములోఁ గనఁబడి "నాస్పర్శవేదిచే సంపాదింపఁబడిన ధనమును ధర్మకార్యములకొఱకు వినియోగింపవలసిన దనియు, అతని కుటుంబములలోని వారికి తన పేరు పెట్టవలసిన దనియు, అట్లు చేయకున్న పిశాచమునై బాధించెద" ననియు జెప్పి యదృశ్యుఁ డయ్యెనఁట. ఆధనము చేత నల్లాడరెడ్డియు నతని సంతతివారును సైన్యమును సంపా

డించి కాకతీయ సైన్యాధిపతులను జయించి పలు భూము లా క్రమించి పరిపాలింపఁ గలిగిరని కర్తృనామ రహిత మగు ,,కొండవీటి దండకవిలి'' మొదలగుగ్రంథముల వ్రాయఁబడినది. ,, ఆపేరు వచ్చుట కింత కంటె మంచికారణ ముండవచ్చు''నని జయంతి రామయ్యగారు వ్రాయుచున్నారు.* వేమారెడ్డి యింటి పేరు దేసటి వా రని గ్రంథములం బేర్కొనంబడియెనే గాని దొంతి వా రని పేర్కొనఁబడియుండలేదు. అదియునుం గాక వేమారెడ్డి పూర్వులలో నల్లాడరెడ్డి యున్న శిలాశాసనమునను బేర్కొనఁబడియుండలేదు. దేసటి పెరుమాడిరెడ్డివంశమున నొక యల్లాడరెడ్డి కన్పట్టుచుండెనుగాని యతఁడు రాజమహేంద్రపుర రాజ్యములు బరిపాలించినట్టివాఁడు. కొండవీటి రాజ్యమును బరిపాలించిన వేమారెడ్డి తరువాత నున్నయతని జ్ఞాతి. అతని సంతతి వారికి కోమటి శబ్దము చేర్పఁబడి యుండలేదు. కాఁబట్టి దొంతి అల్లాడరెడ్డికి వీరికి నెట్టి సంబంధమును లేదు. దొంతి అల్లాడరెడ్డి కథ కల్పితమై యుండ వచ్చును.

## దేసటి వేమభూపాలుని పరిపాలనము.

(క్రీ. శ. ౧౩౨౮ మొదలుకొని ౧౩౫౦ వఱకు)

తురుష్కులు కాకతీయ సామ్రాజ్యమును విధ్వంసము గావించి యాంధ్రదేశంబున నార్యధర్మములు తాటాదూటములు

---

*ఆంధ్రభారతి సంపుటము ౨ సంఖ్య 3 పేజి ౧౧౫ చూడుఁడు.

గఁ జేయుచుఁ గలవర పెట్టుచున్న కాలమున నార్యధర్మోద్ధరణాభిలాషియై పంటకులంబున జనించిన వేమారెడ్డి కృష్ణానదీతీర ప్రాంతదేశములఁ దురుష్కులనోడించి పూఁగినాటి దేశంబున రాజ్యరమను నెలకొల్పి సామ్రాజ్యము విస్తరింపఁ జేయ నెంతేనిఁ బ్రయత్నించిమనోరథసిద్ధిఁగాంచిన శూరశిఖామణిగ నుండెను.*స్వదేశాభిమానము స్వభాషాభిమానము, స్వమతాభిమానము, స్వజనాభిమానము గల భూపాలురలో నితని నగ్రగణ్యునిగా భావింపవచ్చును. కనుకనే ఎఱ్ఱాప్రెగ్గడ వచించిన ట్లవదాతచరితంబున నఖిలజనరంజనం బొనర్చుటం జేసి రాజశబ్దంబునకు భాజనం బయ్యెను. పైని చెప్పినవి గాక యీభూపాలునకు స్వబంధుజనానురాగము మెండుగ నుండెను. ఈవిషయము హరివంశములోని యీక్రింది పద్యము వలన విస్పష్టము కాఁగలదు.

“ తనకు నద్దంకి తగు రాజధానిగాఁ బ
రాక్రమంబున బహుభూము లాక్రమించి
యనుజ తనుజబాంధవ మిత్ర జనుల కిచ్చె
నెదురె యెవ్వరు వేమమహీశ్వరునకు ”

*శ్రీశైల పూర్వతట నికటమునుండి పూర్వసముద్రము దాఁక ప్రవహించు కుండి తరంగిణి యను గుండ్లకమ్మ నది కిరుప్రక్కలనుండు సీమకే పూంగినాఁ డను నామము గల దని తెలియుచున్నది.

ఇతఁ డిట్టి వాఁడు గనుకనే యెఱ్ఱాప్రెగ్గడ యితని నన్నయైకపావనుఁ డని యీక్రిందిపద్యములో నభివర్ణించి యుండెను.

„ సీ. పంటకులస్వామి ప్రఖ్యాతుఁ డౌర వే
మయ పితామహుఁ డను మాన్యతయును
ధూతకళంకుండు దొడ్డయ సైన్య నా
యకుఁడు మాతామహుం డను వినుతియు
నాది రాజన్య తుల్యాచారవిధి మాచ
విభుఁడు పూర్వజుఁ డను విశ్రుతియును
శ్రీయుతుల్ పోతయ చిట్టయ నాగయ
ప్రభులు మాతులులను భవ్యతయును
దన మహత్త్వంబు భూషింపఁ దాను వారి
పేరు వెలయింపఁ జాలు గభీర మహిమ
నాత్మగుణముల నొడవించు నన్నయైక
పావనుఁడు వేమ జనపతి కేవలుండె."

మఱియు సర్వదివేలు శైలములచేఁ జుట్టుకొనఁబడియున్న మేరుపర్వతముతోఁ బోల్పఁ బాత్రమై వేమారెడ్డి చుట్టపు మేరువ న్వినుతి గాంచె నని పైకవియె యీక్రిందిపద్యములో నభివర్ణించి యుండెను.

"ఉ. చుట్టునిజ ప్రభాపరిధిసోకున నర్వదివేలుశైలముల్
గట్టి పసిండిగాఁ దనరుకాంచనభూధ్రముఁబోల్పఁబాత్రమై
చుట్టము లెల్ల నాత్మసమశోభితసంపద నొంద నొప్పెఁ దా
జుట్టపు మేరువ న్వినుతి సొంపున వేమన రేంద్రుఁడున్నతిన్"

ఆకాలమునందు పద్మనాయకులు, రెడ్లు, రాచవారు నైక మత్యమువీడి పరస్పరము ద్రోహులై వంచించు కొనుచుఁడు టం జేసియు, సామ్రాజ్య పునస్సంస్థాపనకై యొండొరులతోఁ బోరాడుకొనుచున్న వా రగుటచేతను వేమారెడ్డి స్వజనమం దే విశ్వాస ముంచి యెఱ్ఱాప్రెగ్గడ చెప్పినట్లు అనుజ తనుజ బాంధవ మిత్రజనులను మాత్రమె యధికార పదవులం దునిచి బహు భూము లొసంగి యుండును.

## వేమారెడ్డి బిరుదనామములు.

పల్లవాదిత్యుఁడు, జగనొబ్బగండఁడు, అంగరక్షపా లుఁడు, కేళాధిరాయఁడు, సంగ్రామధనంజయుఁడు, భుజబల భీముఁడు, రూపనారాయణుఁడు, వీరనారాయణుఁడు, గుజ్జరి దళవిభాళుఁడు, జగరక్షపాలుఁడు, చంచుమలచూఱకారుఁడు, మండలీకరగండఁడు, కోదండరాముఁడు, రాయచేకోలుగం డఁడు, అర్థిప్రత్యర్థిహేమాద్రిదానవిరతుఁడు, ప్రజాపరిపాలన భరితుఁడు, అమరాభరణుఁడు అపరిమితభూదానపరశురా ముఁడు, రాచూరిదుర్గవిభాళుఁడు, అనేకనగరోపకంఠప్రతిపా

దితబహువిధారాముఁడు, పర్వతాహోబలనిర్మితసోపానుఁడు, బ్రహ్మకుండిసహ్యజాగౌతమీజలక్రీడావినోదుండు, విరోధినృప దానవనరసింహుఁడు, పాండ్యరాయగజసింహుఁడు, ప్రజ్ఞా చతుర్విధోపాయుఁడు, నిత్యపరిపాలితసత్యుఁడు, దుర్మదవైరి వీరభయంకరుఁడు, బసవశంకరుఁడు మొదలగు బిరుదము లనేకము లాతనికిఁ గలవు.

వేమారెడ్డిమంత్రి రామాప్రెగ్గడ.

కాశ్యపగోత్రవంశసంజాతుఁడును, రాజ్యతంత్రజ్ఞుఁడును. సమర్థుఁడును, అమాత్యశిఖామణియు, శాస్త్రవిదుఁడు, వయో వృద్ధు నగు రామాప్రెగడ యను నియోగిబ్రాహ్మణుఁడు వేమారెడ్డికి మొదటమంత్రిగ నుండెను. ఇతని తరువాత వేమారెడ్డికడ నితని మనుమనికొడుకు మల్లినాథమంత్రి రాజ్య ధురంధరుఁడై యొప్పియుండె నని తెలియుచున్నది. తండ్రియుఁ దాతయు కూడ నేకారణముచేతనో మంత్రిపదవికి వచ్చియుండ లేదు. రామాప్రెగ్గడ జీవించియుండఁగనే పుత్త్రుఁడును మను మఁడును గూడ మరణించి యుందురు. అట్లు గాకయుండిన నాతనికి వెనుక మునిమునుమఁడు పిన్నవయస్సుననే మంత్రి పదవికి వచ్చుట యెట్లుసంభవించును? వేమారెడ్డికి మంత్రిగ నున్న రామాప్రెగ్గడకు మంచిరాజును, వానికి రామరాజును వానికి మల్లమాంబయందు మల్లనమంత్రి, మంచిరాజు,

వేమయమంత్రి, ఎఱ్ఱనార్యుఁడు, కేసయమంత్రి యను నైదు గురుపుత్రులును గలరు. వీరిలో మల్లనమంత్రియె మొదట వేమారెడ్డికిని పిమ్మట నతనికుమారుఁడైనఅనపోతరెడ్డికిని మంత్రిగ నుండి విఖ్యాతికెక్కెను. రామాప్రెగ్గడయు, మల్లినాథుఁడును వేమారెడ్డికి మంత్రులుగ నుండి రని కమ్మనాటి సీమలో నున్న మణికేశ్వరములోని మాండుకేశ్వరస్వామి వారి దేవాలయములో నున్న శిలాశాసనమువలనఁ దెలియు చున్నది. *

## వేమారెడ్డిప్రసిద్ధసేనానులు.

అఖిలశత్రువిదారణప్రతిజ్ఞాపూరణోద్దాముం డగు వేమారెడ్డికి నసాధ్యసాధకవీరవ్రతనిర్వహణపరాయణు లగు నల్వురు ప్రసిద్ధసేనానులు గలరు. వీరిలో అన్నారెడ్డి, మల్లారెడ్డి యను నిరువురు వేమారెడ్డికి తమ్ములు. మూఁడవయతఁడు కుమారుఁడైనయనపోతరెడ్డి. నాలుగవయతఁడు మాతులపుత్రుఁ డగునూకారెడ్డి. వీరు ప్రసిద్ధులు. వీరు నల్వురు సేనాపతులుగ నుండి వేమారెడ్డికి దిగ్విజయ మొనఁగూర్చు చుండిరి. వీరిలో మల్లారెడ్డి శ్రీరామచంద్రునికి లక్ష్మణుని వలెను, ధర్మజునకు నర్జుననివలెను వేమారెడ్డికి విధేయుఁడై

---

* నెల్లూరుశాసనములు 3 వ సంపుటము పేజీ ౧౦౩౭ ఒంగోలు 25 నంబరు శాసనము చూడుఁడు.

సాభాత్రృత్వము దెలుపుచు సమస్తజనులచేఁ గొనియాడఁబడు చుండెను. ఈమల్లచమూపతి కురుములూరుపురము మకాముగాఁ జేసికొన్న ట్లీక్రింది హరివంశములోని పద్యమువలనఁ గన్పట్టుచున్నది.

"కం. సకలద్వీపాంతరర
త్నకలాపనిరంతరార్చనాకలనారం
భక కురుమలూరిపురనా
యక మల్లచమూవరేణ్య హరినివేద్యా."

ఈ పై పద్యమును బట్టియు

"కం. సర్వధురీణగుణోదయ
సర్వజ్ఞోదాత్తవృత్తసంసిద్ధ యశో
గర్వితమల్లచమూవర
నిర్వంచకసోదరత్వ నిత్యారాధ్యా."

కం. రామాయణ హరివంశ
శ్రీ మన్మథురప్రసంగ సిద్ధచిరయశ
స్సామర్థ్యకరణనిపుణా
శ్రీ మల్లచమూవరేణ్య సేవితహృదయా."

అను పద్యములను బట్టియుఁ జూడ సోదరుల కన్యోన్యానురాగము దట్టముగా నుండె నని స్పష్టముగాఁ గన్పట్టఁ గలదు. మల్లారెడ్డి తురుష్కులను జయించి వా రాక్రమించిన

బ్రాహ్మణాగ్రహారములను తిరిగి బ్రాహ్మణుల కిప్పించెనఁట. ఇతఁడు కాకతీయసైన్యాధిపు లగుక్షత్రియులను జయించి మోటుపల్లిని స్వాధీనపఱచికొనియెను. ఇతఁడు మోటుపల్లిని స్వాధీనము చేసికొన్నవిధ మీక్రిందిపద్యమున నిట్లభివర్ణింపఁబడి యుండెను.

"శా. బాహాదర్పమునం బ్రతీపధరణీపాలావలిం దోలి యు
త్సాహోదగ్రుఁడు మోటుపల్లి గొని సప్తద్వీపసద్వస్తుసం
దోహంబున్ దనకిచ్చు నెచ్చెలిసముద్రుం బ్రీతిగావించుచున్
మాహాత్మ్యంబువహించెమల్లరథినీనాథుండుగాఢోద్ధతిన్"

ప్రాచీనకాలము నుండియు మోటుపల్లి యాంధ్రదేశమున నొకప్రసిద్ధమైన రేవుపట్టణముగా నుండి ద్వీపాంతరములతో వర్తకవ్యాపారములు జరుపునట్టిదిగా నుండి ప్రసిద్ధి గాంచుచు వచ్చెను.

మాతులపుత్త్రుం డగునూకారెడ్డి వేమధాత్రీపతికిఁ బరమమిత్రుండఁట! ఈనూకారెడ్డిపరాక్రమమును, గుణవిశేషమును హరివంశమునం దిట్లభివర్ణింపఁబడి యుండెను

"మ. జయమేకయ్యమునందు నెంతటరిపుక్ష్మానాథులం జెందనీఁ
డయసంపన్నతనెన్నఁడున్ వెలితిగాఁడాద్యక్రమాయత్తమై
నయమాత్రీయముగాజితస్థితులనానందించునాథ్యుండుచి
ట్టయనూకప్రభుఁ డుద్ధసత్యగుణనిష్టం బట్టిపుణ్యుం డిలన్."

అనపోతరెడ్డి సేనాధ్యక్షుఁడై ధరణికోటయందుండి పద్మనాయకులవలనను, రాచవారివలనను రాజ్యమునకు హాని కలుగకుండఁ గాపాడుచుండెను. అనపోతనాయఁడును, మాధవనాయఁడును ధరణికోట నాక్రమించుటకై దండయాత్ర వెడలి వచ్చినప్పుడు ఘోరయుద్ధమున వారిని గెలిచి నిలువరించెను. కటకాధిపతి యైనగజపతి దండెత్తి వచ్చినప్పుడు దోర్దర్పమున వానినెదుర్కొని కృష్ణానదీతటమున నోడించెను. కనుకనే యెఱ్ఱాప్రెగ్గడ తన హరివంశమునందు వేమారెడ్డి నిట్లు శ్లాఘించెను.

మాలిని.

" బహుళహయగజేంద్రస్ఫారసేనాసహస్ర
ప్రహతకటకరాష్ట్రభ్రష్టవిద్విష్టసంప
ద్గ్రహణపరమధన్యోదగ్రధాటీభటశ్రీ
మహితజయవిజృంభా మంజురాజ్యోపలంభా. "

వేమారెడ్డి తమ్ముఁడును మల్లారెడ్డి యన్నయు నైన అన్నారెడ్డి కూడ ప్రసిద్ధికెక్కిన సేనాధిపతిగను శివభక్తుఁడుగను నుండెను. అతఁడు గూడ నిట్లభివర్ణింపఁబడి యుండెను

"ఉ. అన్న చమూవరుండు సకలార్థసమన్వితుఁ డన్నదానసం
పన్నుఁ డభిన్నబాహుబలభాసిభవాంఘ్రిసరోజపూజనా
సన్నుతితత్పరాత్ముఁ డవసన్నవిరోధిప్రసన్నభావుఁ డ
భ్యున్నతిశాలికీలితశుభోదయుఁ డూర్జితుఁ డయ్యెనెయ్యెడన్"

## వేముని రాజ్యవిస్తీర్ణము.

ఇట్టి సేనాపతుల సాహాయ్యముతో పరరాజులను జయించి యీవేమభూలుఁడు అద్దంకి రాజధానిగఁ జేసికొని కందుకూరు మొదలుకొని గోదావరిపర్యంతముగల దేశమును బరిపాలించెను. "బహ్మకుండి కృష్ణవేణ్ణా గోదావరిమహానది తటద్వయ తన్మధ్యదేశదత్తానేకాగ్రహారః" అను విశేషణ మొకటి వేమునకు గలదని శాసనములలోఁ గన్పట్టుచున్నందున వేముఁడు నెల్లూరు మొదలు కటకముదాక పరిపాలనము చేసినట్లు తోఁచు ననియు, ఇందులోఁ గొంతభాగ మతిశయోక్తిక్రిందఁ గొట్టివేసినను ప్రస్తుతపు గోదావరీమండలములోఁ జేరిన దేశమంతయు నతనిపాలనకు లోఁబడిన దనుటకు సందేహ ముండ దనియు జయంతి రామయ్యగారు వ్రాయుచున్నారుగాని * యాకాలమునఁ బ్రస్తుతపు గోదావరిమండలము కోరుకొండ రాజధానిగాఁ జేసికొన్న కూనా రెడ్డి యొక్కయు నతని పుత్త్రుఁడు ముమ్మడినాయకుని యొక్కయు పాలనమునందున్నట్లు ముమ్మడినాయకుని యార్యవట శాసనాదులు వేనోళ్ళ ఘోషించుచున్నవి. ఆశాసనములం దెచ్చోటను కోరుకొండరెడ్లు వేమారెడ్డికి లోఁబడియుండిన సామంతులని చెప్పఁబడి యుండలేదు.

* ఆంధ్రభారతి సంపుటము ౨ సంఖ్య 3 పేజి ౧౧౯ చూడుఁడు.

అందువలన నై వేమభూపాలుఁడు గోదావరినదివఱకుఁగల దేశమునుమాత్రమె పరిపాలించియుండునని సందేహింపవలసి వచ్చుచున్నది. మంచికొండ కూనారెడ్డికి తురుష్కులను జయించుటకుఁ దోడ్పడినవారు ప్రోలయనాయకుఁడును నాతని పుత్త్రుఁడు కాపయనాయకుఁడుగాని ప్రోలయ వేమారెడ్డికాఁడని యార్యవట శాసనములవలన స్పష్టముగాఁ దెలియుచున్నది. వేమారెడ్డియె కాపయనాయకుఁడని వ్యవహరింపఁబడి యుండిన యెడల జయంతి రామయ్యగారి యూహ సరియైనదనవచ్చునుగాని యందునకుఁ బ్రమాణము గానరాదు. అమరావతీ శాసనములో 'మాద్యన్మన్నెనృపాలతూలపవన' యని చెప్పుటచేఁ గళింగదేశములోని కొండరాజులను గొందఱ నీతఁడు జయించినట్టు గనఁబడుచున్నను నాప్రాంతము నీతఁడు పరిపాలించి యుండునని యూహింపరాదు. కొండరాజులను జయించినమాత్రముచేత నాదేశమును బరిపాలించెనని యితర ప్రమాణములేనిదే సిద్ధాంతము చేయరాదు. కాఁబట్టి వేమభూపాలుఁడు పరిపాలించిన రాజ్యముయొక్క విస్తీర్ణము ౧౾౦౦౦ మైళ్ళుండవచ్చును. కాకతి ప్రతాపరుద్రచక్రవర్తి బ్రాహ్మణులకొసంగిన యగ్రహారములను తురుష్కులపహరింపఁగా వేమభూపాలుఁడు మరల బ్రాహ్మణుల కొసంగెనని యమరావతీశాసనమునం గన్పట్టుచున్నది.

## అవచి దేవయసెట్టి.

విక్రమసింహపురమని ప్రసిద్ధిగాంచిన నెల్లూరుపట్టణమున సెట్టి జగజ్జెట్టియని ప్రఖ్యాతబిరుదము వహించిన పావాణిసెట్టి యను నొక కోమటివైశ్యుఁడు నివసించుచుండెను. అవచిదేవయసెట్టియను పుత్త్రుఁడొకఁడాతనికిఁ గలఁడు. అవచిదేవయసెట్టి వేమారెడ్డికిఁ బ్రాపుగనుండెనని శ్రీనాథకవిరచితమైన హారవిలాసములోని యీక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

"కం. శ్రీపర్వత సోపాన
స్థాపకుఁ డగు రెడ్డివేమ జగతీపతికిన్
బ్రాపైనయవచిదేవయ
యాపావాణికి జనించె నభ్యుదయముతోన్"

ఈతని శైవభక్తిని, దాతృత్వమును శ్రీనాథుఁడీతని కుమారున కంకితముగావించిన హారవిలాసమను గ్రంథములో నీక్రిందిపద్యములలోఁ జక్కఁగా నభివర్ణించి యున్నాఁడు.

"ఉ. విశ్వజగత్ప్రసిద్ధుని వివేకనిరంజన రామనాథయో
గీశ్వరపాదసేవకు నహీనదయాగుణశాలి వీరమా
హేశ్వరచక్రవర్తిఁ దరుణేందుకళాధరభక్తి భావనా
శాశ్వతచిత్తు మాయవచిసత్కులు దేవయ నెన్న శక్యమే"

"ఉ. ఆతతభక్తిసంపదనహర్నిశమున్ ఘృతఖండశర్కరా
పాతముతోనపూపములు పాయసముల్ గదళీఫలంబులున్

స్ఫీతముగాగనన్నములుపెట్టును శంకరభక్తకోటికా
సేతుహిమాచలం బవచిసెట్టికి నెవ్వరుసాటియిమ్మహిన్"

## పోలయ వేమారెడ్డి రాజ్యపరిపాలన కాలము.

ఆంధ్ర కవులచరిత్రమునందు "అనవేమారెడ్డి తండ్రియైనపోలయవేమారెడ్డి ప్రతాపరుద్రునిప్రభుత్వదినములలోనొక సేనానాయకుడుగనుండి౧౩౨౩ వ సంవత్సరమున ప్రతాపరుద్రుఁడు తురుష్కులచేత కారాబద్ధుడుగాఁ జేయఁబడినకొన్నిసంవత్సరములకేనఁగా ౧౩౨౮ వ సంవత్సరమునందు స్వతంత్రుఁడై వినుకొండరాజ్యము నాక్రమించుకొని ౧౩౫౩ వ సంవత్సరమువఱకును రాజ్యముచేసె"నని వ్రాయఁబడియుండుటయేగాక పోలయవేమారెడ్డితరువాత నతనికుమారుఁ డనవేమారెడ్డి రాజ్యమునకువచ్చెనని వ్రాయఁబడియున్నది. ఇందు చెప్పఁబడినకాలము సరియైనదికాదు. ప్రథమవేమభూపాలుఁడు క్రీ. శ. ౧౩౫౦ వ సంవత్సరమువఱకును రాజ్యపరిపాలనము చేసియుండెనని శాసనములంబట్టి తెలియుచున్నది. తరువాత నతని జ్యేష్ఠపుత్రుఁడైన అనపోతరెడ్డియు నటుపిమ్మట నతనిద్వితీయ పుత్రుఁడైన అనవేమరెడ్డియు రాజ్యపరిపాలనము గావించినట్లు శాసనాదులవలన స్పష్టముగాఁ దెలియుచున్నది. *ఎఱ్ఱాప్రెగ్గడ తన

---

* ఇటీవలివారు కొందఱు కవులచరిత్రములోని కాలమును నమ్మి తప్పుసిద్ధాంతములు చేయ మొదలుపెట్టినారు. రెడ్లపరిపాలన కాలమును

హరివంశమునం దతని 'వేమా, కోమటివేమా, ప్రోలయవేమా అన్నయవేమా' యని వివిధనామములతో సంబోధించి యున్నను, కోమటివేముఁడు, అనవేముఁడు, నను ప్రసిద్ధభూపాలురీవంశమున నుంటచేత చరిత్రమునందితని ప్రోలయవేముఁడని పేర్కొని వ్యవహరించుట గ్రాహ్యము.

## రాజ్యపరిపాలనస్థితి.

ఆంధ్రదేశము మతాంతరులైన తురుష్కులదండయాత్రల వలనఁ గలవరమునొందియున్న కాలమున వేమభూపాలుఁడు పరాక్రమవంతుఁడై బహుభూములాక్రమించి రాజ్యస్థాపకుఁడై యాంధ్రదేశమున వైదికమతము, వర్ణాశ్రమధర్మములు, సనాతనధర్మము, పౌరాణికవిగ్రహారాధనము, శాస్త్రవిద్యలు,

---

గూర్చి స్థానికచరిత్రములం దుదాహరింపబడిన యీక్రింది చాటుపద్యములోని కాలవివరముకూడ విశ్వాసపాత్రమైనదికాదు.

సీ. ప్రోలయవేమన్న పాలుపారఁబండ్రెండుసంవత్సరంబులుగాచె వసుధయెల్ల
ఆటవెన్క ముప్పది యనపోతవేమన్న యన్నైవాసికినెక్కి వసుధమేలె
ధర్మాత్ముఁడనవేమధరణీకళత్రుండు పదినుఁనేనిట భూమి పదిలపఱిచె
ప్రజలకబ్బసముగఁ బదునాలుగేడులు కొమరగిరేలెను సమసమాక
నేలె కోమటివేమన నిరువదేండ్లు
రాచవేమన్న నాల్గువర్షములనేలె
మించికట్టిరి గృహరాజు మేడకొండ
వీట నూటేండ్లు రెడ్లు భూవిదితయశులు.

నశింపకుండఁ జేసి ప్రోత్సహించి వివిధప్రతిష్ఠాపనలు గావించి భూరియశమును గడించెను. ఇతని రాజ్యపరిపాలనము సర్వోత్కృష్టమైనదిగఁ దెలుపుచుఁ దద్భాగ్యవైభవమును శంభుదాసకవి యిట్లభివర్ణించి యుండెను.

"సీ. అగ్రహారములు విద్యాతపోవృద్ధవి
ప్రులకిచ్చి యజ్ఞకర్తలుగ నునిచెఁ
గామరారఁ జెఱువులుగుళ్ళు ప్రతిష్ఠించి
లోకసంభావ్యంబులుగ నొనర్చె
నిధులునల్లిండ్లను నిలిపెఁ దోటలు సత్ర
ములు చలివిందరల్ వెలయఁజేసె
హేమాద్రిపరికీర్తితామితవ్రతదాన
నివహంబులన్నియు నిర్వహించెఁ
జేసెఁ జేయుచు నున్నాఁడు సేయనున్న
వాఁడు పునరుక్త కృతిశుభావలులనెల్ల
ననఁగ శ్రీవేమవిభున కయ్యలరు పేర్మి
వశమె వర్ణింపఁ దద్భాగ్యవైభవంబు"

వేదశాస్త్రాదివిద్యల నభ్యసించి తపోవృద్ధులై యార్యధర్మోద్ధారకులైన బ్రాహ్మణోత్తములకు ననేకాగ్రహారములొసంగెననుటకు శాసనములలో నీతనికి విశేషణముగా నుదాహరింపఁబడిన "బ్రహ్మాండ కృష్ణవేణా గోదావరిమహానదీతట

SREE VEMANA ANDHRA NILAYAM HYDERABAD-DN. 1923.

ద్వయ తన్మధ్యదేశదత్తానేకాగ్రహారః" అను వాక్యమె ప్రమాణముగాఁ జూపందగును. మఱియు, అపరిమితభూదాన పరశురాముఁడను బిరుదమును వహించియుండుట గూడ పైసిద్ధాంతమును బలపఱచుచున్నది. ఇతఁడనేకనగరోపకంఠ భాగములందువివిధారామములఁ బ్రతిష్ఠాపించెనని,«అనేక నగరోపకంఠ ప్రతిష్ఠాపిత వివిధారాము»"డను బిరుదమును వహించియుండుటయె వేనోళ్లఁజాటుచున్నది. శ్రీశైలమునకు దిగువనున్న కృష్ణకుఁ బాతాళ గంగ యను నామముగలదు. శ్రీశైలముపైనుండి యాత్రికులసౌకర్యార్థము పాతాళగంగవఱకును అహోబల నృసింహక్షేత్రమునుండి దిగువవఱకును సోపానములను నిర్మింపించి ప్రసిద్ధిగాంచెను. తన పట్ల భక్తియుక్తుండై ప్రవర్తించి బహుపరాక్రమవంతుఁడై శత్రురాజుల జయించి తనరాజ్యమును విస్తరింపఁజేసి తనకంటె ముందుగా స్వర్గస్థుఁడై పోయిన పిన్నతమ్ముఁడు మల్లారెడ్డికి పుణ్యముగా నమరావతీ పట్టణములో వేంచేసియున్న యమరేశ్వరస్వామివారి యాలయశిఖరమునఁ బసిండికలశములను బ్రతిష్ఠాపించెను. ఇతఁడు బ్రాహ్మణులకుఁ జేసిన దానములలోఁ గడపటిది క్రీ. శ. ౧౩౪౪ గవ సంవత్సరమునఁ గావింపఁబడినది. కృష్ణాతీరమునందాతుకూరనుగ్రామమునకు వేమవర మని పేరువెట్టి బ్రాహ్మణుల కగ్రహారముగా నొసంగెను. ఇతడు హేమాద్రిదాన

ఖండమునం జెప్పిన వ్రతదానముల నన్నిటిని నిర్వహించి ప్రసిద్ధిగాంచెను. చెఱువులు బావులు మొదలగువానిఁ ద్రవ్వించి వ్యవసాయకులకు మహోపకారములను గావించెను. వర్తక వ్యాపారములకు మార్గము లేర్పరించెను. పూర్వపద్ధతుల ననుసరించియె సుంకములను రాఁబట్టుచుండెను. రైతుల యుపయోగార్థము ధననిధుల నిలిపెను. జార చోర బాధ లుడిపి రామరాజ్యముగ ధరణిఁ బరిపాలించెను.

## వేముని విద్యావ్యాసంగములు.

వేమభూపాలుని కొల్వుకూట మెప్పుడును వేదాధ్యయనసంపన్ను లైనవైదికోత్తములతోడను, తర్క వ్యాకరణ జ్యోతిష మీమాంసాది షట్ఛాస్త్రవిదు లైనపండితసత్తములతోడను మాత్రమెగాక గీర్వాణాంధ్రభాషాప్రవీణు లైన మహాకవిపుంగవులతోడను బరివేష్టింపఁబడి యుండుటయెగాక యతఁడును గీర్వాణాంధ్రభాషాకోవిదుఁ డై పండితులను కవులను బోషించుచు సకలకవివర్ణనీయుఁ డై విఖ్యాతిఁగాంచి యుండెను. కవిత్రయములోనివాఁ డై శంభుదాసనునామాంతరము గల యెఱ్ఱాప్రెగ్గడ యనుమహాకవిచే రామాయణ హరివంశముల రచింపఁ బ్రోత్సహించి తాను గృతిపతి యై శాశ్వతమైనకీర్తిని సంపాదించెను. ఇతని స్వబంధుజనానురాగ మెంతపరిపూర్ణస్థితియం దుండెనో స్వభాషాభిమానము నంత

పరిపూర్ణస్థితియందే యుండెను.

## ఎఱ్ఱాప్రెగ్గడ చరిత్రము.

ఎఱ్ఱాప్రెగ్గడ వేమభూపాలుని యాస్థానకవి యని యింతకు మున్న దెలిపినాఁడను. ఇతఁడు భారతమును రచించి ప్రఖ్యాతి గాంచిన యాంధ్రకవిత్రయములోఁ గడపటివాఁడు. ఇతఁడు మొట్టమొదట వేమభూపాలుని పిన్నతమ్ముఁడును చమూపాగ్రేసరుఁడును శౌర్య పరాక్రమోపేతుఁడు నగుమల్లారెడ్డికడ మంత్రిగ నాస్థానకవిగ నుండెను. ఒకనాఁడు వేమభూపాలుఁ డీకవిశిఖామణి శక్తిని గ్రహించి సవినయముగా నర్చించి యిట్లనియెనఁట.

"తే. సకలభాషాకవిత్వవిశారదుఁడవు
సాధుసమ్మతుఁడవు నిత్యసౌమ్యమతివి
భవ్యుఁడవు గాన నీమీఁదఁ బరఁగఁ బక్ష
మేను గలిగి యుండుదు నెప్డు నెఱ్ఱనార్య."

ఎఱ్ఱనార్యునియందుఁ బక్షపాతము వహించి యుండుటకుఁ గారణ మాతఁడు సకలభాషాకవిత్వవిశారదుం డని మాత్రమె గాక సాధుసమ్మతుఁ డని నిత్యసౌమ్యమతి యని భవ్యుఁ డని విశ్వసించి పలుకుట వేమభూపాలుని గుణగ్రహణశక్తి బహుభంగులఁ గొనియాడఁ దగి యున్నది. మఱియు నెఱ్ఱనార్యునిఁ జూచి యతఁ డిట్లు పలికెనఁట.

"శా. నాతమ్ముండు ఘనుండు మల్లరథినీనాథుండునిన్నాతత
శ్రీతోడన్ సముపేతుఁ జేసి యెలమిం జేపట్టి మాకిచ్చుటం
జేతోమోద మెలర్ప రామకథమున్ జెప్పించి యత్యుత్తమ
ఖ్యాతిం బొందితి నింకనుం దనియ నేఁ గావ్యామృతా
స్వాదనన్.

కం. భారతపరాంశ మని యిం
పారగఁ జెప్పుదురు బుధులు హరివంశము నీ
వా రమ్యకథ దెనుంగున
ధీరోత్తమ నిర్వహించి తెలుపుము మాకున్."

ఇట్లు పలికిన పలుకులకు బ్రహ్మర్షి పులకితదేహుండై యతఁ డమ్మహాభాగుని సమగ్రసంప్రార్థనంబుఁ గృతార్థతాకలితవృత్తంబగు చిత్తంబునం గైకొని యిట్లనియె.

"ఉ. నన్నయభట్టతిక్కకవినాథులు చూపినత్రోవఁ బావనం
బెన్నఁబరాశరాత్మజమునీంద్రుని వాఙ్మయమాదిదేవుఁడౌ
వెన్నునివృత్త మీవు కడువేడుకతో వినునాయకుండ వి
ట్లన్నియు సంఘటించె మదభీప్సితసిద్ధికి రాజపుంగవా!"

ఇట్లు ప్రత్యుత్తరంబొసంగి యాకవిశిఖామణి హరివంశము తెనుంగునఁ దెలుపుటకుఁ బ్రారంభించెనఁట!

ఇతఁ డార్వేలనియోగిబ్రాహ్మణుఁడు. శ్రీవత్సగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. తండ్రి సూరన. తల్లి పోతమ్మ. శైవో

పాసకుఁడు. శంకరస్వామియను యతీంద్రులశిష్యుఁడు. ఈ శంకరస్వామి విద్యారణ్యస్వాములకుఁ గూడ గురువుగానుండె ను. ఎఱ్ఱాప్రెగ్గడ యింటిపేరు చెదల్వాడవారనియా తనివంశ మునజనించిన మల్లనకవి తన విప్రనారాయణచరిత్రములోఁ బూర్వకవిస్తుతిఁ జేయుచు నీక్రిందిపద్యములోఁ బేర్కొని యున్నాఁడు.

"సీ. ప్రతిభతోనారణ్య పర్వశేషముఁ జెప్పెఁ
గవులకుఁ జెవుల పండువులుగాఁగ
వల్మీకభవువచో వైఖరిరామాయ
ణంబు నాంధ్రప్రబంధంబుఁ జేసె
నారసింహుని పురాణమొనర్చె హరి మెచ్చి
నన్ను నెన్నఁడు చూచి నాడననఁగఁ
బ్రౌఢిమై హరివంశభాగముల్ రెంటను
రచియించె సభలందుఁ బ్రాజ్ఞులెన్న
ఆ. దురితహరుప్రబంధపరమేశ్వరుని జెద
ల్వాడ నిలయు నాదువంశకర్త
ధన్యమూర్తిఁ శంభుదాసు నెఱ్ఱాప్రెగ్గ
డను నుతింప బ్రహ్మకును దరంబె."

ఇందునుగూర్చి విప్రనారాయణ చరిత్రమునకు గ్రంథ పరిశోధకులు వ్రాసిన పీఠికలో నిట్లువ్రాయబడియున్నది.

"కవియవతారికలో నెఱ్ఱాప్రెగడను "చెదల్వాడనిలయు నాదువంశకర్త" యని పేర్కొనుటయేకాక యాతనికిఁ "బ్రబంధపరమేశ్వర" యను బిరుదమునే నామముగా నుపయోగించి యాతనివంశమున జన్మించిన వాఁడనని యర్థమును దెలుపుచు నతని ఫక్కినే యనుసరించి యాశ్వాసాంతముల యందు "ఇది శ్రీశంకరస్వామి సంయమీశ్వర చరణసరోరుహ ధ్యానానంద సౌందర్యధుర్యప్రబంధపరమేశ్వర వంశపవిత్ర లింగన మనీషిపుత్త్ర శ్రీకాళహస్తీశ్వర దయాసహాయ చెదల్వాడ మల్లయనామధేయప్రణీతంబైన" యని వ్రాసికొనుటచే వీరి యింటిపేరు తప్పక చెదల్వాడవారని తెలియుచుండగా, రావుబహదరు కందుకూరి వీరేశలింగముగారి కవులచరిత్రయు, గురుజాడ శ్రీరామమూర్తిగారి యాంధ్రకవి జీవితముగూడఁ గవిత్రయ ప్రసిద్ధుఁడగు నెఱ్ఱాప్రెగడ యింటిపేరు 'ఎర్పారివా' రని తెలుపుటకుఁ గారణమేమో చర్చింపఁదగియున్నది.

ఇందులకుఁ గారణము భాగవతషష్ఠస్కంధకర్తయుఁ గసువనామాత్యపుత్త్రుఁడునగు సింగయమంత్రియాఱవస్కంధము మొదల: —

"సీ. శ్రీ వత్సగోత్రుండుశివభక్తియుక్తుఁడా
పస్తంభసూత్రుఁ డపారగుణుఁడు

వైర్యారిశాసనుం డెఱ్ఱనప్రెగ్గడ
పుత్త్రుండు వీరన పుణ్యమూర్తి
కాత్మజుండగు నాదయామాత్యునకుఁ బోల
మాంబకు నందను లమితయశులు
కసువనామాత్యుండు ఘనుఁడు వీరనమంత్రి
సింగధీమణియు నంచిత గుణాఢ్యు
గీ. లుద్భవించిరి తేజంబు లూర్జితముగ
సొరిదిమూర్తిత్రయంబన శుభ్రకీర్తి
బరఁగిరందులఁ గసువనప్రభువునకును
ముమ్మడమ్మను సాధ్వి యిమ్మలను వెలసె''

అని తన వంశమును వర్ణించుకొనిన పద్యములోని శ్రీవత్సగోత్రత్వమును, శివభక్తియుక్తుఁ డను విశేషణము చేత నాకర్షింపఁబడిన శంభుదాసత్వమును, ఎఱ్ఱాప్రెగడయను నామమును, సరిపోవుచున్నవిగదా యని యాయెఱ్ఱాప్రెగడయె భారతారణ్యపర్వశేషము దెలిగించిన యెఱ్ఱాప్రెగడయని భ్రాంతిపడుటయే కాని వేఱుకాదు. సింగనమంత్రి తెల్పిన వంశావళిలో నెఱ్ఱాప్రెగడవంశమునందు వీరన, ఆదెయ్య, కసువమంత్రి, సింగయమంత్రియనువారు క్రమజనితపురుషులుగాఁ గనఁబడుచుండ, మనకవి తెల్పిన తన వంశావళిలోని ఎఱ్ఱాప్రెగడ, మల్లన, ఎఱ్ఱన, లింగన, మల్లనయనువారి క్రమము

పైక్రమమునకుఁ గేవలము విరుద్ధముగాఁ గనఁబడుచున్నది. ఒకవేళ, ఎఱ్ఱాప్రెగడవంశమునందు భాగవతషష్ఠస్కంధకర్తకుఁ దరువాత నీమల్లకవి తెల్పినవంశావళిలోని మల్లన యెఱ్ఱనాదులు పుట్టియుండిరేమోయని యెవ్వరైనను హాస్యాస్పదమైన యుక్తి చెప్పవచ్చును గాని యిది యెఱ్ఱాప్రెగడ సువిదితకాలమునకే హాని తెచ్చును. కావున నీయెఱ్ఱాప్రెగడ లిద్దఱు వేర్వేఱనియు, వీరికిఁ దోడు శ్రీవత్స గోత్రుఁడు, శివకృపాపాత్రుఁడు, సూచనమంత్రిపుత్త్రుఁడు, కొక్కోకకర్తయునగు నెఱ్ఱాప్రెగడ యింకొకఁడు గలఁడనియు నెఱుంగునది. సింగనమంత్రి వంశకర్తయగు నెఱ్ఱాప్రెగడయే కవిత్రయములోని యెఱ్ఱాప్రెగడయేని యతఁడు భారతారణ్యపర్వశేష రామాయణ హరివంశాదులను రచియించినట్లు సింగనమంత్రి భాగవతమున వ్రాసికొనకపోవునా ? ఇంతయేల ? భారతారణ్య హరివంశాదులను రచియించిన యెఱ్ఱాప్రెగడ నావంశకర్తయని మన మల్లయకవి ఘోషించుచుండఁగా నాతని యింటిపేరు చెదల్వాడవారగుటలో సంశయమేమి ? కాఁబట్టి సింగనమంత్రి భాగవతషష్ఠస్కంధములోని పై పద్యమందలి 'పర్చూరిశాసనుం'డను విశేషణమునుబట్టి కవిత్రయములోని యెఱ్ఱాప్రెగడ యింటిపేరు 'పర్చూరివా'రని భ్రాంతిపడరాదనియు, నెఱ్ఱాప్రెగడలు పలువురు కలరనియు, సుప్రసిద్ధుఁడగు నెఱ్ఱా

ప్రెగడ మనకవికి వృద్ధప్రపితామహుఁడనియు, నీతని యింటి పేరు చదల్వాడవారనియు స్పష్టపడుచున్నది. సింగనమంత్రి వంశకర్తయైన యెఱ్ఱాప్రెగడ గోలకొండదేశములోని నల్లగొండమండలమునందలియెర్వారుగ్రామమున నుండువాఁడు. కవిత్రయములోని యెఱ్ఱాప్రెగడ పాకనాటిదేశమువాఁడు. అతఁడు భారతారణ్యపర్వాంతమున—

"సీ. భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుండు
శ్రీవత్సగోత్రుండు శివపదాబ్జ
సంతతధ్యానసంసక్తచిత్తుఁడు సూర
నార్యునకును బోతమాంబికకును
నందనుం డిలఁ బాకనాటిలో నీలకం
ఠేశ్వరస్థానమై యెసక మెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత
నొప్పు ధన్యుఁడు ధర్మైకతత్పరాత్ముఁ
గీ. డెఱ్ఱనార్యుఁడు సకలలోకైకవిదితుఁ
డైన నన్నయభట్ట మహాకవీంద్రు
సరససారస్వతాంశ ప్రశస్తి దన్నుఁ
జెందుటయు సాధుజనహర్ష సిద్ధిగోరి."

అనుపద్యమునఁ దన నివాసము గుడ్లూరని వ్రాసికొనుటచే నప్పటి కతనియింటిపేరు గుడ్లూరువారని యుండి పిదప నీతఁడో

యితని వంశ్యులో చెదలవాడకుఁ జేరి యుండుటచే నేతద్వంశ్యులకుఁ జెదల్వాడవారను గృహనామము స్థిరపడి యుండునని తోఁచుచున్నది. కావుననే యితఁడు తననివాసము గుడ్లూరని భారతములో వ్రాసికొనుట యెఱింగియుండియు మనకవి యాతనివర్ణించు సందర్భమున "చెదల్వాడ నిలయు నాదువంశకర్త" నని చెప్పి యుండెను. కాఁబట్టి యెఱ్ఱాప్రగడ యింటిపేరు చెదల్వాడవారగుట నిర్వివాదాంశము. ఏర్చూరివారనుట భ్రాంతిమూలకము ననాకరము నగును.''

ఈమహాకవి తొలుత రామాయణమును పిమ్మట హరివంశమును రచించి ప్రోలయవేమారెడ్డి కంకితమును గావించెను. అనంతరము భారతారణ్యపర్వశేషమును రచియించి ప్రబంధపరమేశ్వరుఁ డన్న బిరుదమును బడసెను. ఏతద్విషయమును తన నృసింహపురాణమునం దిట్లు చెప్పుకొనియెను.

"ఉ. ఉన్నత సంస్కృతాది చతురోక్తి పదంబులవాక్యకర్తనై
యెన్నిక మైఁ బ్రబంధ పరమేశుఁ డనంగ నరణ్యపర్వశే
షోన్నయ మంధ్రభాష సుజనోత్సవమొప్పఁగనిర్వహించి
తొన్నయభట్టతిక్కకవినాథులకెక్కినభక్తి పెంపునన్ ''

ఇతఁడు తన నృసింహపురాణమును మాత్రము నరాంకితము చేయక అహోబలనృసింహస్వామివారికి సంకితముఁ గావించెను. అరణ్యపర్వశేషమును మాత్రము నన్నయ్య

భట్టు పేరితోనే రచియించి కడపట నీక్రింది పద్యములోఁ దద్రచన యగునట్లుగాఁ బూరించితి నని వ్రాసికొనియెను.

"క. ధీరవిచారుఁడు తత్కవి
తాఁకీర్తియుఁ గొంతదోఁపఁ దద్రచనయ కా
నారణ్య పర్వశేషము
పూరించెఁ గవీంద్రకర్ణపుటపేయము గాన్."

"ఎఱ్ఱాప్రెగడకవిత్వము మృదువును మధురము నయి, కదళీపాక మై, చాలవఱకు తిక్కన సోమయాజి కవిత్వమును బోలి యుండు"నని కవులచరిత్రమును, ఈతని కవనము నన్నయ తిక్కనల కవనముకంటె నించుక కఠినము. విశేషించి తెనుఁగు పదంబులఁ బ్రయోగించు నిష్టము గలవాఁడు. అచ్చటచ్చట సంస్కృత జటిలంబు లగు సమాసములు గానవచ్చెడిని. అన్వయకాఠిన్యమును గలదని కవిజీవితములును దెలుపుచున్నవి. "లోకోభిన్నరుచిః" అనునటుల లోకులరుచులు భిన్నంబులు గదా! ఇందును గూర్చి విశేషము దెలుప నవసరము లేదు. ఆంధ్రకవులలోఁ బ్రామాణికాగ్రగణ్యులని ప్రసిద్ధిగాంచిన కవిత్రయములోని వాఁ డైన శంభుదాసుని కవిత్వము ప్రౌఢ మై. రసవత్తర మై, మనోహర మై యుండు నని చెప్పుట కేవల నింద్య మైన దనుట వంటిదిగాక మఱొకటి గాదు. ప్రసిద్ధికెక్కి ఱ లేని నాచనసోమునకు, నాఁటి తిక్కన

మొదలగువా రితనితో సమకాలికు లైనను వారల చరిత్రము మఱియొక సందర్భమునఁ దెలుపఁబడును గావున నిచటఁ దెలుప మానినాఁడను.

—:o:—

VEMANA ANDHRA NILAYAM

## ఆఱవ ప్రకరణము.

—:o:—

### అనపోతభూపాలుఁడు.

(క్రీ. శ. ౧౩౪౦ మొదలుకొని క్రీ. శ. ౧౩౬౨ వఱకు)

ప్రథమవేమభూపాలునియనంతరమున నతని జ్యేష్ఠపుత్త్రుఁడు అనపోత రెడ్డి శాలివాహనశకము ౧౨౬౨ అనఁగా క్రీ.శ.౧౩౪౦ వ సంవత్సరమున సింహాసన మెక్కి రాజ్యభారమును వహించి క్రీ. శ. ౧౩౬౨ వఱకు ప్రజాపరిపాలనము గావించెను. వేమభూపాలునకు అనపోతరెడ్డి, అనవేమరెడ్డి, కోమటిరెడ్డి, దొడ్డాంబిక, వేమాంబిక, అను ముగ్గురు కొమాళ్ళును, ఇద్దఱు కొమార్తెలును గలరు. కోమటిరెడ్డి చిన్నవయస్సుననే గతాసువయ్యెను. దొడ్డాంబికను కాటయరెడ్డికిని, వేమాంబికను నల్లనూకయరెడ్డికిని నిచ్చి వివాహము గావించిరి. అనపోతరెడ్డి వేమభూపాలునకు కూర్మి పుత్త్రుఁడు. అనపోతరెడ్డి రాజ్యధురంధరుఁ డై తండ్రిపోయినమార్గమును బట్టి ప్రజారంజకముగ రాజ్యపరిపాలనముఁ జేసి తండ్రికిఁ గీర్తియు, రాజ్యమునకు

వన్నెయుఁ దెచ్చెను. తోఁబుట్టువుల భర్తలును సేనాపతులు నైన కాటయరెడ్డియు, నల్లనూకయరెడ్డియు రెండుభుజములుగా నుండిరి. ప్రచండసేనాని యగు అనవేమరెడ్డి విధేయుఁడై యుండెను. దక్షిణమున నుండి కర్ణాటకులును, పశ్చిమముననుండి పద్మనాయకులును, అప్పటప్పట రాచవారును, రెడ్డిరాజ్యమును వశపఱచుకొనవలయు నని ప్రబలప్రయత్నములు చేయుచు వచ్చిరిగాని మిగుల సమర్థుఁడును, పరాక్రమవంతుఁడు నైన అనపోతరెడ్డి వైరివీరమదభంజనుఁడై ఖాగస్థలఁ గాంచెను. తన రాజ్యమును సంరక్షించుకొనుచు వచ్చెను. క్రీ. శ. ౧౩౬౧వ సంవత్సరమున రేచెర్లసింగమనాయనిపుత్త్రులు అనపోతనాయఁడు మాదానాయఁడు బహుళసైన్యములతోఁ దాడివెడలివచ్చి ధాన్యవాటీపురమును (ధరణికోట) ముట్టడించినప్పుడు అనపోతరెడ్డి ప్రచండవిక్రమార్కుఁడై, భూరిసైన్యములతోఁ వారల నెదుర్కొని ఘోరసంగ్రామమును సలిపి కృష్ణానది కావలిప్రక్కకుఁ దఱిమికొట్టఁగా వారలు పరిభవమున కోర్వఁజాలక శిరువిట్లుపడుచు స్వరాజధానిపై తురుష్కులు దండెత్తి వచ్చుచున్నా రనువర్తమానము వినవచ్చినందునఁ బునఃప్రయత్నమును మానుకొని మరలి పోయిరి. అనపోతరెడ్డి యేయుద్ధమునందును నోడిపోయినట్లు గనుపట్టదు. ఆర్యధర్మములఁ బోషింపుచుండెను. వేదాఖ్య

యనసంపన్నులైన బ్రాహ్మణోత్తములకుఁ దనతండ్రి యొసంగిన యగ్రహారముల నన్నిటిని గాపాడుటయేగాక తానును హేమాద్రిధనఖండమునఁ జెప్పినప్రకారముఁ జేసి కీర్తనీయుఁడగుచుండెను. ఇతఁడు రాజ్యమునకు వచ్చిన రెండుసంవత్సరములవఱకును రామాప్రెగ్గడ వంశములోనివాఁ డగు మల్లనమంత్రిగ నుండినట్లు ఒంగోలుతాలూకాలోని మణికేశ్వరము శాసనమువలన నూహింపఁదగి యున్నది. ఆశాసనమునందు మల్లనమంత్రి స్వర్గస్థుఁడు కాఁగా నతని పిన్నతమ్ముఁడు మంచిరాజు శాస్త్రయుక్తముగ నుత్తరక్రియలు నెఱవేర్చి పుణ్యార్థము శాలివాహనశకము ౧౨౭౫ విజయసంవత్సర జ్యేష్ఠశు ౧౪ శనివారమునాడు తానావఱకు శ్రీశైలములోని పాతాళగంగపట్టున నుండి కొని వచ్చిన రెండులింగములలో నొకదానిని మాండుకేశ్వరస్వామిదేవాలయములో రావినూతుల పర్వతమల్లినాథలింగస్వామి యను పేరితో ప్రతిష్ఠాపనఁ గావించెను. మఱియొకలింగమును శ్రీగిరిలింగ మను పేర నెదుటనున్న మండపములోఁ బ్రతిష్ఠాపనము గావించెను. మఱియు నితఁడు శివక్షేత్ర మగు మణికేశ్వరములోని యాశివాలయమునకు నారామములు, భూములు మొదలగువానిని దానము చేసి ప్రఖ్యాతుఁ డయ్యెను.*

* నెల్లూరిశాసనములు ౩వ సంపుటము. ఒంగోలుశాసనము ౭౫, పేజీ ౧౦౩౭.

## అమరేశ్వరపునఃప్రతిష్ఠాపనము.

పైని చెప్పఁబడిన మల్లనమంత్రి గాక మఱియొక మల్లన మంత్రి కలఁడని, యమరావతీ శాసనములలో నొక శాసనమువలన విదిత మగుచున్నది. అతఁడు కేతచమూపతికుమారుఁడైన మల్లినాథుఁ డనియు, వేమపృథ్వీశ్వరుని రాజ్యధురంధరుం డయిన మంత్రి యనియు, కులక్రమాగతమైన మంత్రిత్వపదవియం దుండె ననియు నాశాసనము చాటుచున్నది. అట్టి మల్లినాథమంత్రికి లక్కాంబికయందు జనించిన వేమచమూపతి ధాన్యవాటీపురమునందుఁ బ్రతిష్ఠాపింపఁబడియున్న యమరేశ్వరదేవుని శాలివాహనశకవర్షంబులు ౧౨౮౩ ప్లవ సంవత్సర శ్రావణబహుళపంచమీగురువారమునాఁడు అనపోతయరెడ్డిగారికి ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధికొఱకును ధనకనకవస్తువాహనసమృద్ధికొఱకును, పుత్త్రపౌత్రాభివృద్ధికొఱకును పునఃప్రతిష్ఠాపనము గావించె నని యాశాసనము వేనోళ్ళఁ జాటుచున్నది. పునఃప్రతిష్ఠితమగుటకుఁ గారణ మేమో తెలియరాదు. ఈవేమచమూపతిశాసనములోని బిరుదములన్నియు వేమారెడ్డిమొదలగువారు వహించినవై యున్నవి. ఈశాసన మింకను బరిశోధింపవలసి యున్నది. ఇది విశేషవర్ణనలతోఁ గూడుకొని సంస్కృతాంధ్రభాషలలో లిఖింపఁబడి యున్నది. అందలి తెలుఁగుభాగ మీదిగువను వ్రాయుచున్నాఁ

డెను*. ఈశాసనములోని బిరుదావళిలో 'కృతసోమపాన' యని వ్రాయఁబడియుండుటచేత ఈకేతయమల్లయ వేము చమూపతి నియోగిబ్రాహ్మణుఁ డేమో యని సందియము కలుగుచున్నది. నియోగిబ్రాహ్మణుఁడే యై యున్నయెడల నింతశాసనము సంస్కృతాంధ్రభాషలలో వ్రాయించిన వాఁడు గోత్రాదివివరమును దెలుపుకొనియుండఁడా యని సంశయింప వలసి యున్నది.

---

* స్వస్తి సకలగుణగణాలంకార, చెంజీమలచూఱకార, విశ్వవిశ్వంభరావహదక్ష దక్షిణభుజాదండ, జగనొబ్బగండ, రాయచేకోలుగండ, అర్థిప్రత్యర్థి హేమాద్రిదాన నిరత, ప్రజాపరిపాలనభరిత, అమరాభరణ, రూపనారాయణ, వీరనారాయణ, భుజబలభీమ, కోదండరామ, అపరిమిత భూదాన పరశురామ, అనేక నగరోపకంఠ ప్రతిష్ఠాపిత బహువిహారారామ, సంగడి రక్షపాలక, జగరక్షపాలక, జగదగోపాల, గుజ్జరితర్థివిభాళ, ఘనభుజవిరాజమానకరవాలవృత, కృతసోమపాన, శ్రీపర్వతాహోబల నిర్మితసోపాన, దిక్కాంతామనోహర, కీర్తికుసుమామోద, కుండిప్రభాసహ్యాజాగౌతమీ జలక్రీడావినోద, వివిధదానవనృసింహ, పాండ్యరాయగజసింహ, ప్రజ్ఞా చతుర్విధోపాయ, కేళాదిరాయ, నిత్యపరిపాలితసత్య, పల్లవాదిత్య, రిపునరపతి గోధూమ ఘట్టనఘరట్ట, అప్పయగోపయ దిశాపట్ట, సంగ్రామసముద్దండ, చండభుజాసివిఖండితశత్రుకీలాల, స్నపమాన పిశాచగణస్తూయమానయశోమండన, అశయగియవరద శిరఃఖండన, దుర్మదవైరి వీరభయంకర, బసవశంకర, అమరేశ్వరదేవ శ్రీచరణ సరసీరుహ పత్త్రభావదండెనగోవ బ్రహ్మకుండి కృష్ణవేణ్ణా,

## సముద్రవ్యాపారము విస్తరింపఁజేయుట.

అనపోతభూపాలుని రాజ్యపరిపాలనకాలమున జరిగినమహా ద్విషయ మొందువక్కాణింపవలసి యున్నది. సముద్రతీరము నందున్న మోటుపల్లి పురాతనకాలమునుండియు వర్తకస్థానమై నౌకావ్యాపారమునకుఁ బ్రధానస్థానముగా నుండె ననియింతకుఁ బూర్వము దెలిపి యుంటిని. కాకతీయసామ్రాజ్యమస్తమించినవెనుక మోటుపల్లియందుండెడువర్తకులు పరస్థలములకుఁ బోవుటయు వ్యాపారము తగ్గుటయుఁ దటస్థించెను. అనపోతరెడ్డి యీ రేవుపట్టణమును వృద్ధికిఁ దీసికొని రావలయునని శ్రద్ధతో సంకల్పించెను. అనపోతరెడ్డియాజ్ఞాప్రకార మతని

---

గోదావరీమహానదీ తటద్వయ తన్మధ్యదేశ దత్తానేకాగ్రహార, అగణ్య పుణ్యక్షేత్ర సత్రదత్త బహువిధాహార, పరపురహరణమృత్యుంజయ, సంగ్రామధనంజయ, ఉత్తుంగచతురంగబలరిపుసేనాసాధక, త్రిపురాంతక దేవదివ్య శ్రీపాద పద్మారాధక, కేతయమల్లినాథపయఃపారావార పూర్ణ సుధాకరుండైన శ్రీమతు వేమన్నంగారు శకవర్షంబులు ౧౨౮౩గా ప్లవ సంవత్సర శ్రావణబహుళపంచమీగురువారం స్వస్తి సమస్త ప్రశస్తులైన శ్రీమతు అనపోతయరెడ్డింగారికి ఆయురారోగ్యైశ్వర్యాభివృద్ధిని, ధన కనకవస్తువాహన సమృద్ధిని, పుత్రపౌత్రాభివృద్ధిని అవునట్టుగాను పంచారామంబులకుం బ్రథమారామంబైనఅమరారామంబగు ధాన్యవాటీపురంబునకు నధీశ్వరుం డయిన శ్రీఅమరేశ్వర శ్రీమహాదేవరను ఆచంద్రార్క స్థాయిగాను పునఃప్రతిష్ఠ చేసిరి. (See Elliot's Collections)

మంత్రులలో నొక్కఁ డగుసోమయామాత్యుఁ డొకశాసన మును బ్రకటించెను.

మోటుపల్లి రేవ వర్తకులు వచ్చి నివసింపఁ గోరినను వారిని గౌరవించి వారలకు భూములు నివేశనస్థలములు నిప్పింతు మనియు, వారలు మఱియొకస్థలమునకుఁ బోఁదలఁచుకొన్న ప్పుడు వారిని నిర్బంధపెట్టి నిలుపక స్వేచ్ఛగా విడుతు మనియు, ఏయూరిసరకు తెచ్చినను వారిని స్వేచ్ఛగా నమ్ముకొన నిచ్చెద మనియు, పన్నులకై వారిసరకులను గ్రహింప మనియు నాశా సనమున వ్రాయించి ప్రకటించిరి. మఱియుఁ గొన్నివస్తువులపై సుంకములను దీసివేసియు, కొన్నివస్తువులపై సుంకములు గొం తవఱకు తగ్గించియు, మఱికొన్నివస్తువులపై పూర్వపుమర్యా దల ననుసరించి సుంకములు గైకొందుమనియు, బంగారుసుంక మును మానితి మనియుఁ బ్రకటించిరి. ఇదంతయు నెల్లైన రేవుపట్టణమును నభివృద్ధిలోనికిఁ దెచ్చి ద్వీపాంతరములతోడి వ్యాపారమును పెంపొందింపవలయునని మనఃపూర్వకముగాఁ జేసినప్రయత్నమైనట్లు శాసనముం జదివిన స్పష్టముగా బోధ పడఁగలదు. అనపోతరెడ్డితరువాతగూడనీనౌకావ్యాపారమభి వృద్ధి గాంచినటుల ననేకదృష్టాంతములు గనుపట్టుచున్నవి గావున నీతనిపరిపాలనము సర్వజనరంజకమై శ్లాఘాపాత్రమై

యున్నదనుటకు సందియము లేదు*. పై శాసనము శ్రీ. శ.

* స్వస్తిశ్రీశకవర్షంబులు ౧౨౮౦ అగు నేటివిళంబిసంవత్సర శ్రావణశు ద్ధ మంగళ్వారం స్వస్తిశ్రీమతు అనపోతయరెడ్డింగారు మోటుపల్లి కావువచ్చిన వ్యవహారాలకున్ను వ్యవహారంవచ్చి కరపట్టాలదీపాంతరాలవ్యవహారాలకున్ను యిచ్చినధర్మశాసనం.

యీమోటుపల్లికి యెవరుకాపతనానికివచ్చినాను వారిని మన్నించి పెద్దకానికె పెట్టువారము. వారికి భూమితోటికాణాచి యిచ్చువారము. వారు యెప్పుడు మరివొకతావుకు పొయ్యేమన్నాను కాపనిపట్టక అనిపిపుచ్చువారము. యేవ్వూరిసరకు తెచ్చినాను తమవిచ్చలవిడినమ్మనలసినట్టు సరుకుకొను వారుగాని పోగాపునకు పల్ సునిసర్కు ఆడపట్టేము. చీరాను, గంధము, జవాదము, పట్టివ్యవహారాలకున్ను అపుత్రికమున్ను సుంకాదాయము మానితిమి. బంగారుసుంకము మానితిమి. గంధముయొక్క బదిసుంకము పూర్వమర్యాదల లోను మూటను ఒకటి మానితిమి. యీసరకులకున్ను మెట్టసుంకాలు పూర్వ మర్యాదలు క్రమాననే కొనువారము. యీక్రమానకు సర్వమైనవారున్ను విశ్వ సించెదరు. దేవరవారికి అభయహస్తము నిస్తిమి.

శ్లోకం. జయతి నయవిశాలః ప్రత్యహం దానశీలః కృతబుధపరిపాలః సంగడి రక్షపాలః । అహితతమస్కృశానుః ప్రేమభూపాలసూనుః । స్తుతకలితమ హీశానన్నపోతక్షితీశః ॥ శాకాబ్దే గగనాష్టసూర్యగణితే త్రిరే వహాంభోనిధిః ప్రఖ్యాతేముకుగౌహ్వయె పురవరే శ్రీసోమమంత్రీ కరః మయాన్ దాహకరోజగజ్జనసుతాంసాంయాత్రికాణోమిమాం ॥ కీర్తివేమయ అనపోతనృపతే ఆచంద్ర మాతారకం అన్నపోతమహీపా లాశాసనార్థభూషణాం స్థాపితః స్థానసంస్తంభః । సోమమయా మాత్యధీమతా ॥

(ఈ శాసనమును సవరింపక మేమెత్తినకాపీ యెట్లున్నదో అట్లే ప్రకటించె చినారము).

౧౩౫౮ న వ్రాయఁబడినది. మోటుపల్లికి ముకుళపుర మని నామాంతరము గలదు. అనపోతరెడ్డి రాజ్యపరిపాలనము చేసినది పండ్రెండుసంవత్సరములు మాత్రమె. ఇతఁడే కారణము చేతనో తరువాత మృతినొందెను. ఇతఁ డింకను బ్రదికియుండిన యెడల రెడ్డిరాజ్యము ననేకవిధముల విస్తరింపఁజేసి కర్ణాటక సామ్రాజ్యమువలె నొకఘనసామ్రాజ్యమును దక్షిణహిందూస్థానమున స్థాపించి యుండును. కాని భగవద్విలాసము వేఱుగ నుండెను. ఇతనికి కుమారగిరిరెడ్డి యనుకుమారుఁడును, మల్లాంబ యనుకొమార్తెయును గలరు. మల్లాంబను తనమేనల్లుఁ డగుకాటయవేమున కిచ్చి వివాహము గావించెను.

## అనవేమభూపాలుఁడు.

(క్రీ. శ. ౧౩౬౪ మొదలుకొని క్రీ. శ. ౧౩౮౦ వఱకు).

అనపోతభూపాలునకు వెనుక నతనికుమారుఁడు బాలుఁడగుటవలనఁ గాఁబోలు నతనితమ్ముఁడు అనవేమరెడ్డి రాజ్యారూఢుఁడయ్యెను. అనవేమభూపాలుఁడు తనయన్నవలెనె శౌర్యవంతుఁడును, సమర్థుఁడును, ధర్మాసక్తచిత్తుఁడును నై ప్రజాపాలనము గావించెను. ఇతఁడు బ్రదికియున్నంతకాలము రాచకొండ, దేవరకొండదుర్గముల కధిపతు లై రాచకొండరాజ్యమును బరిపాలనము సేయుచుండెడి అనపోతనాయఁడు, మాధవనాయఁడు బలవద్విరోధు లై యీతనిరాజ్య మాక్రమించుకొనవలయు

నని యనేకపర్యాయములు దండయాత్రలు సలిపి యనవేమ భూపాలునితోడ ఘోరయుద్ధములు చేసి పరాజితు లగుచు వచ్చిరి కాని మనోరథ మీడేర్చుకొన్నవారు కారైరి. అనవేమ భూపాలుని కీవిజయములతోఁ గీర్తి విస్తరించెను. దక్షిణపుసరి హద్దున నున్నయుదయగిరిరాజ్యము కర్ణాటరాజ్యాధీశుల పరిపాలనమునకు వశమై ప్రవర్ధమానమై యొప్పుచున్నందున నెప్పటికైనఁ దనరాజ్యమునకు ముప్పు రాఁగలదని యూహించి తన్నివారణమార్గముల నారయుచుండెను. నూత్నకర్ణాటసామ్రాజ్యాధీశ్వరుల పుత్రులును, యువరాజులు నగువారు తఱుచుగా నుదయగిరిదుర్గమున నుండుచునుదయగిరిరాజ్యమును బరిపాలనము సేయుచుండిరి. అట్టియుదయగిరికి సమీపమునఁ దనరాజధానియుండుట రాజ్యవినాశమునకు హేతు వగుననియో పద్మనాయకవీరులు తఱచు ధాన్యవాటీనగరముపై దండయాత్రలు సలుపుచుండుట చేత తనరాజధాని ధాన్యవాటికాపురమునకు సమీపమునం దుండుట యుచితమని యెంచియో అనవేమభూపాలుఁడు శత్రువుల కభేద్య మగుకొండవీడునకు రాజధానిని మార్చుకొనియెను. గోదావరీమండలములోనియొక శాసనములో అనవేముఁడే కొండవీడును నిర్మించి రాజధాని

గా జేసికొన్నట్లు తెలుపఁబడినది. * అనవేమభూపాలుఁడు

---

*శ్లో. "పురా సా పురాణేన సదాశ్రితత్వా
త్సాకం శ్రియా దుగ్ధనిధే ర్వాసాత్
వర్ణా చ్చతుర్థా ద్విపులాంతరంగా
దుగ్ధే ర్ధాపోలయభూపతీందుః ॥ ౮
పుత్త్రేణ తస్యాప్రతిమోదయేన
భాగ్యావలంబస్వభుజోష్మభాజా
ఆంధ్రక్షమా వేమనృపేణ సాభూ
ద్రాజన్వతీ రాజధురంధరేణ ॥ ౯
ఉద్ధృత్య భూమిం యవనాబ్ధిమగ్నాం
సంస్థాపయంతం ప్రకృతౌ త్తిమార్యాః
సాక్షాత్కరో మానుషదేవభాజా
మహావరాహం పరికీర్తయంతి ౧౦
శ్రీశైలగంగాతట సీమ్నరమ్యాం
సోపానవీథిం విదధేన వేమః
యా దివ్యతిస్వర్గమనోద్యతానాం
నిశ్రేణిరిః ప్రథితా నరాణాం ౧౨
తతోన్నవేమనృపతిః
పరిపాలనకర్మణి
అపాలయ త్తస్య పుత్త్రి
స్తదంతేం ద్రవసుంధరాం ౧౩
కొండవీడుంరాజధానిం సతిచిత్రా మకల్పయత్
దృష్ట్వా త్వాష్టాపి చిత్ర్యా మభూద్యస్యాస్సువిస్మయః"
Elliot's collections. Page 270.

కందుకూరు మొదలుకొని విశాఖపట్టణమండలములోని సింహాచలముపర్యంతమును జయించి పరిపాలనము చేసినటు క్రింది శ్లోకమువలన నూహింపఁదగును.

"శ్లో. తస్యభ్రాతా నిఘృతవత్ప్రతాపో౽దసేంద్రవ్యాప్త
నీరంధ్రకీర్తిః శ్రీశైలవాసింహశైలం తతః క్ష్మాం
దత్తోధర్మేణానవేమక్షితీశః॥"

అనవేమభూపాలుఁడు తనతండ్రివహించిన జగనొబ్బగండఁడాదిగాఁగలబిరుదములను మాత్రమె గాక వసంతరాయఁడను బిరుదమును గూడ వహించెను. అనవేమభూపతి హేమాద్రి దానాధికుఁడై దారిద్ర్యవిద్రావణుఁడై శిబికర్ణదధీచులం బోలెఁ బ్రసిద్ధిఁ గాంచెనఁట. నిజాముసంస్థానములోఁ జేరిన నల్లగొండమండలములోనిమిర్యాలగూడెముతాలూకా నాగపల్లిగ్రామములో శ్రీఅగస్త్యేశ్వరస్వామివారియాలయప్రాకారమందు శిలాస్తంభముమీఁద అనవేమునిశాసనము గన్పట్టుచున్నందున నితఁడాకాలమున పద్మనాయకులరాజ్యములోఁ గొంతభాగ మాక్రమించినట్లు దోఁచుచున్నది గాని యింకను బరిశోధింపవలసినవిషయముగా నున్నది. ఎఱ్ఱాప్రెగ్గడ వేమభూపాలుని కంకితముగావించిన హరివంశములో నీ యనవేమారెడ్డిని బేర్కొనియుండలేదు. కాని యనేకశాసనములనుబట్టి యితఁడు వేమభూపాలుని పుత్త్రుఁడనియు, అనపోతరెడ్డి సోదరుఁ

డనియుఁ దెలియుచున్నందున నిందునుగూర్చి సంశయింపవల సినపని లేదు. అనవేమభూపాలుఁడు శాలివాహనశకము ౧౩౦౦ అగు సిద్ధార్థిసంవత్సర మాఘ బ ౧౪ శివరాత్రిపర్వకాలమున అనఁగా క్రీ. శ. ౧౩౭౮వ సంవత్సరము ఫిబ్రవరి ౨౫వ తేదిని రాజనీతిమర్మజ్ఞుఁడును, శాస్త్రవేత్తయు, అమాత్యశిఖామణి యు, లోహితసగోత్రుఁడును, మల్లయమంత్రిపుత్త్రుఁడు నగు ఇమ్మడీంద్రునకు ఇమ్మడిలంక లేక అనవేమపుర మను నగ్రహారమును దానముచేసె నని వానపల్లి తామ్రశాసనము వలనఁ దెలియుచున్నది. ప్రఖ్యాతపండితుఁడును మంత్రివర్యుఁడ నగు నతం డాయగ్రహారములో సగముభాగమును బ్రాహ్మణోత్తములకు దానము చేసెను. ఈయగ్రహారము గోదావరి మండలములోని అమలాపురముతాలూకాలోఁ గౌతమీతీర మున నున్నది. ఈశాసనమును వ్రాసిన మహాకవి త్రిలోచ నాచార్యుఁడు*.

అనవేమభూపాలుఁడు తనతండ్రి వేమభూపాలునివలెనె బ్రాహ్మణ వృత్తులను బ్రాహ్మణధర్మములను గాపాడుటయె గాక శ్రౌతస్మార్త విద్యలఁ బ్రోత్సహించుటకై బ్రాహ్మణుల కగ్రహారములు, భూములు దానము చేయుట యనునది యొకవ్యసనముగాఁగూడ గలిగియుండెనని యితనిచే లిఖింపఁబడిన

* Ephigraphia Indica, Vol. III, No. 10.

శాసనములుగూడ వేనోళ్ళఁజాటుచున్నవి. ఇతని తామ్రశాసనములు పెక్కులు గలవు. కృష్ణాగోదావరీతీరములయందు బ్రాహ్మణులు విశేషముగాఁ జేరుటకీ రెడ్డిభూనాయకులకు బ్రాహ్మణులయెడగల భక్తియు నార్యధర్మమునం దనురాగము, వైదిక మతాభిమానము ప్రధానకారణము లనుటకు లేశమాత్రమును సంశయములేదు. వీరలు పౌరాణికరాజుల పరిపాలనము లాదర్శములుగాఁ బెట్టుకొని వ్యవహరించినట్లు గన్పట్టుచున్నది. అనవేమభూపాలుఁడు గోదావరిమండలములోని తుల్యభాగనదీతీరముననున్న యిప్పటి మన్యమాపుర మను గ్రామమును భూసురులకు దానముచేసి శాసనము వ్రాయించెను. కృష్ణాతీరమునందు కొల్లూరుగ్రామమును బ్రాహ్మణుల కగ్రహారముగా దానముచేసి శాసనము వ్రాయించెను. గుంటూరుమండలములోని పెదచెఱకూరుగ్రామము నగ్రహారముగాఁ జేసి బ్రాహ్మణులకు దానముచేసి శాసనము వ్రాయించెను. ఆశాసనములో వేమభూపాలుని తండ్రి సైన్యనాథుఁ డనియు నాతనికి మాచయ, వేమయ, దొడ్డయ, అన్నయ, వల్లభయ యని యైదుగురు పుత్త్రు లున్నట్లుగా వ్రాయఁబడినది. ఎఱ్ఱాప్రెగడ హరివంశములో దొడ్డయను విడిచి నల్వురుపుత్త్రులను మాత్రమే పేర్కొని వల్లభయకు బదులుగా మల్లయను జెప్పెనాఁడు. వల్లభయకు మల్లయ యను నామాంతర ముండ

వచ్చును. దొడ్డయబాల్యములోనె మృతినొందియుండవచ్చును*.

---

* పెదచెఱకూరు శాసనములో అనవేమభూపాలునకు సంబంధించిన శ్లోకముల నిక్రింద నుదాహరించుచున్నాఁడను.

శ్లో. తస్యానుజస్తామరసాయతాక్షం
శ్రీయన్నవేమక్షితిపాలరత్నం
శూరాగ్రగణ్యః క్షురికాసహాయో
విఖ్యాతి వీరాహవకేళిలోలః.

యస్యారిన్ కులిశధ్వనిర్గళయతో దాడీషు భేరీరవం
నామానిధృతమర్జునస్య జనతస్సంగ్రామ గాండీవినః
సంగ్రామోపపదానితానిభవతాం రక్షాకృతే సర్వదా
సర్వంతా మతిబోధ యంత్యధిపతిం ధీయంత్రిణో మంత్రిణః.

యద్దాడీషు విరోధిరాజవిలయో యోద్దాలయో యోజితా
సహ్నాః కల్పితహేమకట్టిమధునస్యంవస్త్రలింగోజ్వలః
హేమాద్రిరివభూమి కాంతులయతి ప్రౌఢప్రతాపోష్మభిః
సప్రిత్యంతగిరేర్హేమసరిత స్సంవ్యాప్త తారావళిః.

శ్రీశైలె స్థిరమూలతా ముపగతావ్యాప్తా కుమారాచలే
పంచారామతతే ప్రతాపనకృతా సింహాచలేంద్రతతః
శ్రీకూర్మే పురుషోత్తమే కుసుమితా యద్ధర్మకీర్తిర్లతా
కాంశ్యా విశ్వపతేః పురఃఫలవతి నిత్యోపహారోచితా.

సోయం కరస్సంభృతమాలికాయా విచిత్రం
కాంతా కపోలముకరీకరణేన కంపః
వీరాన్నవేమనృపతే ర్జయనాకరేణ
ప్రత్యర్థినాం యుధిబలాధిపరోపితాని
అగ్రపయం త్యుపగమాచ్చరణాం తదియ్యాం

12

## అనవేమభూపాలుని కవులగోష్ఠి.

అనవేమభూపాలుఁడు విద్యాభిమానియనియుఁ బండితపక్షపాతియనియు, కవులపాలిటి కల్పతరువనియు, చాటు శ్లోకముల వలనను పద్యములవలనను దెలియుచున్నదిగాని యీతండుగాని యీతనియన్న యనపోతరెడ్డిగాని కృతినొందిన గ్రంథములెవ్వియుఁగానరావు. అనవేమభూపాలునిపై కవులు చెప్పిన చాటుపద్యములు :—

కం. కవితాకన్యకు నలుగురు
కవిజనకుఁడు భట్టు దాదిగణుతింపంగా
నవరసరసికుఁ డె పెనిమిటి
యవివేకియె తోఁడబుట్టు వనవేమనృపా.

---

క్షోధీర చామర శితా తపవారణాని.
నిస్సీమాం ప్రీతిగృహ్యాస్పత్తి విషయమె సర్వోత్తరా ముర్వరాఙ్
భూదేవేషు తథాపరిగ్రహవిధా ప్రాప్తేషు తృప్తింపరాఙ్
భూదానవ్యసన ధ్రుపంపునరసా వీరాన్న వేమప్రభుః.
ప్రాదాత్స్వర్ణమయీం విధాయ రచయె సద్వీప శైలార్ణవాన్
ఏతాదృంజ్ఞ మహిమ శ్రీమదనవేమ మహీపతిః
కదాచి దోషాధీశస్య గ్రహణె సముపస్థితే జలే పాథోనిక్షేః
స్నాత్వాకృత్వా దానాని షోడశ శ్రుతాధ్యయన సంపన్నైః
శ్రౌతస్మార్త క్రియారతైః విజ్ఞాపితోవిప్రేవ రైభూదానవ్యసనస్వయం
ఇత్యగ్రామః మిదం ప్రాదా దష్టైశ్వర్య సమన్వితం."

కం. కొంచెపు జగములలోపల
నంచితముగ నీదుకీర్తి యనవేమనృపా!
మించెను గరి ముకురంబునఁ
బంచాక్షరిలోన శివుఁడు బలసినభంగిన్.

గీ. పందికొమ్మెక్కి పెనుబాముపడగ లెక్కి
మేటితామేటి వీపెక్కి మెట్టలెక్కి
విసివి వేసారి యనవేమవిభునిఁ జేరి
రాణివాసంబుగతి మించె రత్నగర్భ.

కం. రాకున్నఁ బిలువఁ జేనియు
రాకకు ముదమంది చేరరమ్మనఁ డేనిన్
ఆకొన్న నీయఁ డేనియు
నాకొలువటు కాల్పవలయు ననవేమనృపా.

శ్లో. అనవేమమహీపాల స్వస్త్యస్తు తవ బాహవే
ఆహవే రిపుదోర్దండ చంద్రమండలరాహవే.

ఈశ్లోకము నొకకవి యనవేమభూపాలునిపైఁ జెప్పఁగా నా తఁడు [illegible]సించి మూఁడువేలు పారితోషిక మొసఁగెనఁట! అప[illegible]కవి తానునాల్గువేలు (వే అనునక్షరములు) ఒసఁగిన మీరు మూఁడు వేలిచ్చెదరాయనెనఁట! అంతట ననవేముఁడు నాల్గువేలొసఁగితిననెనఁట! అప్పుడు కవి మేమొసఁగిన దే మా కొసఁగిపంపెదరా యనెనఁట! అనవేముఁ డైదువేలుకొమ్మనె

నఁట! అప్పుడు కవికులమును (ఆర్వేలనియోగి) గుంచించెదరా యనెనఁట! అంతటనన వేముఁ డాఱువేలిచ్చితిననెనఁట! కవి నేను పుట్టువుతోడనే యార్వేలవాఁడన ననెనఁట! అనవేముఁడు చాతుర్యమునకు మెచ్చి యేడువేలు కొనుము ననెనఁట! కవి సంఖ్యమంచిదికాదననెనఁట ! అనవేముఁ డెనిమిదివేలిచ్చి పంపెనఁట ! అప్పుడు కవి సంతసించి వెడలిపోయెనని చెప్పుదురు. ఈకథవలన గ్రహింపఁదగినది అనవేమభూపాలుఁడు మిక్కిలి కవిత్వాభిమానముగల రసికుఁడని నెఱదాతయని తేటపడుచున్నది.

## అనవేమభూపాలుని మరణము.

అనవేమభూపాలునకు సమకాలికుఁడగు అనపోతనాయని మనుమఁడగు అనపోతనాయఁడు, అనవేమభూపాలుని యుద్ధములో సంహరించి పట్టుతలాటంకబిరుదమును బొందెనని వెలుగోటివారి వంశచరిత్రము దెలుపుచున్నదిగాని సమకాలికుఁడైన అనపోతనాయఁడు చంపెనన్న విశ్వసింపవచ్చును. లేక యతనికుమారుఁడు చంపెనన్నను విశ్వసింపవచ్చునుగాని, అనవేముఁడు చనిపోయిన ముప్పదేండ్లకు వెనుకనున్న అనపోతనాయఁడు వచ్చి సంహరించెననుట యంతగా విశ్వాసపాత్రముగాఁ గన్పట్టదు. మఱియు మఱియొకస్థలమున సింగనమాపెవేంద్రునిమునిమనుమఁడగు లింగమనాయఁడు అనవేమరెడ్డిని

సంహారించి సింహతలాట బిరుదమునొందెనని పై వెలుగోటి వారి వంశచరిత్రమే చెలుపుచున్నది. అనవేమరెడ్డి సింగనమాధవేంద్రునకు సమకాలికుఁడు. సంగనమాధవేంద్రుని మునిమనుమఁడగులింగమునాయఁడెట్లు సంహారించి సింహతలాట బిరుదమునందెనో యూహింపనలవిగాదు. కాఁబట్టి అనవేమ భూపాలుఁడు వెలుగోటివారి వంశచరిత్రములోఁ జెప్పినట్లు అనపోతనాయనివలనఁగాని లింగమనాయనివలనఁగాని సంహరింపఁబడెననుట విశ్వాసపాత్రముగాదు.

## కుమారగిరి భూపాలుఁడు.

(క్రీ. శ. ౧౩౮౩ మొదలుకొని క్రీ. శ. ౧౪౦౦ వఱకు)

అనవేమభూపాలునిశాసనములు క్రీ. శ. ౧౩౮౨ వఱకుఁ గనుబట్టుచున్నవి గాన తరువాతనే అనపోతనాయని కుమారుఁడు కుమారగిరిరెడ్డి రాజ్యభారమును వహించెను. ఇతనికి వసంతోత్సవములయందున్న ప్రీతి రాజ్యాంగవ్యవహారముల యందు లేకపోయెను. కుమారగిరిరెడ్డి తండ్రితాతలవంటి ప్రజ్ఞావంతుఁడుగఁ గన్పట్టఁడు. విద్వాంసుఁడై విద్యావ్యాసంగముల ప్రొద్దుపుచ్చువాఁడేగాని రాజ్యరక్షణమునందు ప్రమత్తుఁడై కనుమఱంగియుండెను. కర్ణాటసింహాసనాధ్యక్షుఁడగు రెండవ హరిహరదేవరాయ లీతనికి సమకాలికుఁడై యుండెను. కర్ణాట యువరాజగు దేవరాయ లుదయగిరి రాజ్యమున కాధి

పత్యమును వహించి ఉదయగిరి నెల్లూరు దుర్గములలోనుండి రెడ్డిరాజ్యమును క్రమముగ నాక్రమింప నభిలషించుచు సమయమునకై నిరీక్షించియుండెను. రాచకొండ, దేవరకొండ దుర్గాధీశ్వరులగు పద్మనాయకులును, శూరవరపట్టణాధీశ్వరులగు రాచవారు మొదలగువారును తనరాజ్య మాక్రమించుకొనవలయునని ప్రబలప్రయత్నములు సలుపుచుండఁగా నీ కుమారగిరిప్రభువు వసంతోత్సవములతోఁగాలము గడపుచు రాజ్యభారము నంతయు బంధువును మంత్రియునైన కాటయవేముని పై నిడి ప్రమత్తుఁడై యుండెను. కుమారగిరితోఁ బుట్టువైన మల్లాంబిక పెనిమిటియగు కాటయవేమారెడ్డి మిగుల సమర్థుఁడుగావున కుమారగిరిభూపాలునికాలమున రాజ్య మన్యాక్రాంతముగాకుండ సంరక్షింపఁ గలిగెను. కాటయవేమారెడ్డి కర్ణాటరాజ్యాధీశులతోడ మైత్రిగలిగియుండి సంగ్రామధనంజయుండని విఖ్యాతిగాంచి శత్రురాజులకు భయంకరుండై మంత్రియు, సేనానియు నై తానే రాజ్యపరిపాలనము సేయుచుండెను.

## అవచి తిప్పయ సెట్టి.

ఆకాలమునాటి రెడ్డిప్రభువులు వసంతోత్సవములు సలుపుచుఁ బ్రఖ్యాతిఁగాంచుచుండిరి. కాని కుమారగిరి విస్తరించి సలుపుటచే నతనికి వసంతరాజను బిరుదము గలిగినది. అవచి

దేవయసెట్టి కుమారుఁడు తిప్పయసెట్టి కుమారగిరిరెడ్డికి మి
త్రుఁడును, సచివుఁడును, సుగంధభాండాగారాధ్యక్షుఁడు నై
వసంతోత్సవములయందు నెక్కువగాఁ దోడ్పడుచుఁ బ్రఖ్యాతి
గాంచినవాఁడు. ఇతఁడు కీర్తిలతాధిష్ఠితాష్టాదశద్వీపాంత
రాళుం డగు కొమరగిరి వసంతనృపాలునివలన నాందోలికా
ఛత్రచామర తురంగాది రాజచిహ్నములం బడసినవాఁడట.
మఱియు నీతఁడు ప్రతి సంవత్సర వసంతోత్సవమునకుఁదగిన
కస్తూరీ కుంకుమ ఘనసార సంకుమదహిమాంబు కాలాగురు
గంధసార ప్రభృతి సుగంధద్రవ్యంబు లొడఁ గూర్చుచుండెను.
ఇంతియగాక యితఁడు చీని సింహళ తవాయి హురుమంజి
జలనోగి ప్రభృతి నానాద్వీపనగరాకరంబులగుధనకనకవస్తు
వాహనమాణిక్యగాణిక్యంబులు తెప్పించుచుండెను. కవి
నైగమికనాదివాంశికవైతాళికాదు లగు నర్థిజనంబులకు
నర్థంబులు గుప్పించు ధీరుండును, నుదారుండును, గంభీరుం
డును సదాచారుండును, నన విఖ్యాతిఁ గాంచినవాఁడఁట.
ఇతండు త్రిపురాంతక దేవదివ్యశ్రీపాదపద్మారాధకుఁడఁట.
ధర్మద్రావిడ బిరుదాధారుఁడఁట! ఇమ్మడిగరుడనారాయ
ణుఁడు, అభయద్రావిళుఁడు, మొదలగు బిరుదము లెన్నిటినో
వడిసియుండెను. ఇతఁడు వీరమాహేశ్వరాచారభక్తిపరుఁడై
శివసాయుజ్యముఁబొందిన కంచిచిరుతొండనంబివంశమున జనిం

చిన వాఁడు. ఈలక్ష్మీపుత్త్రుని పితామహులు, మాతామహులుగూడ నిఖిలలోక ప్రసిద్ధవాణిజ్య వంశ ధరు లని బాలసఖుండును మహాకవిసార్వభౌముఁడు నగు శ్రీనాథునితోఁ జెప్పినట్లుగా హరవిలాసములోని యీక్రిందిపద్యమువలన వేద్యమగు చున్నది.

"సీ. కట్టించె నొకతాత కంచిహర్మ్యంబులు
హరిణాంకమౌళి కేకామ్రపతికి
బాలార్క మనియెడి పద్మరాగము డాఁచె
నొక తాత గంచినాయకుని నాభి
నొక తాత గట్టించె యోజనత్రయదీర్ఘ
తరతటాకాంభోధి తిరువళూరఁ
గావేరి కట్టించెఁ గార్పాసరాసుల
నుబ్బిచోడఁడు మెచ్చ నొక్కతాత
గీ. ప్రతిదినము గపురపుదీపములు వేయు
వ్రతముగా నొక్కతాత యీశ్వరున కొసఁగె
నిఖిలలోక ప్రసిద్ధ వాణిజ్యవంశ
ధరులు మాతాత లుభయగోత్రముల వారు."

వేమభూపాలునకు ప్రాపుగానుండిన యవచిదేవయసెట్టికి మాచాంబయందు మూవురు కొమాళ్లు జనించిరి. అందు జ్యేష్ఠుఁడు త్రిపురారి (తిప్పయ్యసెట్టి) రెండవకొడుకు తిరుమల

నాథుఁడు (తిరుమలసెట్టి) మూఁడవవాఁడు చామిసెట్టి కొమర గిరివసంతనృపాలు వసంతవైభవము నంతయు తిరుమలనాథ సెట్టి యొక్కడే నిర్వహించుచుండెననియు, హరిహరరాయలు, ఫిరోజిషా, గజపతి మొదలగు భూపాలు రెల్ల రీతని ప్రభావము నభివర్ణన సేయుచుండి రని హరవిలాసములోని యీక్రింది పద్యమువలనఁ దెల్లమగుచున్నది.

"చ. హరిహరరాయ ఫీరోజిసహా సురధాణ గజాధిపాది భూ
పరులు నిజప్రభావ మభివర్ణనసేయఁ గుమారగిర్యధీ
శ్వరునివసంతవైభవముసర్వమునొక్కఁడనిర్వహించుమా
తిరుమలనాథసెట్టికిని ధీగుణభట్టికి నెవ్వ రీఁ డగున్."

## సముద్రయానము-విదేశవ్యాపారములు.

సముద్రయానము సేయుటయందును విదేశవ్యాపారములు సలుపుటయందును పైసిజెప్పిన వైశ్యకుటుంబమువారు ప్రఖ్యాతిఁగాంచియుండిరి. తిప్పయసెట్టి తమ్ముఁడైన చామిసెట్టి సముద్రప్రయాణము చేసి నానాద్వీపాంతరములకుఁబోయి కర్పూర పాదపములు, బంగారు మొలకలు, సంకుమద ద్రవములు, ఆణిముత్యములు, కస్తూరికాటంకములు, చీనాంబర శ్రేణి, గంధసింధురములు, తేజిహరులు మొదలగు వాని నాంధ్రదేశమునకుఁ గొనివచ్చుచుండె నని హరవిలాసములో నీక్రిందిపద్యములో జెప్పఁబడినది.

"సీ. పంజాబు కర్పూరపాదపంబులు తెచ్చి
జలనోగి బంగారు మొలక తెచ్చి
సింహళంబున గంధసింధురంబులు తెచ్చి
హురుమంజి బలు తేజి హరులు తెచ్చి
గోవ సంశుద్ధ సంకుమదద్రవము తెచ్చి
యాపగ నాణిముత్యాలు తెచ్చి
చోటంగి గస్తూరికాటంకములు తెచ్చి
చీనిచీనాంబర శ్రేణి తెచ్చి
గీ. జగద గోపాల రాయవేశ్యాభుజంగ
పల్లవాదిత్య భూదానపరశురామ
కొమరగిరిరాజ దేవేంద్రుకూర్మిహితుఁడు,
జాణ జగజెట్టి దేవయచామిసెట్టి.,,

తన యాజ్ఞను తలధరించి తమ్ములిద్దఱును దీవుల కేఁగి వ్యాపారముచేయుచు గడించిన లాభమునంతయు నన్నకొసంగఁగా నాతఁడాధనమును సద్వినియోగముసేయుచు నరుల కిచ్చుచు విమలకీర్తి సంపాదించుచుండెను. తిప్పయసెట్టి వాణిజ్యవ్యాపారముసేయుటయందు మిక్కిలి కుశలుండని కూడ హరవిలాసమునందీక్రిందిపద్యములో నభివర్ణింపఁబడి యుండెను.

"మ. తరుణాచీని తవాయి గోపరమణా స్థానంబులం జందనా
గరుకర్పూరహిమాంబుకుంకుమరజఃకస్తూరికాద్రవ్యముల్
శరధిం గప్పలిజోగులన్ విరివిగా సామాన్ల దెప్పించు నే
ర్పరియా వైశ్యకులోత్తముం డవచితిప్పం డల్పుఁడే
యిమ్మహిన్."

పండువాఢిల్లిరాఘాదిపట్టణాధీశ్వరులు మాళిదాల్చు రత్నాంకురములు సింహళద్వీపమండలక్షేత్రజము లనియు నయ్యవి తిప్పయసెట్టి నౌకలలోఁ గొనిరాఁబడుచున్న వనియు హారవిలాసములోని యీక్రిందిపద్యములోఁ దెలుపఁబడినది.

"గీ. పండువాఢిల్లిరాఘాదిపట్టణముల
యధిపతులు మాళిఁదాల్చు రత్నాంకురంబు
లవచిత్రిపురాంతకానీతయానపాత్ర
సింహళద్వీపమండల క్షేత్రజములు."

అవచితిప్పయసెట్టికిఁ జిన్నటనాఁడు దయతో నక్షరశిక్షయు దైవమార్గసంపన్నతయు, వివేకపరిపాటియును గృపచేసిన వాఁడు మహాప్రధానియు గురూత్తముఁడునైన పిల్లలమఱ్ఱి పెద్దన యని హారవిలాసములోని యీక్రిందిపద్యము దెలుపుచున్నది.

"ఉ. చిన్నటనాడు సత్కరుణఁ బిల్లలమఱ్ఱిమహాప్రధానిపె
ద్దన్నగురూత్తముండు, తగ నక్షరశిక్షయు దైవమార్గసం
పన్నతయున్ వివేకపరిపాటియునుం గృపసేసె నర్థినే

యన్నకునట్టి సెట్టిత్రిపురాంతకునిం దగుఁ బ్రస్తుతింపఁగన్ ॥"

ఈతిప్పయసెట్టికి అన్నమదేవియందు మాచయసెట్టి, విశ్వనాథసెట్టి, చినమల్లయసెట్టి, మూవురుకొడుకులు పుట్టి వంశదీపకులై కీర్తికెక్కిరి. తిప్పయసెట్టి వృద్ధుఁడై కుమారగిరి యనంతరము బహుకాలము బ్రదికియుండి బాలసఖుండైన శ్రీనాథకవివర్యునిచే హరవిలాసమును గృతినొంది యేతన్మూలమునఁ దనకీర్తి జగంబున నిలుపుకొన్నవాఁడయ్యెను. శ్రీనాథుని హరవిలాసము లేనియెడల నిట్టియుత్తమకుటుంబముయొక్క చరిత్రము నాకాలమున విదేశములతోడి వాణిజ్యవ్యాపార విషయములు మనకుఁ దెలియఁజాలవుగదా. ఇట్టి యుత్తమ వైశ్యకుటుంబమువారిచరిత్రమును మన దేశమునందలి వైశ్య శిఖామణులైన కోమటులు పఠించి తమపూర్వులాకాలమున నెంతప్రఖ్యాతి గడించిరో తెలిసికొని బహిష్కారములకు భయంపడక స్వేచ్ఛగా సముద్రయానము చేయుచు విదేశవర్తక వ్యాపారముల నభివృద్ధిపఱిచి ధనమార్జించి యాంధ్రదేశమునకు మహోపకారమును జేసి శాశ్వతకీర్తిని సంపాదింతురుగాక.

### కాటయవేముఁడు-రాజ్యవిభాగము.

కాటయవేముడు కుమారగిరిరెడ్డికి ధర్మరాజునకు శ్రీకృష్ణుఁడును బోలె మేనమఱందియు, సచివుఁడుఁ జెలియునై యుండె

రాజ్యమును సంరక్షించుచున్నవాఁడగుటచేత నితనికి రాజమహేంద్రవరము రాజధానిగాఁగల తూర్పుదేశమును విడఁదీసి యిచ్చినట్లు దెలియుచున్నది.* ఈయొక్క విషయమే కుమారగిరిరెడ్డియొక్క యవివేకమును దుర్బలత్వమును వేనోళ్ల జాటుచుండెను. ఇదియె కుమారగిరిరెడ్డియనంతరము రెడ్డిప్రభువులలో ముఖ్యముగా కోమటి వేమారెడ్డికిని కాటయవేమారెడ్డికిని వివాదములు కలుగుటకును, కోమటివేమారెడ్డి కుమారగిరిరెడ్డిరాజ్యము నాక్రమించుటకును గారణమయ్యెను.

## ఉండ్రాజుశాసనము.

అనవేమభూపాలుని పరిపాలనానంతరమునను కొమరగిరి వసంతనృపాలుని పరిపాలనాప్రారంభమునను కృష్ణాగోదావరీ మధ్యఖండముననఁగా నిప్పటికృష్ణామండలములోని తణుకు భీమవరము తాలూకాలనఁగా లంకసీమలో గొంతిభాగమును

* కాటయవేముని భార్య మల్లాంబ తొత్తరమూడి శాసనములో నిట్లు దెలుపఁబడియున్నది.

"శ్లో. ఆసీదమాత్యరత్నం కాటయవేమప్రభు స్తస్య
అతిసురగురుభార్గవ మతిరతిభార్గవవిజయవిఖ్యాతిః.
శ్లో. సింహాసనే నిధాయాసౌ కుమారగిరి భూవరం
అతేజయన్మహా తేజా శ్రీకృష్ణ ఇవధర్మజం
కుమారగిరి భూనాథోయస్మై విక్రమతోషితః
ప్రాదాత్ ప్రాచీభువంరాజమహేంద్రనగరీముఖాం."

ఝల్లిసీమను ఉండ్రాజనునాయన పరిపాలనము చేయుచున్నట్లు రావులపర్తితామ్రశాసనమువలన ద్యోతకమగుచున్నది. ఇతనికి శూరవరపట్టణము రాజధానిగ నుండెనని యాశాసనమునం జెప్పఁబడినది. సూర్యవంశమున దేవరాజు జనించెననియునాతనికి ఉండ్రాజు జనించెననియు, ఆయనకు చిమ్మిదేవియందు తమ్మిరాజుజనించెననియు, ఆయనకు వీరమదేవియందు ఉండిరాజు జనించెననియు ఆశాసనమునం బేర్కొనఁబడియున్నది ఈయనభార్య రుద్రమదేవి శాలివాహనశకము ౧౩౦౪ దుందుభిసంవత్సరమునఁ దనపురోహితుడయిన నృసింహాభట్టు మొదలగు బ్రాహ్మణబృందమునకు నుంగుటూరిసీమలోనున్న రావులపఱ్ఱుగ్రామమును అగ్రహారముగాఁ జేసి దానముచేసెనని చెప్పఁబడియున్నది. ఉండీశుఁడు, ఉండ్రాజునామములు తణుకుతాలూకాలోని ఉండ్రాజవరమును, భీమవరముతాలూకాలోని ఉండిగ్రామమును జ్ఞప్తికిఁ దెచ్చుచున్నవి. కనుక నితఁడు ఉండిపట్టణమున కధీశుఁడై యుండి ఉండ్రాజవరమును గట్టించియుండును. కాఁబట్టి శాసనములోఁ జెప్పఁబడిన శూరవరపట్టణము ఉండినగరమునకు నామాంతరమేమోయనియూహాపోడముచున్నది. శూరవరపట్టణము మఱియొకచోటనున్నను నుండవచ్చును. ఈశాసనము వర్ణనాంశములేవిశేషముగానుండి చరిత్రాంశము కొం రెండైనను గానరాకు

న్నందున నీతనిచరిత్రము తెలియకున్నది. ఇది క్రొత్తగబయలు పడిన శాసనముగా నున్నది*.

---

* ఈతామ్రశాసనముయొక్క ప్రతి రావులపర్తి కరణము కీర్తిశేషులైన ఆదూరి శేషయ్యగారివలన నాకు దయాపూర్వకముగాఁబంపఁబడినది. రావులపట్టు గ్రామములో మట్టి త్రవ్వుచుండ రాతిచే భద్రపఱుపఁబడి యున్న యీశాసనము కాగుపాడు కాపురస్థులైన కడియాలరత్నముగారికి దొరకినది. ఈశాసనము ఏఁడురాగిరేకులమీఁద వ్రాయఁబడినది. దొరకిన రాగిపోనీయఁగూడదను తలఁపుగల కమ్మవారికీశాసనము లభించుటచే అసలుశాసన మెచటికిఁబంపుటకును వారంగీకరింపలేదు. పరిశీలించి నకలెత్తుకొనుట కిచ్చినందున శేషయ్యగారు నకలు వ్రాయించి యిప్పించినారు. రేకులు రెండుప్రక్కలను వ్రాతగలదు. శాసనము పదుమూడవ పేజియందు ప్రారంభింపఁబడి యొకటివఱకు వ్రాయబడినది. అనఁగా శాసనము చివరనుండి మొదలునకు చదువుకొనవలయును. శాసనము సంస్కృతములో నున్నది. ఇప్పుడు దీనిప్రతి నాకడ నున్నది. ఇందనేకగోత్రసంభవులయిన బ్రాహ్మణోత్తములనామములు పెక్కులుగలవు. ఈశాసనము చివరను పెదచంద్రరాజుయొక్కయు, వానితమ్ముఁడు కాఁబోలు వెంగుయొక్కయు చేవ్రాళ్లుగలవు. ఆశాసనములోని కొన్నిశ్లోకము లిచట నుదాహరించుచున్నాను.

యదీయయాత్రా రిపుదివ్యయాత్రా
యదాతపత్రం భువనాతపత్రం
యదీయగోత్రం ధృతసర్వగోత్రం
యస్యాసిపత్రం నిజశౌర్యమిత్రం॥
బిరుదస్తురాజ వేశ్యభుజంగ ఇతి యోధనంది మేరురితి

ఇతఁడు రెడ్ల కనుకూలుఁడుగ నుండి పరిపాలనము చేయుచుండెనో స్వతంత్రుఁడుగనుండి పరిపాలనము చేయుచుండెనో తెలియరాకున్నది. ఈశాసనవిషయములం బరిశీలింపవలసియున్నది. ఇతఁ డనుకూలుఁడుగాని శత్రువైనచో తమరాజ్యమధ్యమునం దుండనిచ్చుటకు రెడ్డిరాజు లనుమతింతురాయనునది యొక గొప్పసందియముగా నున్నది.

---

ఖ్యాతోశ్వదాన దీక్షాగురురితి నడగోటమల్ల ఇతి లోకై
యస్యాశూరవరం నామ రాజధా న్యభవత్పురీ
పురందరపురీరమ్యా సర్వసంపన్నవాసభూః॥
తత్ర స్థిత్వా బహువిధబలప్రోద్ధతాన్భూమిపాలాన్
జిత్వానీత్వా స్వచరణయుగప్రాంగణావాసభూమిం
సంఖ్యాతీతానమితఫలదాన్ పాలయిత్వాచ దేశా
నుండీశాఖ్యో జయతి సుచిరం కింకరశ్శంకరస్య
దానశౌండోయముండీశః ప్రచండభుజవిక్రమః
అగ్రహారం ద్విజన్మభ్యో దాతు ముద్యుక్తవాన్పరం॥
శాకెంభోధివియద్గుణేందు గణితీసంవత్సరే దుందుభౌ
మాఘేమాసి సితే తిథౌ చ దశమే వారే సూర్యాణోంగురోః
గ్రామంరావులపర్తిసంజ్ఞమకరోద్ దుండీశ్వరో విప్రసాత్
కృత్వోండీశపురం సభోగకృషికంభాగైరశీత్యాయుతం॥
అస్యైవోత్తరభాగే గ్రామస్యాసీద్యథాసీమా
శతపికముంగుటూరి క్షేత్రం ఖారీత్రయంప్రాదాత్॥

## కుమారగిరిరెడ్డి గ్రంథరచనము.

తన పూర్వులవలెనె కుమారగిరిరెడ్డి కూడ విద్యాభిరతి గలిగి విద్వాంసుల నాదరించి పోషించుటయెగాక తాను విద్వాంసుఁడై సంస్కృతభాషలో 'వసంతరాజీయ' మను పేరిట నాట్యశాస్త్రమును రచించినట్లు గన్పట్టుచున్నది. ఇతని మేనమఱఁది కాటయవేముఁడును విద్వాంసుఁడై కాళిదాసకవికృత నాటకత్రయమునకు వ్యాఖ్య రచియించెను. ఈవ్యాఖ్యానములోఁ దఱచుగాఁ బెక్కుతావుల వసంతరాజీయమునుండి ప్రమాణవాక్యములు గైకొనఁబడుచు వచ్చెను. కుమారగిరిరెడ్డికి వసంతరాజను పేరుగలదుగాన తత్కృతమైన నాట్యశాస్త్రమునకు వసంతరాజీయ మను నామము గలిగినది.

కుమారగిరిరెడ్డిభూపాలుఁడు క్రీ. శ. ౧౪౦౦ వఱకును బరిపాలనము చేసినట్లు గన్పట్టుచున్నయది. ఇతనితో వేముని వంశ మంతరించినట్లు గన్పట్టుచున్నది. కుమారగిరిరెడ్డి కొక కుమారుఁడున్నట్లొకటి రెండుశాసనములవలనఁ దెలియవచ్చినను, అతనియనంతరము పెదతాత మనుమఁడు కోమటివేమారెడ్డి ప్రభుత్వభారమును వహించెను. కాటయవేమారెడ్డి రాజమహేంద్రపురరాజ్యమును బరిపాలించినట్లు శాసనాదుల వలన స్పష్టమగుచున్నది. కుమారగిరిరెడ్డి యెన్నివసంతోత్సవములుగావించి యెంతకీర్తి గడించినను, విద్వాంసుఁడై విద్వాం

సులఁ బూజించి విద్వాంసులచే స్తుతులెన్నిగాంచినను, తండ్రి తాతలు పోయినమార్గమునఁ బోక రాజ్యమును విభాగించి మేనమఱఁదికి రాజమహేంద్రపురరాజ్యము నొసంగుట సర్వానర్థములకు మూలమయ్యెను గావున నాకార్య మవివేకకార్యమనిపించుకొనకమానదు. అందుచేతనే కాఁబోలు "చెట్టు చచ్చువేళ బుట్టు కుక్కమూతిపిందె"లను లోకోక్తి కనుగుణముగాఁ గొమరగిరి తండ్రితాతలమార్గమును విడిచి కాపథమవలంబించెనని కొండవీటిదండకవిల నుడువుచున్నది.

### హరిహరరాయలు తన కూతును కాటయవేముని కొడుకునకిచ్చి పెండ్లిచేయుట.

విద్యానగరసామ్రాజ్యమును దక్షిణహిందూస్థానమునందు వ్యాపింపఁ జేసి తురుష్కులను తఱిమివేయవలయునని సంకల్పించి ప్రతికూలముగనున్న హిందూరాజ్యములను వశపఱచుకొనవలయునని తాను సింహాసన మధిష్ఠించినది మొదలుకొని రెండవ హరిహరదేవరాయలు ప్రయత్నము చేయుచుండెను. ఓరుగల్లురాజ్యమునుబరిపాలించుచున్నసింగమనాయఁడు మొదలగువారు వానికి లోఁబడి సామంతనృపతులై మెలఁగుచుండిరి కాని రెడ్డిరాజులు మాత్రము వశపడియుండలేదు. కాటయవేమారెడ్డి ప్రబలుఁడనియు, కుమారగిరిరెడ్డికి మంత్రియు, సేనాపతియనియు, రాజమహేంద్రవరరాజ్యమున కధి

పతియున్నై యున్నవాఁడని యెఱింగి యాతనితో మైత్రిగ నున్నయెడల గజపతులవలన నేహానియుఁ దనసామ్రాజ్యమునకు సంభవింపదనితలంచి రాజాధిరాజ రాజపరమేశ్వరుండను బిరుదాభిదానముగల హరిహరదేవరాయలు తనకొమార్తె హరిహరాంబయను నామెను కాటయవేమారెడ్డిపుత్త్రుఁడగు కాటయప్రభునికిచ్చి వివాహముఁ జేసెను. ఈవివాహవిషయము అల్లాడరెడ్డికోరుమిల్లి శాసనములో వక్కాణింపఁబడినది.*

* పౌత్రింకాటయ వేమయక్షితిపతేః పుత్రించ కాటప్రభోః
దౌహిత్రిం చతురర్ణవీం హరిహరక్షోణీపతే శ్శాసితుః
తన్వామ్నా విదితాహ్వయాంహరిహరాంబాంచారుమగ్రాహయ
త్పాణౌ వేమమహీశమల్లనృపతి స్సామ్రాజ్యలక్ష్మ్యాస్సమం.

(Elliot's Collections page 320)

The Vemavaram plates of Allaya Vema which will be mentioned in the next paragraph, refer to Kataprabhu who was the son of Kataya Vema and who married the daughter of Harihara, evidently of the Vizianagara king Harihara II.

(Annual Report on Ephigraphy; 1906. para 63)

———

## ఏఁడవ ప్రకరణము.

---

### పెదకోమటి వేమభూపాలుఁడు.

(క్రీ. శ. ౧౪౦౦ మొదలుకొని క్రీ. శ. ౧౪౨౦ వఱకు)

కుమారగిరిరెడ్డిభూపాలుని తరువాత కొండవీటిరాజ్యమును బరిపాలించి వాసికెక్కినవాఁడు పెదకోమటివేమభూపాలుఁ డైనట్లు శాసనాదులవలనఁ దెలియవచ్చుచున్నయది. కుమారగిరిరెడ్డి కొక కుమారరత్న ముండినను ప్రోలయయమాచారెడ్డి మనుమఁడు పెదకోమటివేమభూపాలుఁడు సింహాసనారూఢుఁ డగుటయు, కాటయవేమారెడ్డికిని పెదకోమటివేమభూపాలునకు మనస్పర్థ కలుగుటయుఁ జూడ కోమటివేమభూపాలుఁడు కొండవీటిరాజ్యమును బలాత్కారముగా గ్రహించె నని విశ్వసింపవలసి వచ్చుచున్నయది. ఇతఁడు రాజ్యభారమును వహించినతోడనే కాటయవేమభూపాలుని రాజమహేంద్రపుర రాజ్యాధిపత్యమునుండి తొలఁగింప ఘనప్రయత్నములు గావించెనుగాని కృతార్థుఁడు కాఁజాలకపోయెను. ఈ పెదకోమటి వేమభూపాలుఁడు రాజ్యభారమును వహించిన స్వల్పకాలమునకే కర్ణాటసామ్రాజ్యసార్వభౌముఁ డయిన రెండవహరిహారదేవరాయలు స్వర్గస్థుఁడు కాఁగా నతనికుమారుఁడు దేవరాయమహారాయలు క్రీ. శ. ౧౪౦౬ వ సంవత్సరమున రాజ్యాభి-

షిక్తుఁ డయ్యెను. దేవరాయమహారాయలకు సామంతులుగ నుండి దేవరకొండ మెతుకుసీమలఁ బరిపాలించుచున్న పద్మ నాయకభూపాలురు కోమటివేమభూపాలునిరాజ్య మాక్రమింపఁ బెక్కుతడవులు దండయాత్రలు సలిపి యుద్ధములు చేసి పరాభూతు లగుచు వచ్చిరికాని వారిమనోభీష్టము నెఱవేఱి యుండలేదు. పెదకోమటివేమభూపాలుఁడు సమర్థుఁడై, ప్రజ్ఞావంతుఁడై భూరిపరాక్రమమున వైరివీరుల ఘోరసంగ్రామముల నోడించి ప్రతిభతోఁ బ్రజాపరిపాలనము గావించి చిరయశమును సంపాదించెను. వీరనారాయణబిరుదాంకితుం డగుని పెదకోమటివేమభూపాలుఁడు పూర్వరాజమార్గానుసారముగా ధరాపాలనము గావించెను.

మామిడిసింగనామాత్యవర్యుఁడు.

అనవేమభూపాలునికి మంత్రియై ప్రఖ్యాతిఁగాంచిన మామిడిపెద్దనామాత్యుని మూఁడవకుమారుఁడైనసింగనామాత్యుఁడు ముఖ్యమంత్రిగ నున్నట్లు శ్రీనాథకవివిరచిత మైనశృంగారనైషధములోని యీక్రిందిపద్యమువలన విదిత మగుచున్నది.

"సీ. తనకృపాణము సముద్ధతవైరి శుద్ధాంత
తాటంకముల కెగ్గు దలఁచుచుండఁ

జనబాహుపీఠంబు ధరణిభృత్కమఠాహి
సామజంబులకు విశ్రాంతి యొసఁగఁ
దనకీర్తిసక్తకి ఘనతరబ్రహ్మాండ
భవనభూముల గొండ్లిఁ బరిఢవిల్లఁ
దనదానమహిమ సంతానచింతారత్న
జీమూతసురభుల సిగ్గుపఱుపఁ
గీ. బరఁగు శ్రీవేమమండలేశ్వరుని మంత్రి
యహితదుర్మంత్రివదనముద్రావతార
శాసనుఁడు రాయవేశ్యాభుజంగబిరుద
మంత్రి పెద్దయసింగనామాత్యవరుఁడు."

ఈమహాప్రధానశేఖరుఁడు వేమభూపాలునిచే వివిధాగ్రహారములతోఁబాటుగా నాందోళికా ఛత్రచామరకళ్యాణకలాచికాది బహుసమ్మానార్హచిహ్నంబుల నాదర మొప్పారగాంచి సామ్రాజ్యసంభరణప్రౌఢుఁడై యొప్పియుండె నని పైగ్రంథమె తెలుపుచున్నది. ఇతనియన్నలు వేమనామాత్యుఁడును బ్రెగడనామాత్యుఁడును వేమభూపాలునికడ దండనాయకులుగ నుండి ప్రఖ్యాతిఁగాంచినవారలుగ నీక్రిందిపద్యములలో నభివర్ణింపఁబడి యుండిరి.

"సీ. కాలకంఠకఠోరకంఠహుంకారంబు
చెవులు సోకనినాటి చిత్తభవుఁడు

కుపితరాఘవఘనక్రూరనారాచంబు
తనువు నాటనినాటి వనధిరాజు
క్రుద్ధకుంభోద్భవ భ్రూలతాకౌటిల్య
వికృతి గ్రుంగనినాటి వింధ్యశిఖరి
వీరభద్రోదార ఘోరవీరావేశ
విహృతి గందనినాఁటి తుహినకరుఁడు
గీ. చక్కఁదనమున గాంభీర్యసారమునను
బ్రకట ధైర్యకళాకలాపములయందు
దండనాయకచూడావతంస మైన
మంత్రి మామిడివేమనామాత్యుఁ డెలమి.”

సీ. తగఁ గైవారమొనర్ప విక్రమకథాధౌరేయతాశాలి శ్రీ
ప్రెగడన్నధ్వజినీశుఁ డంబునిధిగంభీరుండు శుంభద్ద్విష
న్నగరద్వారకవాటపాటనవిధానప్రౌఢబాహార్గళా
యుగళుం డాహవసవ్యసాచిధరలో నొక్కండు పేరుక్కునన్,’

## సింగనామాత్యుని పూర్వులు.

వీరికిఁ దాతయగు మామిడన్న భారద్వాజస గోత్రుఁడైన పెదతూర్కన మంత్రికి మనుమఁడై విక్రమపురీ సింహాసనాధ్యాసియైన చిటిపెద్ద ప్రభునకుఁ గుమారుఁడై యధిక విమల శివాచార తత్పరుఁడై బంధురయశోమహనీయ సంపదచే విల

సిల్లుచు ధర్మశీలుఁడై అక్కాంబికయందు వంశపావనులైన నల్వురు పుత్త్రులను బడసి యుండెను. వారలలో నగ్రజుఁడైన పెద్దనామాత్యుఁ డనవేమాధిపు రాజ్యభారభరణవ్యాపార దక్షుఁడై యుండెనని యాంధ్రనైషధములోని యీక్రింది పద్యమువలన వ్యక్తమగుచున్నది.

“మ. అనతారాతివసుంధరారమణ సప్తాంగాపహారక్రియా
ఘనసంరంభవిజృంభమాణపటుదోఃఖర్జూద్వితీయార్జునుం
డనవేమాధిపురాజ్య భారభరణ వ్యాపారదక్షుండు పె
ద్దనమంత్రీశుఁడు మామిడన్న సుతుఁ డేతన్మాత్రుఁడే
యెన్నఁగన్.”

ఈయమాత్యశేఖరునకు వీరభద్రామాత్యుఁడు, మారనామాత్యుఁడు. నామామాత్యుఁడు ప్రసిద్ధులైన మువ్వురు తమ్ములు ననవేమ భూపాలుని కడ మంత్రులై యన్నకు విధేయులై వివిధకార్యకరణదక్షులై యొక్కొక్కఁ డొక్కొక్క విషయంబునఁ బ్రజ్ఞావంతులై యున్న ట్లీక్రింది పద్యములం బట్టి ద్యోతకము కాఁగలదు.

“ఉ. హేమధరాధరేంద్రమున కెంతటి పెద్దధృతిన్ భుజంగమ
స్వామికి మేలుచేయు పటువాగ్విభవంబున బుద్ధిసంపదం
దామరచూలికిన్సరి ప్రధానులు దక్కిన వారు సాటియే
మామిడి వీరభద్రున కమాత్యశిఖామణి కివ్వసుంధరన్

"ఈ. సత్యవచోనిరూఢుఁడు నిశాకరశేఖరభక్తిభావనా
సాత్యవతేయుఁ డుద్భటభుజాబల విక్రమ కేళివిక్రమా
దిత్యుఁడు కార్యఖడ్గసముదీర్ణుఁడు మామిడిమంత్రి మారనా
మాత్యుఁడు వానిఁబోలవశమాధరణీధవమంత్రికోటికిన్."

"శా. స్వామిద్రోహరగండలాంఛనునకున్ సంగ్రామగాండీవికిన్,
వేమక్ష్మాపతికార్య భారకలనా విఖ్యాత ధీశక్తికిన్
నామామాత్యునికన్యరాజనిటలాంతర్న్యస్తభాగ్యాక్షర
స్తోమాపాకరణప్రవీణునకుమంత్రుల్సాటియేయెవ్వరున్"

"ఉ. తమ్ములుదన్ను మువ్వురును దైవముఁగాఁగురుగామహాని ధా
నమ్మనఁగ దాతఁగాఁదమమనంబుల భావన సేసి కొల్వ భా
గ్యమ్ములకెల్ల నెల్లయయికాం చెబ్రసిద్ధి నృపప్రధానర
త్నమ్మగుమంత్రి పెద్దనయుదాత్తమతిన్ రఘురాముకైవడిన్"

ఈ పెద్దనామాత్యుఁడు గౌతమ గోత్రవిఖ్యాతుఁడును, ఆపస్తంబసూత్ర పావనుఁడును నగు శ్రీకేతనామాత్య శేఖరునకుఁ బుత్త్రుఁడై చౌహత్తమల్లుండు, దోహత్తనారాయణుండు, ఖండియరాయుండు, నను బిరుదములచేఁ దనరినట్టి యల్లాడమంత్రికి మహిత పుణ్యయగు నన్నమాంబ యందు జనించిన తల్లమాంబిక నుద్వాహమై వేమనామాత్యుని, పెద్రగడనామాత్యుని, సింగనామాత్యునిఁ గనియెను.

మామిడిసింగనామాత్యుఁడు త్రిభువనరాయ వేశ్యాభుజం

గూడనియు, కదనగాండీవియనియు, జగనొబ్బగండఁడనియు, మొదలుగాఁగల పెక్కుబిరుదములను వహించి వేమక్షితిపాల రాజ్యవిభవకారణభూతుఁడై విమలతరంబైన తనకీర్తి నాల్గు దిశల వ్యాపింపఁజేసి మిక్కిలి వాసి గాంచెను.

సింగనామాత్యుని కొల్వుకూటము.

ఈమామిడి సింగనామాత్యుఁడు ప్రసిద్ధిగాంచిన దైవజ్ఞశిఖామణిగ నుండెను. ఇతఁడు క్రీ. శ. ౧౪౧౯వ సంవత్సరమున సోమసిద్ధాంతమునకు వ్యాఖ్యానము రచించి ప్రఖ్యాతిఁ గాంచెను. ఇతఁడు దైవజ్ఞశిఖామణి యగుటచేతనే శ్రీనాథభట్టసుకవి పంచాంగస్థిరమంత్రిరేఖాకరణప్రౌఢుం డని తన నైషధమున నీతని నభివర్ణించియున్నాఁడు. సకలవిద్యాపారంగతుండైన యీయమాత్యశేఖరుఁ డెప్పుడును "మృదుమధురచిత్రవిస్తరకవితావిలాస వాగీశ్వరులగు కవీశ్వరులచేతను, పతంజలికణాదాక్షపాదకపిలాది శాస్త్రసిద్ధాంత కుశల వచోహంసులగు విద్వాంసులచేతను, భరతమతంగదత్తిల కోహలాంజనేయ ప్రణీత సంగీతవిద్యా రహస్యవిజ్ఞాన నైష్ఠికస్వాంతులగు కళావంతులచేతను, శక్తిత్రయచతురుపాయ షాడ్గుణ్యప్రయోగయోగ్యవిచారులగు రాయబారులచేతను, నిఖిలపురాణేతిహాససంహితాశాస్త్రసాహిత్యాలోచనాధురంధర ధిషణా సముత్సాహులగు పౌరాణికవర్యులచేతనుఁ గొల్వఁ

కూటంబునఁ బరివేష్టింపఁబడియుండి సరససాహిత్యగోష్ఠీవినోద ప్రసంగంబులు జరుపుచుండు" నని నైషధమహాకావ్యమునం జేర్కొనంబడియుండెను.

## సర్వజ్ఞచక్రవర్తి.

బ్రాహ్మీసత్త్వవరప్రసాదుండును, ఉరుప్రజ్ఞావిశేషోదయాజిహ్మస్వాంతుండును, ఈశ్వరార్చనకళాశీలుండును, అభ్యస్థిత బ్రహ్మాండాది మహాపురాణచయ తాత్పర్యార్థనిర్ధారిత బ్రహ్మజ్ఞానకళానిధానుండును విద్యాసనాథుండునునగు శ్రీనాథుండు పెదకోమటివేమభూపాలుని యాస్థానమున విద్యాధికారపదవిని, అభినవభట్టబాణబిరుదాంకితుండగు వామనభట్టు ఆస్థానకవిపదవియందును, ప్రతాపగుణభూషణుండును, పరిణతార్థసంభాషణుండును, వితీర్ణమహీమార్ణవుండును, విభవయోగసంక్రందనుండును, పంచాంగస్థిరమంత్రరక్షణ కళాప్రౌఢుండును, యవనాధీశసభాసిరంకుశ వచోవ్యాపారపారంగతుండును, మహాసామ్రాజ్యరక్షామణియునగు సింగనామాత్యుఁడు ప్రధానమంత్రిత్వపదవియందును నున్నవారని తెలిసికొన్నప్పుడు పెదకోమటి వేమభూపాలుఁడు మహాపండితుఁడును రసికుఁడునై యుండునని తెలిసికొనకమానము. అందుచేతనే కాఁబోలుఁ బెదకోమటి వేమభూపాలునకు విద్వాంసులచే సర్వజ్ఞచక్రవర్తి యను బిరుదమీయఁబడినది. అభినవభట్ట

బాణబిరుదాంకితుఁడగు వామనభట్టు తాను రచియించిన వీరనారాయణచరిత్రమను నామాంతరముగల వేమభూపాల చరిత్రమను సంస్కృతవచనకావ్యమునఁ బెదకోమటి వేమ భూపాలుని సర్వజ్ఞచక్రవర్తి యని ప్రశంసించియుండుటయు, విద్యాధికారిగానున్న శ్రీనాథభట్టసుకవి సార్వభౌమునిచే విర చితమైన పోన్నుపల్లి శాసనములో

"వేమాధిపో మాచవిభుశ్చ నన్దనౌ
శ్రీకోమటీన్ద్రస్యగుణైకసంశ్రయౌ
భూలోక మేకోదరజన్మవాంఛయా
భూయోవతీర్ణావివరామలక్ష్మణౌ.
చూడామణి ర్నృపాణాం
దుర్మదపరిపంథిశిఖరిదంభోళిః
సర్వజ్ఞచక్రవర్తీ పెదకోమటి
వేమభూపతి ర్జయతి"

అని పేర్కొనియుండుటయు నిందుకుఁ బ్రమాణములుగఁ దీసికొనవచ్చును. పెదకోమటివేమభూపాలుఁడు విద్వాంసులనాద రించి పోషించుటయెగాక తానును విద్వాంసుఁడును, రసికుఁడు నునై సర్వజ్ఞచక్రవర్తియని పొగడుగాంచుచుండుటయగాక అమరు కావ్యమునకు "శృంగారదీపిక" యనునామముతో వ్యాఖ్యను గూడ రచించి ప్రఖ్యాతిఁగాంచెను. శ్రీనాథకవి ప్రణీత

మైన ఫిరంగి పుర శాసనములోని రెండు శ్లోకములు శృంగార దీపికయందుండుటచేత శృంగారదీపిక శ్రీనాథకవివిరచిత మై యుండునని కొందఱు తలంచుచున్నారు గాని యీరచనమున పెదకోమటి వేమభూపాలునకు శ్రీనాథభట్టసుకవియు వామన భట్టును గొంతవఱకుఁ దోడ్పడినఁ దోడ్పడవచ్చును లేక పీఠిక భాగమును శ్రీనాథకవియె రచించియుండవచ్చును. *

---

* "రాజ్యం వేమ స్సచిర మకరోత్ ప్రాజ్యహేమాద్రిదానో
భూమీదేవై ర్బ్భవ మురుభుజో భుక్త శేషా మభుఙ్త్క,
శ్రీశైలాగ్రాత్ ప్రభవతి పథి ప్రాప్తపాతాళగఙ్గా
సోపానాని ప్రమథపదవీమారురుక్షు శ్చకార.
మాచక్షోణిపతి ర్మహేన్ద్రవిభవో వేమక్షితీశాగ్రజో
హేమాద్రే స్సదృశో బభూవ సుగుణై స్తస్యాత్రయోనన్దనాః
కీర్త్యా జాగ్రతి రేడిపోతనృపతి శ్శ్రీకోమటీన్ద్రస్తతో
నాగక్ష్మాపతి రిత్యుపాత్తవపుషోధర్మార్థకామా ఇవ."

శృంగారదీపికలోని యీరెండు శ్లోకములు శ్రీనాథకవివిరచితము లైన ఫిరంగిపురము శాసనములోఁగలవు. పై రెండు శ్లోకములు మాత్రమె గాక శృంగారదీపికలోని:—

"వేమాధిపో మాచవిభుశ్చ నన్దనౌ
శ్రీకోమటీన్ద్రస్య గుణైకసంశ్రయౌ
భూలోక మేకోదరజన్మవాఞ్ఛయా
భూమోవతీర్ణా వివ రామలక్ష్మణౌ" అను శ్లోకము గూడ

శ్రీనాథకవిరచితమైన పొన్నుపల్లి శాసనమునం గలవు.

## సంతానసాగరనిర్మాణము.

ధాన్యవాటీపురమను నామాంతరముగల ధరణికోటకుఁ బ్రభువగు గన్నభూపాలుని కూఁతురైన సూరాంబను పెదకోమటివేమభూపాలుఁడు వివాహముఁ జేసికొనియెను. ఆమె సంతానసాగరమను నొక పెద్దచెఱువును ద్రవ్వించి శా. శ. ౧౩౩౧ విరోధిసంవత్సరఫాల్గున బ ౨ శుక్రవారమునఁ బ్రతిష్ఠ యొనర్చెనని ఫిరంగిపురశాసనమువలనఁ దెలియుచున్నది. ఈశాసనము చివరను,

> "విద్యాధికారీ శ్రీనాథో వీర శ్రీవేమభూపతేః
> అకరో దాకరో వాచాం నిర్మలం ధర్మశాసనం"

అని యుండుటచేత నియ్యది శ్రీనాథకవి విరచిత మని స్పష్టపడుచున్నది. ఈశాసనము తుదను శ్రీనాథకవివిరచితములైన యీక్రింది సీసపద్యములు మూఁడును సంతానసాగరప్రతిష్ఠను దెలుపునవిగా యున్నవి.

---

See Ephigraphia Indica Vol. X No. 33, ఆంధ్రసాహిత్యపరిషత్తు సంపుటము. 3 సంచికలు ౬-౭ పేజీ, ౨౬౧. Elliot's Telugu Inscriptions 193. పొన్నుపల్లి తామ్రశాసనము. బ్రహ్మశ్రీ వేదము వేంకటరాయశాస్త్రిలవారిచే సంపూర్ణాంధ్ర సంస్కృతవ్యాఖ్యలతో ముద్రింపఁబడిన 'అమరుకావ్యమ్' ౨౫ పేజియును, చూడుఁడు.

"సీ. శాకాబ్దములు సహస్రమును మున్నూట ము
ప్పది యొకండును నైన భవ్యసంఖ్య
వఱలు విరోధిసంవత్సరంబున ఫాల్గు
నంబున బహుళపక్షంబు విదియ
శుక్రవారంబున శుభముహూర్తంబున
శ్రీధాన్యవాటీపురాధిపతియు
కృష్ణవేణ్ణాజలక్రీడావినోదుండు
నగు గన్నభూపాలు ననుగుంబుత్రి (?)

గీ. వీరనారాయణుండు వేమవిభుని దేవి
భూరిసద్గుణ నికురంబ సూరమాంబ
జగము వినుతింప సంతానసాగరాఖ్య
వరతటాకప్రతిష్ఠోత్సవం బొనర్చె."

"సీ. జాహ్నవీయమునాది సకలపావన నదీ
విమల తీర్థాంభః పవిత్రితంబు
సవిధదేశస్థాయి శివమౌళి బాలేందు
కౌముదీ సంఫుల్ల కైరవంబు
బహుమహాపరివాహ పాదోభరధ్వన
ఘుమఘుమాయితదిశాగోళకంబు
జలసారణీసేక సంవర్ధితానేక
వనివినీతాధ్వగాధ్వశ్రమంబు

గీ. బలవదురు మత్స్యకచ్ఛపఘన? కుళీర
త్రిమితిమింగిళ విక్రమక్రమవిహార
తరళతరతుంగ భంగకదంబచుంబి
తాభ్ర వీథిసంతాన మహాపయోధి."

"సీ. కపటసూకరమైన కైటభాసురవైరి
ఖురపుటంబులఁ బరిక్షుణ్ణ మయ్యె
రఘుకులోద్వహ ధనుర్యంత్ర ముక్తములైన
చిచ్చుఅమ్ములవేఁడిఁ జేవఁదఱిగెఁ
గుంభసంభవుని హస్తాంభోరుహంబున
నాపోసనంబయి హ్రాస మొందెఁ
బాషాణముల నచ్చు భల్లగోలాంగూల
కపియూథములచేతఁ గట్టువడియె

గీ. వనధి యేభంగి సరి వచ్చునని గవచ్చు
నారసాతల గంభీరవారి యగుచు
నవగతాపాయ మగుచు శోభాఢ్యమగుచు
ననుపమంబైన సంతాన వనధితోడ.

కైస్తవమానముచే సంతానసాగర ప్రతిష్ఠాతిథి 1410 వ సంవత్సరము ఫిబ్రవరు 21 తేది శుక్రవారమగుచున్నది. ఈ సంతానసాగరమను చెఱువునకు నీరువచ్చుటకై యీసూరాంబ కొడుకు రాచవేమన శాలివాహనశకము ౧౩౩౭ మన్మథ

సంవత్సర మాఘ శు ౧౫ దినమునకు సరియైన క్రైస్తవమానము 1416 వ సంవత్సరము జనవరి 14 తేది మంగళవారము నాఁడు "జగనొబ్బగండకాలువను" త్రవ్వించినట్లు అమీనాబాదు శాసనము దెలుపుచున్నది. అది శ్రీనాథకృతియైనయొక సీసపద్యముగానున్నది దానినీదిగువనుదాహరించుచున్నాఁడను.

"సీ. శాకాబ్దములు సహస్రంబును మున్నూట
ముప్పదియేఁడును నొప్పు మిగుల
మహనీయమైన మన్మథవత్సరంబున
మఘమాసమునఁ బూర్ణిమాదినమున
హేమాద్రిదానచింతామణి యరిరాయ
బసవశంకరుఁ డాజి ఫల్గుణుండు
సమదారి రాయవేశ్యాభుజంగుండు వే
మయ రాచవేమన క్ష్మావరుండు
గీ. తల్లి సూరాంబనే సముత్పన్నమగుచుఁ
బరగు సంతాన వార్థికి వరువగాఁగ
నోలయు గిరివాహినుల జగనొబ్బగండ
కాలువ ఘటించె నాతారకంబు గాఁగ."

"శ్రీనాథకృతి"

శ్రీనాథకవిసార్వభౌముఁడు.

ఆకాలంబున నాంధ్రప్రపంచమునకు నలంకారమణి యై

వఱలుచుండి పెదకోమటివేమభూపాలుని యాస్థానమున విద్యాధికారియై యాతనికి సర్వజ్ఞచక్రవర్తిబిరుద మిప్పించిన శ్రీనాథకవిసార్వభౌముని మనోహరమైనచరిత్రమును గొంత వఱకు నిచటఁ దెలుపుట యావశ్యకమై యున్నది. శ్రీనాథకవిసార్వభౌమునివలన రెడ్డిసామ్రాజ్యము వన్నెకెక్కినది. రెడ్డిసామ్రాజ్యమువలనశ్రీనాథకవిసార్వభౌమునిచరిత్రమును వన్నెకెక్కినది. వీనిని విద్యాధిదేవతయొక్కయవతార మని చెప్పవచ్చును. ఈమహాపురుషుని విద్యాప్రభావము లీపెదకోమటివేమభూపాలునికాలముననే తొలుదొల్తఁబ్రకాశింప నారంభించి రాజమహేంద్రపురరాజ్యాధిపతి యైన యల్లయ వీరభద్రనృపాలునికాలమునఁ బరిపూర్ణత్వమును గాంచినవి. ఈమహాపురుషుఁడు వేమభూపాలునికడ విద్యాధికారిగ నుండి యాతనిదండనాయకుఁ డగుప్రెగడనామాత్యునకుఁ బండితారాధ్యచరిత్రమును, వేమభూపాలుని ముఖ్యమంత్రి యగుమామిడిసింగనామాత్యునకు శృంగారనైషధమును నంకితము గావించెను. సకలవిద్యాపారంగతుండైన సింగనామాత్యుఁడు సరససాహిత్యగోష్ఠీవినోదప్రసంగంబున శ్రీనాథునిం గాంచి యిట్లు వచించెనఁట.

“శా. బ్రాహ్మీదత్తవరప్రసాదుఁడవురుప్రజ్ఞావిశేషోదయా
జిహ్మాస్వాంతుఁడవీశ్వరార్చనకళాశీలుండవభ్యర్హిత

బ్రహ్మాండాది మహాపురాణచయతాత్పర్యార్థనిర్ధారిత
బ్రహ్మజ్ఞానకళానిధానమవు నీభాగ్యంబుసామాన్యమే.”

శ్రీనాథుని జన్మభూమి.

ఇతని జన్మదేశము పాకనాటిసీమగా నుండెను. ఇతఁడు తనభీమఖండములో ;—

“మ. కనకక్ష్మాధరధీరు వారిధితటీకాల్పట్టణాధీశ్వరున్
ఘనునిం బద్మపురాణసంగ్రహకళాకావ్యప్రబంధాధిపున్
వినుమధ్యాంతరసార్వభౌముఁ గవితావిద్యాధరుం గొల్తునా
యనుగుందాతఁ బ్రదాత శ్రీకమలనాభామాత్యచూడామణిన్.

అనుపద్యములోఁ దనతాత కమలనాభుఁ డమాత్యచూడామణియనియును, కవితావిద్యాధరుండనియును, సముద్రతీరమునందలి కాల్పట్టణమున కధీశ్వరుం డనియును, పద్మపురాణసంగ్రహకళాకావ్యప్రబంధాధిపుఁ డనియును జెప్పికొని యున్నవాఁడు. పల్నాటివీరచరిత్రములోని బాలచంద్రయుద్ధభాగమును బ్రచురించిన శ్రీయుమాకాంతముగారు తమయుపోద్ఘాతములో “శ్రీనాథుని జన్మభూమి కర్ణాటదేశమైనట్లగపడుచున్న” దని నుడువుచు నందు కుపబలముగా నాలుగు హేతువులు గనుబఱచి యున్నారు. శ్రీనాథుఁడు తనకాశీఖండములో “కర్ణాటదేశకటకపద్మవనహేళి” యనువిశేషణమును జెప్పికొని యుండుట మొదటి హేతువు. తనభీమేశ్వరపురాణ

ములోఁ "నాకవిత్వంబు నిజము కర్ణాటభాష" యని చెప్పు కొని యుండుట రెండవహేతువు. మఱియు 'తల్లీ! కన్నడ రాజ్యలక్ష్మి! దయలేదా? నేను శ్రీనాథుఁడన్.' అని యొక చాటువులోఁ జెప్పుకొని యుండుట మూఁడవహేతువు. శ్రీనాథుని తాత కమలనాభామాత్యుని 'వారిధితటీకాల్పట్టణాధీశ్వరుం' డని వచించుట నాలవహేతువు. ఈ హేతువులం బట్టి యుమాకాంతముగారు శ్రీనాథుని జన్మభూమి కర్ణాటదేశమని నిర్ధారించి యున్నారు. శ్రీనాథుని జన్మభూమి కర్ణాటదేశ మనుట కీహేతువులు చాలవని నాయభిప్రాయము. శ్రీనాథుఁ డట్లు వచించుటకు నాకుందోఁచిన కారణముల నిట నుదాహరించుచున్నాఁడను. 'కర్ణాటదేశ కటక పద్మవన హేళి' అనఁగా కర్ణాటదేశపట్టణము లనుకమలములకు సూర్యుఁ డని యర్థమగుచున్నది గావున జన్మస్థలమునందలి యభిమానముచేత నట్లు చెప్పుకొనియుండు నని యుమాకాంతముగారి యూహ. అయినను. ఇందునుగూర్చి శ్రీయుత వేటూరు ప్రభాకరశాస్త్రిగారు 'కనకాభిషేక' మను నొకచిన్నపొత్తమునఁ జెప్పినయర్థమును జేసిన వాఖ్యయును గూడ మనము తెలిసికొన వలసియున్నది. కనకాభిషేకమున 'మహారాజతల్పమునఁ దూఁగి యాడుచుండు నాకర్ణాటాధీశ్వరుని (దేవరాయలు) నిండోలగమున డొక్కచెదరును బిక్కబెదరును లేక, పాండిత్య

శౌండీర్యమును వ్యక్తపఱచి, యఖండపండితుఁడు, మహాకవి, బహుశిష్యపరివృతుఁడునై విజయడిండిమాడంబరమునఁ బ్రత్యర్థుల నద్రువఁ జేయుచు, నాప్రభుసార్వభౌముని నాస్థానిం గవిసార్వభౌమవైభవ మనుభవించుచున్న యుద్దండుని డిండిమభట్టారకు నుద్భటవివాదమున నోడఁ గొట్టి యాతనివిజయ డిండిమమును బగులఁ గొట్టించి, యత్యంతగౌరవాస్పద మగు నారాజేంద్రుని ముత్యాలశాలలోఁ బ్రభుపండిత బహుమాన పురస్కృతముగాఁ గవిసార్వభౌమపదవినిగనకాభిషేకముతోఁ బట్టాభిషిక్తుఁడై కవిసార్వభౌముఁ డనుబిరుదాంకనామధేయమునఁ బరగుటయకాక యాకవిమార్తాండుఁ డప్పుడు కర్ణాట రాజధాని (యందలి విబుధరాజి) యను తమ్మితోపునల రార్చినకతన కరాటదేశకటకపద్మవనహేళి' యనఁ దనరారెను." అని తమభావమును విస్పష్టముచేయుటయె గాక యీయర్థభావమునే దెలుపునట్టి యీక్రిందిసీసపద్యమును విరచించి కనకాభిషేకమునకు మకుటముభాతి నలంకరించి యున్నారు.

> ,,సీ. ఒడ్డోలగంబుల నడ్డమాఁకయు లేక
> వాక్ప్రవాహంబు వెల్వఱచినాఁడు
> అష్టదిగ్జయయశోవష్టంభు డిండిమ
> భట్టారకుని నోడఁ గొట్టినాఁడు

అఖిలవిద్వల్లోక మగ్గింపఁ గవిసార్వ
భౌమసద్బిరుదంబుఁ బడసినాఁడు
కలితమౌక్తికసభాగారాంతరమునందుఁ
గనకాభిషేకంబు గాంచినాఁడు
గీ. రాజపరమేశ రాజాధిరాజవిభవ
దక్షిణాధీశ దేవరాయక్షితీంద్ర
రక్షితబుధాభిభటక "కర్ణాటకటక
పద్మవనహేళి శ్రీనాథభట్టసుకవి."

కాఁబట్టి ప్రభాకరశాస్త్రిగారు చెప్పినది సహేతుకముగను, సయుక్తికముగను గనుబట్టుచున్నది. కర్ణాటదేశకటక మను దానికి కర్ణాటదేశపురాజధాని యని యర్థమును గ్రహింపవలయును. దీనింబట్టి శ్రీనాథునిజన్మభూమి కర్ణాటదేశ మని యూహించుట భ్రాంతిగాని నుడియొండు గాదు.

రెండవ హేతువు:—

"గీ. ప్రౌఢిపరికింప సంస్కృతభాషయందు
పలుకు నుడికారమున నాంధ్రభాషయందు
రెవ్వ రేమన్న నందు నా కేమికొఱత
నాకవిత్వంబు నిజము కర్ణాటభాష."

ఈపద్యము రాజమహేంద్రపురాధిపతి యగు వీరభద్రనృపాలునికి మంత్రి యగు బెండపూడి అన్నామాత్యున కంకిత

వ్రాయఁబడిన భీమపురాణములోనిది. కనుక నియ్యది శ్రీనాథుఁడు పెదకోమటివేమభూపాలుని మరణానంతరము కొండవీటిరాజ్యము కర్ణాటదేశాధీశ్వరులవశ మైపోఁగా శ్రీనాథుఁడు అన్నామాత్యునితోడి సంబంధబాంధవ్యముచేత రాజమహేంద్రపురమునకు విచ్చేసి వారలకడ నాస్థానకవిగఁ బ్రవేశించిన కాల మైయున్నది. కాకతీయసామ్రాజ్య మంతరించిన వెనుక నాంధ్రదేశములో దక్షిణభాగము (అనఁగా పాకనాటిసీమ వరకుఁ గలదేశము) కర్ణాటాధీశ్వరులవశ మై కర్ణాటరాజ్యముగానే పరిగణింపఁబడుచు వారిచేతనే పరిపాలింపఁబడుచు వచ్చినది ఆభాగములలో నుండునాంధ్రుల కాకాలమున మాత్రమె గాక యంతకుఁ బూర్వము సహితము కర్ణాటకులతోడఁ బొత్తు కలిగి యుండుట తటస్థ మగుచు వచ్చెను. ఆంధ్రకవు లనేకులు కర్ణాటరాజ్యమునందును, కర్ణాటకవు లనేకు లాంధ్రరాజ్యమందును నుండుచుఁ గవిత్వములం జెప్పుచు వచ్చిరి. సుప్రసిద్ధకర్ణాటకవు లగునాగవర్మ, పొన్నఁడు, కేశిరాజు, రుద్రభట్టు, మొదలగువా రాంధ్రదేశముననే జన్మించినట్లు కర్ణాటసారస్వతమువలన విదిత మగుచున్నది. సుప్రసిద్ధాంధ్రకవు లగునన్నెచోడుఁడు, తిక్కనసోమయాజి, నాచనసోముఁడు, ఎఱ్ఱాప్రెగడ, శ్రీనాథుఁడు, అమరేశ్వరుఁడు, జక్కన అనంతామాత్యుఁడు, మొదలగువా

రెల్లరు కవితారచనలయందుఁ గన్నడపోకల ననుసరించుటయె గాక కర్ణాటభాషాపదములను బెక్కింటిని తమగ్రంథములలోఁ జొప్పించి యున్నారు. శబ్దశాస్త్రజ్ఞుల కీవిషయము చక్కఁగా బోధపడఁగలదు. శ్రీనాథుఁడు తనకావ్యములను కర్ణాటభాషాసాంప్రదాయానుసారముగ రచియించినవాఁ డగుటచేత గోదావరీతీరస్థ మగురాజమహేంద్రపురికి వచ్చినప్పుడచ్చటి పండితకవులలోఁ గొంద ఱీతనికవిత్వము ప్రౌఢమైనదే కాని సంస్కృతపదఘటిత మైన దనియు మఱికొందఱు పలుకుచమత్కారమునం దాంధ్రభాషవలెనే యున్నది కాని యీతనిభాష కర్ణాటభాష యనియు వంకలుఁబెట్టి యుందురు. మనసుప్రసిద్ధాంధ్రకవి వారల నుడికించుటకై కంఠోక్తిగా,

" ప్రౌఢి పరికింప సంస్కృతభాయంద్రు
పలుకు నుడికారమున నాంధ్రభాషయందు
రెవ్వ రేమన్న నండ్రు నాకేమికొఱత
నాకవిత్వంబు నిజము కర్ణాటభాష. "

అనుపద్యమును జెప్పి యుండును గాని నిజముగా నీతని కవిత్వ మాంధ్రకవిత్వమె కాని కర్ణాటకవిత్వము గాదు; ఈతని భాష యాంధ్రభాషయె గాని కర్ణాటభాషయుఁగాదు. దీనిం బట్టి యీతనిజన్మభూమి కర్ణాటదేశ మగుటచేతఁ గర్ణాటభాషయం దభిమానము చూపించె నని యూహించుట

భ్రాంతికాని వేఱొండుకాదు. ఇట్టిది రాజమహేంద్రపురము నకు వచ్చి ప్రథమమున రచియించిన భీమేశ్వరపురాణమునందు మాత్రమె చెప్పుట నిస్సంశయముగా నేఁ జెప్పినకారణము నకు బలము కలిగించుచున్నది. శ్రీనాథకవి యిట్టిప్రశంస నింతకుఁ బూర్వము రచియించినపండితారాధ్య చరిత్రమునఁ గాని,శృంగారనైషధమునఁగాని,హరవిలాసమునగాని,మఱియే గ్రంథమునంగానిచేయక రాజమహేంద్రపురమువచ్చినతోడనే రచియించిన భీమేశ్వరపురాణమునందుఁ జేయుటకుఁ గారణము పైని నే నుదాహరించినదేగాని శ్రీనాథునిజన్మదేశము కర్ణాట దేశ మగుటచేతఁ గాదు.

**మూఁడవహేతువు:—**

"తల్లీ! కన్నడరాజ్యలక్ష్మి! దయలేదా నేను శ్రీనాథుఁడఁ" అని దీనాలాపము లాడుట ఇది యీక్రిందిచాటువులోనిది.

"శా. కుల్లా యుంచితిఁ గోక సుట్టితి మహా
కూర్పాసముం దొడ్గితిన్।
వెల్లుల్లిం దిలపిష్టముం బిసికితిన్
విశ్వస్తవడ్డింపఁ గాఁ।
జల్లాయంబలి త్రావితిన్ రుచులు
దోసంబంచుఁ బోనాడితిన్।
దల్లీ! కన్నడరాజ్యలక్ష్మి దయ

లేదా నేను శ్రీనాథుఁడన్. ''

ఈచాటుపద్యము శ్రీనాథకవివిరచిత మనిచెప్పెదరు గాని సంశయాస్పద మై విశ్వాసపాత్రముగఁ గన్పట్టదు. ఈతఁడు కర్ణాటరాజ్యమును "సల్లీ"యనిసంబోధించినాఁడు గనుక నీతని జన్మదేశము కర్ణాటదేశ మై యుండు నని యూహ. ఈచాటువును శ్రీనాథకవిసార్వభౌముఁడే చెప్పియుండిన యెడల మిక్కిలి దైన్యస్థితియం దున్నకాలమునఁ జెప్పియుండవల యును గదా. బాల్యస్థితి మనకుఁ దెలియకపోయినను యుక్త వయస్సు వచ్చినది మొదలుకొని వయస్సు ముదిరి దేహపటు త్వము సడలువఱకు నీతఁడు మహారాజులయాస్థానములం దుండి పండితకవియై ప్రసిద్ధి కెక్కి నానాలపాత్రుడై మహారాజ భోగము లనుభవించుచు వచ్చినవాఁడు. ఇట్టిదైన్యస్థితి యవ సానకాలమునఁ దటస్థించి యుండె నని దెలియుచున్నదిగాని యౌవనకాలమునఁ దటస్థించి యుండె ననుటకుఁ బ్రమాణము గానరాదు. ఈపద్యము శ్రీనాథకవి చెప్పియుండినదే వాస్తవ మైనయెడల వార్ధక్యమునఁ జెప్పి యుండవలయును. తన కాశ్ర యులుగా నుండుకొండవీటిరెడ్లు, రాజమహేంద్రపురరెడ్లు, తెలుఁగురాయఁడు, మైలారరెడ్డి మొదలగుమహారాజులును, తన్నెఱింగినమిత్రులగుమంత్రిపుంగవులును స్వర్గస్థులు కాఁగా నీతఁడు దుర్దశకు వశ మై కన్నడరాజ్యమునకు లేచిపోయి తన

మ సన్మానము జరుగకున్నప్పుడు చెప్పినపద్య మైయుండవలయును. ఏమన ము న్నొకతూరి నిండుయావనమునఁ గర్ణాటరాజధానికిఁ బోయి కవిసార్వభౌముఁ డైనడిండిమభట్టారకుని నోడించి దేవరాయలముత్యాలశాలలో స్వర్ణాభిషేకమహోత్సవమును బడసినవాఁ డని యెఱుంగక కాలస్థితిని బట్టి యుపేక్షించియుండ వారలకు జ్ఞప్తికిఁ దెచ్చుట కై 'ఓతల్లీ' కన్నడ రాజ్యలక్ష్మి! అప్పుడే నన్ను మఱచి పోయినావా! నామీఁద దయ లేదా! ఇచ్చట ముత్యాలశాలలో స్వర్ణాభిషేకమహాభోగ మనుభవించిన శ్రీనాథుఁడను సుమా'' యని జ్ఞప్తికిఁ దెచ్చినవిషయముగా భావింపవలయునే గాని దీనిం బట్టి యీతఁడు కర్ణాటకుఁ డనిగాని యీతనిజన్మదేశము కర్ణాట మని కాని చెప్పుటకుఁ బనికి రాదు.

నాలుగవ హేతువు:—

"వారిధితటీకాల్పట్టణాధీశ్వరుం" డని తాతను జేర్కొనుట శ్రీనాథుని తాత కమలనాభామాత్యుఁడు సముద్రతీరమునందలి కాల్పట్టణాధీశ్వరుం డని చెప్పి యున్నాఁడు గనుక కాల్పట్టణ మనునది కర్ణాటదేశపుసముద్రతీరమునందలిపట్టణ మైయుండెనని యూహించుటచేఁ గలిగినభ్రాంతి. కాల్పట్టణ మున్నది పశ్చిమసముద్రతీరమో, పూర్వసముద్రతీరమో యెట్లుచెప్పవచ్చును? ఊహామాత్రముచేత నిర్ధారించుట యెట్లు. ఒకవేళ

కాల్పట్టణముపశ్చిమసముద్రతీరమునందే యున్న దనుకొంద ము. కమలనాభామాత్యుఁడు దాని కధీశ్వరుఁ డనుమాట వాస్తవము.ఏమీయాంధ్రుఁడైనకమలనాభామాత్యుఁడుకర్ణా టాధీశ్వరులఁ గొల్చినసుద్యోగి గా నుండి కాల్పట్టణమును బరిపాలించియుండఁగూడదా? శ్రీనాథునితాత కర్ణాటదేశము నందలి యొకపట్టణమున కధీశ్వరుఁడు గానున్నంతమాత్రము చేత శ్రీనాథుఁడు కర్ణాటకుఁడై కర్ణాటదేశము జన్మభూమి గాఁ గలిగి యుండునా? కాఁబట్టి యీపద్యము నైతము శ్రీనా థునిజన్మభూమి కర్ణాటక మని చాటుటకుఁ జాలి యుండలేదు. ఉమాకాంతముగారు తమపీఠికలో "తల్లిదండ్రులతో నప్పు డప్పుడు మిశ్రమకర్ణాటమును మాట్లాడుచుండినను" అని యూహించుట మాత్ర మతిచిత్రముగా నున్నది. శ్రీనాథుఁ డింట మిశ్రమకర్ణాటము వాడుచుండెనో, స్వచ్ఛమైన యాంధ్రము మాట్లాడుచుండెనో ఉమాకాంతముగారికిఁ దెలియు మార్గ మేది? ఇవన్నియును భ్రాంతియంత్రమునందగుల్కొని తిరుగాడుచుండిన మేధస్సువలన జనించెడునద్భుతము లైన యూహలు కాని మఱియొండు కావు.

శ్రీనాథుఁడు తనకవిత్వమునందుఁ గన్నడపదముల నెక్కువ గఁ జొప్పించినాఁడు గనుక నీతని కర్ణాటకుఁడని గాని యీతని జన్మదేశము కర్ణాటదేశమని కాని నిర్ధారణము చేయవలసిన

పక్షమున మన సుప్రసిద్ధాంధ్రకవుల నెల్లరను కర్ణాటకు లని యును, కర్ణాటదేశము జన్మభూమిగాఁ గలవా రనియును జెప్పకతప్పదు. మననాచనసోముఁడు, పాలకురికిసోమనాథుఁడు మొదలగువారు కర్ణాటభాషలోఁ గూడ కావ్యములను రచియించియున్నారు. వా రాంధ్రులు కారా ? ఆకాలమునం దలికవులు మూఁడు నాలుగు భాషలలోఁ గవిత్వము చెప్ప శక్తికలవారుగా నుండిరి.

శ్రీనాథుఁడాంధ్ర దేశస్థుఁడైన యాంధ్రుఁడు.

శ్రీనాథుఁ డాంధ్రుఁ డనియు, పాకనాటి నియోగిబ్రాహ్మ ణుఁడనియు రెండు ప్రబలములైన హేతువులనుజూపుచున్నాఁ డను. శ్రీనాథునిభార్యతోఁబుట్టినవాఁడు దగ్గుపల్లి దుగ్గయా మాత్యుఁడు నియోగి బ్రాహ్మణుఁడు. ఇతఁడు శ్రీనాథునికిఁ గూర్మిమఱఁదియు, శిష్యుఁడు కూఁడ నైయున్నవాఁడు. ఇతఁ డు నాచికేతూపాఖ్యానమును రచించి యుదయగిరి దుర్గాధీశ్వ రుఁడగు బసవభూపాలునకు మంత్రిగ నున్నచిట్టిగంగనామా త్యునకు నంకితముచేసియున్నాఁడు. ఇతని కవిత్వము మిక్కిలి ప్రౌఢమైనదని గ్రంథముం జదివినశ్రీయుతమానవల్లి రామకృష్ణ కవిగారు నాకుఁజెప్పియున్నారు. మఱియు రాజమహేంద్రపు రాధిపతియైనవీరభద్రభూపాలుని మంత్రి బెండపూడి అన్నా మాత్యుఁడు——

"సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణ విద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకం బైన
హర్ష నైషధకావ్యమాంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణవేళలందు
వెదచల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందు
గీ. పాకనాటింటివాఁడవు బాంధవుఁడవు
కమలనాభుని మనుమఁడ వమలమతివి
నాకుఁ గృపసేయు మొకప్రబంధంబు
కలితగుణగణ్య శ్రీనాథకవివరేణ్య."

అని పలికెననిశ్రీనాథకవియె భీమేశ్వరపురాణమునం జెప్పుకొని యుండెను. దీనింబట్టి శ్రీనాథుఁడు పకనాటినియోగిబ్రాహ్మణుఁడనిస్పష్టపడుచుండనింక ననుమాన మెందులకో తెలియరాదు. ఇంతియగాక 'కమలనాభునిమనుమఁడ'వనుట చేఁగూడ నొకవిశేషము గలదు. శ్రీనాథునితాత యగు కమలనాభుఁడు గూడ అన్నమంత్రికిఁ జుట్టమనియు, పరిచితుఁ డనియుఁ దేటతెల్లము సేయుచున్నది. పాకనాటింటివాఁడ వనుదానికి పాక

నాటికాపురస్థుఁడవని గాక పాకనాటినియోగిశాఖలోనివాఁడవని యర్థమగుచున్నది. ఇంక గ్రంథవిస్తరభీతివలన నీవిషయమును గూర్చిన చర్చను విరమించెదను. శ్రీనాథుఁడు భారద్వాజసగోత్రుఁడు. ఆపస్తంబసూత్రుఁడు. పాకనాటినియోగి బ్రాహ్మణుఁడు. తండ్రి మారయామాత్యుఁడు. తల్లి భీమాంబ. ఇతఁడు తనచే విరచింపఁబడిన కాశీఖండములో:—

"సీ. చిన్నారిపొన్నారి చిఱుతకూకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగుమీసాలనూత్నయౌవనమున
శాలివాహనసప్తశతి నొడివితి
సంతరించితి నిండు జవ్వనంబునయందు
హర్షనైషధకావ్య మాంధ్రభాష."

అని చెప్పికొనియుండుటచేత బాల్యమునుండియు నీతఁడు కవియై ప్రసిద్ధికెక్కిన ట్లున్నది. మామిడి సింగనామాత్యుని కంకితము గావించిన శృంగారనైషధమున సింగనామాత్యుఁడు తన్నుఁ జూచి:—

"క. ఒగము నుతింపఁగఁ జెప్పితి
ప్రెగడయ్యకు నాయనుంగుఁబెద్దనకుఁ గృతుల్
నిగమార్థసారసంగ్రహ
మగునాయారాధ్యచరిత మాదిగఁబెక్కుల్"

అని పలికినట్లు చెప్పియుండుటచేత నైషధమునకంటెఁ బూర్వమె పండితారాధ్యచరిత్రము రచించినట్లుగన్పట్టుచున్నది. శృంగారనైషధముతరువాతనీ మహాకవి రచియించినదిహారవిలాసమైనట్టుగన్పట్టుచున్నది. పెదకోమటివేమభూపాలుఁడు మరణమునొందినతరువాత తానురాజమహేంద్రపురముఁ జేరకమునుపు హారవిలాసమును రచియించి బాలసఖుఁడును, వయస్సునఁ దనకంటెఁ బెద్దవాఁడును కుమారగిరి రెడ్డిభూపాలునకు సుగంధభాండారాధ్యక్షుఁడుగ నున్న తిప్పయసెట్టి కంకితముగావించెను. తిప్పయసెట్టి తన్నుజూచి పలికినట్లుగా శ్రీనాథుఁడు తనహారవిలాసములో నీక్రిందిపద్యమును జెప్పెను.

"సీ. కమలనాభునిపౌత్త్రుఁ గవితామహారాజ్య
భద్రాసనారూఢుఁ బరమపుణ్యుఁ
బాత్రునాపస్తంబసూత్రు భారద్వాజ
గోత్రు సజ్జనమిత్రు గులపవిత్రు
భీమాంబికామార నామాత్యనందను
నఖిలపురాణ విద్యాప్రవీణు
నధ్వర్యు వేదశాఖాతిథినిష్ణాతు
నంధ్రభాషా నైషధాబ్జభవుని
గీ. నుభయభాషాకవిత్వప్రయోగకుశలు
బాలసఖు గారవించి తాత్పర్య మొప్ప

నవనిధీశయ త్రిపురారియక్షరాజు
హితమిత్రోక్తులు వెలయఁగ నిట్టులనియె. ”

ఇరువదేండ్లప్రాయమున నైషధము శ్రీనాథుఁడు రచియించెనని యుమాకాంతముగారు చెప్పినది సరికాదు. నైషధము రచించునప్పటికి శ్రీనాథునకు ముప్పదియైన నలువదికి లోపల వయస్సుండి యుండు నని నాయభిప్రాయము. ఇరువదియేండ్లవయస్సుననే శ్రీనాథుఁడు పెదకోమటివేమభూపాలుని యాస్థానమున విద్యాధికారపదవియందుండె ననుట విశ్వాసపాత్రము గాదు. శ్రీనాథుఁ డెంతవిద్వాంసుఁ డైనను వయస్సుముదిరిన పండితప్రకాండులచే నలంకరింపఁబడిన మహారాజాస్థానమునందు విద్యాధికారపదవి యిరువదేండ్లప్రాయమున నధిష్ఠింపఁజాలఁడు. అనుభవ విరుద్ధమైన విషయము నమ్ముట యెట్లు ?

శ్రీనాథుని కొండవీటి పురవర్ణనము.

దేవరాయమహారాయలు కర్ణాటసామ్రాజ్యాధిపత్యమును వహించి యున్న కాలమున శ్రీనాథమహాకవి పెదకోమటి వేమభూపాలునికడ విద్యాధికారిగనుండియుఁ గర్ణాటరాజధాని యగు విద్యానగర మను నామాంతరముగల విజయనగరమును జూడం బోయెను. కర్ణాటసింహాసనాధ్యక్షుఁ డగు దేవరాయ లీయఖండపండితుని సన్మానించి నివాసస్థలం బెయ్యది యని ప్రశ్నింపఁగా నితఁ డీక్రింది పద్యమును జదివెనఁట !

"సీ. పరరాజగిరి దుర్గవర వైభవశ్రీలఁ
గొనకొని చెడనాడు కొండవీడు
పరిపంథిరాజన్యబలముల బంధించి
కొమరు మించినబోడు కొండవీడు
ముగురు రాజులకును మోహంబుఁ బుట్టించు
గుణము లైన యురిత్రాడు కొండవీడు
గీ. జవన ఘోటక సామంత సరసవీర
భటనటానేక హాటకప్రకటగంధ
సింధురారవ మోహనశ్రీలఁ దనరు
కూర్మి యమరావతికి జోడు కొండవీడు."

అష్టభాషాకవితాసామ్రాజ్యాభిషిక్తుఁడును, డిండిమకవిసార్వభౌమ బిరుదాంకితుఁడును, శ్రీకంఠాగమశిఖండమండనమణియై ప్రప్రథమమున విజయ డిండిమము నార్జించిన డిండిమ ప్రభుని దౌహిత్రుఁడును, సభాపతి భట్టారకాచార్య భాగినేయుండును, సరస్వతీప్రసాదలబ్ధకవితా సనాథుండును, యోగానంద ప్రహసనకర్తయు, నగు నరుణగిరి నాథుఁ డను మహావిద్వాంసుఁ డొకఁడు దేవరాయ మహారాయలవారి యాస్థానమలంకరించి యెట్టి పండితులను, ఎట్టి కవులను సరకుఁగొనక విజృంభించి యనేక పండితుల నోడించెను. కారణమేమో తెలియదుగాని యట్టి పండితాగ్రగణ్యునకును మన శ్రీనాథ భట్ట సుకవికి నుద్భటమైన వివాదము పొసఁగినది.

డిండిముని జయించి స్వర్ణాభిషేకము గాంచుట.

డిండిమకవి సార్వభౌమబిరుదాంకముగల కవిశ్రేష్ఠులు మూవురు గానంబడుచున్నారు. వీరిలో మన శ్రీనాథునకు బ్రత్యర్థిగ నున్నయతఁడు యోగానంద ప్రహసన కర్తయగు నరుణగిరి నాథుఁడను కవియని పైని జెప్పియున్నాఁడను. ఇతఁడు గౌడ బ్రాహ్మణుఁడు. ఈమహాకవి తనప్రహసనము నందలి భరతవాక్యములో "దీర్ఘాయుర్దేవరాయో దధతు వసుమతీ చక్రమాచంద్రతారకమ్" అనియున్నందున దేవరాయల కాలమువాఁడని స్పష్టముగాఁ జెప్పవచ్చును. తనపితామహుఁడు కవిప్రభుఁడనియును, బళ్లాలరాయాస్థానకవీశ్వరుల గర్వమడంచినవాఁడనియును, నాగణయను కవీశ్వరుని నోడించినవాఁడనియును, తనతండ్రి రాజనాథ దేశికుఁడనియును, మాతామహుఁడు డిండిమప్రభుఁడనియును, విజయడిండిమము గలవాఁడనియును, శైవవేదాంత పారంగతుఁడనియును, తల్లియభిరామ నాయికయనియును, మేనమామ సభాపతి భట్టారకాచార్యుఁడనియును, యోగానందప్రహసనమునుబట్టి దెలియుచున్నది*

---

*"అస్తి ఖలుగౌడేషు...గ్రిహారనాయనమణేః, సామవేద సాగరసాంయాత్రికస్య, అష్టభాషాకవితాసామ్రాజ్యాభిషిక్తస్య, బల్లాళరాయకటక కవికుల గర్వపర్వతపవేః, నాగణకవిగజకేసరిణః, శ్రీకవిప్రభోఃపౌత్రః

శ్రీయుత వేటూరు ప్రభాకరశాస్త్రిగారు వారిచే రచియింపఁబడిన కనకాభిషేకమను గ్రంథమున నిట్లు వ్రాసియున్నారు.

„దేవరాయలను పేరు విద్యానగర ప్రభువులలోఁ బలువురకుఁ బొసంగునదియే యైనను ద్వితీయహరిహరరాయల కుమారుఁడగు దేవరాయల యందును, తరువాత నాతని పౌత్త్రుఁడు దేవరాయలయందును రూఢముగాఁ గన్పట్టుచున్నది. రెండవ దేవరాయల కిమ్మడి దేవరాయలని, ప్రౌఢ దేవరాయలని, ప్రతాప దేవరాయలని, నామాంతరములుగలవు. యోగానంద ప్రహసనమునఁ బేర్కొనఁబడిన దేవరాయ లీయిర్వుర దేవరాయలలో నొక్కఁడై యుండవలయును. రెండవదేవరాయలే కాఁదగుననుట కొకయాధారముగలదు. సంస్కృతమున నిమ్మడి దేవరాయలు రచియించిన ట్లాతని పేర మహానాటక సుధానిధియను నొకయుత్తమమైన కావ్యముగలదు. బాలకాండాంతమున గల పద్యమిది—

పుత్త్రి శ్రీరాజనాథ దేశికస్య, బ్రహ్మాండభాండపిచండమండలీవిజయడిండిమచండిమ్నః, శ్రీకంఠాగమ శిఖాంతమంత్రసమన్వితః, శ్రీడిండిమ ప్రభోర్దౌహిత్రః, శ్రీమదభిరామనాయికోస్తనంధయః, సభాపతి భట్టారకాచార్య భాగినేయః శ్రీడిండిమ కవిసార్వభౌమ ఇతిప్రథిత బిరుదాంకనామధేయః, సరస్వతీప్రసాదలబ్ధకవితాసనాథః, శ్రీప్రమానరుణాగిరినాథః తేనకృతేన యోగానంద నామ్నా ప్రహసనేన సభానియోగ మనుతిష్ఠామి'' —

శ్లో. శ్రీమానిమ్మడి దేవరాయ నృపతి స్స్వర్లోక కల్లోలినీ
కల్లోలప్రతిమల్లసూక్తివిభవో విద్వజ్జన శ్లాఘితః
ధీమానాది మకాండవస్తు విషయా న్వ్యస్తాన్మహానాటక
శ్లోకాన్వర్ణ పదక్రమోజ్జ్వలతరాన్ రమ్యానకార్షీ ద్విభుః

ఈశ్లోకమునఁగల "కల్లోలప్రతిమల్లసూక్తివిభవ" యను పదమే భేదమును లేక యట్లే డిండిమభట్టారకుని చాటుపద్యమునఁ గూడఁ గలదు. ఉదాహరింతును—

శ్లో. అగ్రే డిండిమతాడనం తత ఇతో వందివ్రజో ద్ఘోషణం
ద్వితాఃశ్చిత్ర పటాః కియంతి బిరుదప్రోతాని పద్యానిన:
ఆస్తాంతావదిదం మహేశ మకుటీకోటీరకల్లోలినీ
కల్లోలప్రతిమల్లసూక్తివిభవై ర్దేవ్యాన్విజేష్యామహే!

దీనివలన నిమ్మడిదేవరాయలకాలమున డిండిమభట్టారకుఁడుండినట్లు తేలుచున్నది. మఱియు, మహానాటక సుధానిధికూడ నాడిండిమభట్టారకునికూర్పే యగునోయని సంశయము పొడముచున్నది. దేవరాయలు రచించినట్లుగల రతిరత్నప్రదీపిక యనుకామశాస్త్రము కూడ నిట్టిదే యగుకాఁబోలు! అయియుండును. అన్యకవీశ్వరరచితములై ధనలోభమున రాజులపేళ్లఁ బ్రచురింపఁబడినగ్రంథములు మన తెల్గుదేశముననే పరశ్శతము కలవు. ఆవుల్లు వెల్లడింప వేఱుగ్రంథమే కూర్పవలసియున్నది. ఈప్రౌఢ దేవరాయలవారి కాలముననే యరు

ణగిరి నాథుఁడను కవీశ్వరునిచే ద్రావిడభాషయందుఁ గొన్ని ప్రౌఢములగు శైవస్తోత్రగ్రంథములు రచియింపఁ బడినవి. ఆయరుణగిరినాథుఁ డీయోగానందప్రహసనకర్త యరుణాగిరి నాథుఁడే యగునేమో విచారింప వలసియున్నది."

ప్రభాకరశాస్త్రిగారు చూపిన హేతువుచొప్పున యోగానందప్రహసనకర్తయగు డిండిమకవిసార్వభౌముఁడు దేవరాయల కాలమునను, ప్రౌఢదేవరాయలకాలమునఁగూడ నుండి యుండును. దేవరాయలకాలమునఁ గడపటిభాగమునను,ప్రౌఢదేవరాయలకాలమునఁ బ్రారంభముననుండి యుండవచ్చును గాని శ్రీనాథకవికిని డిండిమకవిసార్వభౌమునకును జరిగిన యుద్భటవివాదము ప్రథమదేవరాయలకాలమునందే యని నిర్ధారించుట కొకహేతువు గన్పట్టుచున్నది. శ్రీనాథుఁడు కర్ణాటాధీశునికొల్వునకుఁ బోయినపుడు కొండవీటిపురవర్ణనము జేయుట. ప్రౌఢదేవరాయలు సింహాసన మెక్కినప్పటికి అనఁగా క్రీ. శ. ౧౪౨౨వ సంవత్సరమునాటికి పెదకోమటివేమభూపాలుని ప్రభుత్వమును, తరువాత వాని పుత్త్రుఁడు రాచవేమనయొక్క ప్రభుత్వమును కడ ముట్టి కొండవీటిరాజధానియొక్క ప్రాముఖ్యత దొలఁగిపోవుటసంభవించెను. కొండవీటిరాజ్యముతరువాత స్వల్పకాలము కర్ణాటకులస్వాధీన మైయుండినది. కనుక ప్రౌఢదేవరాయలకాల

మున శ్రీనాథుఁడు ప్రౌఢదేవరాయనికి సామంతుఁడగు తెలుఁగురాయనికడను స్వతంత్రులగు రాజమహేంద్రపుర రాజ్యాధిపతులకడను నున్నవాఁడుకానికొండవీటిపురమునందు లేడు. అదియునుంగాక శ్రీనాథుఁడు రాజమహేంద్రపురము చేరునప్పటికే కర్ణాటాధీశునికొల్వున డిండిమకవిసార్వభౌముని నుద్భటవివాదమున జయించి కర్ణాటాధీశ్వరుని యాస్థానమున స్వర్ణాభిషేకమును బొందియుండెను. శ్రీనాథుఁడు తన కాశీఖండములో—

"శా. కర్ణాటక్షితినాథమౌక్తికసభాగారాంతరాకల్పిత
స్వర్ణస్నానజగత్ప్రసిద్ధకవిరాట్సంస్తుత్యచారిత్ర! దు
గ్ధార్ణోరాశిగభీర! ప్రాహ్ణముఖమధ్యాహ్నపరాహ్ణార్చితా
పర్ణావల్లభ! రాజశేఖరమణీ! పంటాన్వయగ్రామణీ!"

అని వీరభద్రారెడ్డిని సంబోధించి వ్రాసినవాఁడగుటచేత నంతకుఁ బూర్వమె యీమహాగౌరవము నాతఁడు పొందియుండె ననుట స్పష్టము. రాజమహేంద్రపురము వచ్చిన తరువాతనె యీతఁడు ప్రౌఢదేవరాయని కొల్వునకేగి యుండుననియూహింత మన్న శ్రీనాథుఁడు తన కునికిపట్టయిన రాజమహేంద్రపురమును వర్ణింపవలయునుగాని యప్పటికె పరాధీనమైనదానిని, తాను విడిచిపెట్టినదానిని కొండవీడు నంతపౌరుషముతో నారీతి వర్ణించియుండఁడు. కాఁబట్టి పెదకోమటి

వేమభూపాలుఁడు కొండవీటిరాజ్యమును బరిపాలించుకాలమున శ్రీనాథుఁడు విద్యానగరమునకుఁ బోయియుండును. కొండవీటి ప్రభువగు పెదకోమటివేమభూపాలుఁడు విద్యానగరప్రభువగు దేవరాయనితో సమకాలికుఁడు గావున శ్రీనాథమహాకవి దేవరాయనికాలమునఁ గడపటిభాగమున నాతని గొల్వునకుఁ బోయి తదాస్థాన ప్రఖ్యాతకవి యగుడిండిమభట్టారకుని నుద్భట వివాదమున నోడించి యాతని కంచుఢక్క పగులఁ గొట్టించి దేవరాయనిముత్యాలశాలలో మహావిద్వజ్జనంబుల సమ్ముఖంబున స్వర్ణస్నానమును గాంచుట యథార్థమై యుండును.*

## ఒంటిస్తంభము మేడ.

ఇందునుగూర్చి కొండవీటి దండకవిల, కవిజీవితములు మొదలగు గ్రంథములయందు నొకవింతకథ దెలుపఁబడుచున్నది. "శ్రీనాథుఁడు రాయలయాస్థానమునకుఁబోయినపుడు రాయల వలన 'గృహరాజుమేడ' యను నొకసౌధవిశేషంబు గట్టించు యత్నము చేయఁబడుచుండెను. అట్టి వృత్తాంతమును దెలిసి

*ఈడిండిమకవిసార్వభౌముని మాతామహుఁ డగుడిండిమకవిసార్వభౌముఁడు (ప్రథముఁడు) కవితార్కిక సింహ సర్వతంత్రస్వతంత్రాదిబిరుదు మండనుఁడై విశిష్టాద్వైతమతమును బెంపొందించిన వేదాంతదేశికులతోడ నుద్భట వివాదము జరిగించిన ట్లోకగాథపండిత పరంపరాగతముగా దక్షిణదేశమునఁ జెప్పుకొనఁ బడుచున్నది.

గాని యామేడ తన ప్రభుండగు కోమటివేమారెడ్డికే యుండ వలయునను కోర్కెతోఁ శ్రీనాథుఁ డాగృహరాజుమేడ మాప్రియుండగు వేమారెడ్డి కట్టించి యుండెను. దానిం జూచి మీరును గట్టింపవచ్చునని పల్కెను. అట్టి మేడ మిగుల నపురూపమైన దగుటంజేసి వేమారెడ్డి దానింగట్టించియే యున్నఁదాఁ గట్టించునవసరము లేదనియు, నైన నది యేవిధముగాఁ గట్టంబడెనో యారసి రం డని తన భృత్యులలోఁ దగువారిం బంప నిర్ణయించెను. ఆవృత్తాంతము తెలిసికొని శ్రీనాథుఁడు తన జనములోఁ గొందఱం బిలిచి వేమారెడ్డి కావార్తం దెలిపి తనమాట బోటుపోకుండఁ ద్వరలో గృహరాజుమేడంగట్టి సిద్ధము చేసి యుంచుమని చెప్పి పంపించెను. అట్టివృత్తాంతమును వినినతోడనే వేమారెడ్డి యట్టి గృహరాజు మేడ కట్టించలేనేమో యని దిగులుపడియుండఁగా నతని యిలువేల్పగు మల్లసూరిశక్తి యతని స్వప్నములోవచ్చి కొండవీటిలోనున్న పోతరాజుగుడిద్వారమందున నొక ముసలితుమ్మమ్రా నున్నదనియును, దానిని దెచ్చి స్తంభముగా వేసినచో గృహరాజు మేడ కట్ట వచ్చునని చెప్పెనఁట. అపుడు వేమారెడ్డి లేచి స్వప్నానుసారముగా తుమ్మఁగొట్టి తెప్పించి తొమ్మిది దినములలో గృహరాజుమేడగట్టించి సిద్ధము చేసెనఁట. ఇట్లుండ రాయప్రేషితులగు భటులువచ్చి గృహరాజుమేడం జూడవచ్చితి

మని తెలిసిరి. అపుడు వేమభూమీధవుఁడు వారిని సగౌరవంబుగాఁ బిలువంపించి గృహరాజుమేడ నంతయుం జూపి వారికి బహుమతులనిచ్చి మరల రాయలకడకుం బంపివేసెనఁట. శ్రీనాథుఁడును వీరు మరల రాయలకడకువచ్చిన సంగతి తెలిసికొని తనమాట నెగ్గుటకు సమ్మతించి రాయలఁ దన కవిత్వంబున నలరింపంజేసి బహుమతులనందుకొని మరల కొండవీటిలోనున్న తన ప్రభునికడకు వచ్చి చేరెను." ఈకథ యొక్క యాదార్థ్యమెంతవఱకు విశ్వసనీయమో చదువరులే నిర్ణయించుకొందురుగాక.

శ్రీనాథుఁడు రావుసింగభూపాలునసభకుఁబోవుట.

శ్రీనాథుఁడు రావుసింగమహీపాలు సభకుఁబోయి కొంత కలవరము కలిగించినట్లు మఱియొకగాథకలదు. కవిజీవితములలో నిట్లు వ్రాయఁబడియున్నది. "వేమభూపాలుఁడు తనకు రావుసింగభూపాలునితోఁ బనిగల్గ శ్రీనాథుని అతని సభకుఁ బంప నుద్యోగించెను. కాని ఆసింగభూపునకు నీవేమభూపాలునకును విశేషముగ సంతస్తాపము లుండుటంబట్టియు, సింగభూపాలునకు సర్వజ్ఞుండను ప్రసిద్ధియుండుటఁబట్టియు నాతని యాస్థానమునకుం బోయినచోఁ దనకుఁ బరాజయము గల్గునేమో యను సంశయంబు శ్రీనాథునకుం గలిగెను.

దేసటివంశ్యులగు రెడ్డికుటుంబమువారికిని, రేచర్లవంశ్యు

లగు పద్మనాయకుల కుటుంబమువారికి నాకాలమున ద్వేషమే కాని మైత్రిలేదు. ఉభయకుటుంబములవారు నొండొరుల నాశనముం జేసికొనంజూచుచుండిరి. పెదకోమటి వేమభూపాలునకు సర్వజ్ఞచక్రవర్తి బిరుదము కలదని శ్రీనాథకవివిరచితమైన పోన్నుపల్లి శాసనమునుబట్టియు, అభినవభట్టబాణబిరుదాంకితుం డగు వామనభట్టవిరచితమైన వీరనారాయణచరిత్ర మను నామాంతరముగల వేమభూపాలచరిత్రమునుబట్టి స్పష్టముగాం దెలియుచున్నది. అట్టిసర్వజ్ఞచక్రవర్తిబిరుదాంకితుండగు పెదకోమటివేమభూపాలునియాస్థానమున విద్యాధికారిగనుండి కర్ణాటాధీశ్వరుని కొల్వునకుంబోయి యఖండపండితుండగు డిండిమకవిసార్వభౌముని నోడించి యాతనిలోహడిండిమమును బగులంగొట్టించి తానార్జించినయశోడిండిమము నాంధ్రమండలమం దెల్ల మ్రోగించుచున్న కవిసార్వభౌముం డగు శ్రీనాథుండు తనకుం బరాజయము కల్గునేమో యని సంశయముపడుట హాస్యాస్పదముగానున్నది. ఇది యెంతమాత్రము విశ్వసనీయముగం గన్పట్టదు. మఱియును పెదకోమటివేమభూపాలుండు కొంచె మించుమించుగా ౧౪౦౦ మొదలుకొని ౧౪౨౦ వఱకును నిరువది సంవత్సరములు పరిపాలనముచేసినవాండు. ఈ పెదకోమటివేమభూపాలునకు సమకాలికుండైన సర్వజ్ఞ బిరుదాంకితుం డగు రావుసింగమహీ

పాలుఁ డెతఁడో నా కింతవఱకును బోధపడియుండలేదు. రావు సింగమహీపాలునకుంగల సర్వజ్ఞబిరుదమునుబట్టి భయపడి శ్రీనాథకవిసార్వభౌముఁడు రావుసింగమహీపాలునియాస్థానమునను న్న శారదావిగ్రహమును గాంచి యీక్రిందిపద్యమును జెప్పెనఁట.

"సీ. దీనారటంకాలఁ దీర్థమాడించితి
దక్షిణాధీశు ముత్యాలశాలఁ
బలుకుతోడై తాంధ్రభాషామహాకావ్య
నైషధగ్రంథసందర్భమునకుఁ
బగులఁగొట్టించి తుద్భట వివాద ప్రౌఢి
గౌడడిండిమభట్టు కంచు ఢక్క
జంద్రశేఖరక్రియా శక్తి రాయలయొద్ద
బాదుకొల్పితి సార్వభౌమ బిరుదఁ

మెటుల మెప్పించెదో సన్ను నింకమీఁద
రావు సింగమహీపాలు ధీవిశాలు
నిండుకొలువున నెలకొనియుండి నీవు
సకల సద్గుణ నికురంబ శారదాంబ."

ఈపద్యమునుబట్టి శ్రీనాథకవిసార్వభౌముఁడు స్వర్ణాభిషేక మహోత్సవకథ నంతకుపూర్వము జరిగియున్నట్లే దెలిపి, యున్నాఁడు. మఱియు నీపద్యమునందు రావుసింగమహీపాలు

కు సర్వజ్ఞబిరుదము కలిగి యున్నట్లు చెప్పక పోయినను,

కం. సర్వజ్ఞనామధేయము
శర్వునకే రావుసింగ జనపాలునకే
యుర్విం జెల్లును నితరుని
సర్వజ్ఞం డనుట కుక్క సామజ మనుటే.''

అను పద్యమును జెప్పి స్తుతించెనఁట !

ఇంతకన్న నవిశ్వసనీయమైనదియు, హాస్యాస్పదమైనదియు నాత్మగౌరవహీనమైనదియునగు విషయము మఱియొండుగానరాదు. రావుసింగమహీపాలుని సర్వజ్ఞుం డని స్తుతించిన స్తుతించుగాక ! ఎవ్వని యాస్థానమునఁ దాను విద్యాధికారపదవి నందుండి మహోన్నతదశ ననుభవించెనో, ఎవ్వనికిఁ దాను సర్వజ్ఞచక్రవర్తి యను బిరుద మిప్పించెనో యట్టి పెదకోమటి వేమభూపాలుని కుక్కనుగాఁబోల్చి విరోధి సభలో నిందించునంతటి యధమపాత్రమును శ్రీనాథకవిసార్వభౌముఁడు కృతఘ్నుఁడై ప్రదర్శించునా ? శ్రీనాథుఁడు మరలి వేమభూపాలుని సభకువచ్చి యాపద్విశేషములను దెలుప వేమభూపాలుఁడు తన విరోధియగు సింగమనీని సర్వజ్ఞుఁ డని వర్ణింపఁగా మేము నట్టి బిరుదున కంగీకరించినట్లుండును గదా, కార్యార్థమై నిన్నుఁ బంపియుంటిమిగాని నిజముగ నతని వర్ణించి యాతనివలన బహుమానమందఁ రాఁబంపలేదే, నీ వెట్లుగ నతని

సర్వజ్ఞుఁ డని నుతియించితివి, నీలౌకికప్రజ్ఞకులోపమాపాదించి తి''వని యధిక్షేపించెనఁట! అందులకు శ్రీనాథుఁ డిట్లు ప్రత్యుత్తర మిచ్చెనఁట!

,,నే నీవలనం బ్రేరేపింపఁబడి యచ్చటికింబోయి యున్నచో నీకవమానకరమగు పనిం జేసి వత్తునా ? అటులొనరింపలేను. నేను యథార్థముం జెప్పినదానిని సర్వజ్ఞుఁడును నాతని యాస్థానపండితులును గ్రహింపలేక వారి సర్వజ్ఞత్వమును వారే పోఁగొట్టుకొనిరి. అనుఁడు సర్వజ్ఞుఁడను పద్యమున కేమి యర్థము చెప్పితి వనుడు నాపద్యమునే మఱియొకవిధంబునఁ జదివి చెప్పెనఁట ! ఎట్లన్నను—

కం. సర్వజ్ఞనామధేయము
శర్వునకే రావుసింగజనపాలునకే
యుర్విం జెల్లును ? నితరుని
సర్వజ్ఞుం డనుట కుక్కసామజమనుటే.''

ఇట్లర్థము భేదించి చదువఁగా దూషణముగ నేర్పడినందున వేమభూపాలుఁడు మిక్కిలి సంతసించెనఁట !

ఇట్లు విరుద్ధార్థమునుబోధించి వేమభూపాలుని సంతోషపెట్టఁ గలిగినను ఈమహాకార్యము శ్రీనాథునకు యశోభూషణము కాఁజాలదు. అక్కడట్లు భూషించి యిక్కడిట్లు సమాధానము చెప్పుకోవలసినంత దురవస్థ యేమి సంభవించి

డె. ఇట్టివి విశ్వాసపాత్రములు కాఁజాలవు. సర్వజ్ఞచక్రవర్తి రుదాంకితుఁడగు పెదకోమటివేమభూపాలునకు సర్వజ్ఞబిరు దాంకితుఁడగు రావుసింగమహీపాలుఁడు సమకాలికుఁడుగాఁడే. ని నెట్లు సమన్వయింపవలయును? రేచెర్లవంశములోఁబదవ రము సింగమనాయని సర్వజ్ఞుఁడని యొప్పుకొందమన్నను ాతఁడు పెదకోమటివేమభూపాలునకు సమకాలికుఁడుగాఁడు. దవతరము సింగమనాయఁడు ప్రౌఢదేవరాయల కడపటి భాగముననో, తరువాతనో యుండియుండును. అప్పటికి శ్రీనాథుఁడు బ్రదికియున్నవాఁడో లేఁడో చెప్పఁజాలము. ఒక వేళ బ్రదికియున్నను డెబ్బదియేండ్ల వృద్ధుఁడై యుండవల యును. శ్రీనాథుఁడు రావుసింగమహీపాలునిసభకుఁ బో నిమి త్తమేమని విచారింపఁగాఁ గవిజీవితముల నొకవిపరీతపు హే తువు వక్కాణింపఁబడియున్నది. అది యెట్లన్న:—

“అట్టికార్య మతినీచకార్యమైనను నిటఁ జెప్పకతీరదు. గావున దాని నిట వివరించెదను. వేమారెడ్డికిని సింగమనీనికిం గలవైరముందీర్చు కొనుటకనేకమార్గము లిర్వుర కున్నను సింగమనీడుదానిందీర్చుట కొక పడిగెముం జేయించి దానికి వేమారెడ్డి యను నామముంచి, ఊచవలెను వేమారెడ్డిం దేరా, అని తనభృత్యునితోఁ జెప్పుచుఁ బ్రతినిముసమందు వేమారెడ్డి పేరు స్మరింపుచు నెన్నిపరియాయము లూచినను నీవేమారెడ్డి

కిఁ దృష్టి లేదనియును వేమారెడ్డి వాతను సభ్యులందఱును సుమి సినఁగాని యతనికడుపునిండదనియు నిట్టివే కొన్ని కార్యంబులు చెప్పి వేమారెడ్డిని గేళిసేయుచుండెను. అది వేమారెడ్డి వినియును సర్వజ్ఞసింగమనీని దండించుటకు దగిన శక్తి లేకుండుటకు ఖిన్నుఁడై శ్రీనాథునిసింగమనీని కడకుం బంపి యాతని మానుపింప యత్నించె. అట్లుగావున శ్రీనాథుఁడుసింగమనీనిమనస్సు ముందుగ రంజిల్లుపద్యములం జెప్పి తనయభీష్టంబుఁ దెలుపుమని యడిగిన సింగమనీనితోఁ బై యనుచితకార్యము మానుటయె తనయభీష్టమనియె. ఆమాటలకు సింగమనీఁడు రసికుఁడును బండితుఁడును గావున నితరమూర్ఖభూపతులవలెఁ గాక దానిని వెంటనే తీసివేసి యింకనెప్పుడు నట్టియకృత్యంబు గావింపనని పల్కెనఁట! సర్వజ్ఞబిరుదు నందినభూపతియే యిట్టి దుర్నీతిగ నడిచెనని చెప్పియుండఁగా నింకభూపతుల దుర్నీతుల నేమని చెప్పవచ్చును. ఇది దేశచారిత్రముగావున నిట్టివృత్తాంతముల నైనం జెప్పక తప్పదు. దేశస్థులందఱు నిట్టివి భావిజనోపకారులుగావున వీనిని బ్రకటించుట కనుజ్ఞనీయఁ గోరఁబడుచున్నారు.."

ఇట్టిదుర్నయకార్యమువలనఁ దన కేమియవమాన మని వేమభూపాలుఁడు శ్రీనాథునిఁ బంపెను? ఇట్టిపనులు గావించువారు రసికులును, పండితులు, సర్వజ్ఞులు నెట్లగుదురు? సర్వజ్ఞ

లిట్టి దుష్కార్యముల కొడిగట్టుదురా? ఇట్టి దుష్కార్యము మత్సరగ్రస్తుఁడైన యేభూపతియైనఁ జేసినఁ జేయవచ్చునుగాని చేసినభూపతి సర్వజ్ఞబిరుదమున కర్హుఁడుమాత్రము గాఁడు. రావుసింగమహీపాలుని యాస్థానపండితులు "కుక్కవో, నక్కవో, పులివో, కోతివో, పిల్లివో, భూతపిల్లివో"

అను సమస్య నొకదానిని శ్రీనాథున కిచ్చి పూర్తి గావింపు మనిరఁట!

శ్రీనాథుఁడు దాని నీక్రిందిరీతిని బూర్తిచేసి మెప్పించెనఁట.

"ఉ. తక్కక రావు సింగవసుధావరుఁ డర్థుల కర్థమియ్య నే
దిక్కున లేని కర్ణుని, దధీచిని, ఖేచరు, వేల్పుచెట్టుఁ బెం
పెక్కిన కామధేనువు, శిబీంద్రునివేఁడఁగనేల యాచకా!
కుక్కవొనక్కవోపులివొకోతివొపిల్లివొభూతపిల్లివో."

అపుడు సింగమహీపాలుఁ డర్హసత్కారమును గావించి పంపెనఁట.

## పెదకోమటివేముని యంత్యదశ.

పెదకోమటివేమభూపాలునిపరిపాలనము సర్వవిధములచేత శ్లాఘాపాత్ర మైనదిగానున్నది. అతఁడు మిక్కిలి సమర్థుఁడు. ప్రజ్ఞావంతుఁడు. అతని మంత్రు లెల్లరును ప్రజ్ఞావంతులు. బాహుబల విక్రమసంపత్తి కలవాఁ డగుటచేత శత్రురాజు లెవ్వరెన్నివిధములఁ దనరాజ్య మాక్రమించు కొనవలయునని

ప్రయత్నించినను వారలను బరాజితులను గావించి నైపుణ్యము మీఱ జనరంజకముగా ధరాపాలనము గావించెను. క్రొత్త సుంకములను వేయక ప్రాతపద్ధతులనే బలపఱిచి సుంకములు రాఁబట్టుచుండెను. ఆర్యమతము, వర్ణాశ్రమధర్మములను పోషించెను. వేదాధ్యయన సంపన్నులును శాస్త్రవేత్తలునగు బ్రాహ్మణోత్తములకు భూదానములు మొదలగు వానిచే సత్కరించుచు సమస్త విద్యలను బోషింపుచుండెను. దేశమున వర్తకవ్యాపార మభివృద్ధియగు మార్గములను వెదకుచుండెను. బావులు, చెఱువులు త్రవ్వించి వ్యవసాయకులకు మహోపకారములను గావించెను. దేశమున ననేకమతప్రతిష్ఠాపనలను గావించెను. ఈతనిపరిపాలనము సర్వోత్కృష్టమైన దనుటకు సందియము లేదు. కడపట కాటయవేమునికి నీతనికిని యుద్ధములు జరుగుచువచ్చి యాయుద్ధములలోఁ బెదకోమటివేముఁడు నష్టముపొందుచు వచ్చెను. మొత్తమున నీపెదకోమటివేమభూపతి సద్వృత్తముగలవాఁడైనట్లు గన్పించును. ఇతనితరువాత రాజ్యభారమును వహించిన యీతని కుమారుఁడు రాచవేమన తన దుష్ప్రవర్తనముచేతఁ దండ్రికి నపయశస్సు కలిగించుటయెగాక తుదకుఁదనరాజ్యమునంతయుఁ గోల్పోయెను. పెదకోమటి వేమభూపాలుని లింగమనాయఁడు చంపినట్లు వెలుగోటివారివంశచరిత్రము చెప్పుచున్నదిగాని యెంతమాత్రము విశ్వాసపాత్రము గాదు.

## రాచవేమారెడ్డిపరిపాలనము.

(౧౪౨౦—౧౪౨౪)

పెదకోమటివేమభూపాలుని యనంతరము రాచవేమారెడ్డి కొండవీటిరాజ్యమున కభిషిక్తుఁడయ్యెను. ఇతఁడు పెదకోమటి వేమభూపాలుని పుత్త్రుఁడనియును, తండ్రి బ్రదికియున్నకాలముననె క్రీ. శ. ౧౪౧౬వ సంవత్సరములో జగనొబ్బగండ కాలువను త్రవ్వించి శాసనము వ్రాయించె ననియు నింతకుఁ బూర్వము తెలిపియున్నాఁడను. ఇతఁ డేసంవత్సరమున సింహాసన మెక్కెనో, ఏసంవత్సరమున మరణము నొందెనో నిశ్చయముగాఁ జెప్పఁజాలము. ఇతఁడు నాలుగు సంవత్సరములు మాత్రమె పరిపాలనము చేసెనని కొండవీటిదండకవిలెయందు వ్రాయఁబడినది. మఱియు నాగ్రంథమును బట్టి యీతని పరిపాలనము జనరంజకమైనదిగాఁ గనుబట్టదు. ఇతఁడు తనపూర్వుల మార్గమునుగాని తండ్రిమార్గమునుగాని యవలంబింపక తా నొక క్రొత్తమార్గ మవలంబించి క్రొత్తపన్నులనువిధించి ప్రజలను బాధింపుచుండెనని యాచరిత్రము వాకొనుచున్నది. రాచవేమన ప్రజలపై పురుటిపన్ను విధించి యక్రమముగా రాఁబట్టుచుండెననియు, తన భృత్యుఁడగు సౌరము ఎల్లయ్య యను బలిజనాయకునిపై పురుటిపన్నువేసి బలాత్కారముగా వసూలుచేసినందున నాతఁ డాగ్రహించి యొకనాఁడు ముత్యా

లమ్మగుడికడ నాతనిఁ గఠారితోఁ బొడిచి చంపె ననియుఁ బై దండకవిలె నుడువుచున్నది. దీనిని స్థిరపరచునట్టి ప్రమాణ గ్రంథ మేమియుఁ గానరాదు. ఇది యెట్లిదైనను నితని పరి పాలనము జనరంజక మైనది కాదనియు, నత్యల్పకాలములోనే కడముట్టె ననియు మాత్రము మనము విశ్వసింపవచ్చును.

మల్లారెడ్డివంశము—కందుకూరు రెడ్లు.

అద్దంకిరాజధానిగాఁ గొండవీటిరాజ్యమును బరిపాలించిన వేమభూపాలునకు మల్లారెడ్డియనుతమ్ముఁడుగలఁడనియునతఁడు రామునకు లక్ష్మణుఁడువలె విధేయుఁడై సహాయుఁడై సేనాప తియై, యుండెనని యింతకుఁ బూర్వప్రకరణమునఁ జెప్పి యున్నాఁడను. ఇతనికిఁ బినకోమటియను పుత్త్రుఁడుగలఁడు. అనవేమరెడ్డికాలమున కందుకూరుదుర్గముననుండి పూంగి నాటిసీమను బరిపాలనము సేయుచుండెను. ఈపినకోమటి భూపాలునకు గౌరాంబికయందు శ్రీగిరిరెడ్డి, రాచవేమారెడ్డి, మాచారెడ్డి, అన్నదేవరెడ్డి, పెద్దిరెడ్డియను నేవురు పుత్త్రులు జనించిరి. శ్రీగిరిరెడ్డి మిక్కిలి పరాక్రమవంతుఁడై శత్రువులను జయించెను. ఇతఁడు సంగీతమునందుఁ బ్రవీణుఁడుగనుండెను. ...యనకు శ్రీమత్ ఒడెయరాయశ్రీగిరి గురువుగా నుండెను. ...ఁడు మహాదాతయై హేమాద్రిదానచింతామణి యని ప్రఖ్యాతిఁగాంచెను. ప్రసిద్ధములైనపంటలను పండించుటకై

గొప్ప చెఱువులను త్రవ్వించి శాశ్వతయశమును సంపాదించెను. ఇతని పెద్దతమ్ముఁడు రాచవేమన శ్రీగిరికిఁ బిమ్మట ప్రభుత్వ భారమును వహించి జనరంజకముగఁ బరిపాలనము చేసెను. ఇతఁడు తన యన్నయగు శ్రీగిరిరెడ్డికి పుణ్యముకొఱకు కందుకూరులోని (స్కందపురి) జనార్దనస్వామికై యొక చెఱువును బద్దెపూడిగ్రామములో త్రవ్వించి శా. శ. ౧౩౨౦ అనఁగా క్రీ.శ. ౧౩౯౮ దవసంవత్సరమున సూర్యగ్రహణపుణ్యకాలమున సమర్పించెను. అనఁగా కందుకూరిజనార్దనస్వామివారి బద్దెపూడిగ్రామములోని పంటభూములు ఫలించుటకుగాను పెద్ద చెఱువును త్రవ్వించెనని భావము. ఇతనితమ్ముఁడు మాచారెడ్డి తనతాత మల్లారెడ్డివలెనె తురుష్కులతో యుద్ధముచేసి జయించినట్లు శాసనములు దెలుపుచున్నవి. శ్రీగిరిరెడ్డికి కోమటిరెడ్డి, మాల్లారెడ్డి, అనవేమరెడ్డి, నారాయణరెడ్డియను నల్వురు పుత్త్రులుగలరు. రాచవేమనకుఁ బిమ్మట శ్రీగిరిరెడ్డిప్రథమ పుత్త్రుఁడైన కోమటిరెడ్డి ప్రభుత్వభారమును వహించెను. పెదకోమటివేమభూపాలుఁడును నతనికుమారుఁడు రాచవేమ భూపాలుఁడును స్వర్గస్థులైనపిమ్మట నీశ్రీగిరి కోమటి భూపాలుఁడు విద్యానగరసామ్రాజ్యచక్రవర్తియగు ప్రౌఢదేవరాయలవారిచే జయింపఁబడి యాతనికిఁ గప్పము గట్టుసామంతుఁడుగ నున్నట్లు గనబట్టుచున్నది. ఈకోమటిభూపాలుని

తమ్ముఁడు మల్లారెడ్డి శా. శ. ౧౩౩౦నకు సరియైన క్రీ. శ. ౧౪౦౮వ సంవత్సరమున చుండిగ్రామమున జనార్ధనస్వామిని ప్రతిష్ఠాపనఁజేసి యాలయప్రాకారములును మండపమును నిర్మాణముచేసి స్వామి కనేక సువర్ణాలంకారములను సమర్పించి నిత్యకైంకర్యాదులకై నాలుగుపుట్లసార ధాన్యము ఫలించు మెరకపొలమును, రెండు నివర్తనముల మాగాణి భూమినిదానముచేసెను. వీరికాలముననఁగా శా. శ.౧౩౭౬వ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౪౦౪ గవ సంవత్సరమునఁ బెదకోమటి వేమభూపాలుఁడు సోమోపరాగమహాపుణ్యకాలమునందు శాండిల్య కౌశిక గోత్రసంభవులగు ఎల్లేపెద్దిలక్ష్మణదీక్షితులవారికి, షడ్దర్శనాలవల్లభ సోమయాజులుగారికిని పెదపూడిగ్రామమును నగ్రహారముగా నొసంగి తామ్రశాసనము వ్రాయించి యిచ్చెను. శ్రీగిరిరెడ్డి తమ్ముఁడైన మాచారెడ్డి మనుమఁడును, కోమటిరెడ్డి పుత్త్రుఁడునగు శివలింగభూపతి ప్రౌఢదేవరాయనికాలమున, శ్రీగిరి కోమటిరెడ్డి యనంతరమున స్కందపురి రాజధానిగఁ బరిపాలనము చేసినట్లు గన్పట్టుచున్నది. ఇతఁడు పండితుఁడై సంస్కృతభాషలో గిరీశశ్రుతిసూక్తిమాలయను గ్రంథమును రచించి ప్రఖ్యాతిఁగాంచెను. శ్రీగిరికోమటిరెడ్డిభూపాలునకు మైత్రావరుణగోత్రుఁడును, ఆపస్తంబసూత్రుఁడును, దూబగుంట

మారమరాజుపౌత్త్రుఁడును, రామరాజునకు బ్రహ్మసానికిఁ బుత్త్రుఁడును పాకనాటినియోగిబ్రాహ్మణుఁడును నగు కొమ్మ నామాత్యుఁడు ప్రధానమంత్రిగ నుండి రాజ్యవ్యవహారముల నడుపుచు వచ్చెను. ఇతఁడు లౌకికకార్యములయందు మాత్రమె గాక వైదికకార్యములయందు నసమానప్రజ్ఞ గలవాఁడై వేదవిద్యల నభ్యసించి, అగ్నిష్టోమము, అతిరాత్రము మొదలగు యజ్ఞకార్యముల నిర్వర్తించి సోమయాజియై తుమిలేఱు తొంపేఱులమధ్యను చుండికోటకు నుత్తరదిక్కున యజ్ఞేశ్వర దేవుని ప్రతిష్ఠాపించెను.

ఇతఁడు తనకు లక్కమాంబయందు జనించిన రామచంద్రుఁడు, నారాయణుఁడు నను నిర్వురుకొమాళ్ళసహాయముతో శ్రీశైలములోని పాతాళగంగనుండి స్వయంభూలింగము నీపవిత్రస్థలమునకుఁ గొనివచ్చి పైఁజెప్పినరీతిని బ్రతిష్ఠాపించెను. ఈ దేవునికి ఱాళ్ళతో నొకయాలయమును మండపమును గట్టించెను. దీనిచుట్టును విఘ్నేశ్వరుని, దుర్గను, గోపాల దేవుని, భైరవదేవునివిగ్రహములను బ్రతిష్ఠగావించి శిలలతో నాలయములను గట్టించెను. శిలాప్రాకారములోపల నొక చక్కనియారామమును నెలకొల్పెను. తాను యజ్ఞము చేసిన తావులలో జ్ఞాపకార్థముగ రెండు శిలాస్తంభములను నిల్పెను. ఈయజ్ఞేశ్వరప్రతిష్ఠాపన శా. శ. ౧౩౫౨ సాధారణసంవత్సర

ఫాల్గుణ శుద్ధ ౧౧ గురువారమునాఁడు జరుపఁబడినది. ఈప్రతిష్ఠాపనల కన్నిఁటికిని కోమటిరెడ్డిపుత్రులు తిప్పయరెడ్డి, శ్రీగిరన్న, రామయ్య, దేవరాయఁడు, నారాయణదేవుఁడు ననునేవురును గలిసి తుంగభద్రాతీరమున నున్న విరూపాక్షదేవుని సమ్ముఖమున ననేకభూదానములను జేసి యుండుట చేత నప్పటికి వీరలు ప్రౌఢదేవరాయలవారికి లోఁబడిపోయి యుండి రని వ్యక్తమగుచున్నది. కొమ్మనసోమయాజులును వానిపుత్త్రులు రామచంద్రుఁడును, నారపరాజును, కందుకూరు, కోవూరు, చుండిగ్రామముల సమీపమున మంచి గొప్పచెఱువులను, బావులను, త్రవ్వించి ప్రజలకు మహోపకారములను గావించుటయెగాక యింక ననేకప్రతిష్ఠలను గావించి ప్రఖ్యాతిఁ గాంచిరి.* ఈకందుకూరిరెడ్లపాలన మింతటితోఁ దుదముట్టెను గావున వీరిని గుఱించి తెలిసికోఁదగిన శేషాంశములు మఱేవియును లేవు.

———

*Nellore Inscriptions, Vol I, 495, Kandukur No 16, Vol II, Kandukur Nos, 17, 18, 19.

శ్రీ వేమన
ఆంధ్ర భాషా నిలయము
దక్షిణ హైదరాబాద్
1923.
HYDERABAD-DN.

# ఎనిమిదవ ప్రకరణము.

## కాటయవేమభూపాలుని చరిత్రము.

(క్రీ.శ. ౧౩౮౬ మొదలుకొని క్రీ.శ. ౧౪౦౦.)

ఈ కాటయవేమభూపాలుఁడు కొండవీటిరాజ్యము నేలిన దేసటి యనపోతభూపాలుని మేనల్లుఁడనియు, జామాతయనియు, కుమారగిరిరెడ్డి తోఁబుట్టువు మల్లాంబిక పెనిమిటి యనియు, కుమారగిరిభూపాలునికాలమున రాజకార్యనిర్వహణదక్షుఁడైనమంత్రిగను సైన్యాధ్యక్షుఁడుగను నుండి యాతని మెప్పించి రాజమహేంద్రపురరాజ్యమును బహుమానముగఁ బడసె ననియు వెనుకటిప్రకరణమునం దెలిపి యున్నవాఁడను. ఇతఁడు మొట్టమొదట విశాఖపట్టణమండలములోని సింహాద్రిపర్యంతము రెడ్డిరాజ్యమును విస్తరింపఁజేసిన మహాశూరుఁడు. ఆకాలమున దీనిని సామాన్యమైనకార్యముగాఁ దలంపరాదు. ఈదిక్కున రెడ్డిసామ్రాజ్యమునకు గర్భశత్రువైనగజపతి మిక్కిలి బలాఢ్యుఁడై యెప్పు డీరాజమహేంద్రపురరాజ్యము నాపోశనము బట్టుదునా యని యెదురు చూచుచున్నకాలమై యుండెను. ఇట్టిసమయమునఁ గాటయవేమభూపాలుఁడు సింహాద్రిపర్యంతమును రాజ్యమును విస్తరింపఁ

జేయ శక్తి గలిగినవాఁ డన్న నాతనిపరాక్రమం బనమాన మని యెఱుంగవలసి యుండును. కుమారగిరిమరణానంతరము పెదకోమటివేమభూపాలునిఁ దిరస్కరించి రాజమహేంద్రపుర రాజ్యమును స్వతంత్రుఁడై పరిపాలనము చేయ నారంభించెను. అందువలనఁ బెదకోమటివేమభూపాలునకును, కాటయ వేమభూపాలునకును మనస్పర్ధ లేర్పడి యొండొరులరాజ్యము లాక్రమించుకొనుటకై యుద్ధములు గూడ జరుపుచు వచ్చిరి. ఈయుద్ధములవలనఁ బ్రయోజనము లేకపోయెను. ఎవరిప్రభుత్వములు వారికి నిలిచి యుండెను. ఈపోరాటములోఁ గొండవీటిరెడ్ల జ్ఞాతి యైనఅల్లాడరెడ్డి కాటయవేమభూపాలుని పక్షమున నిలిచి యాతనికి సాహాయ్యమును సలుపుచుండెను. అల్లాడరెడ్డి కొండవీటిరెడ్లకు జ్ఞాతిమాత్రమె గాక కొండవీటి రాజ్యపాలకుఁడైన అనవేమభూపాలుని మనుమరాలిభర్తయై యుండెను. కాటయవేముని మేనమామ యగు యనపోత భూపాలుఁ డీయల్లాడరెడ్డి భార్య వేమాంబతల్లికిఁ బెద తండ్రి యై యుండెను. అనఁగా కాటయవేముఁడును, అల్లాడరెడ్డిభార్య వేమాంబతల్లియును మేనత్త మేనమామ బిడ్డ లగుదురు. ఇట్టి సంబంధబాంధవ్యముచేత నల్లాడరెడ్డి కాటయవేముని పక్షమున నుండి పెదకోమటివేమభూపాలునికిఁ బ్రత్యర్థియై యుండెను. కుమారగిరియనంతర మక్రమ

ముగాఁ బెదకోమటివేమభూపాలుఁడు కొండవీటిరాజ్యము నాక్రమించెను గావునఁ గాటయవేమారెడ్డియును అల్లాడరెడ్డియును న్యాయముకొఱకే పోరాడి యుందురు. కాని యీవిరోధములవలన రెడ్డిసామ్రాజ్యముయొక్క యున్నతికి భంగమును గలిగించెను. కర్ణాటసామ్రాజ్యమునకు, గజపతిసామ్రాజ్యమునకు, తురుష్కసామ్రాజ్యమునకు దుస్సాధ్యముగ నుండిన రెడ్డిసామ్రాజ్య మీవిధముగా భిన్నమై, జ్ఞాతివైరములతోఁ గూడుకొనుటచేత స్వల్పకాలముమాత్రమె స్వాతంత్ర్యమును నిలుపుకొనఁగలిగి పిమ్మటఁ బరాధీన మయ్యెను. రెడ్డిసామ్రాజ్యమున కిట్టివిపత్తు సంభవించుటకు మూలకారణము కుమారగిరి యసమర్థుఁడై రాజమహేంద్రపురరాజ్యమును మహాపరాక్రమవంతుఁడును, సమర్థుఁడు నగుకాటయవేమునకుఁ బంచి యిచ్చిన యవివేకపుంగార్యమే యని స్పష్టముగా నుడువవచ్చును. కాటయవేముని పరిపాలనము గూడ పెదకోమటివేముని పరిపాలనమువలె జనసమ్మత మైనదిగ నుండెను.

## కాటయవేముని విద్యాపరిశ్రమము.

ఇతఁడు సంస్కృతాంధ్రములయం దసమాన ప్రజ్ఞగల విద్వాంసుఁడుగఁ గన్పట్టుచున్నాఁడు. ఒకనాఁడొక కవి యీతని యాస్థానమునకు వచ్చి యీక్రింది పద్యమును జెప్పెనఁట.

"కం. వెలయాలు శిశువు నల్లుఁడు
నిలమేలిక యాచకుండు నేగురు ధరలోఁ
గలిమియు లేమియుఁ దలఁపరు
కలియుగమునఁ గీర్తికామ! కాటయవేమా!"

అంతఁ గాటయవేమన సంతసించి వానిని సత్కరించి బహుమానమిచ్చి పంపెనఁట. ఇతనికడ రాయని బాచఁడను ప్రసిద్ధి కెక్కిన వ్రాయసకాఁడు గలఁడని యీక్రింది చాటుపద్యము చాటుచున్నది.

"చం. కలయఁబసిండిగంటమునఁ గాటయవేము సమక్షమందుస
త్ఫలముగ రాయసప్రభుని బాచఁడువ్రాసిన వ్రాల
మోతలున్
గలుగలుగల్లుగల్లురనఁ గంటకమంత్రులగుండెలన్నియున్
జలుజలు జల్లుజల్లురనె సత్కవివర్యులు మేలుమేలనన్."

కాటయవేమభూపాలుఁ డాంధ్రముకంటెను సంస్కృతమునం దెక్కువయభిమానము చూపియుండెను. ఇతఁడు కాళిదాసప్రణీతము లైనఅభిజ్ఞాన శాకుంతలము, మాళవికాగ్నిమిత్రము, విక్రమోర్వశీయమను నాటకత్రయమునకువ్యాఖ్యానము రచియించెను. ఇతఁడు తనవ్యాఖ్యానమునందుఁ దఱుచుగాఁ గుమారగిరి ప్రణీతమైన వసంతరాజీయమునుండి ప్రమాణవాక్యముల నెత్తిచూపెను. దీనింబట్టి రచనాసందర్భ

మున వసంతరాజీయమునకు నాటక వ్యాఖ్యానములకును దగ్గిఱ సంబంధము గలదని యూహింపఁ దగియున్నది.

## కాటయవేముని దానధర్మములు.

ఇతర రెడ్డిభూపాలురవలెనె కాటయవేమారెడ్డియు, దేవస్థానములను, వేదశాస్త్రాది విద్యలను, పోషింపవలెనను కుతూహలముగలవాఁడు. హిందూమతాభిమానముగలవాఁడును బ్రాహ్మణభక్తియుఁ గలవాఁడునై యుండి బ్రాహ్మణులకు భూదానముల ననేకములను గావించెను. కాటయవేముని శాసనములు పాలకొలనులోని శ్రీరారామేశ్వరుని యాలయములోను, సర్వవరములోని భావనారాయణస్వామియాలయములోను, ద్రాక్షారామములోని భీమేశ్వరస్వామియాలయములోను, చాళుక్య భీమవరములోని భీమేశ్వరస్వామి యాలయములోనుసింహాచలములోనినృసింహస్వామియాలయములోను గనుబట్టుచున్నవి. కాటయవేమునిభార్య రాజధానియైన రాజమహేంద్రపురమున గోదావరీతీరమున మార్కండేయేశ్వరుని బ్రతిష్ఠాపనఁజేసి యాలయమును గట్టించి శాలివాహనశకము ౧౩౨౩ వ సంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౪౦౧ ఖరనామ సంవత్సర కార్తికశుద్ధ పూర్ణిమనాఁడు కోనసీమలోని మల్లవరము గ్రామమును కాణ్వశాఖీయుఁడైన నృసింహపండితునకు ధారవోసినట్లు తుత్తరమూడి శాసనమువలనఁ దెలియు

చున్నది. మఱియు నీశాసనములోనే కాటయవేమునివంశమును ఆతనికిని కొండవీటిరెడ్లకుఁగల సంబంధమును, కుమారగిరిరెడ్డి కాటయవేమునకు రాజమహేంద్రపుర రాజ్యమిచ్చిన విషయమును దెలుపఁబడినది. *

---

*ఆసీదమాత్యరత్నం కాటయవేమ ప్రభు స్తస్య
అతిసురగురుభార్గవ మతిరతిభార్గవవిజయ విఖ్యాతిః
సింహాసనే నిధాయాసౌ కుమారగిరిభూపతిం
అతేజయ న్మహాతేజా శ్రీకృష్ణ ఇవధర్మజం.
కుమారగిరిభూనాథో యస్మై విక్రమతోషితః
ప్రాదాత్ ప్రాచీభువం రాజమహేంద్రనగరీముఖాం.
నప్తా కాటమహీభుజో గుణగణోదారస్య మారప్రభోః
పౌత్రః కాటయవేమభూమిరమణః శ్రీవేమపృథ్వీపతేః
దౌహిత్రఃపునరన్నపోతనృపతే ర్ధాత్రీశ చూడామణే
ర్జామాతా జయతి క్షితిం చిర మవన్ దొడ్డాంబికానందనః.
కాటయవేమకటాక్షే ప్రభవతి సదయే చ నిర్దయేచ
గజపతిముఖనృపతీనాం చిత్రం ముక్తాతపత్రతా భవతి.
భూపాలాన్నమయన్ ప్రజాన్నియమయన్ కాంతాజనం కామయన్
భూదేవాన్ రమయ న్నరీన్విరమయన్ మిత్రాణి విశ్రామయన్
కీర్తిం విభ్రమయ న్నఘాని శమయన్ ధర్మం సమాయామయన్
సోయం వేమమహీపతి ర్విజయతే కాటావనీశాత్మజః.
అభూత్కాటయవేమస్య జాయా మల్లాంబికా సతీ
అశేషగుణ సంపూర్ణపాతివ్రత్యధురంధరా.
రాజద్రాజమహేంద్రనామనగరే గోదావరీతీరగం

కాటయ వేముఁడు కొండవీటిరెడ్లు వహించిన బిరుదములను అనఁగా జగనొబ్బగండ, అప్పనగోపయదిశాపట్ట, రాయచే కోలుగండ, జగదగోపాల, భుజబలభీమ, పాండ్యరాయగజసింహ, సంగ్రామధనంజయ, పల్లవత్రినయన, పల్లవాదిత్య, జగదక్షుపాల, రాయవేశ్యాభుజంగ, ఇత్యాది బిరుదములను వహించెను. ఇతఁడు బ్రదికి యున్నంత కాలము శత్రువుల కజేయుఁడై యుండెను. ఇతఁడే సంవత్సరమువఱకుఁ బరిపాలనము చేసెనో స్పష్టముగాఁ జెప్పుటకుఁ దగిన యాధారము గాన్పింపదుగాని యితఁడు పెదకోమటి వేమభూపాలునితోడఁ బోరాడుచున్న కాలముననే అనఁగా క్రీ. శ. ౧౪౧౫ వ సంవత్సర ప్రాంతమున మరణమునొంది యుండెను.

## కాటయ వేముని సంతతి.

కాటయ వేమభూపాలునకు కుమారగిరి రెడ్డి తోఁబుట్టు

---

మార్కండేయశివాలయం పతిహితా మల్లాంబికా ధార్మికా
కృత్వాశుద్ధసువర్ణరత్నఖచితం బ్రహ్మప్రతిష్ఠాస్తదా
సత్రాధ్వనిచప్రపాడ జయతే నేకాన్తటా కానపి.
శ్రీశాకేగుణరామవిశ్వగణితే కార్తిక్యహేహ్ని ఖరే
ప్రౌడా త్కాటయవేమయస్యవనితా మల్లాంబికా నామతః.
గ్రామం మల్లవరం నృసింహవిషుషే కాణ్వద్విజా యాదరా
దాచంద్రార్కముదర్కలాల సమతే స్వైశ్వర్య భోగాష్టకం.
కోనదేశాగ్రహారోయం భాతి మల్లవరాభిదః
తీరేచ వృద్ధగౌతమ్యాః పుణ్యేముక్తేశ్వరాంతికే.

వగు మల్లాంబ భార్య యని తెలిసికొనియుంటిమి. మఱియును అల్లాడవేమారెడ్డి కోరుమిల్లి శాసనమున కాటయవేమునకు కాటప్రభు వను కుమారుఁడు కలఁ డనియును, అతఁడు హరిహరరాయల కొమార్తయగు హరిహరాంబను వివాహము జేసి కొనియె ననియుఁ జదివియుంటిమి. కాటయవేమునకు మల్లాంబ మాత్రమెగాక దొడ్డాంబికయను మఱియొక భార్య కల దనియు, ఆమెకు అనితల్లియను కొమార్తయు, కుమారగిరి యను పుత్త్రుఁడును గల రనియు, అనితల్లి శాసనమువలన విదిత మగుచున్నది* కాటయప్రభుని పేరును మల్లాంబపేరును దొడ్డాంబికపుత్త్రికయైన అనితల్లిశాసనమునఁ గానరావు. అల్లాడవేమారెడ్డిశాసనమున కాటయప్రభుని పేరు మాత్రమె గాక అనితల్లి పేరుకూడగలదుగాని కాటయప్రభువు యొక్కయు అనితల్లియొక్కయు, తల్లులపేరులు పేర్కొనంబడియుండ లేదు. కాటప్రభువు మల్లాంబ కుమారుఁ డని గాని లేక మల్లాంబికకు సంతతి కలదని కాని యెచ్చటను జెప్పఁబడియుండ

---

* ౪౨వ శ్లోకము.

యస్యా వేమనృపాలో జనకో దొడ్డాంబికా తు జననీతి
సాదీవ్యత్యనితల్లీనమూర్త్తి రివ దేవభూమిదేవశ్రీః

౪౩ వేమక్షితీశ తిలకేథ కథావశేషే
భర్త్తా కుమారగిరి రస్యసుతోభవోభూత్.

లును నై పరిపాలనము చేసినది స్వల్పకాలమైనను యశముతోఁ గూడుకొని య్యుండిరి. అదియునుగాక వీరికి కులగౌరవ మధికము గానుండెను. వీరివర్ణము (చతుర్థవర్ణము) విష్ణుపాదమునందు శ్రీలోకపావనియైన గంగతోడఁ బుట్టినదిగావున బ్రహ్మక్షత్రియ వైశ్యవర్ణములవారికంటెను పారిశుద్ధ్యమున మించినదనియు వీరి వర్ణములో శతులు లేరనియు, కర్మాసక్తులును, శుద్ధస్వాంతులును, శాంతులును, రాగాదిదోషరహితులును గలరని ముమ్మడినాయకుని శాసనములో నభివర్ణింపఁబడియుండెను. ఇయ్యది వైష్ణవమతసంస్కారమును బొంది వైష్ణవగురు ప్రబోధనలఁగళింకువాసి యుత్కృష్టమైన రాజ్యపదవికి వచ్చిన తరువాత నావిర్భవించినకులాభిమానజనితవాక్యములనుగా మనమూహించి సంతసింపవలసినదే. * ఇంతకన్న వీరినిగూర్చి

* పూర్వాశాపరకర్ణినీ తనులతాం లింపన్ని వోజ్జృంభత
ఈశ్వరవదనభుజోరుప్రభవా బ్రహ్మాదిజాతయ స్త్రిస్రః
తాసా మాధారార్థం చతుర్థజాతిశ్చ తత్పదా జ్జాతా
అస్యాజాతే స్తాభ్యో జాతిభ్య, శ్శుద్ధి రితి వచ స్సిద్ధం
యదియంసహజాజాతా భాగీరథ్యాత్రిలోకపావన్యా
తజ్జాతీయాః కర్మఠా స్త్వక్త శాఠ్యా
శ్శుద్ధస్వాంతా శ్శా తరాగాది దోషాః
రాజః 'న్యానామేత్య సాహాయ్యముర్వ్యా'
స్సర్వం భారం నిర్వహంత్యేవ సమ్యక్

లేదు. కాని, అనితల్లిశాసనము బయలుపడువఱకును అనితల్లి మల్లాంబికపుత్త్రి యని భావించుచుండిరి.

—:o:—

## తొమ్మిదవ ప్రకరణము.

——————

### అల్లాడభూపతి

కాటయవేమభూపాలుఁడు స్వర్గస్థుఁడైనపిమ్మట నతని బంధు వల్లాడభూపాలుఁడు రాజమహేంద్రపురరాజ్యము నాక్రమించుకొని పరిపాలనముచేయ నారంభించెను. అల్లాడభూపతి రాజమహేంద్రపురరాజ్యము పరిపాలనము చేసినట్లు శ్రీనాథకవివిరచితములైన భీమేశ్వరపురాణము, కాశీఖండములవలననేగాక అల్లాడవేమారెడ్డిశాసనమువలనఁగూడ సువ్యక్తమగుచున్నది.*

---

పశ్చాద్ధరాధిపతిభావజుగుప్సయేవ
స్వస్థానయేవసకుమారగిరీశ్వరోపి.''

ఈశాసనము శ్రీయుత దుగ్గిరాల వేంకటసూర్యప్రకాశరావు పంతులుగారిచే ఆంధ్రభారతి మూఁడవ సంపుటములో ౫, ౬ సంచికలు కలిపికుట్టిన సంచికలోఁ బ్రకటింపఁబడినది.

* చతుర్థకులమాళిమండనం బైకీర్తివిహారభుం బూపధం బైన పంట దేసటిమహాన్వయంబున పాకనాటిదేశంబున భద్రపీఠంబు నధి

కాటయవేమభూపాలుఁడు కాలధర్మముఁ జెందినవెనుకఁ బెదకోమటివేమభూపాలుఁడు రాజమహేంద్రపుర మాక్రమించుకొనుటకై దండెత్తి రాఁగా నల్లాడభూపతి రామేశ్వరము కడ నెదుర్కొని యుద్ధముఁజేసి కోమటివేముని సైన్యముల

వసించి సింహవిక్రమనగరదువ్వూరుగండవరాళి పట్టణంబులు నిజనివాసంబులుగా భూ్రలతాదష్టాష్టాదశ ద్వీపాంతరాళులగు భూపాలగ్రామణులకు దిరలింగభూమండలాఖండలురను బోలయవేమాన్నపోతాన్న వేమకుమారగిరీశ్వరాదులం బూజ్యసామ్రాజ్యపీఠస్థులంగాంచె. తత్సంబంధబాంధవంబున వసుంధరాభారధౌరంధర్యంబునం గంధసింధురఘుటాకూట కపట కిటి కచ్ఛపావతార నారాయణభుజంగ భూధరంబులకుఁ దోడుజోడై రాయగురుపరమేశ్వర సాధుజనవిధేయ ఘోడెరాయ సకలకళాధామాది బిరుద భాస్వరుండై భీమయగురువరేణ్యా పుణ్యకారుణ్యా కరుణాకటాక్ష వీక్షాలబ్ధ సుస్థిరైశ్వర్యధుర్యుండై విజయధాటీసమాటీకనంబుల దిశ లల్లాడ నల్లాడభూవల్లభుండు రాజమహేంద్రంబు రాజధానిగా సింహాద్రి పర్యంతంబు...బరిపాలించె.''

'' భీమేశ్వరపురాణము. ''

''తేషాం కనిష్ఠోపి చ జన్మనాభూత్ జ్యేష్ఠో గుణై రల్లయరాతభేఁద్రః
చంద్రో ప్యదోషాకరతా ముపేత స్సోమ్యోపి భూనందనతాముపన్నః
జిత్వా నల్పవికల్పకల్పితబలం తం చాల్పభానుం రణే
మిత్రీకృత్య సమాగతం గజపతిం కర్ణాటభూపం చ తం
హత్వా కోమటివేమసైన్యనికరం భూయోపి రామేశ్వరాత్
రాజ్యం రాజమహేంద్రరాజ్య మకరో దల్లాడభూమీశ్వరః ''

''అల్లాడవేమారెడ్డి కోరుమిల్లిశాసనము''

హతముగావించి యోడించెననియు, కర్ణాటగజపతి భూమీశ్వరులతోడఁ జెలిమిగలిగియుండెననియు నల్లాడరెడ్డిశాసనమువలన స్పష్టమగుచున్నది. కొమ్మనామాత్యవిరచితమై అల్లాడ దొడ్డభూపాలున కంకితమీయఁబడిన శివలీలావిలాసమున "పెద్దకోమటి వేమపృథివీశు వెనుసొచ్చి యతనిసంపద లెల్ల నపహరించె" నని వ్రాయఁబడియుండెను. అల్లాడభూపతి కాటయవేముని శత్రువును వినాశముగావించెనని పలివెల శాసనమున వక్కాణింపఁబడినది. కాటయవేమనిశత్రువు పెదకోమటివేమభూపాలుఁ డనుట నిశ్చయము. కాఁబట్టి అల్లాడభూపతి పెదకోమటివేమభూపాలుని జయించి రాజమహేంద్రపురరాజ్యము నాక్రమించి పరిపాలింపనారంభించెననుట సత్యము. కాటయవేమభూపాలునికిఁ గాటయ, కుమారగిరియను నిరువురు కొమాళ్ళుగలరని యిదివఱకుఁ దెలిసికొనియున్నారము. కాటయవేమున కిరువురుపుత్త్రులుండఁగా నల్లాడభూపతి రాజమహేంద్రపురరాజ్యమును బలాత్కారముగా గైకొనకున్నఁ బ్రభు వెట్లగును? కాటయవేమారెడ్డికిని అల్లాడరెడ్డికిని బూర్వపుబాంధవ్యమెగాక కాటయవేముఁడు తనకు దొడ్డాంబికయందు జనించిన యనితల్లి యనుకొమార్తను అల్లాడరెడ్డికి వేమాంబికవలన బుట్టినకుమారులు నల్వురలోను

రెండవవాఁడైన వీరభద్ర రెడ్డికిచ్చి వివాహముఁ గావించెను.*

ఇట్టిసమీపబంధుత్వము గలిగి యుండుటవలన నల్లాడభూపతి కాటయవేముని యనంతరమున నతనికొమాళ్ళపక్షమునఁ బెదకోమటివేముని జయించి స్వతంత్రుఁడై రాజమహేంద్రపురరాజ్యమునకుఁ దానే పట్టము గట్టుకొని పరిపాలనము చేయఁ బ్రారంభించి యుండవచ్చునని విశ్వసింపవచ్చును. ఇతనిపరిపాలనము క్రీ. శ. ౧౪౧౬వ సంవత్సరము నుండి ప్రారంభమయ్యెనని యీసంవత్సరముననే లిఖియిం

---

* ఆర్యవటశాసనము.

౪౭. "భూలోక భాగ్యోదిత కల్పవల్లీ
శిష్టాశ్రితా నిష్టనిభేదభల్లీ
పవిత్రచారిత్ర వధూమతల్లీ
వేమక్షితీశస్య సుతాన్నతల్లీ.

౪౮. తస్యాః పతిః పతి రశేషమహీపతీనాం
వేమాంబికాల్లయ నృపాల వరేణ్యసూనుః
శ్రీవీరభద్ర ఇతి సర్వగుణైకభద్రః
కీర్తిప్రతాప తులితేశ్వరవీరభద్రః."

"మ. మనుతుల్యుండగుఁ గాటభూవరుని వేమక్ష్మాతలాధీశునం
దనఁ బాణిగ్రహణంబుచేసి ప్రియమొప్పన్ వీరభద్రేశ్వరుం
డనితల్లి న్వనితామతల్లి నుదయాస్త్రాద్రీంద్ర సీమావనీ
ఘన సామ్రాజ్య సమర్థ నుప్రథిమ సాక్షాదిందిరాదేవతన్."

(కాశీఖండము.)

పఁబడిన పాలకొలను క్షీరారామేశ్వరునియాలయములోని యొక శాసనమువలన మన మూహింపవచ్చును. అల్లాడభూపతి పరిపాలనము ప్రారంభ మగునప్పటికిఁ గాటయవేముని కుమారుఁడు కాటయప్రభువు మరణించె నని యూహింపవలసి యుండును. కర్ణాటసామ్రాజ్యాధిపతి యగుహరిహరదేవరాయల కొమార్తె హరిహరాంబ పెనిమిటి యగుటవలనఁ గాటయప్రభువు తాను బ్రతికి యుండఁగఁ దనరాజ్య మన్యు లాక్రమించి పరిపాలించుట కొప్పుకొనఁడు. అతఁ డసమర్థుఁ డని యూహింత మన్నను, హరిహరరాయల కుమారుఁ డగుదేవరాయమహారాయలు తప్పక కాటయప్రభునకుఁ దోడ్పడి యాతని రాజమహేంద్రిరాజ్యమునకుఁ బట్టాభిషిక్తునిఁ గావించి యుండును. అట్టిది జరుగనందున నప్పటికిఁ గాటయ మరణము నొంది యుండు నని నే నూహించుచున్నాను. ఒకవేళ కాటయప్రభువు కర్ణాటరాజ్యాధిపతుల ముఖ్యబంధు వగుటచేత నతనిఁ బట్టాభిషిక్తుని గావించిన రాజ్యము కర్ణాటకుల పాలగునన్న భీతిచేత అల్లాడభూపతియె దోర్దర్పము న రాజ్యము నాక్రమించి తనకోడలి తమ్ముఁ డగుకుమారగిరి బాలుఁ డగుటవలన నాతనిపేరిటఁ దానే స్వతంత్రముగాఁ బరిపాలనము చేయఁ బూనుకొనియె నేమో యథార్థస్థితిమాత్రము బోధపడకున్నది.

అల్లాడ రెడ్డి పూర్వులు నెల్లూరుమండలములోని దువ్వూరు నందు నివసించి యుండిరి. శ్రీనాధుఁడు కాశీఖండమునందు చతుర్థవర్ణము నభివర్ణించి యావర్ణమునందు పెరుమాడిరెడ్డి జనించి దువ్వూరుపట్టణమున వైభవశ్రీలఁ గాంచె నని చెప్పి యున్నాఁడు.*

పెరుమాణిరెడ్డికి నన్నమాంబవలన నేవురుపుత్త్రులు జనించిరి. వారిలో నాలుగవకుమారుఁడైనదొడ్డయకు నన్నమాంబవలన పోలయరెడ్డి, కోటయరెడ్డి, అల్లాడరెడ్డి యను మూవురుకొడుకులు పుట్టిరి. అల్లాడరెడ్డి రాజమహేంద్రపురరాజ్యమున కభిషిక్తుఁ డయ్యెను.

## అల్లాడ భూపతి సంతతి.

అనవేమక్షితిపాలుని పౌత్త్రియగు వేమాంబను వివాహముఁజేసికొని యామె వలన నల్లాడ భూపతి వేమారెడ్డి, వీరభద్రరెడ్డి, దొడ్డారెడ్డి, అన్నారెడ్డి యను నల్వురు పుత్త్రులంగాంచి నట్లుగాఁ గాశీఖండములో నీక్రింది పద్యమున వర్ణింపఁ బడినది.

---

శా. ఆవర్ణంబున నుద్భవించి గుణరత్నోదారనిధానంబు శ్రీ
దూవూరం బెరుమాణిరెడ్డి యభివృద్ధుల్గాంచె మృత్యుంజయ
గ్రీవాక్ష్వేళకళంకపంకహరణ క్రీడాకళాగర్విత
ద్యావాపృథ్వ్యవకాశ పేశలయశోధారానభస్సింధువై."

"మ. అనవేమక్షితిపాలుపౌత్త్రియగువేమాంబామహాదేవికిఁ
ఘనుఁడయ్యెళ్ళడభూమిపాలునకుసంగ్రామస్థలీగాండివుల్
తనయుల్ వేమ విభుండువీరవసుధాధ్యక్షుండుదొడ్డప్రభుం
డును నన్నయ్యయుబాహువిక్రమ కళాటోపప్రతాపోన్న
తుల్."

ఈపై పద్యమునందలి పౌత్రి యను శబ్దమునకు దౌహిత్రి (పుత్ర్యాః పుత్రి) యని యర్థము గ్రహింపవలయును. అల్లాడ దొడ్డభూపాలున కంకితము గావింపఁబడిన శివలీలావిలాసమునఁ గొమ్మనామాత్యకవి యల్లాడరెడ్డి నిట్లభివర్ణించెను.

"మ. భరిత శ్రీనిధియమ్మహీరమణుఁడొప్పన్ జోళభక్తక్షితీ
శ్వరసూనుండగు భీమలింగమనుజేశశ్రేష్ఠు సత్పుత్రి భా
స్వర కారుణ్యదశాజనావనవిధా సంధాత్రి వేమాంబికన్
వరియించెంబతిభక్తిగౌరవదృఢవ్యాపారనిత్యాంబికన్."

మఱియుం గోరుమిల్లి శాసనమున (౧౪౩౪)
"శచీవశక్రస్య శివేవ శంభోః పద్మేవ సా పద్మవిలోచనస్య
వేమాంబికా చోళకులేందుభీమభూపాత్మజా భూస్మహి
ళాస్య జాయా."

అని భక్తీశ్వర చోళనృపాలుపుత్త్రిండు భీమభూపాలుని పుత్త్రియగు వేమాంబికను వివాహముఁజేసికొనియెనని చెప్పఁబడి యుండుటచేత భీమరాజు అనవేమక్షితినాథుని యల్లుఁ

డ నియర్థము చేసికొనకతప్పదు. పదునేనవశతాబ్ది ప్రారంభము నంగూడఁ గొండవీడు, రాజమహేంద్రపురముఁ బాలించిన రెడ్లకును రాచవారికిని సంబంధ బాంధవ్యములు గలవని పై దృష్టాంతములు వేనోళ్ళఁ జాటుచున్నవి.

బెండపూడి లింగనామాత్యుఁడు

కాశ్యపగోత్రసంజాతుఁ డగు బెండపూడి దేవనమంత్రి పుత్త్రుఁ డగు లింగనామాత్యుఁడు అల్లాడభూపాలునకుఁ బ్రధాన మంత్రిగ నుండెను. ఇతఁడు పరాక్రమవిజృంభితుండగు శూరశిఖామణియు రాజ్యాంగవేత్తయు నగుటవలన నాకాలమున గడుం బ్రఖ్యాతిఁగాంచి తన ప్రభువర్యునకు నసుర జయములను నమకూర్చుచు వచ్చెను. ఆకాలమున నియోగి బ్రాహ్మణులలో నెంతటిప్రతిభావంతు లుండిరో యీలింగ నామాత్యుని చరిత్రమునుబట్టి సులభముగాఁ దెలిసికొన వచ్చును. శ్రీనాథుఁడు భీమేశ్వరపురాణమున బెండపూడి లింగనామాత్యు నిట్లభివర్ణించి యున్నాఁడు.

సీ. ఝాడేశ వనసప్తమాడె బారుహదొంతి
వంతు నాద క్షితీశ్వరులఁ గెలిచి
మొడ్డాది మత్స్యవంశోద యాప్తునుచేతఁ
బల్లవాధిపుచేతఁ బలచ మంది
దండకారణ్య మధ్యపులింద రాజరం

బాహివంశజులకు నభయ మొసఁగి
భానుమత్కుల వీరభద్రాన్న దేవేంద్ర
గర్వసంరంభంబుఁ గట్టిపెట్టి
గీ. యవనకర్ణాట కటక భూధవులతోడ
బలిమి వాటించి యేలించెఁ దెలుఁగుభూమిఁ
దననిజస్వామి నల్లాడ ధరణినాథు
బళిరె! యరిమేటి లింగన ప్రభువరుండు."

ఈపై పద్యమునందుఁ బేర్కొనఁబడిన రాజ్యము లన్నియును, విశాఖపట్టణము, గంజాము మండలములలోను, జయపురము, ఒడ్డరు సంస్థానములలోనున్నవిగాన లింగనామాత్యుఁడు వానిని జయించి తురుష్క కర్ణాట కటక రాజులకుఁ బ్రతిస్పర్థిగ నిలిపి యల్లాడ భూపతిచేతఁ దెలుఁగు భూమి నేలించె నని శ్రీనాథుఁ డీతని ప్రతిభావిశేషమును దెలిపి యున్నాఁడు.

ఇట్లు ప్రతిభతోడ లింగనామాత్యుఁడు తెలుఁగు భూమి నల్లాడరెడ్డిచేఁ బరిపాలింపఁ జేసిన విధమును మాత్రమె గాక లింగనామాత్యుని ప్రజ్ఞా పౌరుషముల శ్రీనాథుఁ డిట్లభివర్ణించి యున్నాఁడు.

"సీ. వాహ్యాళి భూమి రేవంత నైషధులట్లు
హయరత్నములనెక్కి యాడనేర్చుఁ

గవిబుధ శ్రేణికిఁ జెవులు పండువులుగా
నాస్థానమున మాట లాడ నేర్చు
శక్తిత్రయంబునఁ జతురుపాయంబుల
షాడ్గుణ్యములబుద్ధి జరుప నేర్చుఁ
గైసేసి ప్రత్యక్ష కందర్పమూర్తియై
నిర్వికారంబున నిలువ నేర్చు
తే. నిష్ఠురాటోప విస్ఫూర్తి నృహరి కరణి
నతికఠోర కుఠార ధారాంచలమున
వైరివక్షస్థలము వ్రచ్చి వైవ నేర్చు
సంగరార్జునుఁ డరియోటి లింగవిభుఁడు."

ఇట్టి ప్రజ్ఞావిశేషములను గలిగి యుండుటయ గాక లింగనామాత్యుఁడు దైవభక్తియు బ్రాహ్మణభక్తియుఁ గలిగి భూపాలునిచేత దేవబ్రాహ్మణులకు సర్వమాన్యములుగా ననేకభూదానములను ధారవోయించెను. కవిద్విజబంధురక్షణకై అన్నచోడవరమను మహాగ్రహారమును అల్లాడవేమభూపాలునిచేఁ బడసెనని యీక్రిందిపద్యమునఁ జెప్పఁబడినది.

చ. అవుర ప్రతాప వేమవసుధాధిపు వే నృపపట్టభద్రుచే
భువనమనోహరంబయిన బోజనకుర్తి మహాస్థలంబునన్
దివిరి పరిగ్రహించె మన దేవయలింగన మంత్రి యన్నచో
డవర మహాగ్రహారముఁ గడంకఁ గవిద్విజ బంధురక్షకై."

ఈలింగనామాత్యుని పితామహుఁడగు అన్నామాత్యుఁడు కాకతిప్రతాపరుద్రచక్రవర్తిమంత్రులలో నొక్కఁడుగా నుండె నని భీమేశ్వరపురాణములోని యీక్రింది పద్యము వలనఁ దెలియుచున్నది.

"సీ. కాకతిక్ష్మాపాలగంధదంతావళ
ధ్వజినీ మహాధురం ధరుఁడనంగ
నవలక్ష కోదండనాథరాజ్యాంభోధి
సంపూర్ణపూర్ణిమాచంద్రుఁడనఁగ
నంధ్ర భూమండలాధ్యక్షసింహాసన
సంప్రతిష్ఠాపనాచార్యుఁడనఁగ
వీరరుద్రాశేష విశ్వంభరాధీశ
పృథుల దక్షిణభుజా పీఠమనఁగ
తే. యవనసంహార విలయకాలాగ్నియనఁగ
ధాటి విఘటిత కుమ్మరోద్యానుఁడనఁగ
విశ్వలోక ప్రశస్తుఁడై వినుతికెక్కె
నతుల బలసిరి పోలయ యన్నశౌరి."

లింగనామాత్యుఁడు రుక్మాంగదుని వలె ద్వాదశీపుణ్య వేళల బ్రాహ్మణులకు భక్తితోడ భోజనము పెట్టి తృప్తులం గావించు చుండెనఁట!*

---

* సీ. ఖండశర్కర జున్ను కండచక్కెరలు దో
సెలు నడ శ్శేవె పాసెములతోడఁ

లింగనామాత్యునకుఁ బల్లనయు నన్నయ్యయు ననునిరువురు సోదరులు గలరు. వీరిలో అన్నామాత్యుఁడు అల్లాడవేమ వీరభద్ర నృపాలురకు మంత్రియై ప్రఖ్యాతిఁ గాంచినవాఁడు. లింగనామాత్యునకుగంగాంబయం దిరువురుపుత్త్రులుజనించిరి. గాని వారలు పెద్దవారగు నప్పటికి రెడ్డిసామ్రాజ్య మన్యాక్రాంతమైనది.

### అల్లాడ వేమభూపతి-అల్లాడ వీరభూపతి.

(క్రీ. శ. ౧౪౨౬ మొదలుకొని ౧౪౫౦ వఱకు)

అల్లాడభూపతి క్రీ. శ. ౧౪౧౬ మొదలుకొని ౧౪౨౬ వఱకును బరిపాలనముచేసి యుండెను. అల్లాడభూపతి స్వర్గస్థుఁడైన వెనుక నతని పుత్త్రులలో జ్యేష్ఠుఁడగు వేమారెడ్డి

---

గమ్మఁగాఁ గాచిన కఱియాల నేతితోఁ
గమనీయపంచ భక్ష్యములతోడ
సంబారములతోడి శాకపాకములతోఁ
బక్వమైన పెసరపప్పుతోడఁ
దేనియధారతోఁ బానకంబులతోడ
శిఖర పాకపు బాయసాన్నితోడ
తే. నచ్ఛలనవాటికములతోడ నమృతఖండ
పాండురంబైన దధితోడ బ్రాహ్మణులకు
భోజనము పెట్టు న్యావత్ప్రత్యవేక్ష
లింగమంత్రినవీన సుకార్త్యంగదుండు."

పట్టాభిషిక్తుఁడు గావలసి యున్నను, రాజ్యము కాటయ వేముని వలన సంక్రమించిన దగుటచేతనో, కాటయవేముని రెండవ కుమారుఁడు కుమారగిరి వీరభద్రరెడ్డికిమఱఁదియై వీరి సంరక్షణములో నుండుటచేతనో, తనకును తమ్మునకును వైరము లేకుండఁ జేసికొనవలయు ననుతలంపుచేతనో వేమారెడ్డి వివేకియుఁ బ్రజ్ఞావంతుఁడు గావున నేవిధమైన యుపద్రవముఁ గలుగకుండఁ గుటుంబకలహము జనింపకుండ రాజమహేంద్రపుర రాజ్యమునకుఁ దమ్ముఁడు వీరభద్రరెడ్డికిఁ బట్టముఁగట్టి తాను సహాయుఁడై వానిచేత ధర నేలించెనని భీమేశ్వర పురాణములో:—

"ఉ. తమ్ముని వీరభద్రవసుధాధిపు విక్రమ వీరభద్రునిన్
సమ్మదలీల రాజ్యభరణస్థితిఁ బట్టముగట్టి బాహుద
ర్పమ్మున వేమభూవరుఁడు వ్రాసె జగద్విజయప్రశస్తి వ
ర్ణమ్ములు దిగ్గజేంద్రధరసురద్విపకుంభవిషాణమండలిన్."

అను పద్యమువలన విస్పష్ట మగుచున్నది. ఈసోదరు లిరువురును సమర్థులును, ప్రజ్ఞావంతులును, విక్రమాఢ్యులునై ప్రతిభాసంపత్తిచే నొప్పియున్న వారగుటచేత నొండొరులయెడ నన్యోన్యానురాగముఁ జూపుచు నెల్లవారును మెచ్చుకొనునట్లుగా నైకమత్యముతో వ్యవహరించినది యాంధ్రదేశ చరిత్రమునం దొక విశేషవిషయముగా నున్నది. అయి

నను బలాఢ్యములై దక్షిణహిందూదేశమున నేకచ్ఛత్రాధిపత్యమునకై పెనగులాడుచున్న యవనకర్ణాటకటకసామ్రాజ్యముల నడుమ వీరిరాజ్యము ప్రవర్ధమానమై చిరకాల ముండుటకు మాత్రము సాధ్యమైనది కాదు. ఈభూపాలుర విక్రమాతిశయముచేతను, మంత్రిపుంగవుని ప్రజ్ఞా విశేషము చేతను ఇరువదిసంవత్సరములకాల మయినను జనరంజకముగాఁ బ్రజాపాలనము చేయఁగలిగిరి. అట్టి దుష్కాలమున మహాసామ్రాజ్యముల నడుమ వేమక్ష్మావరుఁడును, వీరక్ష్మాపతియు నెట్టి స్వాతంత్ర్యవృత్తితో రాజమహేంద్రపురరాజ్యమును బరిపాలించినదియు నీక్రిందిపద్యమువలన సువ్యక్తము కాఁగలదు.

సీ. పాండువానురతాణి పావడం బిచ్చిన
భద్రేభములు వీథిఁ బ్రోలె ముండు
నోఢ్రధాత్రీనాథుఁ డుపదఁ బుత్తెంచిన
బంబారుగోష్ఠినం బెల వహించుఁ
గర్ణాట భూపతి కానుక యనిపిన
ముక్తాతపత్రంబు ప్రోల మెఱయు
యవనాధిపతి యుపాయనముగా నొసఁగిన
హయాహయంబులు వాగెవచ్చు
తే. దూరమం తంత బారుహాద్రంతి మన్నె

సప్తమాళీయ రాజన్యసమితి మ్రొక్కు
రాయ వేశ్యాభుజంగ సంగ్రామ పార్థ
గాయ గోవాళ వేమన క్ష్మాధవునకు.”

రాజమహేంద్రపుర రాజధానీ వర్ణనము.

ఇమ్మహా ప్రభువుల పరిపాలనాకాలమున రాజధానిగ నున్న రాజమహేంద్రపుర వైభవ మెట్టిదిగ నుండెనో శ్రీనాథుని కాశీఖండము, భీమఖండములలోని యీక్రింది వర్ణనములంబట్టి గ్రహింపవచ్చును.

సీ. ఉండు నేవీట మార్కండేయమునినాథ
సద్లింగ మనంగ శాసనుండు
ప్రవహించు నేవీట పశ్చిమ ప్రాకార
మొరసి గంగమ్మ సాగరముకొమ్మ
యావిర్భవించినా డేవీటి కోటలో
పలభేదిమహిత గోపాలమూర్తి
పాలించు నేవీటి ప్రాగుదక్కోణంబు
నుమపోడి శ్రీమల్లగూరిశక్తి
ప్రబలధారాసురత్రాణ భద్రజాతి
కరిఘటా సైన్య దుస్సాధ కనకలోహ
గోపుర ద్వార కవాటప్రకటిత మతి
సాంద్ర విభవంబు రాజమహేంద్రపురము. “కాశీ”

"సీ. కమలాచలాగ్ర మార్కండేయ శివశిర
శ్శశిచంద్రికా ధౌతసౌధవీథి
గోదావరీపుణ్య కూలంకషా జల
స్ఫారిత శ్రీరుద్రపాదయాగళి
బలవదభ్యున్నత ప్రాకారపరివేష
గండూషితాజాండమండలంబు
గంధదంతావళ గ్రైవేయఘంటికా
ఝంకారముఖర ఘంటాపథంబు
తే. రాజబింబాననా నూత్నరత్నపేటి
వీరరాహుత్తసుభట కంఠీరవాద్రి
వేమభూపాల రాజ్యాభివృద్ధికరము
సాంద్రవిభవంబు రాజమహేంద్రపురము."

వేమవీరవిభుల మతము.

అల్లాడభూపతికుటుంబమునకుఁ గులగురువు ఘోడేరాయ భీమేశ్వరుఁ డని తెలియుచున్నది. ఈయన యారాధ్యుఁడు. శైవబ్రాహ్మణుఁడు. రాజగురుపరంపరలోనివాఁడు. అల్లాడ వేమవీరభద్రనృపాలుర మతము శైవము. వేమవీరభద్రనృపతులుచేయు శివార్చనావిధానమి ట్లభివర్ణింపఁబడియెను.

సీ. త్ర్యంబకాచల కన్యకాంబుపూరంబున
నఘమర్షణ స్నానమాచరించి

## తొమ్మిదవ ప్రకరణము.

నిద్ధమైన మడుంగు నీర్కావిదోవతి
కనకమేఖలతోడఁ గడిఘటించి
మూలమంత్రాక్షరంబుల బూని మంత్రించి
పుండ్రకంబుగ ఫాలమున ధరించి
క్రొత్త ముత్యములతో రుద్రాక్షమాలిక
లష్టోత్తరశతంబు లమరఁదాల్చి
గీ. పుండరీకాజినమునఁ గూర్చుండి శంభు
నర్చనము సేయునపుడు మహాప్రమథుఁడు
చాల నొప్పారు రెండవశంభునట్లు
వీరనారాయణుఁడు రెడ్డివేమవిభుఁడు"

"సీ. గోదావరీపావనోదకంబుల హేమ
కలశశతంబుల జలకమార్చి
కర్పూరకస్తూరికాకుంకుమంబులఁ
గలపంబుఁగూర్చి శ్రీగంధ మలఁదు
సప్తగోదావరీ స్వర్ణపుష్కరహేమ
సౌగంధికముల నర్చన మొనర్చి
కలధౌతపాత్రిలఁ గాలాగరుచ్ఛేద
బహుళధూపంబులు పరిఢవించు
గీ. వేనవేలునివాళుల విస్తరించు
నమృతదివ్యాన్నముల నుపహారమిచ్చు

సంఘటించు న శేషోపచారములును
బ్రమథనాయకునకు వీరభద్రనృపతి "

వీరలు శైవమతావలంబకు లైనను పరమతములను సయి తము సమానభావముతోఁ జూచుచుండిరిగాని యెన్నఁడును ద్వేషబుద్ధితోఁ జూచినట్లు గన్పట్టదు.

అల్లాడదొడ్డభూపతి విజయధాటి.

వేమవీరనృపతులకు సోదరు లైన దొడ్డనృపతియు, నన్ననృపతియు సేనాపతులుగనుండి రాజ్యమును విస్తరింపఁజేయుట యం దన్నలకుఁ దోడ్పడుచుండిరి. వీరిలో దొడ్డభూపతి స్వారి చేయుటయం దాఱితేఱిన రాతుగ నుండెను. అనేకజయముల చేతఁ బ్రఖ్యాతిఁగాంచెను. ఇతఁడు గుఱ్ఱము నెక్కి స్వారిచేయుచు నిరువదినాలుగుమూళ్ళమేర భూమిని దాటించి యశముసుగాంచినవాఁ డని కాశీఖండములోని యీక్రిందిపద్యము వలనఁ దెల్లమగుచున్నది.

"మ॥ హరిదాఁటించెఁ బురోపకంఠమున వాహ్యాళిప్రవేశం
బున౦ దరు దేయళ్ళయరెడ్డినందనుఁడు దొడ్డయ్యాఖ్యమహా
ధీశ్వరుం డిరువైనాలుగుమూళ్ళమేర యదిహో లెక్కింపఁ
గా నేల య ద్ధరణీనాథుని కీర్తి దాటెఁ గడునుద్దండించి
బ్రహ్మాండమున్॥

ఇతఁడు చిల్కసముద్రమువఱకుఁగల దేశమును జయించి.

జయ స్తంభములు నాటించినట్లుగా నీక్రిందిపద్యమువలనఁ దెలియుచున్నది.

"శా. ఔరాయళ్ళయరెడ్డి దోడ్డవసుధాధ్యక్షుండు ధాటీచమూ
భేరీభాంకృతి ఘోరఘోషమున నిర్భేదించె నోడ్డాదిశ్శృం
గారం కోటయు లోతుగడ్డయును నుద్ఘాటించె నత్యుద్ధతిన్
క్షీరాంభోధితటంబునన్నిలిపెదక్ష్మాజయస్తంభముల్."

కనుకనే శ్రీనాథ కవి సార్వభౌముఁడు చిల్కసముద్రము వఱకు వీరభద్రనృపాలుఁడు రాజ్యమును విస్తరింపఁ జేసి పరిపాలించుచున్నట్లీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు. ఎట్లన్నను

ఉ. ప్రాకటవిక్రమస్ఫురణ రాజమహేంద్రము రాజధాని గా
నేకసితాతపత్రమున నేలను వీరనృపాలుఁ డుత్తమ
శ్లోకుఁడు వేమశౌరియనుజుండు సమున్నత వైభవాఢ్యుఁడై
చీకటియుం గళింగ మును జిల్కసముద్రముసింహశైలమున్."

## అగ్రహార బ్రాహ్మణవర్ణనము.

గౌతమీతటమునందు వేమభూపాలుఁ డనుజన్ముఁడైన వీరభద్రనృపాలునిచేత ధాత్రి నేలించుకాలమున నగ్రహారములలోని బ్రాహ్మణు లెట్టి యైశ్వర్యములతో నొప్పుచుండి రోయావివరమును గూడ శ్రీనాథకవిసార్వభౌముఁ డీక్రింది రీతి నభివర్ణించి యున్నాఁడు.

"సీ. ధరియింపనేర్చిరి దర్భ వెట్టెడు వ్రేళ్ళ
లీలమాణిక్యాంగుళీయకములు
కల్పింపనేర్చిరి గంగమట్టియను మీఁదఁ
గస్తూరికాపుండ్రకములు నొసల
సవరింపనేర్చిరి జన్నిదంబులమ్రోలఁ
దారహారములు ముత్యాలసరులు
చేర్పంగనేర్చిరి శిఖల నెన్నడుములఁ
గమ్మని క్రొత్త చెంగల్వవిరులు
తే. ధామముల వెండియును బైఁడి దడబడంగ
బ్రాహ్మణోత్తము లగ్రహారములలోన
వేమభూపాలుఁ డనుజన్మవీరభద్ర
ధాత్రియేలింప గౌతమీతటమునందు."

అనఁగా నంతకుఁ బూర్వము బ్రాహ్మణు లంతయైశ్వర్యవంతులుగా లేరని భావము తేటతెల్లమగుచున్నది.

## బెండపూడి అన్నామాత్యుఁడు.

అల్లాడభూపాలునకును, అల్లాడ వేమభూపాలునకును మంత్రిగనుండి విఖ్యాతి గాంచిన బెండపూడిలింగనామాత్యుని రెండవతమ్ముఁడును, అఖిలవిద్యావిరించియు, అర్థిజనకామధేనువునగు అన్నామాత్యుఁడు లింగనామాత్యునికిఁ బిమ్మట వీరభద్ర వేమపృథ్వీధవులకుఁ బ్రధానమంత్రియై, తద్రా

జ్యాభివృద్ధి కారణమై అసదృశమగు కీర్తిసంపాదించెను. శ్రీనాథకవిసార్వభౌముఁ డీయమాత్యశేఖరుని భీమేశ్వరపురాణము నంది ట్లభివర్ణించెను.

"సీ. ఏమంత్రికులదైవ మిందుశేఖరుఁడు ద
క్షారామభీమేశుఁ డఖిలకర్త
యేమంత్రియేలిక యిక్ష్వాకుమాంధాతృ
రామసన్నిభుఁడైన వేమనృపతి
యేమంత్రిసితకీర్తి యేడువారాసుల
కడకొండయవులచీఁకటికిఁగొంగ
యేమంత్రిసౌభాగ్య మిగురుఁగైదువజోదు
లాలిత్యలీలకు మేలుబంతి

తే. యతఁడు కర్ణాటలాటబోటాంగవంగ
కురుకుకురుకుంతలావంతిఘూర్జరాది
నృపసభాస్థాన బుధవర్ణనీయసుగుణ
మండనుఁడు బెండపూడన్న మంత్రివరుఁడు."

"సీ. ధారాసురత్రాణధాటీసమారంభ
గర్వపాథోరాశి కలశజులకు
సప్తమాడియరాజఝూడియతుమ్మెపాల
వందితశ్రీపాద వనరుహులకు
సింహాద్రిపర్యంతసీమాంధ్రమేదినీ

మండలీపాలనాఖండలురకు
హరిదంతదంతిదంతావళీలిఖ్యమా
నానేకజయశాసనాంకురులకు
గీ. వీరభద్రేశ వేమపృథ్వీధవులకు
ననుఁగుమంత్రి మహాప్రధానాగ్రగణ్య
బెండపూఁడన్న జగనొబ్బగండ బిరుద
సచివదేవేంద్రుఁగృతి కధీశ్వరునిఁజేసి."

భీమేశ్వరపురాణము రచించునాటికి వీరభద్రవేమపృథ్వీపాలుర రాజ్యము సింహాద్రిపర్యంతము మాత్రమె వ్యాపించి యుండినను కాశీఖండము రచించునాటికి చిల్కసముద్రము వఱకు వ్యాపించినట్టు గన్పట్టుచున్నది. అన్నామాత్యుఁడు బహుభాషలనేర్చి రాజాస్థానమునకు వివిధదేశములనుండి యేతెంచిన రాయబారులతో వారిభాషలతోనే ప్రసంగము లు సలుపుచుండుననియు, పారశీభాష చక్కగవ్రాయునట్టి వ్రాయసకాఁడనియు, బహమనీసుల్తానగు అహమ్మదుషాతో నుత్తరప్రత్యుత్తరములు జరుపుచుండు వాఁడనియు, శ్రీనాథకవిసార్వభౌముఁడీక్రిందిపద్యములతో నభివర్ణించియున్నాఁడు.

"మ. అరబీభాష తురుష్కభాష గజకర్ణాటాంధ్ర గాం
ధారఘూర్జరభాషల్ మళయాళభాష శకభాషాసింధు
సౌవీర బర్బరభాషల్ కరహాటభాషమఱియుంభాషావిశే

షంబు ల। చ్చెరువై వచ్చు; న రేటియన్ననికి గోష్ఠీసంప్ర
యోగంబులన్॥ ”

ఉ. అన్నయమంత్రిశేఖరుఁ డహమ్మదుశాసన దాన
భూమిభృ। త్సన్నిధికి న్మది న్సముచితంబుగ వేమమహీ
సురేంద్రరా। జోన్నతి సంతతాభ్యుదయ మొందఁగఁ
బారసిభాషవ్రాసినం। గన్నులపండువై యమరుఁ గాకిత
మందలి వర్ణపద్ధతుల్. ”

ఈయమాత్యశిఖామణి యెప్పుడును వేమధాత్రీశ్వరుని ప్రక్కనుగూరుచుండి పసిడిగంటముతో నయకావ్యసరణి వ్రాయునతులగుణహారి యని తెలుపఁబడియెను. నిరంతర శివపూజాధురంధరుండగు నీతఁడుచేసిన ప్రతిష్ఠాపనల నీక్రింది పద్యములో శ్రీనాథుఁ డేకరువుపెట్టియున్నాఁడు.

“సీ. రాజమహేంద్రదుర్గమున గావించె శ్రీ
వీరభద్రునకుఁ బ్రాకారరేఖ
నిలిపె మార్కండేయ నీలకంఠుని మ్రోల
రామేశుఁ దమతల్లి నామకముగ
సంగమేశ్వరదివ్యశంభులింగమునకుఁ
గల్పించెఁ గళ్యాణ గర్భగృహము
దక్షవాటికయందుఁ దరుణేందుమౌళికి
మొగలివాకిట ధామమును రచించెఁ

తే. బ్రాహ్మీశాపప్రగోపుర ప్రాంగణమున
సప్తమునిసింధుసోపాన సరణికెలనఁ
దీర్ఘభవనంబు భీమయదేవునగర
మంత్రి దేవయ యన్నయామాత్యవరుఁడు"
శ్రీనాథకవిసార్వభౌమునిరాక.

పెదకోమటివేమభూపాలుఁడు స్వర్గస్థుడైనపిమ్మట సకల విద్యాసనాథుండగు శ్రీనాథకవిసార్వభౌముఁడు కర్ణాటసామ్రాజ్యసార్వభౌముఁడగు ప్రౌఢదేవరాయనికి సామంతనృపతులుగనున్న యంద్రవల్లభునికడఁ గొంతకాలమును, పంట్లమైలారవిభునికడఁ గొంతకాలమునుండి రాజమహేంద్రపురరాజ్యము ప్రవర్ధమానముగనుండుటయు, తనకు మిత్రుఁడును బాంధవుఁడు నగు బెండపూడి యన్నామాత్యుఁడు వేమ వీరభద్రపృథ్వీశ్వరులకు మంత్రియై పండితపక్షపాతియై విద్యాభిమానియై విఖ్యాతిఁగాంచుచుండుటయుఁ దలపోసి తనకర్హసత్కారము లారాజ్యమునఁ గలుగఁగలవని యూహించి రాజమహేంద్రపురమునకు విచ్చేసెను. రాజమహేంద్రపురవిద్వజ్జనముతోడి ప్రథమసమావేశ మంత యుత్సాహకరమైనదిగ శ్రీనాథునకుఁ గన్పట్టలేదు. రాజాస్థానమున నీతనికిఁ బ్రవేశముగల్గినఁ దమయాధిక్యతకు లోపముగల్గునని పెక్కండ్రు పండితులు భయపడుచుండిరి. అయినను అన్నమంత్రి యొక్క

నాఁడు విద్వజ్జనపరివేష్టితుండై కొలువుకూటముననుండి శ్రీనాథునిరప్పించినవిధ మిట్టులు వర్ణింపఁబడెను.

"సీ. భాట్టప్రభాకరప్రస్థానసంవేద్యు
లుద్దండపాండిత్యు లొక్కవంక
ఫణిపభాషితభాష్యఫక్కికాభావజ్ఞు
లుత్తమప్రాగల్భ్యు లొక్కవంక
గణభుజ్మతగ్రంథ గాఢార్థ విధులబా
హుశ్రుత్య సంపన్ను లొక్కవంక
వేదాంతవాసనా విశ్రాంత హృదయజ్ఞు
లుపనిషత్తత్త్వజ్ఞు లొక్కవంక
తే. నుభయ భాషా కవీశ్వరు లొక్కవంక
వేశ్యలొకవంక నొకవంక వీరభటులు
బలసికొలువంగఁ గొలువుండి పిలువఁబంపె
బెండపూడన్నమంత్రీశ్వరుండు నన్ను."

అట్లు విద్వజ్జన మహాజ్జనులచే నలంకరింపఁ బడిన యాస్థాన మంటపమునకు సకలవిద్యాసనాథుండగు శ్రీనాథుని రప్పించి సముచితాసనమునఁ గూర్చుండఁజేసి యామంత్రి పుంగవుఁడు గంభీరధీరసంభాషణములతోడ నావ[illegible]కవిసార్వభౌమునితోడ నిట్లనియెనఁట.

సీ. వినుపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణ విద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధకావ్యమాంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణవేళలందు
వెదచల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందుఁ
తే. బాకనాటింటి వాఁడవు బాంధవుఁడవు
కమలనాభునిమనుమఁడ వమలమతివి
నాకుఁగృప సేయు మొకప్రబంధంబు నీవు
కలితగుణగణ్య శ్రీనాథ కవివరేణ్య.”

× × × × × ×

మ. అరవిందాప్తకృత ప్రతిష్ఠుఁడగు దక్షారామ భీమేశ్వరే।
శ్వరు మాహాత్మ్యముతోడఁ గూడి భువనశ్లాఘాస్పదంబై [యభం
గురమైస్కాందపురాణసారమగుశ్రీగోదావరీఖండమున్।
బరిపాటిన్ రచియింపుమంధ్రజగతీభాషాప్రబంధంబుగన్”

అనిపలికి బహుమానముగాఁ గర్పూరతాంబూలజాంబూనదాంబరాభరణంబు లొసఁగి వీడు కొల్పెను. అంతటఁ

బండితులును గవులును నీకవిసార్వభౌమునియెడ నీర్ష్యాళువులై ప్రవర్తించినట్లు గన్పట్టుచున్నది. పండితమ్మన్యులును గుకవులు నగువారు గొందఱు శ్రీనాథుని కవిత్వ మాంధ్రకవిత్వము గాదనియు భాష కర్ణాట భాషయనియు వెఱ్ఱి మొఱ్ఱి యాక్షేపణలు చేయనారంభించిరి. శ్రీనాథుఁడు సకలవిద్యాసనాథుఁడని యెఱుంగక శాస్త్రపండితు లనేకులు వివాదములు పెట్టుకొని యెట్టులైన నీతని వంచించి సాగనంపవలయునని ప్రయత్నించిరి గాని తుదకు శ్రీనాథుఁడే విజయమునొంది రాజమహేంద్రపురమునఁ బాదుకొనియుండి యాపురంబునకుఁ బాఁతకాపయ్యెను. అందుకొఱకే శ్రీనాథుఁడు పండితమ్మన్యులను, కుకవుల నీవిధముగా నిందించి ప్రత్యుత్తర మిచ్చుట సంభవించెను.

తే. „బోధ మల్పంబు గర్వ మభ్యున్నతంబు
శాంతి నిష్పచ్చరంబు మచ్చరము ఘనము
కూపమండూకములు బోలెఁ గొంచె మెఱిఁగి
పండితమ్మన్యులైన వైతండికులకు."

తే. „నికటమున నుండి శ్రుతిపుటనిష్ఠురము గ
నడరి కాకులు బిట్టు పెద్దఱచినప్పు
డుదధిరాయంచ యూరక యుంట లెస్స
సైప రాకున్న నెందేని జనుట యొప్పు."

తే. "ప్రౌఢి పరికింప సంస్కృతభాష యండ్రు
పలుకునుడికారమున నాంధ్రభాష యందు
రెవ్వ రే మన్న నందుగా కేలకొఱత
నాకవిత్వంబు నిజము కర్ణాటభాష"

ఇట్టిసుకవినిరాకరణప్రకరణమునందే మనయాంధ్రకవిసార్వభౌముఁడు తనకవిత్వంబు కర్ణాటభాషయని పలికినది. దీనింబట్టి యీతఁడు కర్ణాటకుండని నిర్ధారించుట హాస్యాస్పదము. రాజమహేంద్రపురమునందలి పండితు లొక్కొక్కఁడొక్కొకశాస్త్రమునందుఁ బ్రవీణులై యుండఁగా శ్రీనాథుండు సకలవిద్యానాథుండు గావున సమస్తశాస్త్రములం బ్రవీణుఁడై యెట్టిపండితునైన నవలీల జయించుచుండెను. శ్రీనాథుని విద్యాబలము నాతనికూర్మిమఱఁదియు శిష్యుఁడు నగుదగ్గుబల్లిదుగ్గనామాత్యకవి తన నాచికేతూపాఖ్యానమునం దీవిధముగా నభివర్ణించియున్నాఁడు.

"సీ. సంస్కృతప్రాకృత శౌరసేనీముఖ్య
భాషాపరిజ్ఞాన పాటవంబు
పన్నగపతిసార్వభౌమభాషితమహా
భాష్యవిద్యాసమభ్యాసబలము
అక్షపాదకణాదపక్షిలోదీరిత
న్యాయకళాకౌశలాతిశయము

"శ్రుతిపురాణాగమస్మృతి సాంఖ్యసిద్ధాంత
కబళనాత్యుత్పత్తిగౌరవంబు

తే. పూర్వకవిముఖ్యవిరచితాపూర్వకావ్య
భావరససుధాచర్వణప్రౌఢతయును
గందళింపంగఁ గాశికాఖండ నైష
ధప్రముఖ వివిధప్రబంధము లొనర్చి."

ఇట్టి విద్యామహత్వంబును గవితాసంపత్తియుఁ గలిగి యుండుటచేతనే అల్లాడవేమభూపాలుఁడు తన్నుఁ జూచి పలికి నట్లుగా నీక్రిందిపద్యమును గాశీఖండమునఁ జొప్పించి యున్నవాఁడు.

"శా. ఈక్షోణి న్నినుఁబోలు సత్కవులు లేరీ నేటి కాలంబునన్।
దాక్షారామచళుక్యభీమవరగంధర్వాప్సరోభామినీ।
వక్షోజద్వయగంధసారఘుసృణ ద్వైరాజ్యభారంబున।
ధ్యక్షించుంగవిసార్వభౌమభవదీయప్రౌఢసాహిత్యముల్"

తనతాత కమలనాభామాత్యుఁడు వారిధితటీకాల్పట్టణా ధీశ్వరుండనియు, కాకతిసార్వభౌమునిచేఁ బూజింపఁబడినవాఁ డనియు శ్రీనాథుఁడు తనభీమేశ్వరపురాణములో నీక్రిందిపద్య ములోఁ జెప్పియున్నాఁడు.

* ‹‹మ. కనకక్ష్మాధరధీరు వారిధితటీకాల్పట్టణాధీశ్వరున్।
ఘనునిన్ పద్మపురాణసంగ్రహకళాకావ్యప్రబంధా
ధిపున్। వినమత్కాకతిసార్వభౌముఁ గవితావిద్యాధ
రుం గొల్తు మా। యనుగుందాతఁ బ్రదాతశ్రీకమల
నాభామాత్యచూడామణిన్॥

శ్రీనాథుఁడు భీమేశ్వరపురాణము రచించునాటికి రాజమహేంద్రపురమునకుఁ గొత్తవాఁడుగనున్నను, కాశీఖండము రచించునాటికిఁ బాఁతవాఁ డయ్యెను. వేమవీరభద్రపృథ్వీశ్వరులయాస్థానకవియై విశేషసన్మానములం బొందుచుండెను. అన్నామాత్యుని వలననే యీతనికి నాస్థానమునం బ్రవేశము గల్గెను. శ్రీనాథుఁడొక్కనాఁడు:—

---

* ఈపద్య మీరీతిని ముద్రితప్రతియైన భీమేశ్వరపురాణములో నున్నది. ‹‹వినుమత్కాకతిసార్వభౌము'' అనుపాఠమునకు బదులుగా నాంధ్రకవులచరిత్రములో ‹‹వినుమధ్యాంతరసార్వభౌము'' అనియు, ఇట్లే కవిజీవితములయందును, ఉమాకాంతముగారి పల్నాటివీరచరిత్రపీఠికయందలి పద్యములో ‹‹వినమజ్జ్యాంతరసార్వభౌము'' అని మఱియొకపాఠాంతరభేదము గన్పట్టుచున్నది. కావున ముద్రితప్రతిలోని ‹‹వినమత్కాకతిసార్వభౌము'' అనుపాఠమె సరియైనది కావచ్చును. అట్లయినయెడల శ్రీనాథునితాత కాకతిసార్వభౌముఁడగు రెండవ ప్రతాపరుద్రుని యాస్థానమునలంకరించియున్నవాఁడనుట సమంజసముగా నుండును.

"సీ. చిన్నారి పొన్నారి చిఱుతకూకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగు మీసాల నూత్నయౌవనమున
శాలివాహనసప్తశతి నొడివితి
సంతరించితి నిండుజవ్వనంబునయందు
హర్షనైషధకావ్య మాంధ్రభాషఁ
బ్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁగొని
యాడితి భీమనాయకుని మహిమఁ
బ్రాయమింతకు మిగులఁ గైవ్రాలకుండఁ
గాశికాఖండమను మహాగ్రంథ మేను
దెనుఁగుఁ జేసెదఁ గర్ణాట దేశ కటక
పద్మవనహేళి శ్రీనాథ భట్టసుకవి."

అని యాత్మగతంబున వితర్కించి కావ్యముగా నొనర్ప సమకట్టెను. అమ్మహా ప్రారంభమును గర్ణాకర్ణికా వశంబున విని వీరభద్ర భూపాలుఁ డొక్కనాఁడు:—

"సీ. త్రైలోక్య విజయాభిధంబైన సౌధంబు
చంద్రశాలా ప్రదేశంబునందు
సచివసైన్యాధీశ సామంత నృపవార
సీమంతినీజన శ్రేణి గొలువ
శాస్త్రమీమాంసయు సాహిత్య గోష్ఠియు

విద్వత్కవీంద్రులు విస్తరింపఁ
గర్పూరకస్తూరికాసంకుమదగంధ
సారసౌరభము దిక్పూరితముగ
నిజభుజా విక్రమంబున నిఖిలదిశలు
గెలిచి తను రాజ్యపీఠ మెక్కించినట్టి
యన్న వేమేశ్వరుని యంక మాశ్రయించి
నింపుకొలువుండె గన్నుల పండువగుచు”

అట్టి సమయంబునఁ దనతమ్ముఁడు వీరభద్రనృపాలుని యభిమతంబెఱింగి వేమభూపాలుఁడు శ్రీనాథకవి సార్వభౌముని రప్పించి సముచితాసనంబునఁ గూర్చుండనియమించి యిట్లు పలికెనఁట.

„సీ. వచియింతు వేములవాడభీమనభంగి
నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయ భట్టుమార్గంబున
నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు
వాకృత్తు దిక్కయజ్వప్రకారము రసా
భ్యుచితబంధముగ నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని త్రోవ
సూక్తివైచిత్రి నొక్కొక్కమాటు

గీ. నైషధాది మహాప్రబంధములు పెక్కు
చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ
యిపుడు చెప్పఁదొడంగిన యీప్రబంధ
మంకితము సేయు వీరభద్రయ్య పేర"

వేమవిభునకుఁ దనతమ్మునిపట్ల నెంతయనురాగము గలిగి యుండెనో దీనింబట్టియే గ్రహింపనగును. అల్లాడ వీరభద్ర నృపతివిగ్రహము కొలువున్న సమయమున నెట్లుండునో యారీతి నీక్రింది పద్యమున నిట్లభివర్ణించెను.

"సీ. మకరకుండల వజ్రమాణిక్యదీప్తులు
చెక్కుటద్దములపైఁ జీఱువాఱ
డాకాలిగండపెండారంబుదాపున
బొమ్మలై వైరిభూభుజులు వ్రేలఁ
గలయంగ నలఁదినకస్తూరినెత్తావి
యష్టదిక్కులయందు నఘుమింప
మొగముచూచినమాత్ర మూర్ధాభిషిక్తులు
మోడ్పుఁజేతులు మస్తములఘటింప
గీ. మెఱుఁగు దీగెలఁబోలు భామినులు గొలువ
నిండుకొలువుండెఁ గన్నులపండు వగుచు
రాయవేశ్యాభుజంగ వీరప్రతాప
విభవుఁ డల్లాడభూపతి వీరవిభుఁడు."

ఇట్టిప్రభువర్యులవలనఁ గర్పూరతాంబూలసహితంబుగా జాంబూనదాంబరాభరణంబులు పరిగ్రహించి తాను గావ్యరచనకుఁ గడంగినవిధము నీక్రిందిపద్యములోఁ దెలిపియున్నాఁడు.

"సీ. ఆంధ్రక్షమామండలాఖండలుండైన
వేమభూపతికృపావీక్షణంబు
ఘోడెరాయాంక సద్గురురాజభీమేశ్వ
రస్వామిపదసమారాధనంబు
కమలాద్రినిలయమార్కండేయశివమౌళి
చంద్రాంశునవసుధాసారధార
వేదాద్రినరసింహవిపులవక్షస్స్థలీ
కల్హారమాలికాగంధలహరి
గీ. కారణంబులు నుద్బోధకములుగాఁగ
సంభవించిన సాహిత్యసౌష్టవమున
వీరభద్రేశ్వరుఁ బ్రబంధవిభునిఁ జేసి
కాశికాఖండము దెనుఁగుగా నొనర్తు."

ఇతఁడందందు నిజప్రభావంబుఁ గొంత దెలుపుకొన్నను తిక్కనాదులకంటె నెక్కువ ప్రౌఢముగను రసోదంచితముగఁ గవనము చెప్పుడుననికాని డిండిమకవిసార్వభౌమాదుల నుద్భటవివాదమున గెలిచినవాఁడయ్యును నాడంబరముగా న స్త్రై ప్రబంధమునను జెప్పుకొనక పైనఁజెప్పినవిధముగా సాహిత్య

## తొొమ్మిదవ ప్రకరణము.

సౌష్టవమును బడసి కాశికాఖండముఁ జెప్ప బీఁకొనకొప్పటిని
చెప్పుటెంతయు నౌచితిని దెలుపుచున్నయది.

నిశ్శంక కొమ్మనామాత్యకవి.

SREE VEMANA ANDHRA BHASHA NILAYAM HYDERABAD-DN.
శ్రీ వేమన ఆంధ్ర భాషా నిలయము హైదరాబాదు 1923.

రాజమహేంద్రపురముఁ బాలించిన రెడ్డియాస్థాన మలం
కరించిన మహాకవులలో శ్రీనాథకవిసార్వభౌముఁడుగాక మ
ఱియొక ప్రసిద్ధకవిశూరుఁడుఁ బేర్కొనఁబడవలసి యుండెను. ఆత
నిపేరు నిశ్శంక కొమ్మనామాత్యుఁడు. ఆపస్తంబసూత్రుఁడును
శ్రీవత్సగోత్రుఁడునగు నీకొమ్మనామాత్యుఁడు శివలీలావిలాస
మను మహాప్రబంధమును రచియించి వీరభద్రభూపాలుని
తమ్ముఁడగు దొడ్డభూపాలుని కంకితము గావించెను. శివలీలా
విలాసమును రచించినవాఁడు తిక్కనసోమయాజితండ్రియగు
కొమ్మనామాత్యుఁడని యాంధ్రకవులచరిత్రములోఁ వ్రాయఁ
బడినదిగాని శివలీలావిలాసమును రచించిన మహాకవి పదునే
నవశతాబ్దిలోనున్న నిశ్శంకకొమ్మనామాత్యుఁడేగాని పదు
మూఁడవశతాబ్దిలోనున్న కొమ్మనామాత్యుఁడుకాఁడని శివలీ
లావిలాసకృతిపతియైన దొడ్డభూపాలుని కాలమునుబట్టియు,
ఏతద్గ్రంథములోని యవతారికనుబట్టియు నిర్ధారింపఁగలుగుచు
న్నాము. కొమ్మనామాత్యునికవిత్వము ప్రౌఢమైనదిగఁ గన్ప
ట్టుచున్నది. ఇతఁడవతారికలో:—

ఉ. అందుఁ జనించి మించిరి సమగ్రనిరూఢిఁ గ్రమక్రమంబునన్
మందర ధీరు లాగత సమస్త (విచారులు) సంతతప్రజా

నందన కార్యకారులు గుణస్ఫుటవారులు ధర్మరక్షణా
మందవిచారు లంగజితమారులు దేసటు లత్యుదారులై"

అని వీరలు దేసటివంశ్యులని యెఱ్ఱాప్రెగ్గడయు శ్రీనాథుఁడు ను హరివంశము కాశీఖండములలోఁ జెప్పినదానిని నిశ్శంక కొమ్మనామాత్యుఁడు ధ్రువపఱచి యున్నాఁడు గావునఁ గొండవీడు రాజమహేంద్రపుర రాజ్యములఁ బరిపాలించిన రెడ్డి రాజులు దేసటివంశ్యులుగాని స్థానికచరిత్రముల వ్రాసినట్లు దొంతివారు కారని స్థిరపడుచున్నది.

అవతారికలోఁ గృతిపతివంశవర్ణనమును శ్రీనాథునివలెనె కొమ్మనామాత్యుఁడియు విశేషవర్ణనాంశములతో నించెను. అల్లాడభూపతి ధారాసురత్రాణుని, గజపతీంద్రుని, పెదకోమటివిభుని జయించెననియు, నాకవరము, నోడ్డాదిని వశపఱచుకొనియెననియు వ్రాసియున్నాఁడు. మఱియు బహుపద్యములతో వేమభూపాలుని పరాక్రమం బభివర్ణించుటయె గాక వేముఁడు తనతమ్ముఁడైన వీరభద్రునికిఁ బట్టముగట్టెనని యీక్రిందిపద్యముచే విస్పష్టము చేయుచున్నాఁడు.

ఉ. తేజమెలర్ప నవ్వసుమతీధవశేఖరుఁ డొప్పు సర్వథా
త్రీజనరక్షణక్రమధురీణుని తమ్ముని వీరధీమణిన్
రాజమహేంద్రనామ నగరంబునఁ బట్టముగట్టె నంచిత

శ్రీజయకీర్తి సౌరభవిశేష విజృంభితదిక్సమేతుఁడై." *

రాజమహేంద్రపుర రాజ్యవిస్తీర్ణము.

అల్లాడవేమభూపాలుఁడు వీరభద్రనృపాలునకుఁ బట్టముగట్టి సైన్యాధిపతియుఁ దనతమ్ముఁడునైన దొడ్డభూపాలునిసాహాయ్యముతోఁ గళింగదేశములోని యొడ్డాది, నాకవరము, లోతుగడ్డ, నందాపురము, సింహాద్రి, చీకటి, చిల్కసముద్రము మొదలగుప్రదేశములనాక్రమించి సప్తమాడెములు, ఝూడేశవనము, బారుహాదొంతి, జంతరునాడు మొదలగు కొండదేశములను జయించి దండకారణ్యమధ్యమునందు (బస్తరుప్రాంతము) పుళిందరాజరగిభాహివంశజులకు నభయమొసంగి

---

* శివలీలావిలాసముయొక్క ప్రతి శ్రీయుత మానవల్లి రామకృష్ణకవిగారిచే నాకొసంగఁబడినది. ఇది మిక్కిలి శిథిలమై ద్వితీయాశ్వాసము మాత్రము సంపూర్ణముగా నున్నది. తక్కినవి లేవు. అవతారికపద్యములు పెక్కులు కలవు గాని యవన్నియు లేఖనదోషములతో నిండియున్నవి. అవతారికలోఁ గవి తనగోత్రమును నామమును మాత్రమె తెలుపుకొనియెనుగాని తండ్రితాతలపేరులుగాని వంశనామముగాని యవతారికలో మాత్రముగాక యాశ్వాసాంతగద్యమున సహితము దెలుపుకొనియుండలేదు. ద్వితీయాశ్వాసాంతగద్య మిట్లున్నది. "ఇది శ్రీమదష్టభాషాకవితాప్రవీణ నయవిబుధస్తుత్య నిశ్శంకకొమ్మనామాత్యప్రణీతంబైన శివలీలావిలాసంబునందు ద్వితీయాశ్వాసము." ఈగ్రంథముయొక్క సంపూర్ణమైన ప్రతిని సంపాదించి యెవ్వరైనఁ బ్రకటింపఁగలరేని భాషకు మహోపకారమును జేసినవారగుదురు.

కటకాధిపతియు, కళింగగాంగవంశజుఁడును, గజపతియునగు భానుదేవుని నోడించి తమరాజ్యమును మహానదివఱకు విస్తరింపఁజేసిరి. అనఁగాఁదూర్పుతీరమున గోదావరి మొదలుకొని మహానదివఱకుఁగల కళింగదేశమంతయు నాక్రమించి పరిపాలింపఁగలిగిరి. ఈప్రదేశమంతయుఁ గళింగదేశమని పూర్వము వ్యవహరింపఁబడినను శ్రీనాథకవిసార్వభౌముఁడు వీరభద్రనృపాలుని మధ్యాంధ్రక్షమామండలేశ్వరుండని వ్యవహరించియున్నాఁడు. ఆనాటికే కళింగదేశము సంపూర్ణముగా నాంధ్రదేశములోనిభాగముగా నేర్పడినది. ఈరెడ్డిరాజులు పరిపాలించినభూభాగ మంతయును ముప్పదివేలమైళ్ల వైశాల్యము గలదియై యుండెననుటకు సందియము లేదు. అల్లాడరెడ్డిపుత్త్రులు నిరంకుశులై యవక్రపరాక్రమంబున నిరువదేండ్లకాలము మధ్యాంధ్రదేశమును బలిపాలించిన వెనుక దేశము ఘోరయుద్ధములకు రంగస్థల మయ్యెను.

## రెడ్లధర్మకార్యములు.

అల్లాడవేమభూపాలుని శ్రీనాథకవిసార్వభౌముఁడు "దేవబ్రాహ్మణభక్తివర్ధితధరిత్రీచక్రసామ్రాజ్యలక్ష్మీవాస్తోష్పతి" యని వర్ణించియుండఁగా నాతనిధర్మకార్యము లెట్టివై యుండునో వేఱుగఁజెప్పనక్కఱలేదు. ఇతఁడనేకభూదానములను గావించి కాంచీ శ్రీగిరి కాశీపంచారామాది దేవభవనంబు

లలో శాసనములు వ్రాయించెనని యీక్రింది పద్యమువలన వేద్యముకాఁగలదు.

"క౦. కాంచీ, శ్రీగిరి కాశీ
పంచారామాది దేవభవనంబుల వ్రా
యించెను వేమక్ష్మాపతి
యంచిత భూదానశాసనాక్షరపఙ్క్తుల్"

భీమఖండమున:—

"గీ. ధర్మశాసనఘనశిలాస్తంభ మెత్తె
శ్రీముకుందోద్భవస్వామిశివునిమ్రోల
వీరభద్రేశుఁ డాచంద్రతారకముగ
నగ్రహారాళి నఖిల మాన్యంబు లొసఁగి"

అనుపద్యము గన్పట్టుచున్నందున వీరనృపాలుఁడు సైతము మతసంరక్షకు లగుబ్రాహ్మణులకు నగ్రహారములు మాన్యములు నొసంగుచుండెననుట విదితము కాఁగలదు. ఇట్లుకొండవీటిరెడ్లు, రాజమహేంద్రపురము రెడ్లు బ్రాహ్మణులకు భూదానములు చేసినా రన్న కుక్షింభరమాత్రు లయిన బ్రాహ్మణులకు వ్యర్థముగా భూదానములు చేయుచుండిరని నవనాగరకులు కొందఱు తలంచి పరిహాసింపవచ్చును గాని యట్లు తలంచుట న్యాయముగాదు. విద్యలన్నియు బ్రాహ్మణులయాధీన మై యుండుటచేత వేదశాస్త్రాదివిద్యలపోష

ణార్థము పర్వకాములందు పుణ్యము పేరుచెప్పుకొని వేదవేదాంగవేత్తలైన బ్రాహ్మణులకుమాత్రమే భూదానము మొదలగు దానములను జేయుచుండిరని భావింపవలయును. వారియుద్దేశముగూడ నట్టిదైయుండెను. వీరభద్రభూపాలునిపట్టమహిషియగు అనితల్లీదేవి ఆయుర్వేదపారంగతుండైన పరహితాచార్యుఁడను బ్రాహ్మణునకు కలువచేరను గ్రామమునకు అన్నవరమని పేరిడి దానముచేసియుండెను. ఈగ్రామ మిప్పుడు గోదావరిమండలములోని రామచంద్రపురము తాలూకాలో కలవచెర్లయని వ్యవహరింపఁబడెడి గ్రామముగా నున్నది. పరహితుని పూర్వులెల్లరు నాయుర్వేద పారంగతులైన భిషజ్మణులని శాసనమునందభివర్ణింపఁబడిరి. అట్టి యుత్తమవిద్యను నేర్చి మహాజనోపకారకరులై ప్రసిద్ధి నొందిన బ్రాహ్మణోత్తములఁ బోషించుట యాయుర్వేద విద్యను బోషించుట కాదా? ఇట్టి యుత్తమశాస్త్రములు నశింపకుండఁ జేయుటకే నాఁటికాలమునందు గ్రామములు, భూములు మొదలగువానిని బ్రాహ్మణోత్తములకు దానము చేయుచుండిరి. పైదానము శాలివాహనశకము ౧౩౪౫ (1423) శోభకృద్వర్ష శ్రావణకృష్ణైకాదశీ దినంబున శ్రీమార్కం

దేవేశ్వరుని సన్నిధానమునఁ జేయఁబడినది*

---

* అనితల్లి శాసనము

జగతి సదుపకర్తా జాహ్నవీ శుద్ధిభర్తా
సతతసుకృతకర్తా సత్యవాక్యోపహర్తా
కృతపరశివసఖ్యః కుత్సితాశేషసౌఖ్యః
ప్రథితపరహితాఖ్యః పావనో వైద్యముఖ్యః (౫౩)
జననావనసంహరణేష్వంత్యస్యాహం కథంవిధాతాస్మి
ఇతిపరహితతను మీశం సూనం ప్రోమాస్మయా తుమారూపా
పితాపరహితస్యాస్య మల్లినాథోభిషగ్వరః
పితామహః పరహితః స్సర్వవ్యాధిచికిత్సకః (౫౪)
దీర్ఘాస్థిస్యూతవక్త్రోభయపుటమసకృద్దర్శయం తూస్వమాస్యం
దృష్ట్వావల్మీకపార్శ్వే భుజగవరముపేత్యాభయో యః కృపాళుః
కృత్వాసమ్యక్చికిత్సా మచిరముపరుజా తే వదత్తాభయశ్రీ
రస్యార్తోపక్రమత్తాత్పరహిత భిషజో నామతస్యార్థయుక్తం (౫౫)
శ్రీమత్పరహితనామాచార్య స్సర్వాగమార్థతత్త్వజ్ఞః
సర్వచికిత్సామకరోత్తదుపజ్ఞో పరహితోభిధానశ్రీః (౫౬)
తతః పరహితాచార్య తనయో విశ్రుతశ్శ్రితః
వైద్యవిద్యానవద్య శ్రీరామనామాఖ్యయోదభూత్ (౫౭)
శ్రీరామనాథతనయా వినయావనమ్రా
స్త్రేతాగ్నితుల్య మహస స్తులితస్త్రివేదాః
విశ్వోత్తరపరహితోథచ దేవనార్య
శ్రీకాళనాథభిషగీశ ఇతిప్రసిద్ధాః (౫౮)
తేషాంసవిశేషగుణశ్శ్రీకా శ్రీకాళనాథభిషగీశాత్
జాతా పుత్రాః రామాయపరహితం దేవార్యవరద నామానః (౫౯)

## మధ్యాంధ్రదేశ విప్లవము.

అల్లాడభూపతిపుత్త్రులు క్రీ. శ. ౧౪౨౫ వఱకు నవక్రప రాక్రమంబున శత్రురాజుల నదిమిపట్టి యవనకర్ణాట కటక

---

అత్రిగోత్రకమలాకరభానుః తేషుసాధుజనతాసురధేనుః
రుక్మతీకరణకర్మణిబంధుర్జృంభతేపరహితోగుణసింధుః (౬౦)
శ్రీమద్వైదికకర్మకర్మఠ మతిశ్శైవార్చనా తత్పరః
శశ్వద్దీనజనావనో విమలధీ రాయుర్యజుర్వేదవిత్
శాంతస్సత్పురుషః ప్రియశ్శుచియశోదాతా కళాకోవిదో
లక్ష్మీస్థైర్యనిధిః కృతీ పరహిత శ్శ్రీకాళినాధాత్మజః (౬౧)
సరసాసుసంహితా రసదానవసిద్ధాభిహిత చికిత్సాసు
నరసురదనుజాది కృతాస్వవినరయోగ్యాసు పరహితోజయతి
ఉభాకువలయప్రియా కరగతా వౌషధప్రసిద్ధికృతికోవిదా
సుమనసాంచసంజీవినా సదాశివవతంసకా సుమహాంసో
ధృతాత్రేయతోశచీపరహిత శ్చతావపిచకాళినాధాత్మజౌ
విశుద్ధగుణభూషణో విహితదోషసంభాషణః
ప్రకాశితయశోధనః ప్రవితతాత్మ చిద్బోధనః
శ్రుతార్థనిధికం ధీరమ్నభగధీరతామందరః
ప్రభుర్జయతిదేవనః పరహితానుజః పావనః (౬౨)
శైవశ్శాంతమనాః కళాతిచతురో వేదే యజుష్యగ్రణీ
రాధివ్యాధిచికిత్సకస్సుకృతినాం దాతా వివేకీ శుచిః
ధీరఃసత్పురుషో నదీనహృదయో దీనార్థిసార్థప్రియో
ధన్యోదివ్యతికాళనాధతనయః శ్రీదేవనార్యస్సుధీః (౬౩)
విద్యానవద్యహృదయో వినయోన్నతశ్రీః

భూధవులతోడ బలిమి వాటించి రాజమహేంద్రపుర రాజ్యమును బరిపాలించిరని తెలిపియున్నాఁడను. వీరి రాజ్యము గజపతి రాష్ట్రమునకుఁ బ్రక్కలో బల్లెమై యుండెను. ఈ రెడ్డి రాజ్యము ప్రవర్ధమానమై యున్నంతవఱకు గజపతుల కభివృద్ధి లేక యుండెను. వీరికి కర్నాటకులు శత్రువులుగ నుండిరి. కర్ణాటకులును రెడ్లు నప్పుటప్పుట మైత్రిగలిగి యుండుచువచ్చిరి. అదియుఁ గూడ నొక విరోధకారణమై యుండెను. పశ్చిమమున బహామనీ రాజ్యము వర్ధిల్లుచుండెను. అహమ్మదుషాహ

---

సుభ్రాతృభావ సుభగ స్స్వజనైకబంధుః
శ్రీకాళనాథతనయః శివపాదభక్తో
వశ్యాత్మనాం హి పరదోవరదార్యవర్యః (౬౬)
సంతంసద్గుణశాలినం శుచిమనోవాక్కాయకర్మాన్వితం
రాగద్వేషవివర్జితం వితమసం విద్యాధనంధార్మికం
వైద్యం వైదికమాశ్రితం పరహితం గ్రామేణసంభావయ
న్త్యార్యాభావుక సన్నిధాపతియుతా ప్రీతాన్నతల్యంబికా (౬౭)
శాకాబ్దేశరవేదరామశకభృత్సం ఖ్యే శుభేశోభకృ
ద్వర్షే శ్రావణకృష్ణ విష్ణుదివసే శ్రీకల్వచేరుంశుభం
గ్రామందత్తవతీ పరహితాచార్య శైలాధిప
శ్రీరామేశ్వరసన్నిధా పతిహిత శ్రీరన్నతల్యంబికా (౬౮)
గ్రామస్య కలువచరోరన్న వరాఖ్యం విధాయనిజనామ్నా
పరహితభిషజే ప్రాదాదనితల్లీ గ్రామమర్ధభూతియుతం
ఆంధ్రభారతి సంపుటము 3 పేజీలు ३४६; ३४७.

వల్లి మరణమునొందఁగా అల్లాఉద్దీన్ షాహ ౧౪౩౫ వ సంవత్సరమున రాజ్యారూఢుఁడై కర్ణాటక సామ్రాజ్యచక్రవర్తి యగు ప్రౌఢ దేవరాయనితో యుద్ధములు ప్రారంభించెను. ప్రౌఢ దేవరాయలుతురుష్కుఁడైనబహమనీసుల్తానుమాత్రమె గాక హిందువైన గజపతికూడ శత్రువుగనుండుటచేత నొక ప్రక్క గజపతులతోడను మఱియొకప్రక్క తురుష్కులతోడను యుద్ధములు చేయవలసివచ్చెను. యవనకర్ణాట కటక భూధవులు సమానబలులు సమర్థులుగావున దక్షిణహిందూ దేశమునందు మతమసామ్రాజ్యములనుసుస్థిరముగానిలుపుటకై ఘోరముగాఁ బోరాడుచువచ్చిరి. ఇట్టి యుద్ధముల నడుమ రెడ్డిరాజ్య మెంతోకాలము నిలువఁజాలకపోయినది. గజపతులు రెడ్డిరాజ్యమును మ్రింగివేయవలయునని చలముపట్టి యుండిరి. అందులకుఁ గాలముకర్మమునమకూడినది. ఇట్లుండఁగా ౧౪౩౫ వ సంవత్సరమున గజపతుల రాజధానియైన, కటకపురమున విప్లవము తటస్థించి రాజైన భానుదేవుఁడు సంహరింపఁబడియెను. ఈతనితోఁ గళింగగాంగవంశ మంతరించినది. మంత్రియగు కపిలేంద్రగజపతి రాజ్యారూఢుఁడయ్యెను. ఇతఁడు మిక్కిలి సమర్థుఁడు, విక్రమాఢ్యుఁడునగుట చేతఁ దనరాజ్యమును విస్తరింపఁజేయ సంకల్పించెను. రెడ్డిరాజ్యము నాపోసనముఁ బట్టినఁగాని తనసంకల్పము నెఱవేఱఁ

జాలదు. అందులకై పదిసంవత్సరములు కృషిచేసెను. ౧౪౫౪ ౧వ సంవత్సరమునఁ గపిలేంద్రగజపతి రాజమహేంద్రపురముపై దండయాత్ర వెడలివచ్చెను. ప్రౌఢదేవరాయలు రెడ్లకు సాహాయ్యముఁ జేయవచ్చెను. ఉభయపక్షమువారికి యుద్ధములు జరిగినవి. కపిలేంద్రగజపతి యుద్ధమున గెలువఁజాలక యాతజపకు మరలిపోయెను గాని తనపట్టువిడిచినవాఁడు గాఁడు. ప్రౌఢదేవరాయ లాసంవత్సరమున దక్షారామభీమేశ్వరుని సందర్శించి యొక దానశాసనమును వ్రాయించి వెడలిపోయెను. తరువాత రెండుసంవత్సరములైనతరువాత విద్యానగరమునందు ప్రతాపదేవరాయలుమృతుండయ్యెను. ఇట్టిమహాసమర్థుఁడైనశత్రువు మరణము నొందినందునఁ గపిలేంద్రగజపతికి బలమెక్కువ యయ్యెను. అతఁడు కర్ణాటసామ్రాజ్యమును స్వాధీనపఱచుకొని పిమ్మట తురుష్కులను జయించి దక్షిణహిందూదేశమున నేకసామ్రాజ్యమును స్థాపింపవలయునని సంకల్పించి కృషిచేయుచుండెను.

## అన్నదేవచోడుని వీరకృత్యములు.

ఇట్లుండఁగా మధ్యాంధ్రదేశమున నొకమహావీరుఁడావిర్భవించెను. అతఁడు చోడవంశమున జనించినక్షత్రియుఁడు. ఇతని శాసన మొకటి రాజమహేంద్రవరము మ్యూజియములో నుంచెను. ఈతామ్రశాసనములోని కొన్నిపలకలుపోయినవి.

అయినను గొంతవఱకు నీతని చరిత్రముఁ దెలిసికొనవచ్చును. చోడవంశమున జనించిన యొకరాజు అన్నమాంబను వివాహముఁ జేసికొన వారికి నెఱిన భీమరాజు జనించెను. అతఁడు ప్రోలాంబికను వివాహముఁ జేసికొనియెను. అతని మునిమనుమఁడు గంగాధరుఁడు. అతనికి అరిగండర గండఁడను బిరుదము గలదు. అతనికుమారుఁడు కామరాజు. ఆతనికి భక్తీశ్వరుఁడను నామాంతరము గలదు. భక్తీశ్వరుఁడు బాలుఁడుగానున్నపుడే గులపూండిపురసమీపమున బొగ్గరాడియధిపతులైన మహమ్మదీయనాయకుల జయించెను. పంచధారకడ గజపతిని నోడించి కొప్పులభూపతికిఁ బట్టముగట్టెను. భరణిపాడునకు సమీపమునకు సింగనాయనిఁ జంపెను. పెదకొండాపురముకడ డబరుఖాను మొదలగు తురుష్కనాయకుల నోడించెను. సూరవరపట్టణమునందు రణశూరుఁడైన అనపోతనాయని సులభముగా నాశనము గావించెను. కామభూపాలుఁడన్నమాంబను వివాహముఁ జేసికొని యాంధ్రదేశములోఁ దన పేరిట కామపురియనియొక పట్టణమును నిర్మించెను. కామభూపాలుని పుత్త్రుఁడే అన్నదేవచోడుఁడు. సూర్యవంశమున జనించిన పిన్నుండిరాజుయొక్క సోదరియగు ఇరుగాంబికను వివాహముఁ జేసికొనియెను. ౧౩౬౩ వ సంవత్సర ప్రాంతమున సుంద్రరాజు శూరవరపట్టణము రాజధానిగాఁ బరిపాల

నము చేయుచుండెనని పూర్వప్రకరణమునఁ దెలిపియున్నాఁడను. *ఈపిన్నులఁడి యనునాతఁడాయుండ్రాజువంశమునజనించిన వాఁడుగఁ గన్పట్టుచున్నాఁడు. వీరికి సంతానములేని హేతువుచేత వీరభద్రుఁడనువానిని దత్తుచేసికొన్నట్లు గన్పట్టుచున్నది. అన్నదేవచోడుఁడు బహమనీసుల్తానగు అల్లాఉద్దీన్ షాహాతో నొడంబడిక చేసికొని తురుష్కసైన్య సాహాయ్యముతో రాజమహేంద్రపుర రాజ్యములోఁ గొంతభాగమాక్రమించుకొనియెను. రాజమహేంద్రపురమునకుఁ దూర్పుభాగమున గజపతికిని వీరభూపాలునకును ఘోరయుద్ధములుజరుగుచుండెను. దక్షిణమునుండి లింగమనాయఁడు, సింగమనాయఁడు మొదలగు పద్మనాయకులు కర్ణాటనృపతులకు సామంతులుగావున గర్ణాటసైన్యములతో దండెత్తివచ్చిరి. రాజమహేంద్రపురరాజ్యమిట్లు యవనకర్ణాట కటకసైన్యములతో నొక్కమాఱు పోరాడవలసివచ్చెను. ఈఘోరయుద్ధములలో వేమవీరభద్రపృథ్వీశుల సైన్యము హతమయ్యెను. వీరశిఖామణులైన సోదరులు మువ్వురును వీరస్వర్గమును జూఱఁగొనఁబోయిరి.

---

* పొరవగపట్టణము. బెజవాడకు ఈశాన్యమూలను పదునెన్మిది మైళ్లదూరమున నున్నట్లు సూయల్ దొరగారి గ్రంథమువలనఁ దెలియుచున్నది.

## అత్తిలి కాకరపర్తుల యుద్ధములు.

ఈ మహాసంక్షోభకాలమునందు అన్నదేవచోడుఁడు తురుష్కసైన్యముల సాహాయ్యముతో నొకప్రక్క గజపతుల సైన్యమును, మఱియొకప్రక్కనుండి కర్ణాటసైన్యములను నెదుర్కొని అత్తిలి దుర్గముకడను, గౌతమీతీరమునఁ గాకరపర్తికడను మహాఘోరసంగ్రామమును సలిపెను. హతశేషమైన కాటయవేముని కుటుంబమువారు తనకాళ్ళపైఁబడి శరణువేడఁగాఁ గీర్తికాముఁడనై సంరక్షించితినని అన్నదేవచోడుఁడు తనశాసనమునందు వ్రాయించెను. కాటయవేముని పక్షమువారు పదివేలమందికి నభయహస్తమిచ్చి కాపాడెనఁట. ఈయుద్ధమునందు దనకుఁ దనమఱఁదియగు పిన్నొండిరాజు తోడుగానుండెనఁట. కపిలేంద్రగజపతి సైన్యముల నోడించి తఱిమెను. కర్ణాటసైన్యముల హతముగావించుటయెగాక సైన్యాధీశులను కాకరపర్తియుద్ధమున సంహరించెనఁట. ఎట్లయినను ఈయుద్ధములయం దన్నదేవుఁడు విజయములను గాంచెను. రెడ్లతరువాత పదిసంవత్సరము లితఁడు రాజ్యపరిపాలనము చేసినట్లు గన్పట్టుచున్నది. గౌతమీతీరమునమన్న ముమ్మడిపోలవర మీతనికి రాజధానిగ నుండెను. గౌతమీతీరమునఁ బట్టిసవీరభద్రేశ్వరుని సమ్ముఖమున ననేక గోదానములను గావించెను. మఱియును షోడశమహాదానములలో నొ

క్కటియగు సప్తసాగరదానములను గావించెనఁట. గోముఖ గిరిలోని వీరభద్రునిదేవాలయమును సువర్ణముతోఁ గప్పెను. దక్షారామభీమేశ్వరుని యాలయమునకుసువర్ణకలశము నెత్తించి యాంధ్రదేశకిరీటమున కొకయలంకారముగా నుండునట్లు గావించెనఁట. గంగాతీరమున (గోదావరి) వీసరినాడులో పిన్న సానిగంగకు సమీపమున ఉత్తమగండచోడన్న దేవవరమను గ్రామమును బ్రాహ్మణులకుదానముచేసెననిశాసనముయొక్క ప్రధానాంశమై యుండెను. అన్నదేవుఁడు విశేషకాలము రాజ్యపరిపాలనము చేయకపూర్వమె యీదేశమంతయును కపిలేంద్రగజపతిచే జయింపఁబడి పరిపాలింపఁబడినట్లు శాసనములు సాక్ష్యమిచ్చుచున్నవి.

## శ్రీనాథునికృతులు.

రెడ్డిసామ్రాజ్యచరిత్రము ముగిసినదిగావున శ్రీనాథ కవిసార్వభౌమునిచరిత్రశేషమును గూడ వినిపించి యతని చరిత్రము ముగింపవలసియున్నది. శ్రీనాథుఁడు మరుద్రాజ చరిత్ర, సప్తశతి, పండితారాధ్యచరిత్రము, శృంగారనైషధము, భీమేశ్వరపురాణము, హరవిలాసము, కాశీఖండము మొదలగు గ్రంథములనురచించి యాంధ్రప్రపంచమునఁ బ్రఖ్యాతికెక్కినవాఁడగుటచేత నపకీర్తినిగలిగించు మఱికొన్నింటి గ్రంథములకర్తృత్వముగూడ శ్రీనాథున కారోపింపఁబడుచు

న్నది. వానిని బరిశోధనముతోఁగూడిన విమర్శలేక విశ్వసింపరాదు. పల్నాటివీరచరిత్రమును శ్రీనాథుఁడు రచించెనని చెప్పెదరుకాని శ్రీనాథకవిరచితమైన పల్నాటివీరచరిత్రముయొక్క సంపూర్ణగ్రంథమెచ్చటను గానరాదు. చెన్నపురిప్రాచ్యలిఖితపుస్తకభాండాగారమున శ్రీనాథవిరచితమని వ్రాయఁబడిన పల్నాటివీరచరిత్రములోని యొకభాగముమాత్రము గన్పట్టుచున్నది. ఆభాగమైనను శ్రీనాథవిరచితమని విశ్వసించుటకు ప్రతిబంధకములు చాలఁగలవు. శ్రీయుతులైన ఉమాకాంతముగారు ప్రచురించిన పల్నాటివీరచరిత్రభాగము శ్రీనాథకవిరచితముకాదని తోఁచుచున్నది. ఉమాకాంతముగారు పల్నాటివీరచరిత్రమును శ్రీనాథుఁడు వార్ధకదశయందు వ్రాసెనని వ్రాయుచున్నారుగాని నిక్కముగా నాతఁడాచరిత్రమును రచియించియుండు నేని బాల్యముననే వ్రాసియుండునుగాని యాతప్పులతడిక వార్ధకదశయందు సల్లియుండఁడు. నందనందనచరిత్రము రచించెనని చెప్పెదరుగాని యాగ్రంథము నాకులభించియుండలేదు. వల్లభాభ్యుదయమను నొకగ్రంథమును రచియించి తెలుఁగురాయని కంకిత మీయఁబడినట్లు గన్పట్టుచున్నది. ఇది బందరుసమీపముననుండు శ్రీకాకుళక్షేత్రముయొక్క మాహాత్మ్యమైయున్నది. తెలుఁగురాయఁడు ప్రౌఢదేవరాయనికాలమున శ్రీకాకుళము ముఖ్యపట్టణముగా వెల

నాటిసీమను బరిపాలించిన యొకప్రభువు. వల్లభాభ్యుదయము యొక్కకవనమును,అందలివిషయమును బరిశోధించినపక్షమున నాగ్రంథము శ్రీనాథకవిసార్వభౌమ విరచితముకాదని తేఁటపడఁగలదు. వల్లభునితిరుణాళ్ళలోజరుగు జారిణీజారులవృత్తములన్నియు విశేషముగా వర్ణింపఁబడిన వని గ్రంథమును జదివినవారు నాకుచెప్పి యాగ్రంథము శ్రీనాథవిరచితమగునాయని సందేహించుచున్నారు. ఇదియునుఁగాక "వీథినాటక" మను పేరిట నొక గ్రంథము శ్రీనాథవిరచితమైనట్లు గన్పట్టుచున్నదిగాని యందలిపద్యములన్నియు పెక్కండ్రుకవులు రచించిన చాటుపద్యములు గొన్నిఁటిని శ్రీనాథునిచాటుపద్యములతోఁ జేర్చి 'వీథినాటక' మని పేరుపెట్టి ప్రచురింపఁబడినదిగాని యాగ్రంథము శ్రీనాథవిరచిత మనిచెప్ప వలనుగాదు. వీథినాటక మెప్పుడట్లుండదు. వీథినాటక మెట్లుండునో క్రీడాభిరామమను గ్రంథమునుజదివినవారికి బోధపడఁగలదు. శ్రీనాథుఁడే క్రీడాభిరామమను వీథినాటకమును వల్లభామాత్యుని పేరిట రచించెనని శ్రీయుత మానవల్లి రామకృష్ణకవిగారు కొన్ని హేతువులను జూపియున్నారు. శ్రీనాథునిగూర్చినకథలనేకములుగలవు. ఏతత్కవిచరిత్రముప్రత్యేకముగా వ్రాయఁబూనుకొన్నందున నిందువివరింప మానుకొనుచున్నాఁడను. శ్రీనాథుఁడు రచించిన చాటుపద్యములు వందలకొలఁదిగలవు.

ఇంతటిపలుకుఁబడియుఁ బ్రఖ్యాతియుఁ గలిగియున్న యాంధ్ర కవి మఱియొక్కఁ డాకాలమునఁ గానుపింపఁడు.

శ్రీనాథునిచరమదశ.

శ్రీనాథునియెడ మిక్కిలి గౌరవము సూపినరెడ్డిరాజులును వారి మంత్రులును స్వర్గస్థులైరి. రెడ్డిరాజులప్రభుత్వమునకు మాఱుగా నోడ్డెరాజులప్రభుత్వము ప్రారంభమై రెడ్డిరాజులకు గర్భశత్రువులగు నోడ్డెరాజులు విద్యాగౌరవము లేక శ్రీనాథునిఁ బలుబాములకుఁ బాల్పఱిచి వంచింపఁగాఁ గడుపు కక్కుర్తిచేఁ గృష్ణాతీరమున బొడ్డుపల్లె యనుగ్రామమును గుత్తకుఁ గొని శ్రీనాథుఁడు కృషిచేయ నారంభించెను. శ్రీనాథుఁ డీక్రిందిపద్యములోఁ దన దురవస్థనంతయును వెళ్లఁబోసికొని యాంధ్రసారస్వత మున్నంతకాలము నోడ్డెరాజులకు నపకీర్తిని నెలకొల్పెను.

॥సీ. కవిరాజుకంఠంబు కౌఁగిలించెను గదా
పురవీథి నెదురెండ పొగడదండ
ఆంధ్రనైషధకర్తయంఘ్రియుగ్మంబునఁ
దగిలియుండెను గదా నిగళయుగము
వీరభద్రారెడ్డివిద్వాంసుముంజేత
వియ్యమందెను గదా వెదురుగొడియ
సార్వభౌమునిభుజాస్తంభ మెక్కెనుగదా
నగరివాకిట నుండునల్లగుండు

గీ. కృష్ణవేణమ్మ గొనిపోయె నింత ఫలము
బిలబిలాక్షులు తినిపోయెఁ దిలలు పెసలు
బొడ్డుపల్లెను గొడ్డేరి మోసపోతి
నెట్లు చెల్లింతు టంకంబు లేడు నూర్లు."

ఇట్టికష్టముల ననుభవించి శ్రీనాథకవిసార్వభౌముఁడు తన యవసానకాలమున:—

"సీ. కాశికావిశ్వేశుఁ గలిసె వీరారెడ్డి
రత్నాంబరంబు లేరాయఁ డిచ్చు
రంభఁ గూడెఁ దెనుంగురాయరాహుత్తుండు
కస్తూరి కేరాజుఁ బ్రస్తుతింతు
స్వర్గస్థుఁ డయ్యె విస్సనమంత్రి మఱి హేమ
పాత్రాన్న మెవ్వనిపంక్తి గలదు
కైలాసగిరిఁ బండె మైలారువిభుఁ డేఁగి
దినవెచ్చ మేరాజు తీర్పఁగలఁడు
గీ. భాస్కరుఁడు మున్నె దేవునిపాలి కరిగెఁ
గలియుగంబున నిఁక నుండఁ గష్ట మనుచు
దివిజకవివరుగుండియల్ దిగ్గు రనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి."

అను పద్యమును జెప్పి ప్రాణములను విడిచెనఁట.

"అవసాన దశయం దిట్టి కష్టముల కెల్లను గారణము

యౌవనదశయందుఁ గామవశముచేత స్వేచ్ఛముగావిహరించి దేహమును ధనమును బోఁగొట్టుకొన్న పాపఫలము తక్కవే ఱొక్కటి గానరాదు.'' అని యాంధ్రులచరిత్రమునం దొక యపూర్వవ్యాఖ్యానము చేయఁబడినది. ఇట్టి సిద్ధాంతమునే మనము సాహసించి చేయవలసినపక్షమున లోకములో సిగ్గును విడనాడి ప్రబంధములలోఁ గామోద్రేకము గలిగించువిధమున మిక్కిలి పచ్చిగా స్త్రీవర్ణనములఁ గావించి రసికజనమనోరంజనము గావించెడు కవులను, లోకములోని విటపురుషుల దుర్వర్తనముల హాస్యప్రబంధరూపమునను, ప్రహసనరూపమునను వెల్లడించెడు కవులను కామపరవశులనియు, వ్యభిచారులైన మహాపాపు లనియు, వారలు శ్రీనాథునికంటె ఘనులు కాఁజాల రనియు మనము సిద్ధాంతము చేసి చెప్పవలసి వచ్చును గదా!

"శ్రీనాథకవీశ్వరుఁడు తన పలుకుఁదేనియల నెంద ఱెందఱికో రాజులకు రాజమంత్రులకు నామెతలు వెట్టి బహుధన మార్జించెను. ఎంత యార్జించిన నేమి? తుద కామహనీయుని మనువు కడతేరు దనుక నైన నిలుకడ చెందదయ్యెను. అనాఁటి కానాఁ డేదో కృత్రిమపుఘనత కూర్చుధన మేమి ధనము? దంధనము! కీర్తిధనమే ధనము. శ్రీనాథకవీశ్వరుని గన్నులఁ జూచి యెఱుఁగము. మన కాతఁ డెట్టి చుట్ట

మును గాఁడు. కాని యాంధ్రలోకమున కామహాశయుని మూర్తి కనులకుఁ గట్టినట్లు నాఁటికి నేఁటికిఁ బొడకట్టుచునే యుండును. ఆతని యెడ స్నేహమో, బాంధవమో, గౌరవమో, యాంధ్రలోకమున కెడతెగనిదే. ఇంతకుం గారణమాతఁ డార్జించుకొన్న కీర్తి ధనమే గదా!'' అని శ్రీయుత వేటూరు ప్రభాకరశాస్త్రిగారు కనకాభిషేకముతుదను వ్రాసిన రసపూరితవాక్యము లెంత యాదరణపాత్రములుగా నున్నవో చదువరులకే విదితము కాఁగలదు.

## పదవ ప్రకరణము.

### నూత్న కర్ణాటరాజ్యచరిత్రము.

### రాష్ట్రనామము.

తురుష్కులు దండయాత్రలుసలుపుటకు మున్ను దక్షిణహిందూస్థానంబున మూఁడు స్వతంత్రరాజ్యము లుండినవి. అందు మొదటిది సేవుణరాజ్యము. దీనిరాజధాని దేవగిరి. ఇది మహారాష్ట్రదేశమున నుండుటచేతదీనిని మహారాష్ట్రసామ్రాజ్యమని వ్యవహరించిరి. రెండవది కాకతీయ సామ్రాజ్యము. దీని రాజధాని యోరుగల్లనెడు నేకశిలానగరము. ఇది యాంధ్రదేశమున నుండుటచేత దీనినే యాంధ్రసామ్రాజ్యమని వ్యవహరించిరి. మూఁడవది హొయిసలసామ్రాజ్యము. దీనిరాజధాని ద్వారసముద్రము. ఇదికర్ణాటదేశములోఁ బశ్చిమసము

ద్రతీరమున నుండుటచేత దీనికి కర్ణాటసామ్రాజ్యమని వ్యవహరించిరి. తురుష్కుల దక్షిణదేశదండయాత్రల మూలమున నీసామ్రాజ్యములు మూఁడును క్రమముగా నస్తమించినవి. ఓరుగల్లునుండి వచ్చిన యొకకుటుంబముచే మఱియొక సామ్రాజ్యము నూతనముగా స్థాపింపఁబడినది. దీనిరాజధానియగు విద్యానగరము నిర్మింపఁబడిన ప్రదేశము కర్ణాటరాజ్యములో నిభాగమగుటచేత నీసామ్రాజ్యమునకుఁ గర్ణాటసామ్రాజ్యమను పేరునిల్చినది గావున నీసామ్రాజ్యమునే నూత్నకర్ణాటసామ్రాజ్యమని వ్యవహరించుచున్నాను. ఈనూత్నకర్ణాటసామ్రాజ్యమునే మనవారు విజయనగరసామ్రాజ్య మని వ్యవహరించుచున్నారు. దీనికీపేరు మహమ్మదీయులవలనఁ గలిగినది. ఆంగ్లేయులు నిట్లేవ్యవహరించినకతమున నేటికాలపు వారు విజయనగరసామ్రాజ్యమని వ్యవహరించుచున్నారు గాని గ్రంథములలో నేమి శాసనములలో నేమి యీరాజ్యము కర్ణాటరాజ్యమనియె వ్యవహరింపఁబడియెను గాని విజయనగరరాజ్యమని వ్యవహరింపఁబడి యుండలేదు. అట్లుండుటకుఁ గారణ మారాజ్యమంతయుఁ గర్ణాటదేశమునకు సంబంధించి యుండుటకాదు. కర్ణాటులగు రాజులచే మాత్రము పరిపాలింపఁబడుటయును గాదు. ఈరాజ్యము ప్రవర్ధమానమై వర్ధిల్లుచున్నకాలమునఁ గర్ణాటభాగమునకంటెఁ దదితరభాగ

ములె వెక్కుమశంగు లధికముగా నుండినవి. ఈరాజ్యమును బరిపాలించినవంశము సంగమవంశమను సంజ్ఞగలది. ఈవంశము కన్నడవంశమో, తెలుఁగువంశమో చెప్పుట సాధ్యముగాదు. ఈసామ్రాజ్యమును బరిపాలించిన తక్కినసాళువవంశమును, తుళువవంశమును, ఆర్వీటివంశమును ఆంధ్రవంశములనుటకు, సందియములేదు. అయినను ప్రారంభమునందీ సామ్రాజ్యమునకుఁ బైని చెప్పినకారణముచేతఁ గర్ణాట సామ్రాజ్యమను పేరుగలిగి రాజ్య మెంతవిస్తరించినను, రాజులెందఱు మాఱిపోయినను కర్ణాటసామ్రాజ్యమను సంజ్ఞవిడిచియుండలేదు. *

---

* ఆంధ్రదేశమును బరిపాలించినకర్ణాభిధానులగు చక్రవర్తులు పాండ్యరాజులనుండి గైకొని పరిపాలించిన భూభాగమునకే మొదట కర్ణాటమని వ్యవహారనామముగలిగి క్రమముగానది యుత్తరదిశకుఁ బ్రాకినది. అందలి ప్రజలే కర్ణాటులైరిగావునఁ గర్ణాటులు నాంధ్రులలో నివారే. చాళుక్యపరిపాలనారంభకాలమున నాంధ్రులలోఁ దూర్పుననుండువారికిని పశ్చిమమున నుండువారికిని భాషాభేదములేర్పడి ముదిరిపోయినందున పశ్చిమమున నుండువారిభాషహాలెగన్నడమనియుఁ దూర్పున నుండు వారి భాష తెలుగన్నడమనియు (తెలుఁగు) వ్యవహారనామములను బొంది ప్రత్యేకసారస్వతముల సృష్టికి హేతుభూతములైనవని కొందఱి యభిప్రాయము. అనేకశతాబ్దములు కర్ణాటులు తెలుఁగువారు నొక్కకుటుంబములోనివారివలెనె కలసిమెలసి యుండిరి. కావున జాతీయత్వమువిషయమునఁ గర్ణాటులు తైలింగ్యులుచర్చలు పెంచుకొననక్కరలేదు.

సంగమవంశము-రాజ్యస్థాపనము.

ఈనూత్నకర్ణాట సామ్రాజ్యమును స్థాపించి వర్ధిల్లఁజేసిన
వారు సంగమరాజపుత్త్రులు. వీరీరాజ్యమును స్థాపించినవిధ
మును గూర్చి పెక్కండ్రు పెక్కువిధములుగాఁ బెకుగాధ
లను వ్రాసియున్నారు. మనకు యాదార్థ్యము తెలియునం
వఱకు నీక్రిందిగాధను మాత్రమె విశ్వాసార్హమైనదిగాఁ బ
గణింపవలసియుండును. ఆంధ్రచక్రవర్తియగు రెండవ ప్రత
పరుద్రునికడ కోశాధ్యక్షులుగనున్న హరియప్ప, బుక్కరా
అను నిరువురు సోదరులు కాకతీయసామ్రాజ్యము లేక యా
ధ్రసామ్రాజ్యము భగ్నమైన వెనుక యానెగొంది సంస్థాన
ధీశ్వరుని యొద్దికిఁబోయి వారి శౌర్యసాహసప్రభావములచే
మంత్రిత్వకోశాధ్యక్షత్వమును సంపాదించిరి. *

---

*(1) Buchanan in his "Travels in Souther
India," (Mysore III, p. 110) visited Beidur i
Mysore in A. D. 1801. A Brahmin by nam
Ramappa Varmika, showed him a sanskrit boo
in his possession called the 'Vidyaranya Sikka
which related that the founders of Vizianag
were Hukka and Bukka, guards of the treasury
Pratapa Rudra. They fled from Waranga
sought the help of Vidyaranya and established
new dynasty and founded the city of Vizianaga
(విద్యారణ్యశిక్షయను నొక సంస్కృతగ్రంథములో హక్క, బుక్క, య
నిరువురుసోదరులు ప్రతాపరుద్రుని ధనాగారరక్షకులుగానుండి పాఱిపో

ఆనెగొందిపురాధీశ్వరుఁడైన జంబుకేశ్వరరాయలు ఢిల్లీ చక్రవర్తితో జరిగినయుద్ధమున వీరమరణము నొందినతరువాత ఢిల్లీచక్రవర్తి యాతనిమంత్రి యైనహరియప్పవడయరునకుఁ బట్టము గట్టెనని మహమ్మదీయ చరిత్రకారులు తెలియఁజేసియున్నారని ప్రథమప్రకరణములో వ్రాసియున్నాఁడను. ఏదియెట్లు జరిగినను నూత్నకర్ణాటసామ్రాజ్యమును స్థాపించుటకు మున్ను 'హరియప్పవడయర్' అనె

---

విద్యారణ్యుల నాశ్రయించి యాతనిసాహాయ్యమున నూత్నసామ్రాజ్యమును, విజయనగరపట్టణమును నిర్మాణముచేసినట్లున్నదని యాగ్రంథము మైసూరులో 1801వ సంవత్సరములో వార్మికరామప్పయను బ్రాహ్మణుఁడు తమకుఁ జూపించెనని బుకొనన్ అనువారు తమ "దక్షిణహిందూదేశయాత్రలు" అను గ్రంథములో వ్రాసియున్నారు.'

(2) Ferista writes :—"Warangal had fallen and the eastern territories of the Andhras had been annexed but a branch of this family appears to have removed to Bijanagar, on the Tungabhadra, and founded a Kingdom there which long resisted the Mahammadans of the Deccan and rose to great power and eminence." ఓరుగల్లుపడిపోయినది. ఆంధ్రుల ప్రాగ్దేశము కలుపుకోఁబడినది. కాని యీ(యాంధ్ర)కుటుంబములో నొక శాఖవారు తుంగభద్రాతీరముననున్న విజయనగరమునకుఁబోయి దక్కనులోఁ జాలకాలము మహమ్మదీయుల నెదుర్కొనుచుండి బలాఢ్యమై యుచ్చస్థితికి రాఁగలిగినట్టి సామ్రాజ్యము నొకదానిని స్థాపించినట్టుగనప్పట్టుచున్నది.

గొందిలోనుండి రాజ్యపరిపాలనము చేయుచున్నట్లుమహ్మ దీయుల గ్రంథములలోనెగాక స్థానిక గాథలలోఁ గూడనట్లే చెప్పఁబడియెను. మఱియు నిందునకు శాసనప్రమాణము గూడ లేకపోలేదు. కాపలూరు తామ్రశాసనములో హరి హరుఁడు కుంజరకోనలో(ఆనెగొందికి సంస్కృతనామము) నుండి రాజ్యపరిపాలనము చేయుచుండెనని వ్రాయఁబడి యున్నది. *

విద్యానగర నిర్మాణము.

సంగమరాజపుత్త్రులైన హరిహరరాయ బుక్కరాయ లిరువు రానెగొందెలో నుండి రాజ్యపరిపాలనము చేయుచుండ విద్యారణ్యస్వాములవారి ప్రేరణముచే నానెగొందికి నెదు రుగాఁ దుంగభద్రానదీదక్షిణతీరమున నాసోదరశ్రేష్ఠు లిరు వురు నొకపట్టణమును నిర్మించి విద్యారణ్యుల పేరిట విద్యా నగరమని పేరుపెట్టి తమరాజధాని యానగరమునకు మార్చు కొని యందుండి పరిపాలనముచేయుచుఁ గర్ణాట సామ్రాజ్య మును భుజబలదర్పముచే విస్తరింపఁజేసియాపట్టణముమహో న్నతస్థితికిఁ దెచ్చి రని చరిత్రజ్ఞులు వేనోళ్లఁ జాటుచున్నారు. ఇందుకు విరుద్ధముగా శ్రీయుత జయంతి రామయ్యగారు "ఈప ట్టణమునకు విజయనగరమనియు, విద్యానగరమనియు రెండు

* Nellore Inscriptions Vol. I Copper Plate No. 15.

వేళ్లు మొదటినుండి వాడుకలో నున్నట్లు శాసనముల వలనఁ గనబడుచున్నది. విద్యాస్థానమను నూహచే విద్యానగరమని యు, విజయమున కాకరమను నూహవలన విజయనగరమని యు నామములు కల్పింపఁబడిన ట్లూహింపఁదగియున్నది. విద్యారణ్యస్వాముల ప్రోత్సాహము వలనను, సాహాయ్యము వలనను గట్టినదగుటచే విద్యానగరమను పేరాపట్టణమునకు వచ్చినదని యొక వదంతి. అయినను గావచ్చును'' అని యొక చోటను, ,,హరిహరుఁడు ముందు కాలధర్మము నొందఁగా బుక్కరాజు రాజ్యభారము వహించి, 1380 వ సంవత్సరము వఱకు రాజ్యము చేసెను. తదనంతరమాతని కొడుకు, ఇమ్మడి హరిహరరాజు రాజయ్యెను. ఈతనిరాజ్యకాలమందే విజయ నగరపట్టణము కట్టినట్టు కనుపట్టుచున్నది'' అని మఱి యొకచోటను వారిచేత రచియింపఁ బడిన కర్ణాట రాజ్యకథా సారమనియెడు నొకవ్యాసములో వ్రాసియున్నారు.* వీరిట్లు వ్రాయుటయెగానియిందులకు హేతువులను గనుబఱచియుండిన యెడల వీరి యభిప్రాయము విశ్వసనీయ మని గ్రహింప వచ్చును. ఆనెగొందిపురవరాధీశ్వరుఁడైన విజయధ్వజుని కాలమునాఁడు విజయధ్వజుని పేరిటనేవిజయనగరమని యొక

*ఆంధ్రసాహిత్య పరిషత్పత్రిక ౭గవ సంపుటకము 3వ సంచికలో ౼కర్ణాటరాజ్య కథాసారము'' అనువ్యాసమును జదువునది.

పట్టణము గట్టఁబడియుండెననియు, నయ్యది విద్యారణ్యుల వారి ప్రేరణముచే విస్తరింపఁ జేయఁబడి విద్యానగరమని మఱియొక నామముంచఁబడి కర్ణాటరాజులకు రాజధానిగఁ జేయఁబడినదనియు రాయవంశావళియను గ్రంథమున నున్నదనియు సామ్రాజ్యచరిత్రమును వ్రాసినవారిలో నొకరగు శ్రీయుత బెంగుళూరు సూర్యనారాయణరావుగారు వ్రాసియున్నారు.*

కాఁబట్టి విజయనగరము విజయధ్వజుని కాలమునందనఁగాఁ బండ్రెండవ శతాబ్దిమధ్యమునఁ గట్టఁబడియెనా లేక రెండవ హరిహరరాయల కాలమునందనఁగాఁ బదునాలగవ శతాబ్దాంత్యభాగమునఁ గట్టఁ బడియెనా విద్యానగరమని పేరెప్పుడెట్లు వచ్చినది మొదలగు విషయములను జర్చించి సత్యములను దెలిసికొనుట కర్తవ్యము. వీరియభిప్రాయములు శాసనప్రమాణములతోఁ బోల్చి పరిశోధించినప్పుడెంత వఱకు విశ్వసనీయములుగ నుండఁగలవో చూతము గాక.

---

* 'Raya Vamsavali' ascribes the founding of Vizianagar to Vijayadhwaja, the second son of Chalukya Maharaja, who ruled in Kiskindha. Vidyaranya called the revived city Vidyanagar after his own name, and apparently must have ruled there without any king for about ten years." ("The Never To Be Forgotten Empire" page. 15.)

హరిహరరాయలును వానిసోదరుఁడు బుక్కరాయలును రాజ్యపరిపాలనము చేయుచున్న కాలమున నొకనాఁడు మృగయావినోదార్థము బయలు వెడలి తుంగభద్రానదికి దక్షిణపు టొడ్డున నున్న యరణ్యములో విహరించు చుండిరఁట! ఆప్రదేశమున నుండు కుందేళ్లకు జంకి వేఁటకుక్కలు పఱువిడుచుండుటఁ గాంచి యాశ్చర్యమందుచు నాసోదరు లిరువురు విద్యారణ్యస్వాముల వారికిఁ జెప్పఁగా నాప్రదేశమునఁ బట్టణము గట్టిన జయప్రదమగునని యామహాపురుషుఁడు సూచింపఁగా వారాప్రదేశమున నూత్ననగరమును నిర్మించి యాతని పేరిట విద్యానగరమని పేరుపెట్టి వ్యవహరించినట్లొక గాథ బహుశతాబ్దముల నుండి వాడుకలో నున్నది. దీనికి మాతృక లేక యూరక కల్పింపఁబడినగాథ కాదు. ఒక శాసన మీగాథకు నాధారమై యున్నది. హరిహరరాయలు విద్యానగరమునందు పట్టాభిషిక్తుఁడైన పిమ్మట క్రీ. శ. ౧౩౩౬-౩౭ వ సంవత్సరమున చంద్రగిరి రాజ్యములో పడనాటిసీమలో సువర్ణముఖినదీతీరమున నున్న కాపలూరు గ్రామమునకు హరిహరపురమని పేరుపెట్టి బ్రాహ్మణులకు ధారవోసి తామ్రశాసనము వ్రాయించెను. ఆశాసనమున పైగాథ యీక్రిందివిధముగాఁ దెలుపఁబడినది. "చంద్రవంశమున జనించిన సంగమరాజునకు నైదుగురు పుత్త్రులు గలరు. వారిలో జ్యేష్ఠుఁ

నైన హరిహరరాయలు కుంజరకోన (ఆనెగొంది)లో రాజ్యము చేయుచుండి యొకనాఁడు వేటనిమిత్తము సైన్యముతో బయలువెడలి తుంగభద్రను దాటిదక్షిణమున నున్నయరణ్యామునకుఁ బోయి విహరించుచుండ నొకకుందేలు మిక్కిలి శౌర్యముతో గుక్కపైఁ బడి కఱచుటనుగాంచి యచ్చెరువందెను. అప్పుడాతఁ డాక్షేత్రమును పుణ్యక్షేత్రమునుగా గ్రహించి విరూపాక్షదేవాలయముకడ నున్న విద్యారణ్యస్వామికి విన్నవించుకోఁగా నతఁడు 'రాజా! ఈప్రదేశము మిక్కిలి జయప్రదమైనది. ఇచట నొక నగరమును నిర్మించి విద్యానగరమని పేరుపెట్టి రాజధానిగఁ జేసికొని రాజ్యపరిపాలనముఁ జేసెదవేని నీకు శ్రేయస్సును నీరాజ్యమునకభివృద్ధియును గలుగు నని చెప్పఁగా హరిహరరాయలు విధేయుఁడై యామహనీయుని యాజ్ఞానుసారముగాఁ దరువాతను శా. శ. ౧౨౫౮ ధాతృనామ సంవత్సర వైశాఖ శుద్ధసప్తమినాఁడు పుష్యమీనక్షత్ర యుక్త సింహలగ్నమున శంఖు స్థాపనము గావించి పురనిర్మాణము గావించెను." పట్టాభిషేక మహోత్సవము జరిగిన పిమ్మట హరిహరధరణీపాలుఁడు పంపావిరూపాక్ష మహేశ్వరుని సన్నిధానమున విశ్వామిత్రగోత్రుఁడును, ఆశ్వలాయనసూత్రుఁడును ఋక్శాఖాబ్రాహ్మణుఁడు ను సంకు కేశవ భట్టు కుమారుఁడును నగు అనంతసూరనార్యు

నకు చంద్రగిరిరాజ్యములో పడనాటిసీమలో సువర్ణముఖీతీరమునకున్న కాపలూరుగ్రామమునకు హరిహరపురమని నామకరణమును జేసి యగ్రహారముగా ధారపోసి యీతామ్రశాసనము వ్రాయించెను. ఈశాసనము నందినాగరలిపిలో లిఖియింపఁబడియున్నను అక్షరములరచన యాధునికమైయుండుటయెగాక కొన్నియక్షరములు దేవనాగరియక్షరములను బోలియున్నవి. గనుక శాసనము కల్పితమని నెల్లూరుశాసనసంపుటములం బ్రచురించిన సంపాదకు లభిప్రాయ మిచ్చియుండుటచేఁ గాపలూరుశాసనము విశ్వాసార్హమైనది కాదనియు, పరమప్రమాణముగా గ్రహింపరాదనియుఁ జెప్పవత్తురేమో. దొరతనమువారి శాసనపరిశోధనాధికారిగనుండి కీర్తిశేషులైన రావుబహద్దరు వెంకయ్యగారీశాసనముంగూర్చి యేమి వ్రాసియుండిరో మనము తెలిసికొన్నపక్షమున కాపలూరుశాసనములోని విషయము లబద్ధములు గావనియు, ప్రమాణములుగాఁ గైకొనఁదగినవనియు బోధపడక మానదు. నెల్లూరుమండల ప్రాచీనచరిత్రమునందు వారిట్లువ్రాసియుండిరి.

‘‘మనయెదుటనున్న సంపుటములో విజయనగరమునకు సంబంధించినప్రాచీనశాసనము కాపలూరుశాసనమై యున్నది. (తామ్రశాసనము ౧౫౧) ఈశాసనము మొదటి హరిహరరాయల పరిపాలనములో శా. శ. ౧౨౫౮ ధాతృనామసంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౩౩౬–౩౭ వ సంవత్సరములో లిఖింపఁబడినది. ఈ సంవత్సరములోనే విద్యానగరము

నిర్మింపఁబడియెనని నన్నిజ్ వ్రాసియుండెను. తరువాతశాసనములనుబట్టి వంశమునకు మూలపురుషుఁడైన సంగముఁడు బుక్కరాజునకును మెంగాంబికకుఁ బుత్త్రుఁడని కాపలూరుశాసనము దెలుపుచున్నది. చంద్రవంశమున బుధుఁడు, ఆయువు, నహుషుఁడు, యయాతి, యదు మొదలగువారు జనించిరనియు, వారివంశమున జనించిన సంగమునకు గాలాంబికయను భార్యవలన హరియణ్ణ, కంపణ్ణ, బుక్కణ్ణ, మారణ్ణ, ముద్దణ్ణ అను నేవురు పుత్త్రులు జనించిరనియు, వారిలో జ్యేష్ఠుఁడైన హరిహరుఁడు అంగకళింగాదిదేశములను జయించి కుంజరకోనలో (సంపాదకులు చెప్పినట్లు ఆనెగొందికి సంస్కృతనామమగుట స్పష్టము) నుండి భూపరిపాలనము చేయుచుండెననియుఁ జెప్పఁబడినది. ఆనెగొంది తుంగభద్రానదికి నుత్తరపుటొడ్డున నుండెను. విద్యానగరముయొక్క శిథిలమైన ప్రదేశములన్నియు దానికెదురుగ దక్షిణపుటొడ్డును జేరియున్నవి. ఒకప్పుడు హరిహరరాజు వేటకొఱకు బయలుదేఱి నదినిదాఁటి నదికిదక్షిణమున నొక యరణ్యమునుగాంచెనని శాసనము దెలుపుచున్నది. అచ్చటనొకకుందేలు వేటకుక్కను మార్కొనుటగాంచి విద్యారణ్యాశ్రమమునకుఁబోయి యావింతసమాచారమును దెలిపి యందులకేమిహేతువని ప్రశ్నించెను. అయ్యది రాజాధిరాజులకు నిలయముగానుండఁదగినప్రదేశమని యామహానుభావుఁడు దెలిపెనఁట. అందుమీఁద నతఁడు విద్యానగరమును నిర్మించెను. పట్టాభిషేకమైనపిమ్మట రాజు కాపలూరుగ్రామము నగ్రహారముగా నొసంగెను. ఈశాసనకాల మిది యనుకుఁ గానుపించిన హరిహరుని శాసనకాలముకంటె మూఁడుసంవత్సరములు పూర్వపుదిగా నుండెను. లిపిలోని భేదమునుబట్టి యీశాసనము విశ్వసనీయమైనదికాదని సంపాదకులనుమానించుచున్నారు.

మొదటిసంగమునితండ్రి రైసుగారు ప్రచురించిన మూఁడుతామ్రశాసనములలోను దెలుపఁబడియుండెను. అందొకశాసనము మొదటిహరి

హరుని కాలములోనిది. తక్కిన రెండుశాసనములును మొదటిబుక్కరాయని కాలములోనివి. ఇచ్చట సంగముని భార్యయు, తల్లియు పేరులు కొంచెము మార్పుతోనున్నవి. మొదటిశాసనముయొక్క మాతృక గన్పట్టలేదుగాని దానినకలునుమాత్రము రైసుగారు ప్రచురించిరి. కాపలూరుశాసన మేసంవత్సరమున జనించినదో యీశాసనము నాసంవత్సరముననే జనించినది. తక్కిన రెండుశాసనములయొక్కకాలము శా. శ. ౧౨౬౬ తారణసంవత్సరమునకు సరియైన క్రీ. శ. ౧౩౪౪-౪౫ దవ సంవత్సరముగానున్నది.

కడపటి రెండుశాసనములలోను ప్రతిగ్రహీతయజుశ్శాఖీయుఁడును, ఆపస్తంబసూత్రుఁడును, భారద్వాజగోత్రుఁడును నగు సోమయయనునాతఁడు. అతఁడు నాచనపుత్రుఁడును, సకలాగమవేదియు, అష్టాదశపురాణాభిజ్ఞార్థవేదియు, అష్టభాషాకవిత్వశ్రీయు నగువాఁడుగా నుండెను. ఇతఁడాంధ్రకవియైన నాచనసోముఁడుగాఁబోలు! మొదటి శాసనమైన బాగేపల్లిశాసనములోని మొదటిశ్లోకమునుండి యిరువదియెనిమిదవశ్లోకమువఱకును కాపలూరుశాసనములోని రెండవశ్లోకము మొదలుకొని యిరువదితొమ్మిదవశ్లోకమువఱకునుగల శ్లోకములకు భేదమేమియును లేక యొక్కరీతినే యుండి విద్యారణ్యస్వాముల ప్రేరణమున హరిహరరాయలచే విద్యానగరము నిర్మింపఁబడినదని తెలియజేయుచున్నవి. కడపటి రెండుశాసనములుకూడ విద్యానగరము విద్యారణ్యకృతమని తెలుపుచున్నవి. కాపలూరుశాసనములోను రైసుగారుప్రచురించినశాసనములోను నగరనిర్మాణమునుగూర్చి వ్రాయఁబడినగాథ పదునాలవశతాబ్దిలో ప్రథమభాగకాలమున నయితము వాడుకలోనుండెను. పోర్చుగీసుచరిత్రకారుఁడయిన ఫెర్నావోనిజ్ విద్యానగరనిర్మాణమునుగూర్చి యిదే గాథను దెలిపియున్నాఁడు. కాపలూరుశాసనమేసంవత్సరమునఁబుట్టినదో యాసంవత్సరముననే బాగేపల్లిశాసనము పుట్టినది. దానిమాతృక గాన

రాదు. రెంటిలోను దానమిచ్చుభాగమువఱకు భేదమేమియును గానుపింపదు. ఆశాసనములలో దానముచేయఁబడిన గ్రామములు భిన్నములై భిన్నరాజ్యములం దున్నవి. అనఁగా ఎరగుడిగ్రామము ఘనశైలరాజ్యము (పెనుగొండరాజ్యము) లోనిది. కాపలూరు చంద్రగిరిరాజ్యములోనిది. ఈశాసనము లొకదానిఁజూచి మఱియొకటి వ్రాయఁబడి యుండవలయును. కాదేని యీరెంటికిని మాతృక మఱియొకటి యుండవలయును. కాఁబట్టి మాతృక రాయలగ్రంథభాండారమునఁ బదిలపఱచి యందలి యుపోద్ఘాతమాత్రము ప్రతిశాసనమునందును జేర్పఁబడుచు నుండవలయును. ఈయుపోద్ఘాతము రాయల యాస్థానకవులచే రచింపఁబడియుండవలయును. మొదటి హరిహరరాయల కాపలూరుశాసనమువలెనె మొదటి బుక్కరాయలశాసనములు రెండును నందినాగరలిపిలోనుండుట యొక ముఖ్యాంశము. బుక్కరాయలశాసనములను లిఖియించినవాఁడు నాగిదేవుఁడు. అతఁడే ఎరగుడిశాసనమును పెద్దక్కరములతో వ్రాసినవాఁడు. కాఁబట్టి మాతృకగానరాకపోయినను ఎరుగుడిశాసనము క్రమమైనదని యూహింపనవకాశ మిచ్చుచున్నది. అందువలన కాపలూరుశాసనములోని విద్యానగరనిర్మాణమునుగూర్చిన గాథసైతము విశ్వసనీయమైనదిగా నిర్ధారింపఁబడుచున్నది. సంగమునితండ్రి బుక్కరాజయినను అతనిభార్య పేరు గాలాంబికయైనను లేక మేళాంబికయైనను అతనితల్లిపేరు మెంగాంబికయైనను మేగాంబికయైనను చరిత్రపరిశోధకుఁ డంతగాఁ బాటింపవలసినపనిలేదు.''

ఇట్లు రావుబహదరు వెంకయ్యగారు విద్యానగరము విద్యారణ్య కృతమని తెలుపుచున్న శాసనములు క్రమమైన వని ఋజువు చేసియున్నారు. ఇంతియగాక బుక్కరాయల కాల

ములో అనఁగా క్రీ. శ. ౧౩౪౪-౪౫ దవ సంవత్సరమున లిఖియింపఁబడిన శాసనములో

„విద్యాభిదాన నగరీ విజయోన్నతిశాలినీ
విద్యారణ్య కృతాౕతస్యాం రత్నసింహాసనే స్థితః”

అను వాక్యములు గన్పట్టుచున్నందున విద్యానగరము విద్యారణ్య కృతమనివిస్పష్ట మగుచున్నది.మఱియును శా.శ. ౧౨౬౪ లో (౧౩౫౨) బుక్కరాయలు ద్వారసముద్రము రాజధానిగా హొయిసలరాజ్యమును బరిపాలించుచున్నట్లును, అక్కడనుండి హొసపట్టణమునకును, అచ్చటినుండి విద్యానగరమునకును రాజధానిని మార్చుకొన్నట్లు గన్పట్టుచున్నది. శా. శ. ౧౨౭౬ లో (౧౩౫౪) హొయిసన దేశములోని హొసపట్టణమునుండియె రాజ్యపరిపాలనము చేయుచుండెను*

అయినను శా. శ. ౧౨౭౭ లో (౧౩౫౫) తుముకూరు జిల్లాలోని పావగడతాలూకాలోనియొక శాసనమువలన విద్యానగరములోని రత్నసింహాసన మధిష్ఠించియుండి మొదటి బుక్కరాయలు పరిపాలనముచేయు చుండినట్లు తేటపడుచున్నందున నాసంవత్సరాంతముననే బుక్కభూపతి రాజధాని హొసపట్టణమునుండి విద్యానగరికి స్థిరముగా మార్చుకొని యుండవలయు నని విదిత మగుచున్నది.*

---

* Ep. Carn Vol XI cd Nos 2 and 3
* Ep. Carn, Vol XII P. G. 74

ఇట్లు వెక్కుశాసనముల వలనను, చరిత్రగ్రంథముల వలనను, స్థానిక గాథలవలనను విద్యానగరము విద్యారణ్యస్వామి ప్రేరణముచే మొదటి హరిహరరాయలవలన నిర్మింపఁబడినదనియును, రెండవ హరిహరరాయలకుఁబూర్వమె మొదటిహరిహరునకు మొదటి బుక్కరాయలకు రాజధానిగ నుండెనని స్పష్టముగాఁ గన్పట్టుచుండ జయంతి రామయ్యగారు విద్యానగరము లేక విజయనగరము రెండవహరిహరరాయల కాలమునందే కట్టఁబడినట్లు కనుపట్టు చున్న దని వ్రాయుట వింతగా నున్నది. విద్యానగర నిర్మాణమునుగూర్చిన వీరి యభిప్రాయము విశ్వసనీయ మైనది కాదని నిస్సంశయముగాఁ జెప్పవచ్చును.

## మాధవ విద్యారణ్యస్వామి.

ఆది శంకరుల తరువాత శంకరాచార్య పీఠమునకు వచ్చినవారిలో మాధవాచార్యులకుఁ బూర్వమునందుఁగాని పరమునందుఁగాని యింతటి పండితులు మఱియెవ్వరును లేరని చెప్పుదురు కాని యీమహాత్మునకుఁ బూర్వము జగద్గురుపీఠము నధిష్ఠించి నట్టి విద్యాతీర్థులు విద్యారణ్యునికంటె నధికుఁడును గురువునై యుండెను. విద్యాతీర్థులనే భారతీతీర్థులనికూడ నందురు. మాధవుఁడు తుంగభద్రాతీరమునఁ బం

పాక్షేత్రమున జనించె నని చెప్పుదురు. మాధవుఁడు యజుశ్శాఖీయుఁడును, భారద్వాజగోత్రుఁడును, బోధాయనసూత్రుఁడు నగు మాయణుఁ డను బ్రాహ్మణునకును, శ్రీమతి యను నామెకును జనించిన జ్యేష్ఠ పుత్త్రుఁడు. ఈయనకు సాయన, భోగనాథు లనువారు సోదరులుగా నుండిరి. ఈమహాపురుషుఁడు తురీయాశ్రమము నెప్పుడు స్వీకరించెనో స్పష్టముగఁ దెలియదుగాని మొట్టమొదట నీతఁడు ప్రథమహరిహరబుక్కరాయలకు మంత్రిగను, హితబోధకుఁడుగనుండి విజయనగర సామ్రాజ్య స్థాపనకుఁ దదభివృద్ధికిని కారణభూతుఁ డగుటయే గాక వేదభాష్యాద్యుద్గ్రంథములను రచించి వైదికమతము నుద్ధరించెను. మాధవసాయణు లిరువురు సంస్కృతభాషలో నున్న శాస్త్రము లన్నింట నపారపాండిత్యము గలవారుగానుండిరి. వీరిరువురును గలిసి రచించిన గ్రంథముల సంఖ్యనూటికిఁ బైఁగా నుండును. శ్రౌతము, స్మార్తము, వేదాంతము, ధర్మశాస్త్రము, మీమాంసము, జ్యోతిషము, వ్యాకరణము చరిత్రము మొదలగు విషయములనుగూర్చి యుద్గ్రంథములను వ్రాసియుండిరి. వీనిలో వేదభాష్యము ప్రధానమైనది. దీనికి సాయన భాష్యమని పేరుగలదు. శృంగేరీపీఠము నధిష్ఠించిన విద్యాతీర్థు లనుమహాపురుషునిప్రసాదముననే తాను వేదభాష్యమును రచింపఁగలిగితి నని సాయనాచార్యులు చెప్పు

కొనియెను. తన గురువులైన విద్యాతీర్థులను విద్యారణ్యులవారు తాము రచించిన గ్రంథములలో—

"యస్యనిశ్వసితం వేదాః యో వేదేభ్యోఽఖిలం జగత్
నిర్మమే తమహం వందే విద్యాతీర్థమహేశ్వరమ్."

అని గురుస్తుతి యొనర్చుటఁజూడ నాయన విద్యారణ్యుని కంటెను మహిమాఢ్యుఁ డని బోధపడఁగలదు. మాధవుఁడు ప్రథమ హరిహరబుక్కరాయలకు మంత్రిగ నున్నట్లు సాయణుఁడును బుక్కరాయల యన్నకొడుకగు సంగమునకును తరువాత రెండవహరిహరరాయలకును మంత్రిగ నుండెను. ఇట్టి ప్రసిద్ధపురుషులజీవితచరిత్ర విషయమునఁ జర్చనీయాంశము లనేకములు గలవు. వాని నన్నిటిని గ్రంథవిస్తరభీతిచే వివరించుట మానుచున్నాఁడను. "మాధవాచార్యులే విద్యారణ్యులయి యుండిన నుండవచ్చును గాని యవునని చెప్పుటకుఁ దగిన యాధారములు నాకింతవఱకు దొరకలేదు. మాధవాచార్యకృత గ్రంథములు కొన్నియు, విద్యారణ్యకృత గ్రంథములు కొన్నియుఁ గనఁబడుచున్నవి" అని శ్రీయుత జయంతి రామయ్యగారు తమ 'కర్ణాటరాజ్యకథాసారమున' వ్రాసిన వాక్యమువిద్యానగరనిర్మాణమునుగూర్చివ్రాసిన వాక్యమువలెనె వింతగఁ గనుపట్టుచున్నది. మాధవాచార్యులు తాను సన్న్యాసమును స్వీకరించకమున్ను, పరాశరస్మృతి

వ్యాఖ్యానము, మనుస్మృతి వ్యాఖ్యానము, వేదభాష్యములు, జైమినీన్యాయమాల విస్తారము, కాలమాధవ్యము, వ్యవహార మాధవ్యము, శంకరవిజయము, సర్వదర్శనసంగ్రహము, మొదలగు గ్రంథములను రచించె నని చెప్పుదురు. ఈగ్రంథములలోఁ గొన్నిటఁ దన గోత్రమును తండ్రి పేరును జెప్పుకొనియెను గాని సన్న్యాసమును స్వీకరించిన తరువాత చెప్పిన గ్రంథములలో నీపద్ధతిని బుద్ధిపూర్వకముగా విడిచిపెట్టెను. సాధారణముగా నీయన గ్రంథములలో మొదట "వాగీశాద్యాస్సుమనసః" అను శ్లోకము వ్రాయఁబడుచుండెను. ఆయన 'జైమినీయన్యాయమాల' విస్తర వ్యాఖ్యానములో పైనుదాహరించిన ముద్రభూత శ్లోకము తనచే రచియింపఁబడిన దని తెలిసికొనుటకు గుర్తుగా తన గ్రంథములలోఁ బ్రయోగింపఁబడిన దని వ్రాసికొనియెను. సన్న్యాసమును స్వీకరించిన తరువాత వేదాంతపంచదశి, వివరణప్రమేయసంగ్రహము, బ్రహ్మవిద్యాశీర్వాదపద్ధతి, జీవన్ముక్తివివేకము, దేవీ అపరాధ స్తోత్రము, మొదలగు గ్రంథములను రచించెను. వీనిలో కులగోత్రనామములను దెలుపుకొని యుండలేదు. ఆధ్యాత్మిక గురువైన విద్యాతీర్థులను, శంకరుని మాత్రము పేర్కొని యుండెను. ధర్మశాస్త్రవిషయమునఁ బరాశరమాధవీయమును, వేదాంతవిషయమున విద్యారణ్యకృత పంచదశియు,

చరిత్రవిషయమై శంకరదిగ్విజయమును, దర్శనవిషయమున సర్వదర్శన సంగ్రహము, జైమినీన్యాయమాల యను గ్రంథములును, మన దేశములో విద్వాన్మాన్యములై ప్రఖ్యాతము లై యున్నవి. మ్లేచ్ఛుల దాడులవలన దేశమరాజకమగుటను గాంచియు, శ్రౌతస్మార్తకర్మములు నశించుచుండుటయు వైదికమతము జైనజంగమయవనాది మతములచే ఖండింపఁబడుచుండుటయుఁ దలపోసి స్వదేశ స్వమతముల నుద్ధరించుటకై కేవలము నిరపేక్ష బుద్ధితో నొక హిందూమహాసామ్రాజ్యమును స్థాపించి వర్ధిల్లఁజేసి యద్వితీయ మహాపురుషుఁడై శృంగేరిలోని జగద్గురు పీఠము నలంకరించిన యీ మహానుభావుఁడు నూఱేండ్లకంటె నెక్కుడు కాలము జీవించి యుండి ౧౩౮౬వ సంవత్సరమున బ్రహ్మైక్యమునుగాంచెనని తెలియుచున్నది.

## ప్రథమ హరి హరరాయలు

(౧౩౩౬ మొదలుకొని ౧౩౫౫ వఱకు)

యదువంశమున జనించిన సంగమరాజ పుత్త్రుఁడగు నీప్రథమ హరిహర రాయలు ౧౩౩౬ వ సంవత్సరమున విద్యానగరమునఁ బట్టాభిషిక్తుఁడైనట్లు గన్పట్టుచున్నది. ఇతఁడు సింహాసనమెక్కిన కాలమున మూఁడవ బల్లాలదేవుఁడు హొయిసలరాజ్యమును (కర్ణాటరాజ్యమును) బరిపాలనము చేయుచుం

డెను. ౧౩౨౭ వ సంవత్సరములో మహమ్మదుతుఘ్లఖ్ దండెత్తివచ్చి రాజధానియైన ద్వారసముద్రమును ముట్టడించి నాశనము గావించెను. అంతట బల్లాలదేవుఁడు స్వరాజధానిని దక్షిణార్కాడు మండలములోని తిరువణ్ణామలకు మార్చుకొనియెను. మూఁడవ బల్లాలదేవుఁడు ౧౩౪౨-౪౩ వఱకు రాజ్యపరిపాలనము చేసియుండెనుగాని పూర్వపు ఔన్నత్యమంతయును గోల్పోయి పేరునకు మాత్రము చక్రవర్తిగ నుండెను. వానికొడుకు నాలుగవ బల్లాలదేవుని శాసనము లొకటి రెండు గన్పట్టుచున్నవి గాని యతఁడు స్వతంత్ర పరిపాలనము చేసెనని విశ్వసింప నాధారము గన్పట్టదు. మూఁడవబల్లాలదేవుఁడు రాజధానిని ద్వారసముద్రము నుండి తిరువణ్ణామలకు మార్చుట మహమ్మదీయుల దాడివలనఁ గాక హరిహరరాయలయొక్కయు, బుక్కరాయలయొక్కయు భయముచేతఁగూడనైయుండును. అప్పటికే హొయిసల సామ్రాజ్యము నానాటఁ గృశించి సన్నగిలిపోవు చుండెను. హరిహర రాయలు తాను సింహాసన మెక్కునప్పటికే తానును తనసోదరులును హొయిసలరాజ్యములోఁ జాలభాగము నాక్రమించుకొని యుండిరి. విద్యానగరమున రత్నసింహాసన మధిష్ఠించిన తరువాత హరిహరరాయలు తనరాజ్యమును నలుప్రక్కల విస్తరింపఁజేసెను. ఇతనికి హొయిసల బల్లాలదేవునికి నెట్టిసంబంధము గలదో

శాసనాధారము లేవియులేవని తెలుపుచు హరిహరుఁడుమూఁడవబల్లాలదేవునికి లోఁబడిన సామంతుఁడని మార్షల్ గారెట్లూహింపఁ గలిగిరో విదితము గాక యున్నది. *

౧౩౪౬ వ సంవత్సరము నాఁటికి హొయిసల రాజ్యమంతయు హరిహరరాయలచే జయింపఁబడి నూత్నకర్ణాటసామ్రాజ్యమునం జేర్పఁబడి యుండెను. హరిహరునకు రెండవ తమ్ముఁడైన బుక్కన్నయను బుక్కరాయలు యువరాజుగఁ జేయఁబడియెను. తనయన్న మరణమునొందు వఱకు బుక్కరాయలన్నతోఁగలిసి పరిపాలనము చేసినట్లు శాసనములవలనఁ దెలియుచున్నది. తమ్ములు నల్వురును తనకు విధేయులై చెప్పినరీతిని బ్రవర్తించు చున్నందున హరిహరరాయలు రాజ్యమునువిస్తరింపఁ జేయుట కనువయ్యెను. సోదరులలోనిట్టి యైకమత్యము కుదిరి యుండుటచేతనే వీరలు మహమ్మదీయులు మొదలగు వారిని జయించి రాజ్యమును విస్తరింపఁజేయఁ జాలిరి. ఇతఁడు తెలుఁగు దేశములోని యుదయగిరి రాజ్యమును, చంద్రగిరి

* It is not ascertained as yet from epigraphical records what definite position these 2 chiefs held under the Hoysals, but that they were powerful enough to exercise much influence in the Hoysala kingdom long before they could declare their independence is proved by certain known facts. (Marshall's Report 1907—08. pp. 235)

రాజ్యమును, పెనుగొండరాజ్యమును జయించెను. ౧౩౪౮ గవ సంవత్సరమునఁ దురుష్కులకును హిందువులకును జరిగిన యుద్ధములోఁ బ్రతాపరుద్రుని పుత్త్రునికిఁ దోడ్పడఁ బెక్కు సైన్యములతోఁ దన పెద్దతమ్ముఁడగు కంపభూపతిని బంపెను. ఆయుద్ధమున హిందువులుజయించి తురుష్కులను ఏకశిలానగరమునుండి తఱిమివేసిరి. హరిహర రాయలు తన పెద్దతమ్ముఁడగు కంపభూపతిని ఉదయగిరి రాజ్యమునకుఁ బాలకునిగా నియమించెను. ఈయుదయగిరి రాజ్యమునఁ బాకనాటివిషయమును, ములికినాటి విషయమును జేరియుండెను. ౧౩౪౬ వ సంవత్సరమునకంప రాయలకు మంత్రిగనున్న ముద్రిసిద్ధిశాయన్న యొడయలు గావించిన దానశాసనమునుబట్టి కంపరాయలీరాజ్యమును బరిపాలనము చేయుచున్నట్లు తెలియుచున్నది. కంపరాయనిశాసనము లెచ్చటను గానరానందునను ౧౩౫౭వ సంవత్సరమున నీతనికుమారుఁడగు సంగముని శాసనము గానంబడు చున్నందునను, హరిహర రాయలకుఁ బిమ్మట బుక్కరాయలె రాజ్యాధిపత్యము వహించినందునను నీతఁడు హరిహరునకు ముందుగానే మరణము నొంది యుండవలయును. సంగమ రాజపుత్త్రులగు హరయన్న, కంపన్న, బుక్కన్న, మారన్న, ముద్దన్న అను నేవురును బంచపాండవులవలె నైకమత్యము గలిగి దిగ్విజయము గావించి సామ్రాజ్యము ప్రవర్ధ

మానముగునట్లు చేసిరి. ఈసోదరు లేవురును బల్లప్పదండనాయకుఁడును కుమార శ్యామన్న యొడయలును గలిసి దిగ్విజయ జ్ఞాపకార్థము శా. శ. ౧౨౬౮ పార్థివ సంవత్సర ఫాల్గుణ బహుళ పాడ్యమినాఁడు. (౧౩౪౬)శృంగేరి పీఠాధిపతి భారతీ తీర్థ శ్రీపాదులకును, వారిశిష్యులకును, నలువండ్రు బ్రాహ్మణులకును తొమ్మిది గ్రామములను దానములను జేసియుండిరి. కావున నాసోదరు లేవురు నైకమత్యముతో నుండిరనియు, హరిహరునికి లోఁబడి నల్వురు తమ్ములు స్వతంత్రపరిపాలనము చేయుచుండిరని మనమూహింప వలయునే గాని పరస్పరము సంబంధములేక యెవరికివారు స్వతంత్రులై పరిపాలనము చేయుచుండిరని తలంపరాదు.

ప్రథమ హరిహరరాయలు రాజ్యపరిపాలనము చేయుకాలముననే యోరుగల్లునుండి ఢిల్లీచక్రవర్తి సైన్యములను వెడలఁగొట్టిన తరువాత మూఁడు సంవత్సరములకుఆనఁగా ౧౩౪౭ వ సంవత్సరములో చక్రవర్తి సైన్యాధిపతులలోనొక్కఁడగు హసన్‌గంగూ అను నాతఁడు స్వతంత్రుఁడై బహమనీరాజ్యమును స్థాపించి అల్లాఉద్దీన్ షాహా అను బిరుదునామముతో దక్కను దేశమునఁ బరిపాలనము చేయనారంభించెనని ప్రథమ ప్రకరణమునఁ దెలిపియున్నాఁడను. బహామనీ రాజ్యము స్థాపింపఁబడిన వెనుక విజయనగరసామ్రాజ్యాధీశ్వరులును

బహామనీ సుల్తానులకును యుద్ధములు జరుగుచువచ్చెను. అనేకయుద్ధములలో తురుష్కులను హరిహరరాయలు జయించినట్లు శాసనములంబట్టి తెలియుచున్నది. ఈప్రథమ హరిహరరాయలు ౧౩౫౪ లో రాజ్యపరిపాలనము చేయుచున్నట్లొక శాసనములో గన్పట్టుచున్నందున ౧౩౫౫వఱకు బదునెనిమిది సంవత్సరములు పరిపాలనము చేసెనని యూహింపవచ్చును. అల్లాఉద్దీన్‌షాహా ౧౩౫౮ వఱకుఁ బరిపాలనము చేసెను. కాఁబట్టి వీరుభయులును సమకాలికులనిచెప్పుట కెంతమాత్రమును సందియములేదు*. హరిహరరాయలు ౧౩౪౩ వఱకు మాత్రమె జీవించియుండెనని స్యూయలుగారు వ్రాసినది విశ్వసనీయముగాదు. మఱికొందఱు హరిహరరాయలు ౧౩౬౧ వఱకు జీవించి యుండిరని వ్రాసిరి. అదియును విశ్వసనీయముగాదు.

---

* Ep. Carn Vol VIII Sb. 104.

Archaeological Survey of India. 1907-08 The irst Vizianagar Dynasty, Viceroys and Ministers. age 240.

(A Jaina Sasana dated S. 1276 (Vijaya) or .D 1354 from Soraba, distinctly says that in that ear when Mahamandaleswara Hariappaodeyar vas ruling the kingdom. Malagowda died and is wife Chennakka went to swurga (heaven) by er sahagamana (seti)

విద్యానగరము నిర్మింపఁబడిన తరువాత దక్షిణీ సుల్తానుల దౌర్జన్యములకుఁ దాళఁజాలక స్వదేశములను విడనాడి వచ్చిన యాంధ్రకర్ణాటకుల కెల్లరకు రక్షక స్థానమై క్రమాభివృద్ధి నొందుచు దక్షిణ హిందూదేశమున విశేష ప్రాముఖ్యమును గాంచి మహమ్మదీయుల కభేద్యమై యొప్పుచుండెను. హరిహర దేవరాయలు సింహాసన మధిరోహించిన వెనుక క్రమముగా మహిశూరము, కన్నడము, వనవాసి (జయంతి) మొదలగు సీమలను జయించి రాజ్యమును విస్తరింపఁ జేసెను. మఱియు బాదామికోటను బలపఱిచెను. ఇతఁడు విద్యానగరమునందుండి బరకూరు మొదలగు సీమలను బరిపాలించుచుండఁ బెద్దతమ్ముఁడైన కంపభూపతి యుదయగిరిరాజ్యమును, రెండవతమ్ముఁడైన వీరబుక్క భూపతి మధ్యదేశమును మూఁడవ తమ్ముఁడైన మారభూపతి వనవాసిదేశమును, బరిపాలనము చేయుచుండిరి. హరిహరదేవరాయలు బహుభూము లాక్రమించుకొని ప్రతినిధి పాలకులను నియమించి మహారాజ పదవి యందున్నను మూఁడవ బల్లాలదేవుఁడు బ్రదికి యున్నంతవఱకును మహామండలేశ్వరుండనని మాత్రమె చెప్పుకొనుచు దేశమునకు నెమ్మది కలిగించి చక్కనిస్థితికిఁ దీసికొని వచ్చెను. కన్నడదేశమునందలి ప్రాచీన జైన ప్రభువులను బోఁచుచుకొని యాదేశమునఁ బన్నులు రాఁబట్టుకొనుటకు కొఱకుఁ జక్కనిపద్ధ

తుల నేర్పఱిచెను. కన్నడదేశమునందలి సముద్ర ప్రాంత భూముల నాక్రమించుకొన్న యరబ్బులను జయించి వారివలనఁ గప్పముఁ బడయుచుండెను. ఇతఁడీనూత్నకర్ణాట సామ్రాజ్యము నేలుచున్న కాలమున జనుల మానప్రాణ ధనంబులకు రక్షణము గలిగి యుండెను. వాణిజ్యము పెంపొందినది. దారి దోపిడులు దొంగతనములు తగ్గిపోయినవి. వసుంధర సర్వసస్యాఢ్యయై వఱలుచుండెను.

## నాచన సోముఁడు.

ఆంధ్రమున నుత్తరహరివంశకావ్యమును రచించి ప్రఖ్యాతుఁడైన మహాకవి నాచనసోముఁడు హరిహరబుక్కరాయల కాలముననుండెను. నాచనసోముఁడనెడికవి యెఱ్ఱాప్రగడ కిరువదిముప్పదిసంవత్సరముల తరువాత నున్నవాఁడని యాంధ్రకవుల చరిత్రమునందు వ్రాయఁబడియుండెనుగాని యెఱ్ఱాప్రగడకు నాచనసోముఁడు సమకాలికుఁడని స్పష్టముగా బుక్కరాయని శాసనములంబట్టి తెలియుచున్నది. యజుశ్శాఖాబ్రాహ్మణుఁడును, ఆపస్తంబసూత్రుఁడును, భారద్వాజగోత్రుఁడును; నాచనవంశాంబుధిచంద్రుఁడును,సకలాగమవేదియును, అష్టాదశపురాణనామాభిజ్ఞాతార్థవేదియును, అష్టభాషాకవిత్వశ్రీయుతుఁడు, నగుసోమయాఖ్యునకు సంగమరాజపుత్త్రుఁడగు బుక్కరాయలు పంపాతటంబునందలి భాస్కరక్షేత్రం

బునందుండిన శ్రీవిరూపాక్షస్వామిసన్నిధిని శా. శ. ౧౨౬౬ తారణసంవత్సర చైత్రశుద్ధ ౯ నాఁడు పినాకినీతటమునందలి పంచాకలదిన్న యను గ్రామమునకు బుక్కరాయపుర మని నామాంతరమును గల్పించి ధారపోసి శాసనము వ్రాయించెను. నాచనయనునది ప్రసిద్ధపురుషుని నామమైయుండును. ఆతనివంశమునందు సోముఁడు జనించెనుగావున నాచన సోముఁడని వ్యవహరింపఁబడుచున్నాఁడు. నాచనయింటిపేరు మాత్రమెగాక యితని తండ్రిపేరు నాచిరాజని యాంధ్రప్రబంధములయందు వ్రాయఁబడియున్నది. ఒకవేళ యింటిపేరు నాచిరాజువారనియైనం జెప్పవచ్చును. పిల్లలమఱ్ఱిపినవీరనశృంగారశాకుంతలమున కవిస్తుతిపద్యములో "నాచిరాజుని సోము" అని ప్రశంసించియున్నాఁడు. కూచిమంచి జగ్గకవి సుభద్రాపరిణయమునందు "నాచిరాజుసోముని" యనినుడివియున్నాఁడు. ఆఱువేలనియోగియైన కోవెల గోపరాజు,

చ॥ అనఘుహుళక్కిభాస్కరు మహామతిపిల్లలమఱ్ఱి పెద్దిరా
జును చినవీరరాజు కవిసోముని తిక్కనసోమయాజి కే
తనకవిరంగనాథు నుచితజ్ఞుని నెఱ్ఱననాచిరాజు సో
మన నమరేశ్వరుం దలఁతు మత్కులచంద్రుల సత్కవీం
ద్రులన్"

అని 'నాచిరాజుసోమన' యని వచించుటయెగాక "మత్కు

లచందు్రి' లని అనఁగా నియోగులనికూడ వ్రాసియున్నాఁడు. దీనిం బురస్కరించుకొని నామిత్రులొకరు ఆంధ్రపత్రిక సంవత్సరాదిసంచిక ప్రథమసంపుటములో నేనీకవింగూర్చి "ఇతఁడాంధ్రకవులచరిత్రమునందు నియోగియని చెప్పఁబడినను ఈశాసనమునం దితఁడు నియోగియో వైదికుఁడో స్పష్టముగాఁ జెప్పియుండకపోయినను వైదికుఁడనియె యూహించుటకాస్పదములైన వాక్యములే గానవచ్చుచున్నవి" అని వ్రాసిన వాక్యముల నధిక్షేపించియున్నారు. ఆంధ్రపత్రికయందు నేనువ్రాసినది భ్రాంతిమూలమైనది. ఈకాలమునందువలెఁ గాక యాకాలపు నియోగిబ్రాహ్మణులుకూడ కొందఱు వైదికబ్రాహ్మణోత్తములవలెనె వైదికమార్గనిష్ఠాపరులై వేదవేదాంగవేత్తలై యుండినది వాస్తమనుటకు తిక్కనసోమయాజి మొదలగువారిని దృష్టాంతముగఁ జూపవచ్చును. ఈమహాకవి తనకావ్యమును హరిహరనాథున కంకితమిచ్చుటచేతను, "ఇది బుధారాధనవిరాజి కొమ్మనామాత్యపుత్ర తిక్కనసోమయాజిప్రణీతభారతకథానంతరమున' అని గద్యయందుఁ దిక్కనయెడ గౌరవభావమును దెలిపియుండుటచేతను, నెల్లూరుమండలవాసియని చెప్పవచ్చును. పైశాసనము నాటికివిద్యానగరి విద్యారణ్యునిచే నిర్మింపఁబడినదనియును పంపాతటమున భాస్కరక్షేత్రమున విరూపాక్షదేవుని సన్నిధిని నాచన

సోమునకు బుక్కరాయపురమును ధారవోసెననియుఁ జెప్పి యుండుటచేతఁగూడవిద్యానగరనిర్మాణమును గూర్చిజయంతి రామయ్యగా రిచ్చినయభిప్రాయము సరియైనదికాదని స్పష్టముగాఁ దెలియుచున్నది. విద్యానగరము నూతనముగా నిర్మింపఁబడి కర్ణాటరాజ్యము మెల్ల మెల్లగ వర్ధిల్లుచుండుటచేత నాచనసోముఁడు నెల్లూరును విడిచి విద్యానగరముఁ జేరుకొని "శ్రీమత్సకలభాషాభూషణరసపోషణసంవిధానచక్రవర్తి" యగుటం జేసి బుక్కరాయనిచే సమ్మానింపఁ బడియెను. అప్పటికితఁ డుత్తరహరివంశమును రచియించెనో లేదో తెలియదు. ఎఱ్ఱాప్రగడయును నాచనసోముఁడును సమకాలికులు గావున నుభయులలో నెవరిగ్రంథము ముందురచింపఁ బడినదో చెప్పుట సాధ్యముకాదు. కాని యెఱ్ఱాప్రగడవిరచితమైన హరివంశమును విన్నమీఁదట నది ప్రౌఢముగ లేదను తలంపుతో నుత్తరహరివంశమును వ్రాసెనని యూహించుటకు గద్యములో "శ్రీమత్సకలభాషాభూషణ రసపోషణసంవిధానచక్రవర్తి" అని పెట్టుకొన్న పెద్దబిరుదములే యవకాశమిచ్చుచున్నవి.

నాచనసోమనాథునికవిత్వము :- మిక్కిలి ప్రౌఢమైనది. మహాకవి కవిత్వ పటుత్వసంపదను బట్టి యీతనికి సర్వజ్ఞుఁడను బిరుదు పేరువచ్చినది. అట్లనుటకు సందేహింపం

## పదునొకండవ ప్రకరణము.

---

### వీరబుక్కరాయలు.

(౧౩౫౫ మొదలుకొని ౧౩౭౭ వఱకు)

మొదటి హరిహరదేవరాయలు ౧౩౫౫దవ సంవత్సరమున మృతి నొందఁగా నతని ద్వితీయ సోదరుఁడైన బుక్కరాయలు హొసపట్టణముననుండి రాజధానిని విద్యానగరమునకు వెంటనే మార్చుకొని కర్ణాటసామ్రాజ్యసింహాసనము నధిష్ఠించెను. హరిహరదేవరాయల మరణానంతరము కర్ణాటరాజ్యాధిపత్యమునకై యాతని సోదరులలో వివాదము జనించి కంపరాయలను గాదని తుదకు బుక్కరాయలే రాజ్య మాక్రమించెనని స్యూయలుగారు 'విస్మృత సామ్రాజ్య' మను నర్థమిచ్చు 'ఫర్గాటన్ ఎంపైర్' అను తమ గ్రంథమున వ్రాసియున్నారు. ఆయనసిద్ధాంతమును నమ్మి పంధ్రెండు సంవత్సరముల క్రిందట నాచే రచింపఁబడిన 'జీర్ణకర్ణాటరాజ్యచరిత్ర' మను గ్రంథమున నట్లే నేనును వ్రాసి యున్నాఁడను. అప్పటి నాయభిప్రాయమును మార్చుకొనవలసి వచ్చినది. హరిహరదేవరాయలకు ముందే కంపభూపతి మరణముఁ జెందియుండుటచేతనే బుక్కరాయలు రాజ్యాధిపత్యమును వహించెను.

## కంపరాయని దక్షిణదిగ్విజయ యాత్ర.

"బుక్కరాయలకు దేవాయి యను భార్యవలన మూవురు పుత్త్రులు గలిగిరి. వారిలోఁ జ్యేష్ఠుఁడైన కంపరాయలు తండ్రి యాజ్ఞను శిరసావహించి దక్షిణదిగ్విజయ యాత్రకు బయలుదేఱెను. ఈదిగ్విజయ యాత్రలో వైష్ణవమతావలంబకుఁడైన గోపన్నమంత్రియును, సాళువమంగరాజును సైన్యాధిపతులుగ నుండి తోడ్పడిరి. తండ్రి యాజ్ఞానుసారముగా కంపభూపతి తుండీరమండల మను ద్రావిడదేశాధిపతియైన రాజనారాయణసాంబువరాయల (సాంపరాయలను) జయించుటకై ముందుగ ద్రావిడదేశముపై దండయాత్ర వెడలెను. ఈదండయాత్ర ౧౩౬౦-౬౧వ సంవత్సరములో జరిగియుండును. ఇతఁడసంఖ్యాకములగు సైన్యములతో ముగిలికనమ మార్గముగఁ బాలేఱునది యొడ్డున నున్న విరించిపురమునకుఁ బోయి దండు విడిసెను. ఈసమాచారమును సాంపరాయలు విని పాలేఱునదినిదాటి తన రాజ్యములోఁ బ్రవేశింపకుండ విశేష సైన్యములతో నడ్డుకొని విరించిపురముకడ ఘోర యుద్ధము సలిపెనుగాని యాంధ్రకర్ణాటకులతోఁ బోరాడఁ జాలక ద్రావిడ సైన్యములు పలాయనము కాఁగా సాంపరాయలును పలాయనుఁడై పడవీటి వైపునకుఁ బాఱిపోయి స్వల్ప సైన్యముతో రాజగంభీర పర్వతమును శరణ్యముగాఁ

జేసికొని తగు రక్షణచేసికొనుచుండెను గాని విజయనగరసైన్యములు వెంటాడించి రాజగంభీరపర్వతమును (పడవీడు దుర్గమునకు నామాంతరము) ముట్టడించినవి. రాజగంభీరసాంబువరాయలను నాతఁడు శా. శ. ౧౧౮౦ లోఁ బరిపాలనము చేయుచున్న మూఁడవరాజరాజను చోళరాజునకు సామంతుఁడుగ నుండెను. అతని పేరిటనే పడవీడుదుర్గమునకు 'రాజగంభీరమలై' అను నామము గలిగినది. అతని వంశమునందే కంపభూపతితో సమకాలికుఁడగు రాజనారాయణసాంబువరాయలు జనించి రాజగంభీర రాజ్యమును (తుండీరమండలము లేక తొండై మండలమును) పరిపాలించుచుండెను. విజయనగరసైన్యములు పడవీడు దుర్గమును ముట్టడించినప్పుడు ము రల వారలకు భయంకరమైన యుద్ధము జరిగెను. ఈయుద్ధములో సాంపరాయలు కంపభూపతిచేఁ జంపఁబడినటులు ంగాదేవిరచితమైన మధురవిజయము లేక కంపరాయచరిత్రము లనఁ దెలియుచున్నది. కాని సంస్కృత కావ్యములగు రామా భ్యుదయము, సాళువాభ్యుదయమును, ఆంధ్ర కావ్యములగు జైమినిభారతమును, వరాహపురాణమును, సాంపరా యలు పరాజితుఁడై శరణు వేఁడగా విజయనగర సైన్యాధిపులలో నొక్కఁడగు సాళ్వమంగు వానిని మరల సామ్రాజ్యమున నిలిపి సాంపరాయస్థాపనాచార్య బిరుదమునుగాంచె

నని చెప్పఁబడి యుండుటచేత మధురవిజయములోఁ జెప్పినది యతిశయోక్తిగా భావింపవలసి యున్నది. ఈసాంపరాయలే తెలుంగాధీశుని తండ్రి యని జయంతి రామయ్యగారును, కొమర్రాజు లక్ష్మణరావుగారు నభిప్రాయులగు చున్నారు గాని తెలుఁగురాయల కుటుంబము వేఱు; ఈరాజనారాయణ సాంపరాయని కుటుంబము వేఱు, తెలుగురాయల కీసాంప రాయలకు నెనుబదిసంవత్సరములు వ్యత్యాసముగలదు. తండ్రి కొడుకుల కింత కాలవ్యత్యాస ముండుట యసంభవము. ఇట్లు కంపభూపతి సాంపరాయని జయించి తనకు లోఁబడిన సామంతునిగాఁ జేసికొనినతరువాత కాంచీపురరాజధాని వశముఁ జేసికొనుట సులభసాధ్య మయ్యెను. కంపభూపతి మరకతనగరమును రాజధానిగఁ జేసికొని కొంతకాల మచట నుండి పిమ్మట మధురాపురతురుష్కులను జయించుటకయి మధురానగరముపై దండయాత్ర బయలుదేరెను. ఈదండ యాత్రకుఁ గారణము 'శ్రీరంగముకోయిలొలుగు' అనుగ్రంథ ములో నిట్లు తెలుపఁబడియున్నది. కంపరాయని బ్రాహ్మ ణసేనాని యగుగోపనార్యుఁడు చెంజీసీమకుఁ బాలకుఁడుగా కంపరాయనివలన నియమింపఁబడియెను. ఇతఁ డాపస్తంబ సూత్రుఁడు, భారద్వాజగోత్రుఁడు, నైనబ్రాహ్మణుఁడు. ఇతఁ డొకనాఁడు యాత్రార్థము తిరుపతికొండకుఁ బోయినప్పు

డు వేంకటేశ్వరుని యాలయములో లోహవిగ్రహము మఱొక్కటి యదనముగానుండుటఁ గాంచి యెక్కడిదని యక్కడి వారినిఁ బ్రశ్నించెనఁట. అయ్యది రంగనాథుని విగ్రహమనియు, తురుష్కులు శ్రీరంగమును వశపఱచుకొన్నప్పు డావిగ్రహమునునచ్చటినుండితిరునారాయణపురమునకుఁ గొనిపోయి యచ్చటినుండి తిరుపతికిఁ గొనిరాఁబడినదనియు నచ్చటి యర్చకులు చెప్పిరఁట. అంతట గోపన్న తురుష్కులను శ్రీరంగమునుండి తఱిమివేయువఱకును ఆవిగ్రహమును చెంజీనగరమునకుఁ గొనిపోయి పూజించుచుండ వలసినదని తనపురోహితులను బ్రోత్సాహపఱిచెనఁట. అట్లాతఁ డావిగ్రహమును గొనిపోయి చెంజీపురములోని శృంగవర మనుకొండపైనుంచి పూజాకైంకర్యములు జరుగున ట్లేర్పాటు గావించెనఁట. శ్రీరంగములో నున్నతురుష్కనాయకుఁడు రంగనాథుని యాలయములోఁ గొంతకాలము నివసించియుండి యనారోగ్యము వలన నాప్రదేశమును విడిచి యచ్చటికి నుత్తరముగా నాలుగుమైళ్ళదూరమున నున్నసమయవర మనుగ్రామమునకుఁ బోయి యుండెనఁట. అక్కడి నంబులు కొందఱు తురుష్కుల సమాచార మెప్పటికప్పుడు గోపన్నమంత్రికిఁ దెలియఁజేయుచుండిరఁట. ఒకప్పుడు మంచిసమయమును గనిపెట్టి తురుష్కనాయకుఁడు సురాపానప్రమత్తుఁ డై కామపరవశుఁ డై

యంతఃపురములో నొడలెఱుంగక విహరించుచున్న కాలమున దండెత్తి పోయి తురుష్కులను సంహరించి శ్రీరంగములో రంనాథునివిగ్రహమును మరల బ్రతిష్ఠాపించెనఁట. అదివఱకుఁ దురుష్కులకు వెఱచి సత్యమంగలమునకుఁ బాఱిపోయి యున్న వేదాంత దేశికులవారు శ్రీరంగమునకుఁ దిరిగివచ్చి రెండు సంస్కృతశ్లోకములతో గోపనార్యుని నభినందించిరఁట." తరువాత కంపరాయలు మధురసుల్తానుని సంహరించి శా. శ. ౧౨౮౩వ సంవత్సరము నాఁటికి దేశమునంతయుఁ గైవశము జేసికొనియెనఁట. ఈదక్షిణదిగ్విజయయాత్రలో వీరలకు జయమును సమకూర్చినవాఁడు నిజముగా వీరల సైన్యాధిపతి యైన సాళ్వమంగరాజు. ఇతఁ డసామాన్యపరాక్రమవంతుఁడు, విజయనగరరాజ్యమునకు ముఖ్యాధారముగ నుండినవాఁడు. కనుక వరాహపురాణమునం దితఁ డిట్లభివర్ణింపఁబడియుండెను.

"సీ. దురములో దక్షిణ సురతాను నెదిరించి
  కొనివచ్చి సాంపరాయనికి నిచ్చి
సామ్రాజ్యమునఁనిల్పి సాంపరాయస్థాప
  నాచార్య బిరుద విఖ్యాతిఁగాంచె
శ్రీరంగవిభుఁ బ్రతిష్ఠించి యర్వదివేల
  మాడ లద్దేవు నుమ్మడికి నొసఁగె

మధురా సురత్రాణు మడియించి పరపక్ష
సాళువబిరుదంబు జగతి నెఱపె
తే. గబ్బితనంబునఁ దేజమొగంబుగట్టి
తఱిమి నగరంపు గవనులు విఱుగఁద్రోలి
తానునేఁగి గౌనుద్దవిడిఁ జొచ్చె
సాహసంబున నుప్పొంగు సాళ్వమంగు."

ఇట్లు కంపరాయలు దక్షిణ దేశము నంతయు వశపఱచుకొని రాజగంభీర రాజ్యమను రాజ్యవిభాగ నామమునువహించిన యీదేశమును దాను బ్రదికి యున్నంతవఱకుఁ బరిపాలించుచుండెను.*

హరిహరబుక్కరాయలనాఁటి రాజ్యవిభాగములు.

హరిహర బుక్కరాయలు పరిపాలనము చేయుకాలమున రాజ్యమంతయు నాలుఖండములుగా విభాగింపఁబడియెను.

*మధుర విజయమను కావ్యమునుండి శ్లోకములను సవిస్తరముగా ట్రావెన్కూరు ఆర్క్యాలాజికల్ సూపరింటెండెంటుగా నున్న టి. గోపినాథరావు. ఎమ్. ఏ. గారు న్యూయిండియా 1915 సంవత్సరము నవంబరు 22-26 తేదులందు వెలువడినసంచికలలోఁ బ్రచురించిన వ్యాసమునుండి సంగ్రహముగాఁ దెలిపియున్నాఁడను. ఈచరిత్ర మంతయు మధుర విజయమను కావ్యములోఁ జక్కఁగా వర్ణింపఁబడినదఁట. కంపభూపతి భార్య గంగాదేవి యీకావ్యమును రచించినదఁట ఈగ్రంథమును నేను జూచినవాఁడను గాను.

మొదటిఖండము-ఉదయగిరిరాజ్యము.

ఉదయగిరిరాజ్యములో ములికినాటివిషయమును పాకనాటి విషయమును చేరి యుండెను. ఈరాజ్యమును మొదట వీరిసోదరుడగు కంపభూపతి (మొదటి) పరిపాలనముచేసిమరణము నొందగా నతని తరువాత నతనిజ్యేష్ఠపుత్రుడైన సంగము రాజు (రెండవ) విక్రమసింహాపురము రాజధానిగా పాకనాటి విషయమును బరిపాలనము చేసెను. కంపభూపతి ద్వితీయ పుత్త్రుడైన శావన్నవొడయలు ఉదయగిరిపట్టణము రాజ ధానిగ ములికినాటివిషయమును బరిపాలనము చేసెను. వేద భాష్యకర్తయు, విద్యారణ్యుల సోదరుడునగు సాయనాచా ర్యుడే రెండవసంగముని మంత్రిగానుండి విక్రమసింహాపు రమునందు నివసించియుండెను. విద్యారణ్యులు బుక్కరాయ నికి మంత్రిగానుండెను. సంగముడు ౧౩౫౭ వ సంవత్సరమున నెల్లూరుమండలములోని బిట్రగుంట గ్రామమును బ్రాహ్మ ణులకు దానముచేసి శాసనము వ్రాయించెను. ఈశాసనములో ప్రత్యబ్దకాలమువ దానము చేసినట్లు చెప్పియుండుటచేతనాబ్దిక మనమని బోధపడగలదు. అప్పటికి కంపభూపతి మరణము నొందియుండును.

2 పెనుగొండరాజ్యము. దీనిలో గుత్తిరాజ్యమును, చంద్రగిరిరాజ్యమును చేరియుండెను.

3 ఆరగము లెహా రాజ్యము. దీనిలో వనవాసి, చంద్రగుత్తి, గోవా రాజ్యములు చేరియుండెను.

అనఁగా మైసూరు మండలములోని షిమొగజిల్లాయును, ఉత్తరకన్నడ జిల్లాయును గలిసి ఆరగము లెహా రాజ్యమను పేరున వ్యవహరింపఁబడినట్లు తెలియుచున్నది. దీనిని బుక్కరాయల సోదరుఁడగు మారభూపతి పరిపాలనము చేయుచుండెను. గౌడబ్రాహ్మణ మంత్రియగు మాధవమంత్రి మొదట నితని కడనే ప్రధానిగనుండెను. శా, శ. ౧౨౬౯ లో మారభూపతి కదంబరాజ్యమును (వనవాసి) జయించి చంద్రగుత్తిపురము రాజధానిగా మాధవ మంత్రి సాహాయ్యముతో బరిపాలనము చేయుచుండెను.

4 ములువాయి రాజ్యము. దీనిలో తేకలినాడు మొదలగునవి చేరియున్నవి. బుక్కరాయల సోదరుఁడగు ముద్దభూపతి పరిపాలనము చేయుచుండెను.

5 తుళు రాజ్యము. దీనిలో బరకూరు లేక వరాహకన్యాపుర రాజ్యమును, మంగుటూరు లేక మంగళూరు రాజ్యమును జేరియున్నవి. ఈ రాజ్యమును మొదట హొయిసలరాజగు బల్లాలదేవునికి సామంతుఁడుగనున్న శంకరప్పయను వానిని జయించి బుక్కరాయలు తమ రాజ్యములోఁ గలుపుకొనిరి. మొదటి హరిహరరాయల మంత్రులలో నొకఁడగు

హడపాదగొతరాజను నాతఁడు ౧౩౪౯సంవత్సరమునఁ బరిపాలనము చేయుచుండెను. ఈరాజ్యపాలకులకు స్వంతనాణెములు ముద్రించుకొనుట కధికారముగలదు. కనుకనే మంగటూరుగద్యాణములని బరకూరుగద్యాణములని నాణెములఁ గొన్నిటికి వ్యవహారనామములు గలిగినవి.

6 రాజగంభీరరాజ్యము. ఈరాజ్యమును బుక్కరాయని కుమారులలో నొక్కఁడగు కుమారకంపనచే జయింపఁబడి పరిపాలింపఁబడియె నని పైని యాతనిదండయాత్రాసందర్భమునఁ జెప్పియున్నాఁడను.

## మాధవమంత్రి.

పూర్వము చరిత్రకారులు మాధవమంత్రియు, మాధవాచార్యులు నొక్కరే యనుకొని యొకరు గావించిన పనులు మఱియొకరికి ముడిపెట్టుచు వచ్చిరి. నేనును నాజీర్ణ కర్ణాటరాజ్యచరిత్రమున నట్లే భావించి వ్రాసియున్నాను గా నియిప్పుడు వారిరువురు వేర్వేఱు పురుషులైనట్టు స్పష్టముగాఁ దెలియుచున్నది. ఈమాధవమంత్రి బుక్కరాయని కాలములోఁ బ్రఖ్యాతిఁగాంచిన సేనాధిపతులలో నొక్కఁడుగా నున్నాఁడు. ఇతఁడు గౌడ బ్రాహ్మణుఁడు. తండ్రిపేరు చౌండప్ప. గోత్రమాంగిరసము. గురువు కాశీవిలాసక్రియాశక్తి పండితుఁడు. శైవుఁడు. మాధవ విద్యారణ్యులుగౌడబ్రాహ్మణుఁడు కాఁడు.

తండ్రి మాయణుఁడు. భారద్వాజ గోత్రుఁడు. గురువు విద్యాతీర్థులు, అద్వైతి. వీరిరువు రొక్కరు కారనుట దీనింబట్టి స్పష్టపడియెను. మాధవ మంత్రియు వేదవేదాంతార్థముల నెఱింగిన విద్వాంసుఁడు. కాశీవిలాస క్రియాశక్తి పండితుని బోధచే నితనికి శివభక్తి పట్టువడినది. ఇతఁడు నాస్తికవాదములను నిర్మూలనము గావించి యుపనిషన్మార్గమును చక్కఁబఱిచెను. అనేకవిద్వాంసులకుఁ దానుగురువై యుండి వారికి నుపనిషన్మార్గములను బోధించుచు బ్రహ్మపదముఁ జూపువాఁడని ప్రఖ్యాతిఁగాంచెను. ఇతఁడు బుక్కరాయనికాలమున బశ్చిమఖండమున కధికారిగ నుండి పరిపాలనము చేయుచుండెను. ఇతఁడుజయంతిపురాధిపతిగ నుండి గోవారాజ్యమును జయించి తన పేరిటఁ దానువ్రాసిన గ్రంథములకుఁదోడ్పడిన యిరువది బ్రాహ్మణపండితులకు భూదానములను జేసియుండెను. ఇతఁడు శైవాగమతంత్రజ్ఞుఁడు గావున వాని ననుసరించి లింగపూజలను గావించుచుండెను. ఇతఁడు రాయల యాజ్ఞను బొంది నాగర ఖండములోని ముచ్చుండి యను గ్రామమును వాని శివారులను కాశ్మీర బ్రాహ్మణులకు దానముచేసెను. నాగరఖండమునకుఁ జంద్రకూటపురము రాజధానిగనుండెను. ఈయనకు వీరవసంతమాధవుఁడను నామాంతరముగలదు. ఇతఁడు సూతసంహితకు తాత్పర్యదీపికయను వ్యాఖ్యానమును,

శైవామ్నాయసారమను గ్రంథమును, మాధవనిదానము మొదలగు పెక్కుగ్రంథములను రచించి ప్రఖ్యాతికెక్కెను. మాధవమంత్రి తురుష్కులను గోవానగరమునుండి తఱిమి భువనైకవీరుఁ డనెడిబిరుదమును గాంచెనని వామనశాస్త్రి వ్రాసియుండెను. ఇతనికి మాధవాంకుఁ డనియుఁ మాదిరాజనియుఁ గూడ నామాంతరములు గలవు.

## తురుష్కులతోడి యుద్ధములు.

బహామనీసుల్తానగుమహామ్మదుషా యోరుగల్లురాజ్యమును బరిపాలించుచున్న అనపోతమాధవభూపాలురను జయించి రత్నసింహాసనమును, గోలుకొండదేశమును గైకొన్న తరువాత తనదృష్టినంతయువిద్యానగరలక్ష్మిపైని పునకుఁ ద్రిప్పెను. విజయనగరము నెప్పుడు మ్రింగుదునాయని యతఁడు చింతనము సేయుచుండెను. విజయనగర వైభవముఁ బలువురు పలువిధములఁ గొనియాడుచుండ మహమ్మదుషాహ చెవుల కాపలుకులు ములుకులై నాటుచుండెను. వేయేల! నిద్రాహారములాతనికి దూరములయ్యెను. ఏరీతినైన నేమి ౧౩౬౬ వ సంవత్సరమున సైన్యముల సమకూర్చుకొని వీరబుక్కభూపాలునిపై దండయాత్రవెడలివచ్చెను. బుక్కరాయలకు తురుష్కులతో జరిగిన యుద్ధములలో బుక్కరాయలకే విజయము కలుగుచుండెనని శాసనాదులు తెలుపుచున్నను మహమ్మదీయ చరి

త్రకారులు బుక్కరాయలకే యపజయమును బహామనీసుల్తానులకు విజయములను జెప్పుచువచ్చిరి. మహమ్మదీయ చరిత్రకారులలో ఫెరిస్తా ముఖ్యుఁడు.

ఈయుద్ధములలో నైదులక్షల హిందువులను నఱికించిరక్తనదులు ప్రవహింపజేసెనని చెప్పినంగాని యాతనికిఁ దృప్తి కలుగకపోయెను. ఈదండయాత్రను గూర్చి యసత్య వృత్తాంతములను గల్పించి వ్రాసెను. ఈమహమ్మదీయచరిత్రకారుఁడే యుద్ధవృత్తాంతమును వినుపింప వలసి వచ్చినను లక్షలకొలఁది హిందువులను మహమ్మదీయులచేఁ జంపింపక మానలేదు. ఇతఁడు వ్రాసినచరిత్రములోనుండి నే నిదివఱకు జీర్ణకర్ణాటరాజ్యచరిత్రములో భాషాంతరీకరించి పెట్టిన భాగమునే యీదిగువ నుదాహరించుచున్నాఁడను.

## మహమ్మదుషాహాతోయుద్ధము.

"ఒకనాటిసాయంకాలమున మహమ్మద్షాహ ప్రమోదసాగరనిమగ్నుఁడై నిండుపేరోలగంబున్నవేళ కొందఱు సంగీతప్రోతకులువచ్చి 'అమీరు ఖుస్రూ' అనువానిచే రచియింపఁబడిన రెండుగీతములను శ్రవణానందకరంబుగా వినిపింపఁగాఁ బరవశుఁడై మధుపానమ్ముచేసి యొడలెఱుంగని చిత్తముతో విజయనగరధనాగారమునుండి ద్రవ్యమును గొని వారలకు బహుమానము చేయవలసినదని ముఖ్యమంత్రికి నాజ్ఞచేసెను. సారాయిమత్తువలనఁగలిగినయుద్రేకముతోఁజెప్పినమాట గదాయని గ్రహించి యాజ్ఞాపత్రికను వ్రాసెను గాని విజయనగరరాజునకుఁ బంపలేదు.

అయినను మహమ్మదుషాహ యారాత్రి యావిషయమునుగుఱించి యాలోచించుచుండెను. మఱునాఁడు మంత్రిని బిలిపించి యాజ్ఞాపత్రికను బంపితివా యని యడుగఁగానే, యాతఁడు లేదని ప్రత్యుత్తరమిచ్చెను. అంతట సుల్తాను 'ఏమీ! నా పెదవులనుండి యర్థములేని వ్యర్థపుమాట జాఱఁగలదా ? సురాపానప్రమత్తుఁడనై నేనాజ్ఞ యిచ్చియుండలేదు. నాకట్టి సంకల్పము కలదు' అని హెచ్చరించెను. అంతట 'మల్లెక్ సయఫ్ ఉద్దీన్' అను నతని మంత్రి, యాయాజ్ఞాపత్రికపై రాజముద్రికను ముద్రించి శీఘ్రగామియగు నొకదూతచేతికిచ్చి విజయనగరమునకుఁ బంపెను. కృష్ణరాయలా పత్రికను వీక్షించి కోపోద్దీపితుఁడై యాపత్రికం దెచ్చిన దూతను నొకగార్ధభముపై నెక్కించి విజయనగరవీధులం దూరేగించి పేడనీళ్లు గొట్టించి యవమానపఱిచి యాతనిం బంపించుటయే కాక భామినీరాజ్యముపై దండెత్తుటకై సంసిద్ధులై యుండవలసినదని తన దండనాయకులకెల్లరకు సమాచారములు పంపి యుద్ధమునకై యెదురుజూచుచుండెను. తన దండనాయకులెల్లరును స్వసైన్యములతో విజయనగరమునకు వచ్చిన తరువాత కృష్ణరాయలు ముప్పదివేలగుఱ్ఱపుదళమును మూఁడువేల యేనుంగులును లక్ష కాల్బలమును గల సైన్యముతోడ 'ఆదవాని' దుర్గము చెంతకుఁబోయి, యచటినుండి కొంత సైన్యమును సుల్తానుదేశమును బాడుచేయుటకై భామినీరాష్ట్రమునకుఁ బంపెను. వర్షాకాల మాసన్నమగుటచేత రాయలు కృష్ణవేణీ తుంగభద్రా నదుల సంగమస్థానమునకుఁ బడమట త్రికోణాకారముగా నుండి హిందూమహమ్మదీయులకు వివాదభూమియై యుండి తరువాత రెండువందల సంవత్సరములవఱకు యుద్ధరంగముగానున్న రాయచూరు మండలములోని ముఖ్యనగరమగు ముద్గల్లునకు బోయి యాపట్టణము పట్టుకొని స్త్రీపురుష లను భేదములేకుండ నెల్లరను గ్రూరఖడ్గాహతిపాల్జేసి విజృంభింపఁగా నొక్కఁడుమాత్రము ప్రాణమెట్లో తప్పించుకొని పోయి కలుబర్గ కేఁగి సుల్తానున కీసమాచార

మంతయుఁ దెలియఁజేసెను......ఈ మారణకర్మ వృత్తాంతమును మహమ్మదుసాహ విని దుఃఖాక్రాంత చిత్తుఁడయ్యును కోపోద్రేక మడంచుకొనలేక, యాదుఃఖసమాచారమును దెచ్చిన నిరపరాధియగు దౌర్భాగ్యుని తక్షణమే చంపించెనఁట. మహమ్మదుసాహ సర్దారులతో నిలువంబడి "మహమ్మదీయమతావలంబకుల సంహారించినందుకు ప్రతీకారముగా సనాతనమతాభిమానులను విగ్రహారాధనపరులను లక్షహిందువులను మట్టుపెట్టినంగాని మతయుద్ధమును బ్రకటించు చండాగ్రియుఖడ్గమును మఱల నొరలోనికిఁ జేర్ప"ననియు "హత్యనుండి వెనుదీయ'' ననియుఁ బ్రతిజ్ఞపట్టి యా దినముననే రణభేరి మ్రోఁగించి దండయాత్రకు బయలువెడలెను.

మత యుద్ధమును బ్రకటించుచు మహమ్మదుసాహ కృష్ణానదీతటముఁజేరి శత్రువుల రక్తములో ముద్గల్లు పురమునందలి రాయలఖిల్లాము పాలఁబడిన వారియాత్మలకుఁ దర్పణము విడిచి సంతోషపెట్టుటకై శత్రువుల కక్షిదుఃఖముగా నానదిని దాటినఁగాని భుజించుటయు నిద్రించుటయు నశాస్త్రీయమని నిశ్చయించి, నిద్రాహారముల మానెదనని ప్రతిజ్ఞను చేసెనఁట! పిమ్మట తనకొడుకగు ముజాహిదుసాహుఁ బట్టముగట్టి మంత్రియగు మల్లిక్ సయుఫ్ ఉద్దీనుని, పాలకునిగా నియమించి యిరువదియేనుఁగులను మాత్ర ముంచుకొని తక్కినయేనుఁగులనన్నిఁటిని వానికిచ్చి బుద్ధులుచెప్పి కలుబర్గనగరమునకుఁ బంపివేసెనఁట! కాలవిలంబము చేయక తరువాత మహమ్మదుసాహ తొమ్మిదివేలగుఱ్ఱపుదళముతో నదిని దాఁటెనఁట! రాయ లీవార్తవిని దిగులుపడి ధనకనకవస్తువాహనాములను విజయనగరమునకుఁ బంపివేసి మఱునాఁడు వీలుగానున్న యుద్ధముచేయుటయో లేనిచోఁదల వెనుదీయుటయో జరిగింపవచ్చునని నిశ్చయించెనఁట! ఆరాత్రి భయంకరమగు గాలివీచుచుఁ గుంభవృష్టిగా వర్షము

గురియుచున్నందున నేనుఁగులు మొదలగు భారవాహకములగు జంతువులు బురదలోఁ జిక్కుకొని శ్రమపడుచు, సేనానివాసస్థానమును విడిచి నాలుగు మైళ్ళదూరమునకైన నడువశక్తికలవి కాకపోయినవి. మహమ్మదుషాహ యీవృత్తాంతమును విని తనస్థానమును విడిచి తానే వారల కభిముఖుఁడయి నడువ నారంభించెను. మఱునాఁ డుదయమునకు రాయల సైన్యమును సంధింపఁగానే వారలు సామగ్రినంతయు వెనుకదిగవిడిచి భయంపడి యాదవాని దుర్గమునకుఁ బాఱిపోయిరఁట! మహమ్మద్ షాహ సామగ్రినంతయుఁ గొల్లవెట్టి శిశుసహితముగా స్త్రీపురుషుల డెబ్బదివేల జనులను సంహరించెనఁట! సుల్తాను వేసవికాలము గడచుపర్యంతము ముద్గల్లు పట్టణమున నుండి తరువాత సేనలంగూర్చుకొని ఆదవానిదుర్గము ముట్టడించెను. రాయలు తన మేనల్లుని దుర్గసంరక్షణార్థము గొంతసైన్యముతో నిలిపి తాను తుంగభద్రానదికి దక్షిణభాగమునందు నిలిచి విజయనగరమునుండి యింకను సేనలను రప్పించుకొని యుద్ధసన్నద్ధుఁడై నిలిచి యుండెను. మహమ్మదుషాహ శీఘ్రకాలములోనే తుంగభద్రానదిని దాఁటి విజయనగరరాజ్యభూములలోఁ బ్రవేశించెను. విజయనగరము పయి మహమ్మదీయులు దండెత్తివచ్చిన వానిలో నిదియే ప్రథమదండయాత్ర యని చెప్పవలసి యున్నది. ఎందుకనిన నిదివఱకు ఢిల్లీసుల్తాను తుంగభద్రానదికి నుత్తరముననున్న యానగొందిని ముట్టడించెనేగాని తుంగభద్రానదిని దాఁటి యీవలకు వచ్చినవాఁడు కాఁడు. మహమ్మదుషాహ సిరుగప్పను గ్రామసమీపమున నదిని దాఁటి కౌతాళమువద్దనున్న బయలులో రాయలసైన్యమును దాఁకెను. మహమ్మదుషాహనదిని దాటి వచ్చుచున్నాఁడని [illegible]లవలన విని కృష్ణరాయలు తనమంత్రులను సేనాధిపతులను రప్పించి సుల్తాను నేప్రకార మెదుర్కొనవలసి యుండునో యోచింపసాగెను.

అప్పుడందఱును జేరి రాయలముఖ్యసేనాధిపతి యగు భోజమల్లునకాధిపత్యమునిచ్చిరి. అతఁడు సంతసించి తురుష్కరాజకుమారుని జీవముతో ఖైదిగాబట్టుకొని తీసుకొని రావలసియుండునో అతనిశిరస్సు బల్లెమునకు గ్రుచ్చి చూపింపవలసియుండునో రాయలచిత్తమును వినఁగోరుచున్నానని మహాగర్వముతోఁ బలికెనఁట! బ్రతికియున్న శత్రు వేయవస్థలో నున్నను నిష్టుఁడు కాఁడు గనుక చేతి కందివచ్చినపుడు చక్కాఁడుటయె యుచితమార్గ మని రాయలు ప్రత్యుత్తర మిచ్చెనఁట! రాయుల యనుజ్ఞనుబొంది మల్లయదండనాథుఁడు నలువదివేల గుఱ్ఱపుదళముతోడను, లక్ష కాల్బలముతోడను, మహమ్మద్ షాహ నెదుర్కొని హిందువులచేఁ బరమ పవిత్రములుగాఁ జూడఁబడు గోవులను మహమ్మదీయులు చంపుటను గూర్చియు, వారి దేవాలయములను నిర్మూలము చేయుటను గూర్చియు ననుదినమును వర్ణించుచు సైనికుల కుపన్యాసము లిచ్చి చంద్రధ్వజులఁ జంపుటయే పరమార్థ మని తోఁచునట్లుగాఁ బౌరుష మెక్కింప వలసినదిగా బ్రాహ్మణోత్తముల కెల్లరకు నానతియిచ్చెను. మహమ్మదుషాహ భోజమల్లుని రాక విని తన సైన్యమున కంతకు ఖానుమహమ్మదుని నధ్యక్షునిగా నేర్పరిచి పదునైదువేల గుఱ్ఱపుదళమును, ఏఁబదివేల కాల్బలమునిచ్చి తాను పదివేల గుఱ్ఱపుదళముతోను ముప్పదివేల కాల్బలముతోను సమరసన్నద్ధుఁడయి యుండెను. ౧౩౬౬ వసంవత్సరము జూలై ౨౩వ తేది గురువారమునాఁడు సూర్యోదయ సమయమున నుభయసైన్యములును గలిసికొని సంకుల సమరంబునకుఁ గడంగెను. ఉభయసైన్యములును సముద్రతరంగములవలె నిటునటు నూగులాడుచు నొండొరులతోఁ డీకొని సాయంకాలము నాలుగు గంటలవఱకు ఘోరయుద్ధము చేయఁగా నిరుప్రక్కలను వేలకొలది జనులు మృతినొంది రని చెప్పుట యతిశయోక్తిగాదు. ఖాన్ మహమ్మదు సేనయొక్క కుడి యెడమ భాగములకు రక్షకులుగా నున్న శూరాగ్రేసరులగు మూషిఖానుఁడును, ఏషీఖానుఁడును వీరమరణము నొందగా వారి సేనలు హిందువుల ప్రతాపమునకుఁ దాళఁజాలక పలాయనము లయ్యె

ను. ఈమరవస్థ నంతను జూచి తురుష్క సైన్యములు దిగులుపడి ధైర్యమును వదలి చెల్లాచెదరగుచుండ, మహమ్మదుషాహ మూఁడు వేల గుఱ్ఱపుదళముతో వచ్చి మల్లయదండనాథునిఁ దార్కొనఁగానే, పాఱిపోవుచున్న తురుష్కసైన్యములు వెనుకకు మఱలివచ్చుచుండెను. ముక్రీబుఖానుఁడు ఫిరంగులను గాల్చుచు శత్రుసైన్యమును జీకాకు నొందించుచు ముందుకు సాగివచ్చి శత్రువులను బాఱఁదోలుట కనుజ్ఞ యిమ్మని ఖానుమహమ్మదు నడిగెను. అతనికి మూలబలము కొంత యిచ్చి సాగుమని యుత్తర్వుచేసెను. ఫిరంగులను గాల్చుటకు హిందువులకు కాలముచాలక పోయినందున, వీరావేశముతోఁ గత్తులు గటారులు దూసి తురుష్కుల కభిముఖులై పిఱికితన మావంతయు లేక శత్రువులు సహితము మెచ్చునట్లుగాఁ బోరాడుచుండిరి. ఇట్లు ఖానుమహమ్మదుని యొక్క 'పులివేఁటకాఁడను' పేరు గల యేనుఁగొకటి మావటీనియాజ్ఞకు లోఁబడక శత్రుసేనా మధ్యభాగమునం జొఱంబడఁగా మల్లయదండనాథుని యేనుఁగు లడ్డపడి నిలుపఁగా నాసందడి సమయములోఁ పులివేటకాని మావటీఁడు ప్రాణములను గోలుపోయెను. తదనంతరము ఖానుమహమ్మ దయిదువందల గుఱ్ఱపు దళమును దీసికొని సమరగజమును వెంబడించి పురికొల్పుచుండె. హిందూసేనలు క్రమము తప్పి చెల్లాచెదరగునట్లుగా నాయేనుఁగు ఘీంకృతులువెట్టుచు ధ్వంసముచేయుచుండఁగా భోజమల్లుఁడు దెబ్బతిని గాయమును బొంది రణరంగమున నిలువలేక పరాఙ్ముఖుఁ డయ్యెను. తదనుచరులు సయితము నిలిచి యుద్ధపడలేక పోయిరి. హిందువులు తమ మధ్యభాగ మిట్లల్లకల్లోలమగుటఁ జూచి యధైర్యపడి నలుదిక్కులకుఁ బాఱిపోయిరి. ఇక జెప్పవలసిన దేమున్నది? తురుష్కులు చెలరేఁగి తారసించిన యెల్లరను నఱికి వైచుచుండిరి. గర్భిణీస్త్రీలనుసయితము వదలిపెట్టక హతము చేయుచుండిరి. బిడ్డల ఱొమ్ములమీఁద నుంచుకొని పెనఁగులాడుచున్న తల్లుల నుండి బిడ్డలనులాఁగి, బిడ్డలను తల్లులనుగూడ నఱుకుచుండిరి. మహమ్మదుషాహ

యిట్టి విజయవార్తలను తన రాజ్యమునకుఁ బంపియుఁ దృప్తినొందనివాఁడయి, తన ప్రతిజ్ఞఁ దీర్చుకొనుటకయి రాయలను వెంబడించి మహారణ్యములమధ్యఁ దిఱుగుచుండెను. కృష్ణరాయలు వానికిఁ జిక్కక హతశేషులను గూర్చుకొని సురక్షితముగా వచ్చి విజయనగరముఁ బ్రవేశించెను. మూఁడు నెలలు మహమ్మదుషాహ రాయలను వెదకి నగరమును ముట్టడించెను. కాని ముప్పదిదినములెంత ప్రయత్నము చేసినను రాయలు లోఁబడలేదు. పట్టణమును స్వాధీనము కాలేదు. తన ప్రయత్నము వ్యర్థముకాఁగా నతఁడు పట్టణమును విడిచి తుంగభద్రానది మీఁదుగాఁ బాఱిపోవుచు నడుగడుగునకు హిందువులచే నడ్డగింపఁబడుచుండియుఁ బోయి పోయి యొక మైదానమున దండువిడిసి యుండెను. రాయలును వారిని వెంబడించివచ్చి సమీపముననే దండు విడిసి యుండెను. మహమ్మదుషాహ పాఱిపోయిన విధముఁజూచి దురుష్కులకుఁ దమ్ముఁ దలపడఁ జాలరనియు, తేఱిపాఱఁ జూడనైనఁ జాలరనియు, హిందువులకు దృఢవిశ్వాసమును గలిగించుచుండెను. ఆహేతువుచేత హిందువులు జాగ్రతలేనివారలై పరాకు గలిగి యలక్ష్యస్వభావముతో నుండిరి. రాయ లొకనాఁడురాత్రి మధుపదార్థములను సేవించి వారకాంతా వినోదగోష్ఠిలోనుండి యానందాబ్ధి నోలలాడుచుండఁగా నకస్మాత్తుగాఁ దురుష్కులు పైఁబడి తమ కపటతంత్రమును బయల్పఱుపఁగా కృష్ణరాయలు పశ్చాత్తాపము నొందుచు విజయనగరమునకు మఱలఁ బాఱిపోయెనఁట! పదివేల హిందువుల నఱుమాడి మహమ్మదుషాహ తిరిగి విజయనగరమును ముట్టడించెను. రాయలు సమాధానపఱుపుటకై రాయబారులను సుల్తానుకడకుఁ బంపెనుగాని యాతఁడంగీకరింపకుండెనఁట! అది చూచి వాని మిత్రుఁడొకఁడు 'మీరు లక్ష హిందువులను మాత్రమే సంహరించెదమని ప్రతిజ్ఞపట్టినారు కాని హిందూగాతి స్త్రంతను జంపెదమని ప్రతిజ్ఞపట్టలేదే' యని మందలించెనఁట! అందుకు సుల్తాను తాను ప్రతిజ్ఞపట్టిన మొ[illegible]న్ను నినుమడిగా హిందువులను

జంపినను రాయలు లోఁబడి తానాజ్ఞచేసిన ధనమొత్తమును సంగీతపాఠకులకు సమర్పించినఁగాని రాయలయెడలను నాతని ప్రజలయెడలను గరుణఁ జూపఁజాలనని బింకములు వలుకుచుండఁగా, రాయల రాయబారులు సర్వస్వాతంత్ర్యమును బొంది వచ్చినవారు గావున నాధనమొత్తమును నాతనికిఁ దత్క్షణమే చెల్లించిరి. 'రాయలయందుఁ దప్పిద మున్నయెడల నిరాధారులును నిరపరాధులునగు పరిజనులును, స్త్రీలును, బిడ్డలును గూడ దండార్హులగుదురా' యని రాయబారులు మందలింపఁగా సుల్తాను భగవదనుజ్ఞ యట్లుండెననియు నద్దానిని మార్పఁదనకు శక్తిలేదనియు నుడివెనఁట ! హిందూమహమ్మదీయు లిరుగుపొరుగువా రగుటవలన నవసరములగు క్రూరకృత్యములు మానుట యుచిత మనియు, లేనియెడలఁ బరస్పరద్వేషములు ప్రబలములగుననియు రాయబారులు వాదింపఁగా మహమ్మదుషాహ వారివాదములు సహేతుకముగా నుండుటచేతఁ దానొడంబడితి ననియు, నిఁక నెన్నఁడును తనకు జయము లభించిన తరువాత శత్రువుని నొక్కనినైన నిష్కారణముగాఁ జంపింప ననియుఁ నెదుటివారుగూడ నట్లేచేయ బద్ధు లనియుఁ బలికి ప్రమాణముచేసెనఁట ! ఆపద్ధతి కొంతకాలము వఱకు నవలంబింపఁబడెను. కాని తరువాతి ప్రభువు లామార్గమును మఱచి యథేచ్ఛగాఁ గ్రూరకృత్యములు చేయుచునే యుండిరి. ఈమహాయుద్ధమునందు నైదులక్షల హిందువులను జంపి కర్ణాటకభూములు నిర్జనప్రదేశములుగాఁ జేసెనని మహమ్మదుషాహను ఫెరిస్తా శ్లాఘించుచు నతిశయోక్తిగాఁ జెప్పుచున్నాఁడు. తరువాత కొన్ని సంవత్సరములవఱకుఁ బోరులేకుండ రెండు రాజ్యములవారికి సఖ్యత గలిగి యుండెను."

పైనివర్ణింపఁబడిన చరిత్రాంశముల సత్యత్వమును గూర్చి ప్రశ్నింపవలసి యుండును. మహమ్మద్‌షాహతోఁ బోరాడిన విజయనగరాధీశ్వరుఁడు కృష్ణరాయఁడని ఫెరిస్తా వ్రాయు

చున్నాఁడు.౧౩౫౮ మొదలుకొని ౧౩౭౫ వఱకు రాజ్యపరిపాలనముచేసిన మహమ్మద్ షాహాతో ౧౫౦౯ మొదలుకొని౧౫౩౦ వఱకు రాజ్యపరిపాలనము చేసిన కృష్ణరాయఁడు సమరము సలుపుట యేకుతర్కముచేత సాధ్యమగును? కాఁబట్టి యీ కథ ఫెరిస్తాచేఁ గల్పింపఁబడినదని చెప్పుటకు సందియము గలదా? ఇయ్యది చరిత్రకారుని పొరబాటని చెప్పఁదగునా ? ఇట్టివిపొరబాటులు కావు. పదునాలుగవ శతాబ్దిమధ్యమున జరిగిన యీకదనవృత్తాంతమును పదునేడవ శతాబ్ది ప్రారంభమునందు జనించిన ఫెరిస్తా అహమ్మదనగరములోఁ గూరుచుండి తన ప్రభువులగు సుల్తానుల చెవుల కింపగునట్లుగా గాథలనల్లి తన యపూర్వబుద్ధి వైశద్యమును వెల్లడించెనని విస్పష్టమగుచున్నది. బుక్కరాయని కాలమునకును కృష్ణరాయని కాలమునకు నంతర మెఱుగని చరిత్రకారుని వ్రాతలెవ్వారికివిశ్వసనీయములుగావు. పైనివర్ణింపఁబడిన వర్ణనలలో విపరీతాంశములు మఱికొన్ని గలవు. నిజముగా నైదులక్షల జనులనే సంహరించి మహమ్మద్ షాహానిజముగనే విజయనగరాధీశ్వరునిఁ బూర్తిగఁ బరాభవించియుండినయెడల నతఁడు సంగీతపాఠకుల కీయవలసిన పైకమును మాత్రము రాయల యొద్దనుండి గైకొని యూరకుండుట సంభవించునా ? విజయాంధుఁడైన మహమ్మద్ షాహా విశేషధనమును నూత్న

రాజ్యమును గైకొనక సంధికినొడంబడునా? సుల్తాను లిట్టి సందర్భమున స్వల్పద్రవ్యముతోఁ దృప్తిఁజెంది యూరకొన్న స్త్రెచ్ఛాటను మనమెకనివిని యెఱుంగము. కాఁబట్టి సంగీతపాఠకులకీయవలసిన రూకలతోఁ దృప్తిఁబొంది మహమ్మద్‌షాహ యూరకనియెనని చెప్పినహేతువుచేతనే మహమ్మదుషాహకు విజయము సంప్రాప్తము కాలేదని చెప్పవచ్చును. స్వల్పసైన్యముతో మహమ్మద్‌షాహ వచ్చుచున్నాఁడని విన్నంతమాత్రముననే యసంఖ్యాకములగు సైన్యములతో నున్న రాయలు భయపడి పాఱిపోవయత్నించెననుట విశ్వాసపాత్రముగాదు. ఆదవాని దుర్గములోఁ దానును దనమేనల్లుఁడును సైన్యములతో నుండియు, దన సైన్యాధ్యక్షుఁడైన భోజమల్లుఁడు పడిపోయినందునఁ దనసైన్యములన్నియుఁ జెల్లాచెదరై పోవుచున్నవని వినియు రాయలువచ్చి తోడ్పడియుండలేదని వ్యక్తీకరించువాక్యముల నేచరిత్రజ్ఞుఁడు విశ్వసించును?

రాయలు మహమ్మద్‌షాహయొక్క రాయబారిని మిక్కిలి యవమానించెను. అట్టివానిని విజయాంధుఁడైన మహమ్మద్‌షాహ యవమానింపక విడిచిపెట్టునా? అట్టిపనినేమియుఁ జేయక సంగీతపాఠకులకీయవలసిన నాల్గురూకలనుమాత్రము గైకొని యూరకుండెనని ఫెరిస్తా వ్రాయుట చూడ నీయుద్ధసమాచారమే యబద్ధమని తోఁచుచున్నది. ఒకవేళయుద్ధమే

జరిగియుండునేని మహమ్మదుషాహాకు విజయము కలిగిన దనుట యసత్యమై యుండును.

## ముజాహిదుషాహాతో యుద్ధము.

మహమ్మదుషాహా ౧౩౭౫లో మరణము నొందెను. అతని కుమారుఁడు ముజాహిదుషాహా సుల్తానయ్యెను. అతనికి వయస్సు పందొమ్మిదియేండ్లుమాత్రమె యుండెను. ఇతఁడు సింహాసన మెక్కినతోడనే రాయలతో వివాదము పెట్టుకొని యుద్ధము ప్రారంభించెను. ఈయుద్ధము మూఁడు సంవత్సరములు జరిగెనని కొందఱు వ్రాసియున్నారు. ఫెరిస్తా వ్రాసినదాని జీర్ణకర్ణాటరాజ్యచరిత్రమునుండి యీదిగువ నుదాహరించుచున్నాఁడను.

"మహమ్మదుషాహా మరణానంతరము నతనికుమారుఁడు ముజాహిదుషాహా సింహాసనమునకు వచ్చెను. ఇతఁడు సింహాసన మెక్కినతోడనే కృష్ణాతుంగభద్రానదులకుమధ్యనున్న దుర్గములును, మండలములును తనకుఁ జెందియున్నవనియు, వానినిగురించి యెప్పుడెప్పుడు తగవులాట గలుగుచున్నదనియు నట్లుకలుగకుండఁ దుంగభద్రానది సరిహద్దుగాఁ జేసికొని దానికిఁ దూర్పున నుండు దేశమును వెంగాపుర (బంకాపురము) దుర్గమును గూడ విడిచిపెట్టవలసినదనియు, కృష్ణరాయలకువ్రాసెను. ఈవెంగాపురము ధార్వాడకు దక్షిణమున నున్నది. సముద్రతీరమునకును, విజయనగరమునకును మధ్యనుండుటచేతను, మహమ్మదీయులు చిరకాలమునుండి యాకోటనుస్వాధీనముఁ జేసుకొనవలెనని తలంచి మహాదృష్టితోఁ జూచుచుండిరి. అందుచే కృష్ణరాయలు 'రాయచూరు ముద్గల్లు దుర్గము లాదిగాఁగల సంస్థానమునకుఁ జెందినవగుటచేత రాయవారుమండల

మంతయు నదలిపెట్టవలసినదనియు, కృష్ణానదియే సరియైన సరిహద్దనియు, మహమ్మదుషాహ తనవద్దనుండి కైకొన్న యేనుఁగులను మఱలఁ దనకిచ్చివేయవలసిన దనియుఁ' బ్రత్యుత్తరమంపెను. సుల్తాను యుద్ధమును బ్రకటించెను. సుల్తాను రెండునదులను దాఁటి ఆపవానిదుర్గముకడకు వచ్చిచేరెను. కృష్ణరాయలు తుంగభద్రానదీతటమున దండు దిగియున్నాఁడనివిని ముజాహిదుషాహ తనసైన్యమును రెండుభాగములుగా భాగించి, యొకబలము కోటముట్టడించుటకును, రెండవబలముతోఁ దాను బోయి విజయనగరమును బట్టుకొనుటకును నిశ్చయించి, వాయవ్యమూలమార్గమున జాగరూకతగలిగి సేనలను నడిపించుకొని పోవుచుండెను. కృష్ణరాయలు మొట్టమొదట సుల్తానును సంధించి సమరము చేయుటయే యుక్తమని యోచించెనుగాని తరువాత నది మంచిపద్ధతి కాదని తలఁచి తనరాజధానికి దక్షిణముననున్న సోండూరు కొండలలోని యడవులలోనికిఁ బోయి యుండెను. ముజాహిదుషాహ [illegible]నిని వెంబడింపక, విజయనగరము సొగసైననగరమని బహుజనులు శ్లాఘించుచుండుటచేత నచటికిఁ బోవఁ జూచెను. [illegible]ని యది సుసాధ్యము కానిహేతువుచేత తిన్నగా కృష్ణరాయలున్న యరణ్యమునకు దారితీసెను. సుల్తాను వచ్చుచున్నాఁడను సమాచారమునువిని రాయలు యరణ్యమార్గములు తురుష్కులకుఁ గొత్తవియగుటఁ దలపోసి యాతని నాకాడవులలో నాయాసపెట్టఁ దలఁచియుండ, సుల్తాను మహారణ్యమును భేదించుకొని దారులేర్పరచుకొనుచు రాయలసైన్యమును వెంబడించుచుండ, నారాయలా స్థానమును విడిచి మఱియొక స్థానమునకుఁ బోవుచు నీరీతిగా నాలుమాసములు సుల్తానుఁ గంపకయే చిక్కులు పెట్టుచుండెను. సుల్తానువజీరు లిది ప్రయాససాధ్యమనియు, లాభము లేని త్రిప్పటయనియు, సైన్యమునకు నధిక కష్టము సంభవించుననియు, బహువిధముల బోధించి యతనిని మరలింపజూచుచుండిరి. కాని వారి యదృష్టవశమున రాయలకారోగ్యభంగము కలిగి, యాయడవులలోని విషవాయువుల నాఘ్రాణించుటవలనఁ బ్రాణాపాయము కలుగ

వచ్చును గావున, నాతనివైద్యు లడవిని విడిచి స్వరాజధానికి విజయంచేయవల సినదని వేఁడుకొనుట తటస్థించెను. కృష్ణరాయలు చేయునదిలేక వారియుపదేశమును విశ్వసించి చాటుదారులను దప్పించుకొనిపోయి విజయనగరము ప్రవేశించెను. సుల్తా నాతనివెనుకను గొంతసైన్యమును బంపి తాను 'అమీరాల్ఉమ్రా బహదూరుఖాను'తో నైదువేలసైనికులును దీసికొని, సేతుబంధరామేశ్వరమును ప్రదేశము సందర్శించుటకై పోయెను. ఈతఁడాప్రదేశమున సుల్తాను 'అల్లాఉద్దీను ఖిల్జీ' కట్టించిన మసీదును బాగుచేయించుటయే గాక, హిందూదేవాలయములను బెక్కింటిని గూలఁద్రోయించి దేశమునంత పాడుచేసి, విజయనగరమునకుఁ దిరిగివచ్చెను. ముజాహిదుషా తరువాతనెట్లో కృష్ణరాయలకు దెలియకుండఁ జాటుదారులగుండవచ్చి విజయనగరముపైఁబడె'' నని ఫెరిస్తా యసందర్భపువ్రాఁతలను వ్రాయుచున్నాఁడు.

'తురుష్కులు విజయనగరమును బ్రవేశించుటకు నద్భుతపడి కృష్ణరాయలు వీథులను గాపాడుటకు పెక్కండ్రు సైనికులను బంపెనఁట. కాని తురకలు హిందువులను దఱిమి యెట్టకేలకుఁ గోటకును పట్టణమునకు నడుమనున్న చెఱువుకట్ట నాక్రమించుకొనిరఁట. ఆసమీపముననున్న కొండపై నెక్కి యచటి హిందూదేవాలయ మిడియఁగొట్టి యమూల్యములగు రత్నాభరణములతోడ నలంకరింపఁబడిన సువర్ణమయములగు విగ్రహములను జూఱఁగొనెనఁట!' పరుల కవిలంఘ్యము లగునట్టి సప్త ప్రాకారములు గలిగి విజయనగరము లక్షలకొలఁది శూరాగ్రేసరులచేఁ బరిరక్షితమైయున్న మహానగరమని కన్నులారఁ జూచిన విదేశీయచరిత్రకారులు పెక్కండ్రు వర్ణించియున్నారు. అట్టి సురక్షితస్థానముల నన్నిఁటిని దాఁటి యొడలుదుమ్ముగాకుండ, ననాయాసముగా సుల్తానెట్లు రాఁగలిగెనో వింతగానున్నయది. ఈవృత్తాంతము జరిగిన రెండుశతాబ్దముల కావలనున్న యీచరిత్రకారుఁడగు ఫెరిస్తా స్వజాతివారిలోఁ జెప్పుకొనెడు కల్పనాకథలనుబట్టి యీచరిత్ర మల్లెనుగాఁబోలు. "కట్టకడ ముజాహిదునకు 'జావుతప్పి కన్నులొట్టపోయె' ననుసామ్యము ననుసరించి ప్రాణగండము

గలిగియుఁ దప్పించుకొని పోవుట తటస్థించెను. అత్యంతచింతాస్వాంతులును తురుష్కుల దౌర్జన్యమునకు నోర్వంజాలక హిందువు లెల్లరు లోనిరోషానలంబు ప్రజ్వలింప శత్రువినాశనమునకై కృష్ణరాయలను బ్రోత్సాహపఱచి యనేక కొలఁది హిందూ శూరాగ్రేసరులు ధ్వజమెత్తి వచ్చుచుండుటఁజూచి, ముజాహిదుషాహ తనఛత్రము నావలఁబాఱవైచి, తన కైదండయొసఁగువాని నొక దేశపుఁదురుష్కుని మామూదనువానిని వెంటఁదీసుకొని, శత్రువులసంఖ్యనుగనుఁగొనుటకై చిన్న సెలయేటినిదాఁటి యావలియొడ్డున నిలువంబడి యుండెను."

'అప్పుడు పరాక్రమవంతుఁడగు నొక్కహిందువు సుల్తానుస్వారిచేయు గుఱ్ఱమునుగుర్తుపట్టి తనదేవతాస్థానముల నిర్మూలించిన పగదీర్చుకొని ప్రఖ్యాతి నొందుటకై సుల్తానువంకకు నశ్వారూఢుఁడై యతివేగమున వచ్చుచుండెను. అతఁడు పొదలచాటుననుండియు, నొడ్డువిఱిగి పల్లముగానున్న సెలయేటియొడ్డువెంబడి నేరికిఁ గానరాకుండవచ్చి బయలుపడి తనవంక నతివేగమున వచ్చుచుండుటనదృష్టవశమున సుల్తాను వీక్షించి, మామూదునకు సైగచేయఁగా నాతఁడు వెంటనే గుఱిపెట్టికాల్చెను. కానితనగుఱ్ఱము బెదరినందున నతఁడు క్రిందఁబడెను. ఇంతలోశత్రువు మామూదును సంహరింపనుద్యుక్తుఁడుకాఁగా ముజాహిదుషాహ భుజబలాఢ్యుఁడుగాన నతనిరక్షణకై తత్క్షణమేపోవ నాహిందువు మామూదును జంపుటమాని సత్తువతోసుల్తానునొక్కదెబ్బతీసెను. కాని యదృష్టవశమున సుల్తానడ్డపెట్టిన యినుపసుత్తివలన నతఁడు జీవింపఁగలిగెను. కాని లేనియెడల నాదెబ్బతో ముజాహిదు నామమాత్రావశిష్టుఁడగుననుటకు సంశయములేదు. చూపఱులందఱు నాదెబ్బ సుల్తానుప్రాణముఁగొనెనని నిశ్చయించిరి. కాని యట్లు జరుగక సుల్తానుసుత్తిపెట్టుతో శత్రువు రెండుతుండెములై క్రింపఁబడిపోయెను. తరువాత మామూదును గుఱ్ఱముపైనెక్కించి సుల్తాను సైన్యమునుజేరుకొనెను. తదనంతరము ఘోరయుద్ధము జరిగెను; కాని హిందువులు పరాజితులయిరి. తురుష్కులు బడలిక దీర్చుకొనుచుండిరి. ఇంతలో

కృష్ణరాయల సోదరులలో నొకరు (మారభూపతియో లేక ముద్దప్పయో) ఇరువదివేల గుఱ్ఱపుదళముతోడను, నధిక కాల్బలముతోడను రాజధానికివచ్చి రాయలను గలిసికొనఁగా భయంకర మగుయుద్ధము మరలనారంభమయ్యెను. అప్పుడు సుల్తానునకునాపద కలుగునేమో యనుభీతిచే నతనిబంధువు దాదుఖానుం డనువాఁడు తనస్థానమగు ధర్మసముద్రమును విడిచి యుద్ధము జరుగు ప్రదేశమునకు వచ్చెను. తురుష్కులు మఱల జయమును బొందిరి. కానిశత్రువులు దాదుఖానుఁడు విడిచి వచ్చినధర్మసముద్రమును ముట్టడించి పట్టుకొని సుల్తాను సైన్యమునకు వెనుకనే హానిఁజేయుచు భీతికలిగించుచుండిరి.

'ముజాహిదుషాహయుద్ధభూమినివిడిచిపెట్టి కొండలలోనుండితనసైన్యమును సురక్షితముగా నావలకుఁ దరలించుకొని, యరువదివేల హిందువులను ముఖ్యముగా స్త్రీలను ఖైదీలనుగాఁ దీసికొనిపోయి యాదవానిదుర్గమును తొమ్మిదిమాసములు ముట్టడించియు నయ్యది స్వాధీనము గాకపోవుటవలనఁ బ్రయత్నమును మానుకొని స్వదేశమునకుఁబోయెను. అంతటితో యుద్ధముముగిసినది.'

ఈయుద్ధమునందును సుల్తాను విజయలాభమును బడయఁజాలక యనేకసైన్యములను బోఁగొట్టుకొని వచ్చినత్రోవను బట్టి మరలిపాఱిపోవలసినవాఁడయ్యెను. ఇదిపరాజయముగాని సుల్తానునకు విజయముగాదు. సుల్తాను విజయనగరమునుండి రామేశ్వరమువఱకు నైదువేలసైనికులతోఁ బోయి రాయలను తఱుముకొనివచ్చెనని వ్రాసెను. విజయనగరమునుండి రామేశ్వరమునకు నైదువందలమైళ్లు దూరముండెను. వెళ్లి మరలివచ్చుటకు వేయిమైళ్లగును. అనేకరాజ్యము లీనడుమ

నుండెను. ఈరాజ్యములన్నియుబుక్కరాయలకులోఁబడినపాలక రాజ్యములుగనుండెను. ఈరాజ్యమునంతయు నైదువేలసైనికులతో నెందు నెవ్వరునడ్డుకొనువారులేక తిరిగివచ్చెననుట హాస్యాస్పదముగా నుండెను. ఈసుల్తానుతోఁ గూడయుద్ధము చేసినవాఁడు కృష్ణరాయఁడనియే వ్రాసియుండెను. ఈయుద్ధము తరువాత నూఱేండ్లకుఁగాని కృష్ణరాయఁడుజనింపలేదు.

### బుక్కరాయనిపరిపాలనము.

ఎవ రేమివ్రాసినను బుక్కరాయలు మాత్రము సామాన్యపురాజులతోఁ జేర్పవలసినవాఁడు కాఁడు. అతఁడు సర్వస్వతంత్రుఁడు. బహుదేశములను జయించి పాలించుచున్నవాఁడు. భూరిపరాక్రమవంతుఁడు. హరిహరరాయలకాలమునుండియు సామ్రాజ్యాభివృద్ధికై సమస్తవిధములఁ గృషిచేయుచు, తనప్రభుత్వకాలములో మహోన్నతదశకుఁ గొనివచ్చెను. సంపత్తియందును, రాజ్యవిస్తారమునందును, సామర్థ్యమునందును విజయనగర సామ్రాజ్యము బహమనీరాజ్యముకంటెను మిన్నయై శ్రేష్ఠత్వమును వహించియుండెననియు, సముద్రపురేవగు గోవాపట్టణమును, మాల్గామను దుర్గమును, తుళువరాష్ట్రములోని యనేకమండలములును విజయనగరసామ్రాజ్యమునకు వశములైయుండెననియు, మలయాళము, సింహళము మొదలగు రాజులురాయల కడకు

రాయబారులనుబంపిపిలువఁగల కానుకలర్పించుచుండిరనియు, విజయనగరద్వేష్టయగు ఫెరిస్తాయే వ్రాసియున్నాఁడు. బుక్క రాజు ప్రజారంజకుఁడుగ నుండెను. ప్రజలు ప్రభువునెడ భక్తి, విశ్వాసములు గలిగియుండిరి. బుక్కరాయలు తన పరిపాలన కాలములోఁ జెఱువులను, బావులను, కాలువలను త్రవ్వించి సస్యసమృద్ధి గలుగఁజేసి ప్రజలకు సౌఖ్యమును గలిగించెను. భూమిశిస్తునుగుఱించి నియమము లేర్పఱిచెను. ఇతఁడు విద్యానగరమును విస్తరింపఁజేసెను. పట్టణమునందు భవ్య మందిరములును పెద్దవియైన గిడ్డంగులును వెలసినవి. దక్షిణ హిందూదేశమున వర్తకమునకుఁ బ్రధానస్థానమగుటంజేసి ధనికులగు వణిక్ప్రముఖు లనేకులు విజయనగరమునఁ గళా శ్రామ్యముగల భవనములను నిర్మించి కాపురముండిరి. బుక్క రాయలకాలమున నీమహానగరము వీరులకును, విద్వాంసుల కును రక్షకస్థానమై 'విజయనగరము, విద్యానగరము' అను నామములను సార్థకపఱచుకొని వన్నెకెక్కుచుండెను. ఫెరిస్తా వ్రాసినట్లు దేశమున నైదులక్షలజనులు సంహరింపఁబడి, రాయలు తురుష్కులచేఁ బరాభవింపఁబడి సుల్తానునకుఁ గప్పము చెల్లించుచుండెనను మాటయె సత్యమైయుండినయెడల దేశమిట్లుండుట యెట్లుతటస్థమగును? దీనికంతకుఁ గారణము - బుక్కరాయలు మానధనుఁడును, సాహసికుఁడును, మహా

యోధుఁడునగుట మాత్రమెగాక మహామాధ్యుఁడగు విద్యారణ్యస్వామి మంత్రిగనుండి కార్యముల నిర్వహించుట. తానును తనయన్నయును శైవులై శైవాగమతంత్రవేదియగుకాశీవిలాసక్రియాశక్తిగురునకు శిష్యులైనను వైదికమతమునందును నెక్కుడభిమానముగలిగి పరమతములయెడ ద్వేషము లేకయుండిరి. తాను శైవమతావలంబకుఁడైనను తనరాజ్యములోని శ్రావణబెల్గోలాయను పట్టణమునందు వైష్ణవులకును జైనులకును వివాదములు తటస్థించినప్పుడు తాను మధ్యవర్తిగనుండి ఉభయుల కనుకూలముగాఁ దగవు దీర్చి సంతోషపెట్టెను. ఇతనిప్రోత్సాహముచేతనే సాయనమాధవులు వేదభాష్యమును జేసిరి.

---

## పంద్రెండవప్రకరణము.

---

### రెండవ హరిహరరాయలు.

( ౧౩౭౭ మొదలుకొని ౧౪౦౪ వఱకు )

వీరబుక్కభూపాలుని మరణానంతరమాతనికి గౌరాంబికయందు జనించిన హరిహరరాయలనుపుత్త్రుఁడు రత్నసింహాసన మధిష్టించెను. ఇతఁడు ౧౩౭౭ మొదలుకొని ౧౪౦౪ వఱకు ప్రజారంజకుఁడై రాజ్యపరిపాలనము చేసెను. ఈతఁడు ద్వా

క్షీణాత్యప్రభువులనెల్లర నోడించి సామ్రాజ్యమునంతయు విస్తరింపఁజేసి తనపూర్వులు 'మహామండలేశ్వర, ఒడయర్' అనుబిరుదములతో మాత్రము తృప్తినొందియుండఁగా నీతఁడు తనకు లోఁబడిన మాండలికరాజు లనేకులు కప్పము గట్టుచున్నందున 'మహారాజాధిరాజ, రాజపరమేశ్వర' ఇత్యాదిబిరుదములను వహించి చక్రవర్తియయ్యెను. ఇతనిశాసనములాంధ్రదేశముననేగాక మైసూరు, దార్వాడ, కాంచీనగరము, చెంగల్పట్టు, తిరుచునాపల్లి మొదలగు ప్రదేశములందును గానంబడుచున్నవి. దీనింబట్టి యీతనిసామ్రాజ్యవైభవము విస్తారమయ్యెనని తేఁటపడుచున్నది. తనతండ్రికివలెనె సమర్థులగు మంత్రిపుంగవుల సాహాయ్యము గలదు. అట్టివారిలోఁ బ్రముఖుఁడగు మాధవాచార్యులవారి తమ్ముఁడగు సాయనాచార్యులొకరు. రెండవయతఁడు గాడబ్రాహ్మణుఁడగు మాధవమంత్రి. మూఁడవమంత్రి మహాప్రఖ్యాతుఁడైన ముద్దపదండనాథుఁడు. నాలుగవయతఁడు గుండపదండనాథుఁడు. ఈతనిసామ్రాజ్యములోఁ బ్రఖ్యాతిగాంచిన మంత్రులయొక్కయు, సేనాధిపతులయొక్కయుఁ జరిత్రములను సంపూర్ణముగాఁ దెలుపుటకీగ్రంథము చాలదు. ఈ రెండవహరిహరరాయలకాలమున మహమ్మదీయుల విజృంభణము చాలవఱకుఁదగ్గినది. గుండప్పదండనాథు డాంధ్రదేశములోని కొండవీ

టిరాజ్యమును ఓరుగంటిరాజ్యమును వశముఁ జేసికొనవలయు నని రెడ్లతోడను,పద్మనాయకులతోడనుబోరాడి చూచెనుగాని యాతని ప్రయత్నములు కొనసాగలేదు. గుండపదండనాథుడు గోవానగరమునుండి మహమ్మదీయులను తఱిమెను.

రెండవ హరిహరరాయలు పరాక్రమవంతుఁడుమాత్రమె గాక సంగీతసాహిత్యవిద్యలయందుఁ బ్రవీణుఁడు. ప్రజాసుఖైక నిరతుఁడు. దేవబ్రాహ్మణ భక్తిగలవాఁడు అయినను నిష్పక్షపాతబుద్ధియుఁ న్యాయైకద[illegible]గి మతాంతరులగు జైనులను సైతము పరిపాలనమునం దున్నత పదవులందు నిలిపి యాదరించినవాఁడు. ఇరుగప్పదండాధిపుడను జైనపండితుఁడు విజయనగరమున నొక జైనాలయమును నిర్మించెను. ఇతఁడే నానార్థరత్నమాలయను నిఘంటువును రచించినవాఁడు. ఇతఁడు సేనాధిపతులలో నొక్కఁడు. హరిహరరాయలు దేవాలయములకు మాత్రమె కాక బ్రాహ్మణులకును పాఠశాలలకును గూడ మాన్యములనిచ్చి పోషించినవాఁడు. ఈతనికాలముననే విద్యారణ్యభాష్యము ముగింపఁబడినది. ఫిరోజిషా తుఘ్లక్ చక్రవర్తి డిల్లీనగరమున బ్రాహ్మణులను వారిగ్రంథములతోఁ దగులఁబెట్టుచుండఁగా దక్షిణహిందూ దేశమున రెండవ హరిహరరాయలు హిందూ మతోద్ధారణము సేయ సర్వవిధములఁ బాటుపడుచుండెను. ఇతనికి మల్లాంబిక వలన

జనించిన దేవరాయ లనునాతఁడు యువరాజుగనుండి యుదయగిరి రాజ్యమును రాజప్రతినిధియై పరిపాలించెను. అనఁగా విజయనగర సామ్రాజ్యములోఁ జేరిన యాంధ్రదేశభాగమునఁ దనతండ్రియగు రెండవ హరిహరరాయల కాలమున ౧౩౯౯ సంవత్సరము లీ యుదయగిరిరాజ్యమును బరిపాలించినవాఁడు గావున దేవరాయలకు నాంధ్రదేశమునకు నెక్కువసంబంధము గలదు.

రెండవ హరిహరరాయలు కొండవీటిరెడ్లతో మైత్రిగలిగి యున్నట్లు గన్పట్టుచున్నది. ఇతఁడు తనకుమార్తె యగు హరిహరాంబను కాటయవేమారెడ్డి కుమారుఁడగు కాటయప్రభుని కిచ్చివివాహాము చేసినట్లు కాటయవేముని చరిత్రమున దెలిపి యున్నాఁడను.

## వినుకొండతిప్పనామాత్యుఁడు.

ఋగ్వేదియు, ఆశ్వలాయనసూత్రుఁడును, విశ్వామిత్ర గోత్రుఁడును నగు వినుకొండ తిప్పనామాత్యుఁడు హరిహర రాయల రత్నభండారమునకు రక్షకుఁడుగా నుండినట్లు క్రీడాభిరామమను గ్రంథములోని యీక్రింది పద్యముల వలన విదితమగుచున్నది.

సీ. సత్యవ్రతాచార సత్కీర్తిఁ గరిమలఁ
జంద్రుతోడను హరిశ్చంద్రుతోడ

నభిమానవిస్ఫూర్తి నైశ్వర్య మహిమల
రారాజుతోడ రేరాజుతోడ
సౌభాగ్యవైభవ జ్ఞానసంపన్నత
మారుతోడ సనత్కుమారుతోడ
లాలిత్యనిరుపమ శ్లాఘావిభూతుల
భద్రుతోడను రామభద్రుతోడ

గీ. పాటియనఁదగు ధారుణీపాలసభల
వీరహరిహరరాయ ప్రఖ్యాత
రత్నభండార సాధకారంభగల్భ
మల్లికార్జునుఁ డ్రిపురారి మంత్రివరుని."

వినుకొండ వల్లభామాత్యకవి.

క్రీడాభిరామమును రచియించిన వల్లభామాత్యకవి జెప్పిన వినుకొండ తిప్పనామాత్యునికి పుత్త్రుఁడు. క్రీడామములోని యీక్రిందిపద్యమున వల్లభామాత్యుఁడిట్లభివర్ణింపఁబడి యుండెను.

"సీ. మూఁడుగ్రామగ్రాసములతోడఁ బ్రాఁడ్వేన
మోపూరుపాలించె ముల్కినాఁట
నాశ్వలాయన శాఖయందు ఋగ్వేదంబు
కరతలామలకంబుగాఁ బఠించెఁ

బ్రత్యక్ష మొనరించి భైరవస్వామిచే
సిద్ధసారస్వత శ్రీవరించెఁ
గామకాయన సవిశ్వామిత్రగోత్రంబు
వంశగోత్రంబుగా వార్త కెక్కె.

గీ. నవ్వఁడా త్రిపురాంతకాధీశ్వరునకు
రాయనవరత్నభండారరక్షకునకుఁ
బ్రియతనూజుండు చందమాంబికకు సుతుఁడు
... వల్లభామాత్యవరుఁడు."

... క్రీడాభిరామ ... నాటకమును రచించినట్లు
... గన్పట్టుచున్నను ... వాస్తవముచేత నీగ్రంథమును
... ఁడు మఱియొకఁడని మఱికొన్ని ప్రబల హేతువుల
... మగుచున్నది. వల్లభామాత్యుఁడిందు విశేషముగా
... ఈగ్రంథమున ననేక పద్యములతో
... యతిశయోక్తులతో వల్లభామాత్యుని నభివర్ణించిన
పిమ్మట ... మంత్రిశేఖరుండు రావిపాటి త్రిపురాంతదేవుఁ
డను కవీశ్వరుఁ డొనరించిన ప్రేమాభిరామ నాటకంబు నను
...రించి క్రీడాభిరామ...బను రూపకంబు తెనుంగుబాసరచియిం
...వాఁడు" అనువాక్యము గన్పట్టుచున్నందునను నీతఁడు
వ్రాసినది కాదని స్పష్టముగాఁ జెప్పవచ్చును. దీనిని శ్రీనాథకవి
వల్లభామాత్యుని పేరుపెట్టి రచించెనని గ్రంథపీఠికలో శ్రీయుత

మానవిల్లి రామకృష్ణకవి. ఎం.ఎ.గారు కొన్ని హేతువులంగనఁబ ఱచియున్నారు. శ్రీనాథుని నిజమైన వీథినాటక మిదియెకాని బజారులలోనమ్ము వీథినాటకము కాదని వీరియభిప్రాయము. ఈవీథినాటకమునకు రంగస్థలము ఓరుగల్లు. మంచనశర్మయను బ్రాహ్మణుఁడును, టిట్టిభ సెట్టియను కోమటియు నిరువురును జెలిమికాండ్రును,విటపురుషులునై యుండిరి వీరిరువురుఁనోరుగల్లు నకుఁ బోయి జారిణుల సంగతి నుందురు. ఈగ్రంథమునఁ వేశ్యాభుజంగుల వృత్తములు, విధవ... కూళ్ళయిండ్లు, అమ్మవార్లజాత... ములు, కోడిపుంజులయు, పొట్టే... రుద్రవి యుంపుడు కత్తెయగు... లగునవి మిక్కిలి చమత్కారము... థముం జదివినవారికి నాకాలపు స... మునందు వలెనె యున్నవని చక్కఁగా బోధ... త్వమునారికేళపాకముతోమిళితమై మిక్కిలిప్రౌఢ... యున్నను మనోరంజకమై, యున్నది. ఇదిహాస్యప్రబంధ మనిచెప్పఁ దగును. ఇట్టిగ్రంథమును శ్రీనాథుఁడు రచించెననుట విశ్వసింపఁ దగి యున్నది.

ఫిరోజిషాహా... యుద్ధము.

బహామనీసుల్తానగు మహామూద్ షాహా ౧౩౭౭ లో మర... ణ... నొందఁగా సింహాసనమును గూర్చి దాయాదులలో...

వివాదములు జనించెను. మహమూదునకు వెనుక నతని పెద్ద కొడుకు ఘియాసుద్దీనను పదునేడేండ్ల బాలుఁడు రాజ్యభారమును వహించినతరువాత నిరువది దినములకు నొక బానిసవాఁడువిందుపేరు చెప్పిరప్పించి వానిగ్రుడ్లు పెఱికించెను. పిమ్మట నాతని కనిష్ఠసోదరుఁడగు షామ్సుద్దీను పట్టాభిషిక్తుఁ డయ్యెను. అయిదుసంవత్సరములు జరిగినతరువాత సుల్తాను దావూద్ కుమారుఁడగు ఫిరోజిషాహ యనునాతఁడు వానిని [illegible] గావించి తాను ౧౩౯౭ వ సంవ [illegible] క్రీడాభిరామ [illegible] సింహాసన మెక్కెను. హర [illegible] గన్పట్టుచున్న [illegible] హమనీసుల్తానునకును విజయనగ [illegible] కచ్చివి [illegible] డు మఱియొకఁడని జరిగెననియు, రాయల పేర్లు [illegible] మగుచున్నది. [illegible] వ్రాసియున్నాఁడు గాని శాసన [illegible] రెండవహరిహరరాయలే పరిపాలన [illegible] యతని [illegible] గన్పట్టుచున్నది. ఫెరిస్తాయొక్క గ్రంథము [illegible] కాలవిపర్యాస దోషములు, పురుషవిపర్యాసదోషములు పెక్కులు గలవు. ఫెరిస్తా వ్రాసిన యుద్ధకథనము సత్యమైన యెడల ఫిరోజిషాహకును, రెండవ హరిహరరాయలకును జరిగి యుండవలయును. సింహాసన [illegible] క్రమించుకొనుటకై కలుబరగి నగరములోఁ గల్లోలము జరుగుటచూచి హరిహరరాయలదియె మంచిసమయమని యెంచిబహమనీరాజ్యమునకుఁ జమకు